ప్రపంచ సాహిత్యం-9

# ప్రపంచ ప్రసిద్ధ కథలు-1

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం - 9

# ప్రపంచ ప్రసిద్ధ కథలు-1

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# World Famous Stories

by

**Dr. Lanka Siva Rama Prasad**

January 2014

All rights reserved

Copyright @ 2014
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002.
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Price : ₹ **200** **$ 4**

Cover Design & Post Script
**Prakash Pula**

Printed at :
**Vasavi Printers**
J.P.N. Road, Warangal.
Ph : 0870-2426364

***This book is presented to...***

**(STORY - A narrative or story is any account of connected events, presented to a reader or listener in a sequence of written or spoken words or in a sequence of (moving) pictures.)**

# ప్రస్తావన

"కథాకథనం (Story telling), కథాశ్రవణం (Story Hearing) ఈ రెండూ మానవజాతి వికాసానికి అత్యవసరం. ఆకలికి తరువాత, నిద్రకు, మైథునానికి ముందుగా నిత్యావసర వస్తువై కథ ఏదో ఒక రూపంలో మానవ జాతిని పురోగామి పథంలో నడిపిస్తున్నది. ప్రేమ, ఇల్లు లేకున్నా లోకులు కాలం గడపగలరేమో కాని నిశ్శబ్దంలో ఎవరు బ్రతుకగలరు? నిశ్శబ్దాన్ని చీల్చేదే సంభాషణ. ఆ సంభాషణలే కథాకథనంగా మారి నిత్య జీవన సంఘటనలకు కథారూపాన్నిస్తాయి"

**- Reynolds Price.**

కథను చిరకాలం జీవింప చేసినది తరతరాలుగా వచ్చిన వారసత్వ సంపద అయిన మౌఖిక సాహిత్యం, చిన్నకథ కథకుల నోళ్లలో పడి అనేక మార్పులకు చేర్పులకు లోనై విశ్వ విశాల పరిధిని ఏర్పరచుకుంటుంది. ఏనాడైతే ముద్రణా సదుపాయాలు మౌఖిక సంప్రదాయాన్ని భూస్థాపితం చేసాయో ఆనాడే కథకు కాలం చెల్లిందని Roland Barthes లాంటి వాళ్లు కథకుడు చచ్చిపోయాడా? (Death of the author) – అని ఆవేదన వ్యక్తం చేసారు

ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందించే క్రమంలో– ఇలియాడ్, ఒడెస్సీ, ఎపిక్‌సైకిల్, పారడైజ్ లాస్ట్, పారడైజ్ రిగెయిన్డ్, ఈనీడ్, డివైన్ కామెడి, పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్, ఫాస్ట్ లాంటి మహా కావ్యాల్ని అనువదించి ప్రచురించిన సృజనలోకం ప్రపంచ ప్రసిద్ధ కథకుల, కవుల రచనలను తెలుగు పాఠకుల ముంగిటిలోకి తీసుకొనివస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

**కట్టె, కొట్టె, తెచ్చె!**

**(మహాకావ్యానికి సంక్షిప్త రూపం)**

↑

# అతి చిన్న కథలు

↓

**"For Sale : Baby shoes, Never Worn"**

- Ernest Hemingway

# విషయసూచిక


1. కపాల కలాపం ........................................................ 1
2. మంచివాడు దొరకడం చాలా కష్టం ........................................ 2
3. రహస్యం (కవిత్వం) .................................................... 22
4. నా మనసులో (కవిత్వం) ................................................ 23
5. అతి ప్రమాదకరమైన ఆట ................................................. 24
6. చిహ్నాలూ – సంజ్ఞలూ .................................................. 51
7. దక్షిణానికి పోయే రహదారిపై (కవిత్వం) ................................. 58
8. వధ్యశిలపై గొర్రెపిల్ల ................................................... 60
9. కానుక ............................................................... 73
10. బహుమతి (కవిత్వం) .................................................. 77
11. జ్ఞానులు తెచ్చిన బహుమతి ............................................ 79
12. కానుకలు (కవిత్వం) .................................................. 86
13. సాల్వడార్ – కాస్త ముందో, వెనకో ..................................... 87
14. జాగ్రత్త! చదవకండి ఈ కవిత! (కవిత్వం) ................................ 89
15. మా నాన్నతో నృత్యం (కవిత్వం) ....................................... 91
16. పొగమంచు (కవిత్వం) ................................................. 92
17. కోతి చెయ్యి .......................................................... 93
18. పాఠశాల ............................................................. 108
19. మధ్యవర్తులు ......................................................... 112
20. లాటరీ ............................................................... 119
21. శిలాక్షరాలు (కవిత్వం) ................................................ 130
22. ఆశ (కవిత్వం) ........................................................ 131
23. హార్లెమ్ (కవిత్వం) .................................................... 132
24. నేను వెళ్లని దారి (కవిత్వం) ............................................. 133
25. నేను ఆడదాన్ని కానా? (కవిత్వం) ...................................... 134
26. గ్రద్ద (కవిత్వం) ......................................................... 136

27. గరుడపక్షుల ప్రేమాయణం (కవిత్వం)............................. 137
28. అద్దం (కవిత్వం).................................................... 138
29. స్త్రీ (కవిత్వం)........................................................ 139
30. ఒక గంటలో జరిగిన కథ ........................................ 140
31. బక్కెట్టు మీద స్వారీ చేసేవాడు ........................................ 144
32. ఉసిరికాయలు ...................................................... 147
33. ఒమెలాస్ నుంచి వెళ్లిపోయే వాళ్లు ................................. 161
34. ఇక మనం నౌకా విహారానికి వెళ్లలేం! (కవిత్వం).................. 169
35. బైజాంటియమ్‌కు నౌకా ప్రయాణం (కవిత్వం) ..................... 170
36. నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకెలా తెలుపను? (కవిత్వం).......... 172
37. మరేమైనాయి నిరుటి జలపాతాలు? (కవిత్వం) .................... 173
38. అమన్‌టిల్లాడో కొయ్య పీపా ........................................ 175
39. అతగాడి పేరు గుర్రం! ................................................ 185
40. కిలిమంజారో హిమశిఖరం .......................................... 205
42. వష్టి (కవిత్వం).................................................... 227
43. రాజుగారి కథకుడు ................................................. 230

# 1. కపాల కలాపం

## (The Talking Skull)

### (నైజీరియన్ జానపద గాథ)

ఓ వేటగాడు అడవిలోకి వెళ్లాడు. అక్కడ అతడికి ఓ పాత మానవ పుర్రె కనిపించింది. వేటగాడు అడిగాడు "ఇక్కడికెవరు తీసుకొచ్చారు నిన్ను?"

కపాలం అన్నది– "మాట్లాడడం ఇక్కడకు తీసుకొచ్చింది"

వేటగాడు పరిగెత్తి పరిగెత్తి రాజు వద్దకు వచ్చాడు. "ప్రభూ! అడవిలో పొదల మధ్య నేనో మాట్లాడే మానవ కపాలాన్ని చూసాను. తన తల్లిదండ్రులెట్లా ఉన్నారో కనుక్కోమన్నది".

రాజు అన్నాడు– "నా తల్లిదండ్రులు నన్ను కన్నప్పటి నుంచి ఇటువంటి చిత్రం నేను కనీవినీ ఎరగను. చచ్చిన పుర్రె ఏమిటి, మాట్లాడడమేమిటి!" అనుకుని ఆల్కలి, సబా, డెగి అనే ముగ్గురు మేధావుల్ని పిలిచి ఎప్పుడైనా ఇటువంటి విషయం విన్నారా అని అడిగితే వాళ్లూ వినలేదన్నారు. రాజు భటుల్ని పిలిచి అడవిలో, పొదల దగ్గరకు పోయి వేటగాడి కథ నిజమో కాదో తేల్చుకుని రావాలి, ఒకవేళ వేటగాడు అబద్ధం చెబితే వాడికి అక్కడికక్కడే శిరచ్ఛేదం చేయమన్నాడు.

భటుల్ని వేటగాడు మాట్లాడే కపాలం వద్దకు తీసుకువెళ్లాడు. పొద్దుట్నుంచి సాయంకాలం వరకు– "మాట్లాడే కపాలమా! చెప్పు, నిన్నెవరు ఇక్కడకు తీసుకు వచ్చారు" అని అడుగుతూనే ఉన్నాడు. పుర్రె మాట్లాడ్తుందా? పల్లెత్తి ఒక్క పలుకూ పలకలేదు. రాజుగారి ఆజ్ఞ ప్రకారం భటులు వేటగాడికి శిరచ్ఛేదం చేసి వెళ్లిపోయారు.

భటులు వెళ్లిపోయాక కపాలం నోరువిప్పి, వేటగాడి శిరస్సును అడిగింది– "ఎవరు నిన్నిక్కడికి తెచ్చారు?"

చచ్చిన వేటగాడి శిరస్సు జవాబిచ్చింది– "మాట్లాడడం ఇక్కడకు తీసుకు వచ్చింది!"

# 2. మంచివాడు దొరకడం చాలా కష్టం
## (A Good Man is Hard to Find)

**- ఫ్లాన్నెరీ ఓ కాన్నర్**

నాయనమ్మకు ఫ్లారిడా వెళ్లడం ఇష్టం లేదు. తూర్పు టెన్నెస్సీలో ఉన్న బంధువర్గాన్ని కలిసి రావాలని ఆమె అవకాశం దొరికినప్పుడల్లా తన కుమారుడు బెయిలీ మనసు మార్చడానికి ప్రయత్నం చేస్తున్నది. బెయిలీ ఆమె ఏకైక కుమారుడు. అతడు తన టేబుల్ వద్ద కుర్చీ అంచుపై కూర్చుని పత్రికలోని ఆరెంజ్ రంగున్న స్పోర్ట్స్ సెక్షన్ దీక్షగా చదువుతున్నాడు.

"ఇటు చూడు, బెయిలీ" అన్నదామె. "ఇదుగో ఇది చదువు" తన ఒక చేయి నడుం మీద వేసుకుని, ఇంకో చేత్తో గాలికి ఊగుతున్న దినపత్రిక పేజీలను అతడి బట్టతలకు తగిలిస్తూ అన్నదామె- "ఇదుగో, ఈ మిస్‌ఫిట్ అనే హంతకుడు, కరడుగట్టిన నేరస్తుడు, ఫెడరల్ జైలు నుంచి తప్పించుకుని ఫ్లారిడా వేపు పోయినాడట. దీంట్లో వాడు చేసిన నేరాలు చిలవలు పలవలుగా వర్ణించబడి ఉన్నాయి. చదువు. నేను నా పిల్లల్ని అటువంటి దుర్మార్గులు తిరిగే వేపుకు వెళ్లడానికి ససేమిరా ఒప్పుకోను. అన్నీ తెలిసీ అటు వెళ్లి ఆ తరువాత నా అంతరాత్మకు సమాధానం చెప్పుకోలేను"-

బెయిలీ తలపైకెత్తి ఆమెవేపు చూడకపోయేసరికి ఆమె ఈసారి తన కోడలి వేపు తిరిగింది. ఆ యువతి గుండ్రటి కాబేజీ లాంటి మొహం, వెడల్పుగా, అమాయకత్వం నిండి ఉన్నది, తలకు ఆకుపచ్చ వస్త్రాన్ని కట్టుకున్నది. దాని చివరలు కుందేలు చెవుల్లా పైకి లేచి ఉన్నాయి. సోఫాలో కూర్చుని ఆమె తన చంటి పాపడికి జాడీలోంచి తీసిన ఏప్రికాట్సు తినిపిస్తున్నది. "పిల్లలు ఇదివరకు ఫ్లారిడా చూసారు కదా!" అన్నదా పెద్దావిడ. "వాళ్లను వేరే చోట్లకు తీసుకువెళ్తే లోకజ్ఞానం పెరుగుతుంది. అంతేకాక వాళ్లెప్పుడూ ఈస్ట్ టెన్నిస్సీకు వెళ్లలేదు."

ఆ పిల్లల తల్లి ఈమె మాటలను పట్టించుకోలేదు. కాని ఎనిమిదేళ్ల పిల్లవాడు- జాన్‌వెస్లీ - బొద్దుగా ఉండి, కళ్లజోడు పెట్టుకున్నవాడు అన్నాడు- "నీకు ఫ్లారిడా రావడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండవచ్చుకదా?"- అతడూ, వాడి చెల్లెలు- జూన్‌స్టార్- కింద కూర్చుని పేపర్లో కార్టూన్లు, బొమ్మలు చూస్తున్నారు. "మహారాణి సింహాసనం ఇచ్చినా ఆమె ఇంటిలో ఒక్కరోజు ఒంటరిగా ఉండలేదు" అన్నదా చిన్నపిల్ల- జూన్‌స్టార్. తన పచ్చని తల పైకెత్తకుండానే.

"అవును. ఈ 'మిస్‌ఫిట్' మిమ్మల్ని పట్టుకుంటే ఏం చేస్తావు?" అన్నదామె పిల్లలతో.

"నేను వాడి మొహం మీద లాగి ఒకటి కొడ్తాను" అన్నాడు జాన్‌వెస్లీ.

"మిలియన్ డాలర్లిచ్చినా నాయనమ్మ ఇంట్లో ఉండదు" అన్నది చిన్నపిల్ల జూన్‌స్టార్– "తానేమన్నా మిస్సవుతుందేమోనని భయం. మనమెక్కడికిపోతే ఆమె అక్కడికి రావాల్సిందే"

"ఆఁ! ఈసారి నా దగ్గరకు రా! నాయనమ్మా! జుట్టుకు వంకీలు పెట్టవా, అని, అప్పుడు చెబ్తా" అన్నదామె.

జూన్‌స్టార్ అన్నది– "నా జుట్టు మామూలుగానే వంకీలుగా ఉంటుంది తెలుసా!"

మరుసటి రోజు ఉదయానికి అందరికన్నా ముందు నాయనమ్మ కారులో కూర్చున్నది. ఆమె తనతోపాటు తన నల్లని పెద్ద చేతిసంచి– బ్లాక్ వాలైస్– దాని ఒకవేపు హిప్పొపొటమస్ తలలా ఉంది. దానిలో ఒకమూల చిన్ని బుట్టలో దాక్కుని ఉంది 'పిట్టీసింగ్'. అది నాయనమ్మ పెంపుడు పిల్లి. మూడు రోజులు దానిని ఒంటరిగా ఇంట్లో విడిచి వెళ్లడమే! అది ఆమె భరించలేదు. అంతేకాక అదే ఏ గాస్ బర్నరో తిప్పి ఆ వాసనకు చచ్చిపోయే ప్రమాదం ఉండదూ! కాని ఆమె కొడుకు "బెయిలీ"కి పిల్లితో ప్రయాణం, హోటల్‌లో దిగడం అంటే అస్సలు ఇష్టం ఉండదు.

ఆమె వెనక సీటు మధ్యలో కూర్చున్నది. ఒకవేపు జాన్‌వెస్లీ, రెండోవేపు జూన్‌స్టార్‌లు– కిటికీల పక్క. బెయిలీ, బెయిలీ భార్య, చంటిపిల్లవాడు ముందు కూర్చున్నారు. 8–45 కల్లా అట్లాంటా దాటారు. కారులో మైలేజి 55890 చూపిస్తుందన్న విషయాన్ని నాయనమ్మ ఒక నోటుపుస్తకంలో వ్రాసుకున్నది. వచ్చినాక చూసుకోవచ్చు తాము ఎన్ని మైళ్లు రానూపోనూ ప్రయాణం చేసిందీ.

పట్టణం శివారు చేరడానికి వాళ్లకు దాదాపు ఇరవై నిముషాలు పట్టింది.

ముసలావిడ స్థిమితంగా కూర్చుని, తన చేతికున్న తెల్లటి గ్లవుస్‌ను తీసి పర్సులో పెట్టుకున్నది. దాన్ని కారు వెనక అద్దం కింద ఉన్న షెల్ఫ్‌లో ఉంచింది. బెయిలీ భార్య ఇంకా తలకు ఆకుపచ్చని రుమాలు కట్టుకునే ఉండగా, నాయనమ్మ మాత్రం నావీబ్లూ హాట్, దానిపై వయొలెట్ల గుత్తి ఉన్నది తలపై పెట్టుకుని, మ్యాచింగ్ డ్రస్ నావీబ్లూ, చిన్నచిన్న చుక్కల ప్రింట్‌తో ఉన్న దుస్తులలో హుందాగా ఉన్నది. ఆమె కాలర్, చేతి కఫ్‌లు తెల్లటి ఆర్గాండి క్లాత్, లేస్‌తో కూడినది, మెడలో పర్పుల్

క్లాత్ వయొలెట్ల అలంకరణతో ఉన్న దానిని ధరించి ఉన్నది. పొరపాటున ఏక్సిడెంట్ అయి రోడ్డుమీద పడిపోయిన ఆమె దేహాన్ని చూసి ఎవరైనా చెప్పేయగలరు ఆమె ఉన్నత కుటుంబ స్త్రీ (లేడీ) అని.

"నేను చెప్పలేదా ఇవ్వాళ చాలా మంచిరోజు ప్రయాణానికి" అన్నదామె. అంత వేడిగా లేదు, అట్లా అని చల్లగానూ లేదు. బెయిలీని హెచ్చరించింది కారు స్పీడు గంటకు యాభై అయిదు మించవద్దూ, ఎందుకంటే పెట్రోల్‌మెన్ ఎక్కడో బిల్‌బోర్డుల పక్కనో, చెట్ల మాటునో దాక్కుని గమనిస్తూ ఉంటారు. నీవు స్లో అయ్యేలోపులే వాళ్లు నిన్ను దాటుకుని వచ్చి 'టికెట్' ఇస్తారు. అదుగో ఆ సీన్లు చూడు. రాతి కొండలు- నీలి గ్రానైట్ కొండలు ఒక్కోసారి రహదారికిరువేపులా! అదిగో- ఎర్రగా మెరుస్తున్న మట్టి అంచులు. అక్కడక్కడా పర్పుల్ రంగులతో- ఎక్కడ చూసినా ఆకుపచ్చని పొలాలే, తివాచీ పరిచినట్లు. రకరకాల పంటలు అందమైన లేసువర్క్‌లా... చెట్లు తెల్లటి వెండి కిరణాలతో సూర్యకాంతిని ప్రతిఫలిస్తున్నాయి. చెబుతూనే ఉన్నది. పిల్లలు కామిక్ మాగజైన్లు చదవడంలో మునిగిపోయారు. బెయిలీ భార్య నిద్రపోతున్నది.

"జార్జియాను వేగంగా దాటిపోదాం, అక్కడ పెద్ద చూసేందుకేం లేదు" అన్నాడు పిల్లవాడు జాన్‌వెస్లీ.

"నేనే చిన్నపిల్లవాడినయితే నా స్వంతరాష్ట్రం గురించి అలా మాట్లాడను. టెన్నెసీలో పెద్ద పర్వతాలున్నాయి. జార్జియాలో గుట్టలున్నాయి" అన్నది నాయనమ్మ.

"టెన్నెసీ కొండగుట్టల చెత్త ప్రాంతం. జార్జియా కూడా అంతే!" అన్నాడు జాన్ వెస్లీ.

"భలే అన్నావు" అన్నది చిన్నపిల్ల జూన్‌స్టార్.

"మా రోజుల్లో పిల్లలు కాస్త మర్యాదగా ఉండేవారు" అన్నది నాయనమ్మ తన చేతివేళ్లను మడుస్తూ- "తల్లిదండ్రులన్నా, పెద్దవాళ్లన్నా, స్వంత దేశమన్నా గౌరవ మర్యాదలుండేవి. అందరూ మంచిపనులు చేసేవాళ్లు. చూడు ఆ చిన్న పిల్లవాడు ఎలా ఉన్నాడో"- అన్నదామె ఓ రేకుల పాక ఎదురుగా నిలబడ్డ నీగ్రో బాలుడిని చూపిస్తూ. "మంచి పెయింటింగ్‌లా ఉంది కదూ. ఇదంతా!" అన్నదామె.

అందరూ అటువేపు చూసారు. ఆ పిల్లవాడు చేయి ఊపాడు.

"అతడు నిక్కరు తొడుక్కోలేదు" అన్నది జూన్‌స్టార్.

"వాళ్లకా స్తోమత ఉండి ఉండదు" అన్నది నాయనమ్మ. "నల్ల పిల్లలు మనలా ఉండరు. నాకే గనక పెయింటింగ్ వస్తే భలేగా వేసేదాన్ని పెయింటింగ్" అన్నదామె.

కారు పోతూనే ఉన్నది. పిల్లలు కామిక్స్ మార్చుకున్నారు.

నాయనమ్మ చంటిపిల్లవాడిని ఎత్తుకుంటాననగా పిల్లల తల్లి చంటిపాపని ఆమెకు ఇచ్చింది. ముసలావిడ ఆ పసిపిల్లవాడిని తన మోకాళ్లపై ఉంచి ఊగిస్తూ దారిలోని విశేషాలను చెబుతూపోయింది. తన ముడతలు పడిన ముఖంతో పాలుగారే చిన్నారి బాలుడి మృదువైన వదనాన్ని తడిమింది. ఆ పిల్లవాడు అప్పుడోసారి ఇప్పుడోసారి అందమైన చిరునవ్వులను చిందిస్తున్నాడు. వాళ్లు ఓ పెద్ద పత్తిపొలాన్ని దాటిపోతుండగా అక్కడ అయిదారు సమాధులు కనబడ్డాయి. వాటిని చూపిస్తూ నాయనమ్మ అన్నది– "అదిగో, అది చూసారా– కుటుంబ స్మశానం. అది ప్లాంటేషన్‌కు చెందింది"

"ప్లాంటేషన్ ఎక్కడ?" అడిగాడు జాన్‌వెస్లీ.

"గాలికి కొట్టుకుపోయింది. గాన్ విత్ ద విండ్" అని నవ్వింది నాయనమ్మ– "హా!హా!"

పిల్లలు వాళ్లు తెచ్చుకున్న కామిక్ బుక్ అవగొట్టినాక లంచ్‌బాక్స్ తీసి భోజనాలు కానిచ్చారు. నాయనమ్మ పీనట్ బటర్ శాండ్‌విచ్, ఆలివ్ తిన్నది. పిల్లలు నాప్‌కిన్‌లు, బాక్సులు కిటికీలోంచి పారేయబోతే ఒప్పుకోలేదామె. కామిక్ పుస్తకాలన్నీ అయిపోయాక చేయడానికి ఏమీ తోచక పిల్లలు ఆకాశంలో కనబడుతున్న మబ్బును చూసి దానికి పేరు ఏం పెట్టాలీ అన్న ఆట మొదలెట్టారు. జాన్ వెస్లీ ఆవు రూపంలో ఉన్న మబ్బును చూసి అదేమిటి అని అడిగితే జూన్‌స్టార్ "ఆవు" అని చెప్పింది. జాన్‌వెస్లీ "కాదు, కారు" అన్నాడు. సరిగా ఆడటం లేదని ఇద్దరూ వాదించుకుంటూ నాయనమ్మ కిరుపక్కలా అరచేతుల్తో చిన్నసైజు యుద్ధం చేసుకున్నారు.

వాళ్లిద్దరూ మౌనంగా ఉంటే నాయనమ్మ ఒక కథ చెబుతానన్నది. ఆమె కథ చెబుతుంటే వినేవాళ్లకు ఒక నాటకం చూస్తున్నట్లే ఉన్నది. కళ్లు తిప్పడం, తల పంకించడం, గొంతులో హెచ్చుతగ్గులూ ఇవన్నీ! ఆమె వయసులో ఉన్నప్పుడు ఎడ్గార్ అట్కిన్స్ టీగార్డెన్ అనే యువకుడు, జార్జియాలోని జాస్పర్‌కు చెందినవాడు, చాలా అందగాడు, మంచివాడు– ప్రతి శనివారం మధ్యాహ్నం ఆమెకోసం పెద్ద పుచ్చకాయ, దానిపై E.A.T. Well అని వ్రాసి తెచ్చి దానిని తమ ఇంటిముందు ఆవరణలో ఉంచి బగ్గీలో మళ్లా జాస్పర్ వెళ్లిపోయేవాడట. కాని ఆమెకు ఏనాడూ ఆ పుచ్చకాయ

అందలేదు. ఎందుకంటే దాని మీద E.A.T. Well అని వ్రాసి ఉండడం చేత ఇంట్లో పనిచేసే నల్ల పిల్లవాడు దాన్ని హాయిగా తినేసేవాడట. ఈ కథ జాన్‌వెస్లీకి బాగా నచ్చింది. చక్కిలిగిలి పెట్టినట్లు తెగ నవ్వాడు. అయితే జూన్‌స్టార్‌కు నచ్చలేదు కనుక ఆ పిల్ల నవ్వలేదు. అతడిని పెళ్లి చేసుకుని ఉంటే బాగుండి ఉండేదని నిట్టూర్చింది నాయనమ్మ. "ఎందుకంటే అతగాడు కోకా-కోలా స్టాక్ - షేర్లు కొని దాచి ఉంచుకొని బాగా ధనవంతుడైనాడు. ఈ మధ్యనే చనిపోయాడు" అందామె బాధగా!

వాళ్లు బార్బెక్యూడ్ శాండ్‌విచెస్ టవర్ దగ్గర ఆగారు. ఆ టవర్ కాస్త చెక్క, కాస్త సిమెంట్ గచ్చుతో చేయబడి ఉన్న ఫిల్లింగ్ స్టేషను, ఒక డాన్సుహాలు కూడా ఉంది దాంట్లో. అది తిమోతికి ఆవల ఉన్నది. బాగా లావుగా ఉన్న రెడ్‌శామీ బట్స్ అనే అతడు నడుపుతున్నాడు. ఆ ఫిల్లింగ్ స్టేషన్‌కు కొన్ని మైళ్లు అటూయిటూ దానికి సంబంధించిన సైన్‌బోర్డ్సు ఉన్నాయి. "రెడ్‌శామ్ బార్బెక్యూ ఆనందించండి! రెడ్ శామీను మించినవాడు లేడు! రెడ్ శామ్! లావుగా ఉన్నా నవ్వించగలిగినవాడు- రెడ్‌శామ్! అనుభవజ్ఞుడు. రెడ్‌శామ్ మీవాడు, మనవాడు!"

రెడ్‌శామీ నేలమీద వెల్లకిలా పడుకుని తల ఏదో ట్రక్కు కింద ఉంచి మెకానిక్ పనేదో చేస్తున్నాడు. అడుగు ఎత్తున్న ఓ నల్లకోతి - కారు దిగి అటు పరుగెత్తుకు వస్తున్న పిల్లల్ని చూడగానే ఒక గెంతు గెంతి తనను గొలుసుతో కట్టేయబడి ఉన్న చైనా బెర్రీచెట్టు చిటారుకొమ్మకెక్కి కూర్చున్నది.

ఆ టవర్ లోపల పొడుగాటి గది చివర కౌంటర్, ఇంకో చివర టేబుల్స్, కుర్చీలు మధ్యలో డాన్స్‌ఫ్లోర్ ఉన్నాయి. వాళ్లు నికెల్ ఒడియాన్ పక్కనున్న టేబుల్ వద్ద కూర్చున్నారు. రెడ్‌శామీ భార్య కాబోలు- పొడుగ్గా, ఆమె జుట్టు, కళ్లు ఆమెకన్నా కాస్త తేలికపాటి గోధుమ వర్ణంలో ఉన్నావిడ వచ్చి ఆర్డర్ తీసుకున్నది. పిల్లల తల్లి మెషిన్‌లో డైమ్ వేసి 'ద టెన్నిస్సి వాల్జ్' పాట వింటుంటే నాయనమ్మ అన్నది- 'ఈ పాట విన్నప్పుడల్లా నాకు డాన్సు చేయాలనిపిస్తుంది" అని కొడుకు బెయిలీని అడిగింది డాన్సు చేద్దామని కాని అతడు ఆమెవేపు గంభీరంగా చూసి మౌనం వహించాడు. అతడు ఆమెలా అంత హుషారైనవాడు కాదు, అంతేకాక ఇటువంటి ట్రిప్పులు అతడిని ఆందోళనకు గురిచేస్తాయి. నాయనమ్మ బ్రౌన్ కళ్లు మెరుస్తున్నాయి. ఆమె తన తలను అటు యిటూ ఆడిస్తూ, కుర్చీలో కూర్చునే డాన్స్ చేస్తున్న ఫీలింగ్ కనబరుస్తున్నది. జూన్‌స్టార్ వాళ్లమ్మనేదో అడిగింది అందుకని వాళ్లమ్మ మరో డైమ్ మెషీన్‌లో వేసి ఇంకో ఫాస్ట్‌బీట్ ఉన్న పాటరాగా జూన్‌స్టార్ లేచి డాన్స్‌ఫ్లోర్‌కు వెళ్లి కాసేపు డాన్స్ చేసింది.

“పాప చాలా బాగుంది కదూ” అన్నది రెడ్ శామీ భార్య– “నా దగ్గర ఉంచుకుంటాను వస్తావా?”–

“నేను రాను. మిలియన్ డాలర్లిచ్చినా నేనిటువంటి కూలిపోయిన ఇంటిలో ఉండను” అన్నదా చిన్నపిల్ల.

“భలేగుంది కదూ పాప” అన్నది రెడ్శామీ భార్య బుగ్గలు నొక్కుకుంటూ వినయంగా, మర్యాదగా.

“నీకు సిగ్గు భయం లేవు” అన్నది నాయనమ్మ చిన్నపిల్లతో మెల్లగా.

రెడ్ శామీ లోపలకు వచ్చి భార్య టైం వేస్ట్ చేస్తున్నందుకు కోప్పడి వాళ్ల ఆర్డర్ రెడీ చేయమన్నాడు. అతడి ఖాకీ ట్రౌజర్లు బొడ్డు కిందకు జారి ఉన్నాయి. అతగాడి పొట్ట వాటిమీద బియ్యం బస్తాలా ఊగుతున్నది. అతడు వాళ్లకు దగ్గర్లోనే ఉన్న టేబుల్ మీద కూర్చుని నిట్టూర్పు, కేక కలిసిన స్వరంతో– “చాలా కష్టం! చాలా కష్టం” అన్నాడు. నల్లటి రూమాలుతో తన ఎర్రటి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ “ఈరోజుల్లో ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో తెలియడం లేదు. చాలా కష్టం. అవును కదూ!”

“అవును. జనం ప్రవర్తన ఈ రోజుల్లో ఏమీ బాగుండడం లేదు” అన్నది నాయనమ్మ.

“క్రితం వారం ఇద్దరు వ్యక్తులు వచ్చారు” రెడ్శామీ అంటున్నాడు– “క్రిస్లర్ కారు నడుపుకుంటూ. అది పాత కారే కాని మంచి కండిషన్లో ఉంది. వాళ్లు నా కళ్లకు మంచివాళ్లలానే కనబడ్డారు. వాళ్లు అక్కడున్న మిల్లులో పని చేస్తున్నామంటే వాళ్లకు కావాల్సిన సాయం చేసానా? ఎందుకు చేసాను?”

“ఎందుకంటే నీవు మంచివాడివి కనుక” అన్నది నాయనమ్మ.

“అవుననుకుంటాను” అన్నాడు రెడ్ శామీ. ఆ మాట నచ్చిందతడికి.

రెడ్శామీ భార్య వాళ్లు ఆర్డర్ చేసినవన్నీ అయిదు ప్లేట్లలో ఒక్కో చేతిలో రెండేసి, ఇంకోకటి మధ్యలో బాలెన్స్ చేసుకుంటూ తెచ్చింది. “ఈ భూప్రపంచంలో, దేవుడిమీదొట్టు, ఎవర్నీ నమ్మలేం. నేను చెబుతున్నాను ఏ ఒక్కడినీ నమ్మలేం, ఏ ఒక్కడినీ” అన్నదామె రెడ్ శామీ వేపు తీక్షణంగా చూస్తూ.

“ఆ మిస్ఫిట్ గురించి చదివినావా?” అడిగింది నాయనమ్మ. “దుర్మార్గుడు, హంతకుడు!”

"ఇటువంటి ప్లేస్ ఇక్కడున్నదని తెలిస్తే వాడు ఈసరికే, ఏం ఆశ్చర్యం లేకుండా, మామీద దాడిచేసి ఉండేవాడు" అన్నది రెడ్ శామీ భార్య. "వాడొస్తే అదేం పెద్ద ఆశ్చర్యపడాల్సిన విషయం కాదు. కాష్ రిజిస్టర్లో రెండు సెంట్లున్నా, నాకేం ఆశ్చర్యంలేదు వాడు..."

"సరేసరే!" అడ్డుతగిలాడు రెడ్ శామీ– "వెళ్లి వీళ్ల కోకాకోలాలు తీసుకురా"–

ఆమె అవి తీసుకు రావడానికి వెళ్లింది.

"మంచివాడు దొరకడం చాలా కష్టం ఈ రోజుల్లో"– అన్నాడు రెడ్శామీ.

"రోజు రోజుకీ పరిస్థితి దారుణమైపోతున్నది. నాకింకా గుర్తే, వెనకటి రోజుల్లో ఎవరం ఇంటికి తాళాలు వేసుకునేవాళ్లం కాదు. ఇప్పుడైతేనా?"

అతడు, నాయనమ్మ ఆనాటి మంచిరోజుల గురించి చాలా చర్చించారు. ముసలావిడ అభిప్రాయం ప్రకారం అమెరికాలో ఇప్పుడున్న దారుణ పరిస్థితులన్నిటికీ యూరపే కారణం. యూరప్ అనుకుంటుంది మనం డబ్బుతో చేయబడినవాళ్లమని. రెడ్ శామీ అన్నాడు "దాని గురించి చర్చించడం దండగ. ఎందుకంటే పెద్దావిడ చెప్పింది నూటికి నూరుపాళ్లూ నిజం". ఈలోగా పిల్లలు బయటకు పరుగెత్తారు. బయట వెలుగులో గంతులేస్తూ కోతిని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు. చైనా బెర్రీ చెట్లమీద కోతి తన వంటిమీద వాలిన ఈగల్ని పట్టుకుని జాగ్రత్తగా మునిపళ్లతో కొరుకుతూ అరుదైన ఖరీదైన ఆహారంలా తింటున్నది.

అక్కడ్నుంచి వాళ్లు తమ ప్రయాణం మధ్యాహ్నం ఎండలోకి కొనసాగించారు. నాయనమ్మ కాసేపు కునికిపాట్లు పడి, కొద్దినిముషాలు గురక పెడ్తూ, లేస్తూ, నిదరబోతూ లేస్తున్నది. టూంబ్స్బరో దాటినాక నిద్రలేచి అక్కడో ప్లాంటేషన్ ఉన్న విషయాన్ని, తాను యువతిగా ఉన్నపుడు ఆ చుట్టుపక్కల ప్రదేశాల్ని చూడడం గుర్తుకు తెచ్చుకున్నది. అక్కడ ఉన్న ఇంటికి ముందు వసారాకు ఆరు పెద్ద స్తంభాలున్నాయని, ఓక్ చెట్ల వరుసల్లోంచి పోతే, చెక్కతో చేసిన పూలమొక్కల పందిళ్లు రెండు కనిపిస్తాయని వాటి కింద కూర్చుని తనను పెళ్లి చేసుకుందామని వచ్చిన వ్యక్తితో రోజుల్ని క్షణాల్లా గడిపినట్లు ఇద్దరూ ఆ ఓక్ చెట్లమధ్య షికారు చేసినట్లు ఆమె చాలా తన్మయత్వంతో చెప్పింది. అక్కడికి వెళ్లాలంటే ఏ రోడ్డులో పోవచ్చో కూడా ఆమె చెప్పగలిగింది. ఆమెకు తెలుసు తన కుమారుడు బెయిలీ, దారిలో ఇంకే పాత ఇంటి దగ్గర ఆగడానికి ఇష్టపడడని, అయినా ఆ ఇంటి గురించి చెబ్తున్న కొద్దీ ఆ ఇంటిని మరలా చూడాలన్న ఆసక్తి ఆమెలో పెరిగి ఆ పూల పందిళ్లు, ఆనాటి పూలపందిళ్లు అలానే ఉన్నాయా లేదా చూడాలన్న తహతహ

మరింత ఎక్కువయ్యింది. "ఆ ఇంటికి ఒక రహస్య ద్వారం ఉంది" అన్నదామె అబద్ధాన్ని నిజంలా చెబుతూ– "దాంట్లో రహస్య అర ఉందిట. ఆ అరలో బోలెడంత వెండి సామాగ్రి వంశపారంపర్యంగా వచ్చింది ఉండేదట. షెర్మాన్ చెప్పేవాడు. కాని అది ఎక్కడుందో ఎవరికీ తెలియదు....

"హే!" అరిచాడు జాన్ వెస్లీ. "మనం వెళ్లి చూద్దాం ఆ యిల్లు. ట్రెజర్‌హంట్ కామిక్‌లోలా! మనకే దొరకొచ్చు. అక్కడున్న కొయ్య అరల్ని తట్టి చూద్దాం. నాయనమ్మా! ఆ ఇంటికి వెళ్లే దారెటు? హే పాప్! మనం అటు వెళ్లి చూసొద్దాం! పద!"

"మేం రహస్య ద్వారం ఉన్న ఇల్లెప్పుడూ చూడలేదు" అరచింది జూన్‌స్టార్. "మనం అక్కడికి వెళ్దాం. హే పాప్! వెళ్దాం పద, రహస్య ద్వారం ఉన్న ఇంటివేపు!"

"ఇక్కడికి దగ్గరే, నాకు గుర్తుంది" అన్నది నాయనమ్మ – "ఇరవై నిముషాల కంటే ఎక్కువ టైం పట్టదు"

బెయిలీ కారు నడుపుతూ రోడ్డు వేపే చూస్తున్నాడు. అతడి మొహం గుర్రపు నాడాలా బిగించుకుని ఉన్నది. "నో! వీల్లేదు" అన్నాడతడు.

పిల్లలిద్దరూ గొడవ ప్రారంభించారు, కేకలు బొబ్బలు పెడుతూ. వాళ్లు అరుస్తున్నారు– "చూద్దాం సీక్రెట్ పానెల్ ఉన్న ఇల్లు; రహస్య ద్వారం ఉన్న ఇల్లు! చూద్దాం! చూద్దాం!"

జాన్ వెస్లీ ముందు సీటు వెనక గట్టిగా తన్నాడు. జూన్‌స్టార్ తన తల్లి భుజాన్ని పట్టుకుని చెవిలో మూలిగింది– "సెలవుల్లో కూడా మాకే సరదా ఉండదు. అంతా మీరు చెప్పినట్లే చెయ్యాలి. మేం ఏం అడిగినా మీరు 'నో' అంటారు" అన్నది. చంటి పిల్ల ఏడవడం మొదలెట్టింది. జాన్‌వెస్లీ డ్రైవర్ సీటును గట్టిగా తన్నడం మొదలెట్టాడు. ఆ తన్నులు బెయిలీ కిడ్నీలకు తగుల్తున్నట్లనిపించాయి.

"సరే! సరే!" అంటూ బెయిలీ కారును రహదారి పక్కగా ఆపాడు. "మీరంతా నోరు మూసుకుంటారా! నోరు మూసుకుంటారా ఒక్కక్షణం! మీరు నోరు మూసుకోక పోతే మనమెక్కడికీ వెళ్లేది లేదు"

"పిల్లలకు అది విజ్ఞానం, వినోదం" అన్నది ముసలావిడ గుసగుసగా.

"ఆల్‌రైట్!" బెయిలీ ఎట్టకేలకు ఒప్పుకున్నాడు. "ఇదే మొదటిసారి, ఆఖరుసారి. దీని తర్వాత మీరు చచ్చి గీ పెట్టినా నేను ఇంకెక్కడా కారు ఆపను" అన్నాడతడు.

"అది మట్టిరోడ్డు. మనం ఓ మైలు దూరం ముందుకు వచ్చేసాం దాన్ని దాటి" అన్నది ముసలావిడ.

"మట్టిరోడ్డు!" బెయిలీ మూలిగాడు.

కారు వెనక్కి మళ్లి మట్టిరోడ్డు వెంబడే పోసాగింది. ఈలోగా ముసలావిడ ఆ ఇంట్లోని ఇతర గొప్ప విషయాల్ని, పెద్ద తలుపుకుండే అందమైన గాజు పలకల్నీ, హాల్లో ఉండే పెద్ద కొవ్వొత్తి దీపాన్నీ గొప్పగా వర్ణించింది. జాన్‌వెస్లీ అన్నాడు– ఆ రహస్య ద్వారం, అర ఖచ్చితంగా– నెగడు– ఫైర్‌ప్లేస్– పక్కనే ఉంటుందని.

"ఆ ఇంట్లోకి ఎట్లా వెళ్తావు?" అన్నాడు బెయిలీ. "అక్కడెవరుంటున్నారో నీకేం తెలుసు?"

"మీరు వాళ్లతో మాట్లాడుతూ ఉంటే నేను వెనకపక్క కిటికీలోంచి లోపలికి పోయి వెదుకుతాను" అన్నాడు జాన్‌వెస్లీ హీరోలా.

"మనం కారులోనే ఉందాం" అన్నది పిల్లల తల్లి.

ఎర్రమట్టి రోడ్డు మీదుగా కారు పోతుంటే మెత్తటి దుమ్ము ఎగిరి మబ్బులా కమ్ముకుంటున్నది వెనక. ఈలోగా నాయనమ్మకు కాలిబాటలు లేని రోడ్లు, రోజుకు ముప్ఫై మైళ్లు మాత్రమే వెళ్లగలిగిన ఆనాటి పరిస్థితులు గుర్తుకు వచ్చాయి. ఆ మట్టిరోడ్డు చిన్నచిన్న గుట్టలతో, మురికి నీళ్ల గుంటలతో ఎగుడు దిగుడుగా ఉన్నది. అక్కడక్కడా వంపులు, ప్రమాదకరమైన కరకట్టలతో ఆ దారిన కారు నడపడం నరకయాతనే! ఒక్కోసారి గుట్టమీద ఉన్నట్లు, దిగువగా చెట్లూ కొండగుట్టలూ దూరాన కనిపించేవి. మరుక్షణంలో ఎర్రటి గోతిలో ఉన్నట్లు పక్కనే దుమ్ముకొట్టుకున్న చెట్ల మొదళ్లు, వాటి కొమ్మలు వీళ్లవేపు తొంగి చూస్తున్నట్లు.

"నీవు చెప్పిన ఇల్లు ఇంకో నిమిషంలో వచ్చిందా సరే!" బెయిలీ అన్నాడు ఓపిక నశించి– "లేకుంటే నేను వెనక్కి తిరగడం తథ్యం"

ఆ రోడ్డును చూస్తే ఎవరూ ఆ దారిన ఈ మధ్యకాలంలో వెళ్లిన ఆనవాళ్లు లేవు.

"అది ఇంకెంతో దూరం లేదు" అలా అంటున్నపుడే ఆమెకు ఏదో భయపెట్టే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన ఎంత కలవరపరచిందంటే ఆమె మొహం ఎర్రగా కందగడ్డలా మారి, కళ్లు పెద్దవై, కాళ్లు గెంతినట్లయి, కాళ్లు తగిలి ఆమె చేతిసంచి మూలనున్నది తిరగబడింది. అది కదలంగానే దాన్లో అప్పటిదాకా న్యూస్‌పేపర్

కింద పడుకున్న పిల్లి 'పిట్టీసింగ్' మ్యావ్‌మంటూ పైకెగిరి కారు నడుపుతున్న బెయిలీ భుజం మీద పడి గోళ్లతో రక్కింది.

పిల్లలు తల్లి సీట్లోంచి కిందకు పడ్డారు. ముసలావిడ వెనక సీట్లోంచి ముందు సీట్లోకి దూసుకు వచ్చింది. కారు తలకిందులై, కుడిపక్క పైకి వచ్చేట్లు రోడ్డు దిగువ గుంటలో పడి ఆగిపోయింది. చక్రాలింకా బర్రున తిరుగుతూనే ఉన్నాయి. బెయిలీ డ్రైవర్ సీట్లో కూర్చునే ఉన్నాడు, అతడి భుజంపై నల్లచారల పిల్లి తెల్లటి వెడల్పాటి మొహంతో, దాని నారింజ రంగు ముక్కు అతడి మెడకు గొంగళి పురుగులా అంటుకొని భయభయంగా చూస్తున్నది.

కాస్త కాళ్లుచేతులు ఆడగానే పిల్లలు, కారు తలుపు తెరచుకుని– "మనం ప్రమాదం చూసాం! మనకి ఎక్సిడెంట్ అయ్యింది" అనుకుంటూబయటకు దూకారు. డాష్ బోర్డు కింద ముడుచుకుని ఉన్న ముసలావిడకు ఏమన్నా దెబ్బలు తగిలి ఉండవచ్చనుకున్న  బెయిలీ తన కోపాన్ని దిగమింగుకున్నాడు. ఇంతకీ ఆమెకు వచ్చిన భయంకరమైన ఆలోచన ఏవిటంటే అంత గొప్పగా వర్ణించిన ఆ యిల్లు జార్జియాలో కాదు ఉన్నది, టెన్నెస్సీలో.

బెయిలీ తన భుజం మీది పిల్లిని రెండు చేతుల్తో గట్టిగా లాగి కిటికీలోంచి అక్కడున్న పైన్ చెట్లవేపు విసిరికొట్టాడు. అతడు కారులోంచి దిగి తన భార్య గురించి వెదికాడు. ఆమె ఏడుస్తున్న చంటివాడిని గుండెల్లో దాచుకుని ఒదిగి భయపడుతూ కూర్చుని ఉన్నది. మొహంపై కోసుకుపోయినట్లు చిన్ని గాయం, భుజం విరిగి నట్లున్నదామెకు. "మనకు ఏక్సిడెంట్ అయ్యింది, ఏక్సిడెంట్ అయ్యింది" అని పిల్లలు గంతులేస్తున్నారు  ఆనందంతో!

"ఎవరూ చావలేదు" అన్నది జూన్‌స్టార్ ఒకింత నిరాశతో. అదే సినిమాల్లో, కామిక్ బుక్స్, టీవీల్లో అయితే– ముసలావిడ కుంటుతూ కారు నుంచి బయట పడింది. నెత్తిమీది టోపీ అలానే అతుక్కుని ఉన్నది కాని ముందు అంచు రెండుగా చిరిగి వయొలెట్లు కిందికి వేలాడుతున్నవి. పిల్లలు మినహా మిగతా వాళ్లు ఆ గోతి పక్కనే వణుకుతూ కూర్చున్నారు. ఏక్సిడెంట్ షాక్ నుంచి వాళ్లు ఇంకా పూర్తిగా తేరుకోలేదు.

"ఏదన్నా కారు వస్తుందేమో ఈ దారిన" అన్నది పిల్లల తల్లి బొంగురు గొంతుతో.

"నా అనుమానం నాకు లోపల ఏ భాగమో దెబ్బతిందని" అన్నది ముసలావిడ తన పక్కల్ని నొక్కుకుంటూ. ఎవరూ సమాధానమివ్వలేదు. బెయిలీ

దంతాలు పటపట లాడ్తున్నవి. అతడు పసుపు స్పోర్ట్ షర్ట్ వేసుకున్నాడు. దానిపై నీలిరంగు చిలకల డిజైన్ ఉన్నది. ఇప్పుడతడి ముఖం ఆ చొక్కారంగులా పసుపుగా మారింది. ముసలావిడ ఆ యిల్లు టెన్నెస్సీలో ఉన్నదన్న విషయం ప్రస్తుతానికి చెప్పకపోవడం మంచిదని నిర్ణయించుకున్నది.

రోడ్డు వాళ్లకు పది అడుగుల ఎత్తులో ఉండి, వాళ్లకు దారికి అటు పక్క ఉన్న చెట్ల ఆకులు రెమ్మలు మాత్రమే కనిపిస్తున్నాయి. వాళ్లు కూర్చున్న గుంట వెనక కూడా చెట్లు, పొదలు దట్టంగా ఉన్నాయి. కొద్ది నిముషాలయ్యేసరికి కొంత దూరంలో ఒక కారు 'స్లో'గా వస్తూ పక్కనున్న గుట్టపై కనబడింది. దానిలోని వాళ్లు వీళ్లను గమనిస్తూన్నట్లున్నారు. ముసలావిడ లేచి నిలబడి తన రెండు చేతుల్ని గాలిలో ఊపుతూ వాళ్ల దృష్టి తనవేపు పడేలా చేయసాగింది. ఆ కారు నెమ్మదిగా వచ్చి మూల మలుపు పల్లంలో అదృశ్యమై మరల ఎత్తుకు రాగానే కనబడింది. ఆ గుట్టమీంచే వీళ్లు కిందకు పడింది. ఆ కారు నల్లగా బాగా దెబ్బతిని మెకానిక్ షెడ్‌లోంచి వస్తున్నట్లున్నది. దాని లోపల ముగ్గురు వ్యక్తులున్నారు.

వాళ్లున్న చోటుకు ఎగువగా ఆగిన కారు లోంచి డ్రైవర్ వాళ్లవేపు కొద్ది నిముషాలసేపు పరిశీలనగా చూసాడు. అతడి మొహంలో ఎటువంటి భావమూ ఉద్వేగమూ లేదు. ఏం మాట్లాడకుండా అలా కొద్దిసేపు చూసి తన పక్కనే ఉన్న వాళ్లవేపు తిరిగి ఏదో గొణిగాడు. వాళ్లిద్దరూ కారు దిగారు. ఒకడు లావుగా బొద్దుగా ఉన్న కుర్రవాడు– నల్ల పాంటు, ఎర్ర స్వెట్‌షర్టు దానిపై వెండి గుర్రం మెరుస్తున్నది. సగం తెరిచిన నోరు వెకిలి నవ్వును స్ఫురిస్తుండగా వాడు వాళ్ల కుడివేపు నిలబడ్డాడు. రెండోవాడు ఖాకీ పాంటు, నీలి చారల కోటు తొడుక్కుని ఉన్నాడు. నెత్తిపై బూడిదరంగు టోపి, వాడి మొహాన్ని దాదాపు దాచేస్తున్నది. వాడు నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి ఎడమవేపు నిలబడ్డాడు. ఎవరూ మాట్లాడలేదు.

డ్రైవరు కారు దిగి పక్కనే నిలబడి దిగువన ఉన్నవాళ్ల వేపు చూడసాగాడు. వయసులో అతడు మిగతా ఇద్దరికంటే పెద్దవాడిలా ఉన్నాడు. జుట్టులో కొంతభాగం నెరిసి ఉంది. కళ్లకున్న వెండి ఫ్రేము కళ్లజోడు అతడికి చదువుకున్నవాడి తరహాన్నిస్తోంది. మొహం మీద గుంటలు, ఒంటిమీద చొక్కా కాని, బనీను కాని లేదు. బ్లూజీన్స్ పాంటు చాలా టైటగా ఉంది. చేతిలో నల్ల టోపీ, చిన్న తుపాకి పట్టుకుని ఉన్నాడతడు. ఆ ఇద్దరి కుర్రాళ్ల దగ్గరా గన్నున్నాయి.

"మాకు ఏక్సిడెంటయ్యింది" – పిల్లలు అరిచారు.

ముసలావిడకు ఆ కళ్లజోడు మనిషి తెలిసున్నవాడిలానే అనిపించాడు. అతగాడెవరో గుర్తుకు రావడం లేదు కానీ వాడేదో చిరకాల పరిచితుడిలా

అనిపించాడామెకు. అతడు కారు దగ్గర నుంచి నెమ్మదిగా నడుస్తూ జారకుండా జాగ్రత్తగా వస్తున్నాడు. తెల్లటి షూస్‌లో మేజోళ్లు లేకపోయేసరికి చీలమండలు ఎర్రగా సన్నంగా కనిపిస్తున్నాయి. "గుడ్ ఆఫ్టర్‌నూన్!" అన్నాడతడు "చిన్న ప్రమాదంలో పడ్డారన్నమాట!"

"రెండుసార్లు పల్టీ కొట్టింది కారు" అన్నది ముసలావిడ.

"ఒక్కసారే!" అన్నాడతడు– "మేం చూస్తూనే ఉన్నాం. హిరామ్! కారు కండిషన్ ఎట్లా ఉందో చూడు!" అన్నాడతడు ప్రశాంతంగా బూడిదరంగు టోపీ ధరించినవాడితో.

"ఏం చేస్తావా గన్నుతో" అడిగాడు జాన్‌వెస్లీ– "ఏం చేయబోతున్నావు?"

"లేడీ!" అన్నాడతడు ఆ పిల్లల తల్లితో– "పిల్లల్ని నీ దగ్గర కూర్చోబెట్టుకో! పిల్లలు నన్ను కలవరబెడ్తారు. మీరందరూ అక్కడే ఒక్కచోటే కూర్చోండి"

"మాకెందుకు మేమేం చెయ్యాలో చెబుతున్నావు?" అన్నది జూన్‌స్టార్.

వాళ్ల వెనక పొదల మధ్య నోరు తెరచినట్లు ఖాళీ ప్రదేశముంది. "ఇటు పదండి" అన్నదామె పిల్లలతో.

"చూడండి" అన్నాడు బెయిలీ చటుక్కున "మేం అనుకోని విపత్తులో చిక్కుకున్నాం. మేం..."

ముసలావిడ పెద్దగా అరచింది. ఆమె చటుక్కున లేచి నిలబడి ఆ కళ్లజోడు వ్యక్తిని తీక్షణంగా చూస్తూ అన్నది– "ఆః! నీవే మిస్‌ఫిట్! నేను వెంటనే గుర్తు పట్టాను"

"యస్ మేడమ్" అన్నాడతడు తననెవరో గుర్తుపట్టారని దిగులు లేకుండా, పైపెచ్చు సంతోషంతో "నీవు నన్ను గుర్తుపట్టకపోతే మీ పరిస్థితి, సారీ మేడమ్, కాస్త బాగుండేది"

బెయిలీ తన తల్లి వంక చూసి ఏదో అనరాని మాట అన్నాడు. పిల్లలు కూడా షాక్ తిన్నారు ఆ పరుషమైన మాటకు. ముసలావిడ ఏడ్వసాగింది. మిస్‌ఫిట్ ముఖం ఎర్రబడింది.

"లేడీ!" అన్నాడా మిస్‌ఫిట్– "ఆందోళన పడకు. ఒక్కోసారి మగవాళ్లు కొన్ని మాటలంటారు, వాటిని పట్టించుకోకూడదు. అతడి ఉద్దేశం అదికాదు. అయినా అతడు అట్లా మాట్లాడి ఉండకూడదు."

"ఒక ఉన్నత కుటుంబ స్త్రీని చంపవుగదా, నీవు! అవునా!" అన్నదామె రుమాలుతో కళ్లమీద కొట్టుకుంటూ.

మిస్‌ఫిట్ తన బూటుకాలితో నేలపై గుంట తవ్వి మళ్లీ దానిని పూడుస్తూ అన్నాడు– "అటువంటివి చేయడం నాకిష్టం ఉండదు"

"విను! నా మాట విను" ముసలావిడ దాదాపు అరుస్తూ "నీవు మంచివాడివి. నాకు తెలుసు. నీలో అలగా జనపు రక్తం లేదు. నీవు మంచి కుటుంబం నుంచే వచ్చి ఉంటావు!"

"యస్ మేడమ్!" అన్నాడతడు. "ప్రపంచంలోనే గొప్పవాళ్ల కుటుంబంలో పుట్టాను" అతడు నవ్వినప్పుడు తెల్లటి పలువరస కనబడింది. "దేవుడు మా అమ్మకన్నా మంచి స్త్రీని సృష్టించలేదు. ఆ భగవంతుడు మా నాన్న హృదయాన్ని స్వచ్ఛమైన బంగారంతో చేసాడు."

ఎర్ర స్వెట్ షర్ట్ వేసుకున్న కుర్రాడు వాళ్ల వెనక నిలబడ్డాడు. అతడి చేతిలో గన్ను సిద్ధంగా ఉంది ఉపయోగించడానికి.

మిస్‌ఫిట్ నేలమీద కూర్చున్నాడు... "పిల్లల్ని ఒక కంటితో కనిపెట్టి ఉండు, బాబీలీ! నీకు తెలుసు వాళ్లు నన్ను కలవరపెడ్తారు" అతడు తన ముందు కూర్చున్న ఆ ఆరుగురివేపు చూసి ఇబ్బంది పడుతున్నట్లు, మాట్లాడడానికింకేమీ లేదన్నట్లు– "ఆకాశంలో ఒక్క మబ్బు కూడా లేదు" అన్నాడు పైకి చూస్తూ– "సూర్యుడూ లేడు మబ్బులూ లేవు".

"అవునవును. చాలా మంచిరోజు" అన్నది నాయనమ్మ. "నా మాట విని నీపేరు మార్చుకో! నీలాంటి మంచి మనిషికి ఆ 'మిస్‌ఫిట్' అనే పేరు ఫిట్ కాదు. నాకు తెలుసు నీ హృదయం మంచిదని. నిన్ను చూడగానే ఆ విషయం చెప్పగలను నేను"

"హుష్!" బెయిలీ అరచాడు– "ప్రతి ఒక్కరూ నోరు మూసుకుని ఉండండి. నేను మాట్లాడ్తాను" అతడు పరుగుపందెంలో రన్నర్‌లా కూర్చున్నాడు కాని కదలలేదు.

"నాకు ముసలావిడంటే గౌరవం" అన్నాడు మిస్‌ఫిట్ నేలపై తుపాకీ మడమతో ఓ వలయం గీస్తూ.

"ఓ అరగంట పడ్తుంది కారు బాగుచేయడానికి" అన్నాడు హిరామ్ కారు బోనెట్ తలుపు పైకెత్తి లోనికి తొంగి చూసి.

"సరే. ముందుగా నీవు, బాబీలీ- ఇతడిని, ఈ పిల్లాడినీ మీతో అటు దూరంగా తీసుకువెళ్లండి" అన్నాడు బెయిలీ, జాన్‌వెస్లీల వేపు చూపిస్తూ.

"కుర్రాళ్లు మిమ్మల్నేదో అడుగుతారట" అన్నాడు అతడు బెయిలీతో- "ఏమనుకోకుండా కాస్త అటు వాళ్లతో ఆ పొదలలోకి వెళ్లకూడదూ?"

"నా మాట విను" అన్నాడు బెయిలీ- "మేం దారుణమైన విపత్తులో చిక్కుకున్నాం. అదేమిటో ఎవరికీ తెలీదు" అతడి గొంతులో జీర వినవచ్చింది. అతడి కళ్లు నీలంగా అతడి పచ్చచొక్కాపై ఉన్న నీలిరంగు చిలకల్లా, నిశ్చలంగా ఉన్నాయి.

ముసలావిడ తన హాట్ అంచు సరిచేసుకుని పొదల దగ్గరకు వెళ్లడానికా అన్నట్లు లేచింది కాని హాట్ అంచు ఊడివచ్చింది. ఆమె అలానే నిలబడి చూస్తూ ఉండగానే అది నేలపై పడింది. హిరామ్ బెయిలీ చేయి పట్టుకుని వృద్ధుడికి సాయం చేస్తున్నవాడిలా పైకి లేవదీసాడు. జాన్‌వెస్లీ తన తండ్రి చేయి పట్టుకుని నడుస్తుంటే బాబీలీ వాళ్ల వెనక అనుసరించాడు. దూరంగా పొదల దగ్గరకు, అడవి అంచుకు చేరుకుంటున్నప్పుడు బెయిలీ వెనక్కి తిరిగి అరిచాడు- తనకి పక్కనే ఉన్న బూడిద రంగు పైన్ చెట్టు కాండాన్ని పట్టుకుని- "నేనొచ్చేస్తానమ్మా, ఒక్క నిముషంలో. వేచి ఉండు అక్కడే!"

''ఈ క్షణం వచ్చేయి'' అన్నదావెు అరుసూ్త- వాళ్లు పొదల్లో మాయమయ్యారు.

"బెయిలీ బాయ్" అరిచిందామె. కాని ఆమెకు ఎదురుగా మిస్‌ఫిట్ కూర్చుని ఉన్నాడు. "నీవు మంచివాడివి" ఆమె అన్నది- "నీవు మామూలు మనిషివి కాదు!"

"నో మేడమ్! నేను మంచివాడిని కాదు!" అన్నాడు మిస్‌ఫిట్ ఒక్కక్షణం ఆలోచించినట్లు. "అట్లా అని ఈ ప్రపంచంలో అందరికంటే చెడ్డవాడినీ కాను. మా నాన్న అనేవాడు 'నా పిల్లల్లో నీవు కాస్త తేడారా! ఈ ప్రపంచంలో కొందరు జీవితమంటే ఏమిటో తెలియకుండా జీవిస్తారు. కొందరు ఏమిటీ జీవితం, ఎందుకు అని తెలుసుకుని జీవిస్తారు. నీవు రెండో వైపు వాడివిరా. నీవు అన్నిటినీ రుచి చూస్తావు!'-" మిస్‌ఫిట్ తన తలపైని నల్లటి హాట్‌ను సర్దుకుని ఓ క్షణం పొదలవేపు, అడివి వేపు పరికించి చూసాడు. "ఆడవాళ్ల ముందు షర్ట్ లేకుండా ఉన్నందుకు నన్ను క్షమించాలి" అన్నాడతడు భుజాలు ఎగరేస్తూ- "మేం తప్పించుకున్నప్పుడు మా దుస్తుల్ని ఎక్కడో బొందలో పాతిపెట్టాం. ఈ దుస్తుల్ని దారిలో మాకు కలిసిన వాళ్ల దగ్గర బదులు తీసుకున్నాం" అన్నాడు.

"అది సరైనదే! పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్" అన్నది ముసలావిడ– "బెయిలీ దగ్గర వేరే చొక్కా అతడి సూట్‌కేసులో ఉండి ఉంటుంది."

"నేను చూస్తాను" అన్నాడు మిస్‌ఫిట్.

"వాళ్లనెక్కడికి తీసుకువెళ్లారు?" అన్నది పిల్లల తల్లి ఏడుస్తూ.

"మా నాన్న మంచి తెలివైనవాడు!" అన్నాడు మిస్‌ఫిట్– "అతడి మీద ఎటువంటి నిందా మోపలేం. చట్టంతో అతడెప్పుడూ గొడవ పడలేదు, చాకచక్యంగా తప్పించుకునేవాడు"

"ప్రయత్నం చేయాలేగాని, నీవు నిజాయితీపరుడివే" అన్నది నాయనమ్మ. "ఆలోచించు, సుఖంగా ఒకచోట స్థిరపడి, సురక్షితమైన జీవితం గడపడం ఎంత హాయిగా ఉంటుందో. దీనికన్నా, ఇలా ఎవరో వెంటబడి తరుముతుంటే క్షణక్షణ గండంగా జీవించడం కన్నా!"

మిస్‌ఫిట్ తన గన్ను మడమతో నేలమీద గీస్తూ తల పంకించి అన్నాడు– "యస్. మేడమ్! ఎవరో ఒకళ్లు నీ వెనక పడుతూనే ఉంటారు"

ఆమె నిలబడి, కింద కూర్చున్న మిస్‌ఫిట్ వేపు చూస్తుంటే ఆతడి భుజపు ఎముకలు ఎంతో సన్నగా ఉన్నాయనిపించింది. "నీవు దేవుడిని ప్రార్థిస్తావా?" అడిగిందామె. అతడు తల అడ్డంగా ఊపాడు. ఆమెకు కనబడిందల్లా అతడి నల్లటి హాట్ కదలడమే. "నో మేడమ్" అన్నాడతడు.

దూరంగా అడవుల్లోంచి ఒక పిస్టల్ షాట్, దాని వెనక మరోటి వినిపించాయి. ఆ తరువాత నిశ్శబ్దం. ముసలావిడ ఉలిక్కిపడింది. చెట్ల శాఖలపై కదుల్తున్న గాలి సవ్వడి ఊపిరిని పీల్చుకుంటున్నట్లు అనిపించి "బెయిలీ బాయ్!" అని కేక పెట్టిందామె గద్గద స్వరంతో.

"ఒకప్పుడు నేను సువార్త గాయకుడిని" అన్నాడు మిస్‌ఫిట్. "ఒకటేమిటి అన్ని పనులూ చేసాను. సైనికుడిగా నేలమీద, సముద్రంలో ఇంటా బయటా, స్వదేశ విదేశాల్లో తిరిగాను. రెండుసార్లు పెళ్లి చేసుకున్నాను, ప్రేతకర్మలు చేసాను. రైలు, రోడ్లు వేసాను. నాగలి పట్టాను. టోర్నడోలో చిక్కుకున్నాను. మనిషి సజీవంగా తగలడుతుంటే చూసాను" అంటూ అతడు తన పక్కనే కూర్చున్న పిల్లల తల్లిని, చిన్నపిల్లను చూసాడు. వాళ్ల మొహాలు పాలిపోయి కళ్లు గాజుముక్కల్లా ఉన్నాయి. "ఒక ఆడదాన్ని కొరడాతో బాదడం కూడా చూసాను" అన్నాడు.

"ప్రార్థన, ప్రార్థన" అన్నది ముసలావిడ– "ప్రార్థించు..."

"నేనేమీ చెడ్డవాడిని కాదు నాకు తెలిసినంత వరకు" మిస్‌ఫిట్ చెప్పుకుపోతున్నాడు కలలోలా. "ఎప్పుడో ఎక్కడో ఏదో తప్పుపని చేసినట్లున్నాను. నన్ను సంస్కరణ కారాగారానికి పంపారు. బతికుండగానే నన్ను సమాధి చేసారు" అంటూ అతడు ఆమె కళ్లల్లోకి చూసాడు.

ముసలావిడ వెంటనే అందుకుంది– "అందుకే ప్రార్థన చెయ్యాలనేది నేను. అప్పుడే ప్రార్థించడం మొదలెట్టిఉంటే బాగుండేది. అయినా ఎందుకు ఆ జైల్లోకి వెళ్లాల్సి వచ్చింది?"

అతడు ఆమె మాటలు వింటున్నట్లు లేదు.

"కుడిపక్కకు తిరుగు– గోడ; ఎడమపక్కకు తిరుగు– గోడ; పైకి చూస్తే పైకప్పు; కిందకు చూస్తే నేల; నేనేం తప్పు చేసానో మరిచిపోయాను లేడీ!" అన్నాడు మిస్‌ఫిట్ మబ్బులు లేని ఆకాశం వేపు చూస్తూ– "ఆ ఇరుకు గదిలో కూర్చుని, కూర్చుని నేనేం తప్పు చేసానా అని గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించేవాడిని, కాని అదేమిటో ఇవ్వాళ్టికీ గుర్తులేదు. ఒక్కోసారి దాదాపు గుర్తుకు వస్తున్నట్లుండేది కాని రాలేదు"

"బహుశా పొరపాటున వాళ్లు నిన్ను జైల్లో పెట్టారేమో" అన్నది ముసలావిడ సంశయిస్తూనే.

"లేదు మేడమ్! వాళ్లేం పొరపాటు పడలేదు. నామీద ఛార్జీషీటు, నేరారోపణ, విచారణ అన్నీ ఉన్నాయి"

"ఏమన్నా దొంగతనం చేసావా?" అడిగిందామె.

మిస్‌ఫిట్ తిరస్కారంగా నవ్వి అన్నాడు– "నాకు కావాల్సింది ఎవరి దగ్గరా లేదు" అన్నాడతడు.

"జైల్లో పిచ్చిడాక్టరు నేను మా నాన్నను చంపానన్నాడు. కాని అది పచ్చి అబద్ధం. మా నాన్న 1919లో ఎపిడమిక్ ఫ్లూ వల్ల చచ్చిపోయాడు. దాంతో నాకేమీ సంబంధం లేదు. అతడ్ని మౌంట్ హోప్‌వెల్ బాప్టిస్ట్ చర్చియార్డులో ఖననం చేసారు. కావాలంటే నీవు వెళ్లి చూసి నిజం తెలుసుకోవచ్చు"

"నీవు జీసస్‌ను ప్రార్థించు" అన్నదామె. "అతడు నీకు సాయం చేస్తాడు"

"అలాగే" అన్నాడు మిస్‌ఫిట్.

"మంచిది. మరి నీవెందుకు ప్రార్థించవు" అన్నదామె మనసులో ఏదో మారుమూల సంతోషంగా అనిపించి.

"నాకెవరి సాయం అక్కర్లేదు" అన్నాడు మిస్‌ఫిట్. "నా మట్టుకు నేను న్యాయంగానే ఉన్నాను"

బాబీలీ, హిరామ్‌లు అడవుల్లోంచి నెమ్మదిగా వస్తున్నారు. బాబీలీ చేతిలో వేలాడుతున్న పసుపుపచ్చ చొక్కాపై నీలిచిలకల బొమ్మలు మెరుస్తున్నాయి.

"ఆ చొక్కా ఇటు విసురు, బాబీలీ" అన్నాడు మిస్‌ఫిట్. అనడమే తడవుగా అది ఎగురుకుంటూ వచ్చి మిస్‌ఫిట్ భుజంపై పడింది. దాన్ని వెంటనే అతడు తొడుక్కున్నాడు. నాయనమ్మకు ఆ చొక్కా గురించి ఏం చెప్పాలో తోచలేదు– "నో, లేడీ" అన్నాడు మిస్‌ఫిట్ చొక్కా గుండీలు పెట్టుకుంటూ "నేను గ్రహించాను నేరం చేయడంలో తప్పేమీ లేదని. నీవు ఇదో అదో నిస్సంకోచంగా చేయవచ్చు. ఎవర్నైనా చంపవచ్చు. అతడి కారు టైరో, మరొహాటో తీసుకోవచ్చు. తర్వాతో, వెంటనే నీవేం చేసావో మరిచిపోతావు. కాని దానికి నీకు శిక్షపడ్తుంది"

పిల్లల తల్లి భారంగా శ్వాస పీల్చుకున్నది, ఇక ఊపిరి అందదేమోనన్నంత కష్టంగా. "లేడీ!" అన్నాడు మిస్‌ఫిట్– "ఏమనుకోకుండా నీవూ, ఆ చిన్నపిల్లలు బాబీలీ, హిరామ్‌లతో పోయి నీ భర్త, పిల్లాడి దగ్గరకు వెళ్లకూడదూ?"

"యస్. థాంక్యూ" అన్నదామె అస్పష్టంగా. ఆమె ఎడమచేయి దెబ్బతిన్నట్లు వేలాడుతున్నది. కుడిభుజంపైన చంటిపిల్లాడు నిద్రపోతున్నాడు. "హిరామ్! ఆమెకు సాయం చేయి" అన్నాడు మిస్‌ఫిట్ లేవడానికి ఆమె శ్రమపడ్తుంటే. "బాబీలీ, నీవు చిన్నపిల్ల చేయి పట్టుకో!"

"వాడి చేయి నేను చచ్చినా పట్టుకోను" అన్నది జూన్‌స్టార్– "వాణ్ణి చూస్తే నాకు పంది గుర్తుకువస్తుంది"

లావుగా ఉన్న కుర్రాడు కాస్త సిగ్గుపడి నవ్వాడు. అయినా ఆ చిన్నపిల్ల చేయి పట్టుకుని గుంజుతూ హిరామ్, చిన్నపిల్లల తల్లి వెనక అడివిలోకి అదృశ్యమయ్యాడు.

మిస్‌ఫిట్‌తో ఇప్పుడు తానొక్కటే ఒంటరిగా ఉండేసరికి ముసలావిడకు గొంతు మూగవోయింది. ఆకాశంలో చిన్నమెత్తు మబ్బు కాని, సూర్యుడి జాడ కానీ లేదు. ఆమె చుట్టూ అడవులు తప్ప ఏమీలేవు. ప్రార్థన చేయాలి నీవు అని అతడికి చెప్పాలని వుంది ఆమెకు. చాలాసార్లు నోరు తెరచి ఏదో చెప్పబోయి ఆగిపోయింది.

చివరకు– "జీసస్ జీసస్" అని మాత్రమే అన్నది. జీసస్ నీకు సాయం చేయుగాక అన్న అర్థంలో ఆ పదాలు వాడినా, అవి ఏదో తిడ్తున్నట్లు ధ్వనించాయి.

"యస్ మేడమ్" అన్నాడు మిస్‌ఫిట్ అంగీకరించినట్లు– "జీసస్ అన్ని విషయాలు చూపించాడు. అవన్నీ అసమతూకమైనవి. నాకూ అతడికి పెద్ద తేడా ఏమీ లేదు, ఒక్క విషయంలో తప్ప. అతడే నేరం చేయలేదు. కాని నేను నేరం చేసాననడానికి నా పేరు మీద పేపర్లు, సాక్ష్యాధారాలు ఉన్నాయి". "కాని, ఏనాడూ నాకు వాళ్లు ఆ పేపర్లు చూపించలేదు. అందుకే నేనిప్పుడు నేను చేసే పనులపై నా సంతకాలు పెడ్తున్నాను. చానాళ్లక్రితం నాలో నేను నిర్ణయించు కున్నాను. నీవు ఏదన్నా పని చేసావా దాని మీద నీ సంతకం స్పష్టంగా పెట్టు. దానికి గుర్తుగా నీ దగ్గర ఒక కాపీ ఉంచుకో. అప్పుడు నీకు నీవేమేమి చేసావో నీకు గుర్తుంటాయి. అప్పుడు నేరము–శిక్ష రెండింటిని సరిచూసుకోవచ్చు. దాన్నిబట్టి నీకు న్యాయం జరిగిందా, అన్యాయం జరిగిందా ఋజువు చేయవచ్చు. అందుకే నన్ను నేను 'మిస్‌ఫిట్'గా ఇతరులతో కలిసి ఉండలేనివాడిగా, అనుకున్నాను"– అన్నాడతడు. "నేను చేసిన తప్పుకు దానికి నాకు పడ్డ శిక్ష మిస్‌ఫిట్ అని నేననుకున్నాను"

అడవుల్లోంచి ఓ హృదయ విదారకమైన కేక, వెంటనే పిస్టల్ షాట్ ప్రతిధ్వనించాయి– "ఇది నీకు న్యాయంగా అనిపిస్తుందా, లేడీ, ఒకడికేమో దారుణమైన శిక్ష, మరొకడేమో అసలు శిక్ష అనుభవించకపోవడం?"

"జీసస్" ఏడ్చింది ముసలావిడ– "నీలో మంచి రక్తముంది. నీవు ఉన్నత కుటుంబ స్త్రీని చంపవు కదా! నాకు తెలుసు నీవు మంచి కుటుంబం నుంచి వచ్చావని. జీసస్‌ను ప్రార్థించు. నీవు ఉన్నత కుటుంబ స్త్రీని చంపకూడదు. నా దగ్గర ఉన్న డబ్బంతా ఇచ్చేస్తాను"

"లేడీ!" అన్నాడు మిస్‌ఫిట్ దూరంగా ఉన్న అడవుల వేపు చూస్తూ– "కాటికాపరికి శుల్కం చెల్లించకుండా ప్రేత సంస్కారం జరగదు!"

ఇంకో రెండు పిస్టల్ షాట్లు వినిపించాయి. ముసలావిడ, దాహంతో గొంతెండిపోయిన కోడిపెట్టలా తలపైకెత్తింది. "బెయిలీ బాయ్, బెయిలీ బాయ్"– అన్నది గుండె పగిలేలా దుఃఖంతో ఏడుస్తూ–

"మృతుల నుంచీ లేచింది జీసస్ ఒక్కడే" అన్నాడు మిస్‌ఫిట్. "ఆ పని అతడు చేసి ఉండాల్సింది కాదు! జీసస్ అన్ని విషయాలూ చూపించాడు. అవన్నీ అసమతూకమైనవి. అతడు చెప్పిందే అతడు చేసాడని నీవు నమ్మితే నీవు

చేయగలిగిందేమీ లేదు నీ దగ్గర ఉన్నవన్నీ ఇచ్చేసి అతడిని అనుసరించు. అతడు చేయలేదని అనుకుంటే అప్పుడు కూడా నీవు చేయాల్సిందేమీలేదు. నీకున్న ఈ కొద్ది నిముషాలూ సంతోషంగా గడపవచ్చు, ఎవడినన్నా చంపో ఇళ్లు తగలబెట్టో, అటువంటి క్రూరమైన పని ఏదో ఒకటి నీచమైనది చేయి. సంతోషంతో కాదు సిగ్గుతో. సమాజం నిన్నెట్లా చూసిందో సమాజాన్ని నీవట్లాగే చూడాలి" అతడి గొంతు క్రమేపీ ఛీత్కారంగా మారింది.

"అతడు మృతుల నుంచి లేవలేదేమో" అన్నది ముసలావిడ గొణుగుతూ. ఆమె ఏం మాట్లాడుతున్నదో తెలీని పరిస్థితిలో ఉన్నదామె. అలా గొణుగుతూనే కళ్లు తిరిగినట్లు, నిస్త్రాణ ఆవహించినట్లు, కాళ్లు చచ్చుబడినట్లు గోతిలో కూలబడింది.

"అప్పుడు నేనక్కడ లేను, అందుకే అతడు మృతుల నుంచి లేచాడో లేదో చెప్పలేను" అన్నాడు మిస్‌ఫిట్– "ఒకోసారి నేనక్కడ ఉంటే బాగుండేదేమోనని అనిపిస్తుంది నాకు" – నేలపై పిడికిలితో గుద్దుతూ అన్నాడు– "నేనప్పుడు అక్కడ లేకపోవడం కరెక్టు కాదు, ఎందుకంటే, అక్కడేం జరిగిందో నాకు తెలవలేదు. విను లేడీ! నేనే గనక అక్కడ అప్పుడున్నట్లయితే నాకు తెలిసి ఉండేది, అప్పుడు నేనిట్లా ఉండేవాడిని కాను" అతడు గొంతు స్థాయి పెరిగింది. ముసలావిడ కాస్త తేరుకున్నట్లై అతడివేపు చూసింది. అతడి ముహం దాదాపు ఆమె దగ్గరకు వచ్చి రంగులు మారుతూ అతడు ఏడ్వబోతున్నాడని ఆమెకనిపించగా ఆమె నెమ్మదిగా గొణిగింది "నీవూ నా పిల్లల్లాంటి వాడివే! నా స్వంత పిల్లాడివి" ఆమె నెమ్మదిగా తన చెయ్యి పైకెత్తి అతడి భుజాన్ని తాకింది. మరుక్షణం ఏదో పాము అతడిని కరిచినట్లుగా తుళ్లిపడి వెనక్కి జరిగి టపటపా వరసగా మూడుసార్లు ఆమె గుండెలోకి సూటిగా కాల్చాడు. తరువాత గన్ను నేలపై ఉంచి, నింపాదిగా కళ్లజోడు తీసి అద్దాలను శుభ్రం చేయసాగాడు.

హిరామ్, బాబీలీ పొదల్లోంచి వచ్చి గోతి అంచున నిలబడ్డారు. వాళ్లకు సగం కూర్చుని, సగం పడుకున్నట్లు, శరీరం కింద కాళ్లు క్రాస్‌గా మడతబడి, రక్తపు మడుగులో ఉన్న ముసలావిడ శరీరం కనిపించింది. చిన్నపిల్లలా ఆమె ముఖం చిరునవ్వు నవ్వుతూ ఆకాశంవేపు చూస్తున్నట్లున్నది.

కళ్లజోడు లేకపోయేసరికి మిస్‌ఫిట్ కళ్లు ఎర్రటి అంచులతో పాలిపోయినట్లు కనిపించాయి. "ఈమెను తీసుకుపోయి మిగతా వాళ్ల దగ్గర పడవేయండి" అన్నాడతడు తన కాళ్ల దగ్గర పాకుతున్న పిల్లిని ఎత్తుకుంటూ.

"మహా మాటకారి కదూ, ఈవిడ" అన్నాడు బాబీలీ, గోతిలోకి దిగుతూ, ఏదో పాడుతూ.

"ఈమె మంచిదే అయ్యుండేది" అన్నాడు మిస్‌ఫిట్– "ఆమె జీవితంలో ప్రతి నిముషం ఎవరో ఒకరు ఇలా షూట్ చేసి ఉంటే!"

"కాస్త కాలక్షేపం!" అన్నాడు బాబీలీ.

"నోర్మూయ్! బాబీలీ!" అన్నాడు మిస్‌ఫిట్–

**"జీవితంలో కాలక్షేపం ఆనందాన్నివ్వదు"**

✧✧✧✧✧

---

**మేరీ ఫ్లాన్నెరీ ఓ కానర్ (Mary Flannery O'Connor 1925-1964)**

మేరీ ఫ్లాన్నెరీ ఓ కానర్ అమెరికన్ రచయిత్రులలో పేరెన్నికగన్నది. రెండు నవలలు, 32 కథలు, అనేక కామెంటరీలు వ్రాసినది. ఆమె కథల్లో దక్షిణ గోథిక్ శైలి ఉండి, పాత్రలలో వికారపు లక్షణాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. ఆమె Complete Short Stories 1972 U.S. National Book Award for Fiction గెలుచుకున్నది. ఆమె ఇతర రచనలు– Wise Blood, The Violent Bear it away (నవలలు); A good man is hard to find; Everything that rises must converge (కథా సంపుటాలు). కాథలిక్ క్రిష్టియన్‌గా జీవితాన్ని గడిపిన ఆమె– 'Grace changes us and change is painful' అని వ్రాసింది.

# 3. రహస్యం (Secret)

– డెనిసి లెవర్‌టోవ్

ఇద్దరు బాలికలు
ఓ కవితలోని వాక్యంలో
కనుగొన్నారు జీవిత రహస్యాన్ని.
ఆ రహస్యం తెలీని నేను
వ్రాసాను ఆ వాక్యాన్ని.–

వాళ్లు నాతో చెప్పారు.
(మూడో వ్యక్తి ద్వారా)

వాళ్లు దాన్ని కనుగొన్నారు, కాని
అప్పటికింకా ఆ వాక్యం
వాక్యమే కాలేదు. సందేహం
లేదు ఒక వారం
తరువాత, వాళ్లు మరచిపోయారు
ఆ రహస్యాన్ని.

వారిని నేను ప్రేమిస్తున్నాను.
ఎందుకంటే, నాకు కనబడనది
వాళ్లు కనుక్కున్నారు, నేను ఆ వాక్యాన్ని
వ్రాసినందుకు నన్ను ప్రేమిస్తున్నారు గనుకా,
మరల మరచిపోయినందుకూ;
ఎందుకంటే
వేయిసార్లు, వారిని మృత్యువు కనుగొనేంత వరకూ
ఆ రహస్యాన్ని వాళ్లు కనుక్కోగలరు. ఇతర
వాక్యాలలో కూడా–

ఇతర అనుభవాల్లో. దానిని
తెలుసుకోవాలని అనుకుంటున్నందుకు.
అటువంటి రహస్యం ఉన్నదని
అనుకున్నందుకు,
ముఖ్యంగా, అందుకే నేను
వారిని ప్రేమిస్తున్నాను.

# 4. నా మనసులో

**- డెనిసి లెవర్‌టోవ్**

ఏ ఆర్భాటమూ అలంకారాలు లేక
పసిరిక లేదా ఫలపుష్ప పరిమళాలు వెదజల్లుతూ
ప్రకృతి సహజ సౌందర్యంతో, మృదువైన శిరోజాలతో
నడయాడుతున్న అమాయక యువతి
నా మనసు ఒక మూల నిండి ఉన్నది.
ఆమె దయగల స్త్రీ,
కాని, ఆమెకు ఊహాశక్తి లేదు.

మరో మూల, శుక్ల కృష్ణపక్ష కాంతులతో
ఉద్విగ్నం చెందే బాలిక లేదా వృద్ధస్త్రీ లేదా ఇద్దరూ
సమస్త అలంకారాలతోనో, చిరుగు దుస్తులలోనో-
వాళ్లకు వింత వింత పాటలు వచ్చు--
కాని, వాళ్లలో ఏ కోశానా దయలేదు.

✧✧✧✧✧

---

**డెనిసి లెవర్‌టోవ్ (Denicci Levertov 1923-1997)**

ఇంగ్లండ్‌లో నర్సుగా రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పనిచేసిన డెనిసి లెవర్‌టోవ్ తరువాత anti war, anti nuclear protest movements లో ప్రముఖ పాత్ర పోషించింది. ఆమె మాటల్లోనే- "I believe Poets are instruments on which the power of Poetry Plays... that who cannot see may see, since we are members of one another".

# 5. అతి ప్రమాదకరమైన ఆట
## (The Most Dangerous Game)

**– రిఛర్డ్ కోన్నెల్**

"అటు కుడిపక్కకు చూడు – పెద్దద్వీపం. అంతుచిక్కని రహస్యాల దీవి..." అన్నాడు విట్నీ.

"ఎటువంటి దీవి అది?" అడిగాడు రెయిన్స్‌ఫోర్డ్.

"నావికులు దానిని 'నౌకల్ని కబళించే ద్వీపం' Ship trap island అంటారు. పేరుకు తగ్గదే కాబోలు. అది కంటపడగానే వాళ్లు వణికిపోతున్నారు. ఎందుకో నాకు తెలీదు. ఏదో మూఢనమ్మకం..." అని చెప్పి విట్నీ ఆగాడు.

"నాకేం కనబడటం లేదు" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

నల్లటి చీకటిరాత్రి వాళ్ల విలాస నౌకను పూర్తి అంధకారంతో నొక్కుతూ కమ్ముకున్నది.

"నీ చూపు నిశితమైనదే!" అన్నాడు విట్నీ నవ్వుతూ.–

–"నాకు తెలుసు. నీవు నాలుగు వందల గజాల దూరంలో దట్టమైన దుమ్ములో కలిసిపోయి దూసుకు వస్తున్న కడిమి దున్న మూస్ (Moose)నే కనిపెట్టగలిగినవాడివి. అయినా ఈ కరిబ్బియన్ చీకటి రాత్రుల్లో నాలుగు మైళ్ల దూరంలో ఉన్న ద్వీపాన్ని పసిగట్టడం అసాధ్యమేలే!"

"ఈ కటిక చీకటిలో నాలుగు గజాలలోపు కూడా చూడలేం" ఒప్పుకున్నాడు రెయిన్స్ ఫోర్డ్.

నల్లటి ముఖమల్ గుడ్డ పరిచినట్లుందీ చీకటి.

"మనకి సరిపడా వెలుగు రియొ (Rio) లో ఉంటుంది. ఇది నా వాగ్దానం. ఇంకా కొద్దిరోజులేగా ప్రయాణం. 'పర్దే' నుంచి జాగ్వార్ తుపాకులు వచ్చే ఉంటాయి. అమెజాన్‌లో మన వేట బాగానే ఉంటుందని నా ఆశ. అన్ని ఆటల్లోకి గొప్పది వేట" అన్నాడు విట్నీ.

"అవునవును. ప్రపంచంలోని అన్ని వినోదాల కన్నా గొప్పది క్రీడా వినోదం– అదే వేట" రెయిన్స్‌ఫోర్డ్ అంగీకారం తెలిపాడు.

"వేటగాడికి ఆట కావచ్చు కాని జాగ్వార్ పులికి వేటు కదా!" అన్నాడు విట్నీ.

"చెత్త విషయాలు మాట్లాడకు, విట్నీ" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్. "నీవు వేటగాడివి; వేదాంతివి కావు. జాగ్వార్ బాధలు భావాలతో మనకు పనేమిటి?"

"బహుశా జాగ్వార్ అలాగే అనుకుంటుందేమో!" విట్నీ తనలో తను అనుకున్నట్లు అన్నాడు.

"వాటికి అర్థం చేసుకునే శక్తి లేదు మిత్రమా!"

"కాని వాటికి ఒకటి అర్థమవుతుంది. అదే భయం! నెప్పి భయం, మృత్యుభయం"

"అర్థంలేని మాటలు!" నవ్వాడు రెయిన్స్‌ఫోర్డ్. "ఈ ఉక్కబోత, వేడి నిన్ను మెత్తబరిచాయనుకుంటాను విట్నీ! యదార్థవాదివికా! ఈ ప్రపంచంలో రెండే జాతులున్నాయి. వేటగాళ్లు, వేటాడబడేవాళ్లు. అదృష్టవశాత్తూ మనిద్దరం వేటగాళ్లం. మనం ఆ ద్వీపాన్ని దాటి వచ్చేసామంటావా?"

"ఈ చీకటిలో ఇతమిత్థంగా చెప్పలేను కాని దాటాలని కోరుకుంటున్నాను" అన్నాడు విట్నీ.

"ఎందుకా ప్రార్థన?" ఆశ్చర్యంగా అడిగాడు రెయిన్స్‌ఫోర్డ్.

"ఆ ద్వీపానికి బాగా పేరు ఉన్నది. భయంకరమైనది!"

"నరమాంస భక్షకులా?" రెయిన్స్‌ఫోర్డ్ అడిగాడు.

"కాదు కాదు! వాళ్లు కూడా అక్కడ బతకలేరట. నావికుల కథనాల ప్రకారం అది చొరరాని ప్రదేశం. నీవు గమనించే ఉంటావు. ఇవ్వాళ మన నౌకాసిబ్బంది అంతా భయభ్రాంతులతో ఉలిక్కిపడుతూ ఉండడం"

"అవునవును. కెప్టెన్ నీల్సెన్ కూడా ఏదో పరధ్యానంగా, అదోరకంగా ఉన్నాడు... నేనూ గమనించాను"

"చివరకు మహాగట్టివాడైన స్వీడన్ వృద్ధుడు– డెవిల్ దగ్గరకు వెళ్లి అగ్గి అడగగల సమర్థుడూ అతగాడి సందేహాస్పద నీలికళ్లు కూడా ఏదో తత్తరపాటుతో కనిపించాయి. తరచితరచి అడిగితే ఏమన్నాడంటే– 'నావికులకు ఈ ద్వీపంపై మంచి అభిప్రాయం లేదు సార్, మీకేమీ అనిపించడం లేదా?' అని తిరిగి నన్నే

అడిగాడు. అక్కడి నుంచీ వచ్చే గాలిలోనే ఏదో విషం కలిసి ఉన్నట్లు. నీవు నవ్వకూడదు సుమా నేనీమాట అంటున్నానని. నాకు శరీరంలో ఏదో జివ్వున చలివణుకు పుడుతున్నది! గాలిలేదు. సముద్రం గాజు పలకలా నిశ్చలంగా ఉంది. అంటే మనం ఆ ద్వీపానికి దగ్గరగా వస్తున్నామన్నమాట. నా మనసులోనే ఏదో శీతల వణుకు. ఆకస్మిక భయం."

"అంతా భ్రాంతి. విపరీతపు ఆలోచన" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

"ఒక్క మూఢనమ్మకపు నావికుడు చాలు మొత్తం నౌక సిబ్బందినీ భయంతో గడ్డగట్టించడానికి"

"నీవన్నది నిజం కావచ్చు. కాని ఈ నావికులకు ఆరవ ఇంద్రియశక్తి ఉంటుందేమో. సిక్త్స్‌సెన్స్. వాళ్లు ప్రమాదాన్ని ముందుగానే పసిగడ్తారు. నాకేమని పిస్తుందంటే ఈ చెడు విషయానికి, ఈ 'ఈవిల్ థింగ్'కు కాంతికి, ధ్వనికి ఉన్నట్లు తరంగదైర్ఘ్యము లాంటి లక్షణాలు ఉంటాయేమో! ఈ దయ్యాల ద్వీపం నుంచి అటువంటి భ్రాంతులు, చెడు ఆలోచనలు చుట్టూరా వ్యాపిస్తాయేమో! ఏది ఏమైనా మనం ఈ దీవిని దాటి దూరంగా పోతున్నందుకు నాకు సంతోషంగా ఉన్నది. నేను లోపలికి వెళ్తున్నా! బై! రెయిన్స్‌ఫోర్డ్! బై!"

"నాకు నిద్ర రావడం లేదు" రెయిన్స్‌ఫోర్డ్ బదులు పలికాడు. –

"కాసేపు పైన కూర్చుని మరోపైపు వెలిగిస్తాను తీరికగా!"

"గుడ్‌నైట్! రెయిన్స్‌ఫోర్డ్! రేపు బ్రేక్‌ఫాస్ట్ దగ్గర కలుద్దాం!"

"రైట్! విట్నీ! గుడ్‌నైట్!"

విలాస నౌక చీకటిలో పోతుండగా వస్తున్న మంద్రమైన ఇంజన్ చప్పుడు, ప్రొపెల్లర్‌కు నీళ్లు తగిలి కోసుకుపోతుంటే వచ్చే 'స్విష్' శబ్దం మినహా అంతా నిశ్శబ్దంగా ఉంది.

వాలుకుర్చీలో కూర్చుని తనకిష్టమైన పొగ పీలుస్తూ ఉన్న రెయిన్స్‌ఫోర్డ్‌ను రాత్రి మగతనిద్ర ఆవహించసాగింది. "బాగా చీకటిగా ఉంది. నేనిక్కడ కనురెప్పలు మూసుకోకుండా నిద్రపోగలను. ఈ రాత్రి చీకటి నాకు కనురెప్పలుగా ఉండనీ..." అనుకున్నాడతడు.

అకస్మాత్తుగా వినవచ్చిన ఓ శబ్దానికి అతడు ఉలిక్కిపడ్డాడు. తనకు కుడివేపుగా వచ్చిన ఆ ధ్వనిని ఆతడు చెవులు నిక్కబొడిచి విన్నాడు. అటువంటి

విషయాలలో అతడు నిష్ణాతుడు. మరల అదే శబ్దం. ఆ చీకటిలో ఎవరో మూడుసార్లు తుపాకీ పేల్చారు.

రెయిన్స్‌ఫోర్డ్ చటుక్కున లేచి నౌక అంచు వద్దకు చేరుకున్నాడు. విభ్రాంతితో అతడు ఆ శబ్దాలు వచ్చినవేపు నిశితంగా చూడడానికి ప్రయత్నించాడు. కానీ చీకటి మందపాటి దుప్పటిలా దట్టంగా ఉన్నది. అంచుపైకి ఎక్కి తనకు తాను బాలెన్స్ చేసుకుంటూ ధ్వని వచ్చిన వేపు చూడబోయాడు. నోటిలోని పైపు దగ్గరలో ఉన్న తాడుకు తగిలి కిందపడబోగా దానిని అందుకోబోయాడు. అంతే! అతని పెదాలు నుంచి రక్తాన్ని గడ్డకట్టించే కేక. అతడికి అర్ధమయ్యింది తాను పడిపోయానని. ఆ కేక పూర్తికాకముందే కరిబియన్ సముద్రపు రుధిరోష్ణ జలాలు అతడి తలను ముంచెత్తాయి.

నీళ్లల్లో కొట్టుకుంటూ అతడు పైకితేలి బిగ్గరగా అరిచాడు కాని వేగంగా పోతున్న విలాసనౌక – యాక్ట్ – నుంచి జిమ్ముతున్న నీళ్లు అతడి ముఖానికి తగిలి అరుస్తున్న అతడి నోటిలోకి ఉప్పునీటిని విరజిమ్మి అతడికి ఊపిరాడకుండా చేసాయి. శాయశక్తులా ఈతకొడ్తూ పెద్దపెద్ద బారలతో ఈదుతూ నౌకనందుకోవాలని ప్రయత్నం చేసాడు. నౌక వెనుక ద్వీపాలు క్రమేపీ దూరం కాసాగాయి. ఒక యాభై అడుగుల దూరం ప్రయత్నించి ఆగిపోయాడు. మనసు ఒక దృఢ నిశ్చయానికి వచ్చింది. ఇదేమీ తొలిసారి కాదు ఇటువంటి కష్టాల్లో ఇరుక్కోవడం, తన కేకలు ఎవరికైనా వినబడతాయేమో అన్న ఆశతో దుస్తులు వదులు చేసుకొని మరీ అరిచాడు. కాని నౌక ఆగకుండా వెళ్లిపోతుండగా అతడి ఆశలూ సన్నగిల్లిపోయాయి, ఆ దీపాల కాంతిలానే! క్రమేపీ కటిక చీకటి కమ్ముకున్నది అతడి చుట్టూరా!

అతడికి ఆ తుపాకీ పేల్చిన శబ్దాలు గుర్తుకొచ్చాయి. అవి తన కుడివేపునించి వచ్చాయి. అటువేపే అతడు ఈదడం మొదలెట్టాడు. నింపాదిగా, లెక్కబెడ్తున్నట్లు, తన శక్తిని కాపాడుకుంటూ. అంచనా వేయలేనంత సమయం పాటు ఈదుతూ సముద్రాన్ని కోసుకుంటూ పోతూనే తాను ఎన్ని అంగలు వేసాడో మనస్సులో లెక్కబెడ్తూనే ఉన్నాడు. దాదాపు వందకు పైనే–

రెయిన్స్‌ఫోర్డ్‌కు ఓ భయంకరమైన శబ్దం వినిపించింది. చీకటిని చీల్చుకు వచ్చిన ఆ అరుపు– భయంతో నెప్పితో గిలగిలలాడ్తూ ఏదో జంతువు అరచినట్లుగా ఉన్నది. ఓ క్షణంపాటు ఒళ్లు జలదరించిందతడికి.

అంత అనుభవమున్న అతడు కూడా అదే జంతువుదో గుర్తుపట్టలేక పోయాడు. అతని ఆలోచనంతా ఒడ్డుకు ఎలా చేరాలా అనే. ఇనుమడించిన శక్తితో

ఆ శబ్దం వచ్చిన వేపే ఈదినాడు. మళ్లీ అరుపు వినిపించింది. ఆ అరుపును ఆపివేస్తున్నట్లు మరో శబ్దం. టక్‌టక్‌టక్ మంటూ –'పిస్టల్ షాట్'– గొణిగాడు రెయిన్స్‌ఫోర్డ్ ఈదుతూనే. పది నిముషాలు అలా ఈదుతూ వచ్చేప్పటికి అతని చెవులకు మరో శబ్దం వినిపించింది. ఈ శబ్దం కాస్త చెవులకింపుగా ఉండింది. అది సముద్రపు అలలు ఒడ్డుకు ఢీకొని చేసే సవ్వడి. ఆ అలల్ని అతడు చూసే సరికి అతడు రాళ్లపైకి చేరుకున్నాడు. సముద్రం కాస్త ప్రశాంతంగా ఉంది కాబట్టి సరిపోయింది కాని లేకపోతే ఆ కోసురాళ్లకు తగిలి ముక్కలు ముక్కలు కావాల్సింది తాను. సుడులు తిరుగుతున్న నీటి నుంచి చాలా జాగ్రత్తగా బయటపడుతూ మొత్తానికి పదునుగా ఉండి, జారిపోతున్న రాళ్ల అంచులపై చేతిపై చేతి నుంచి గట్టిగా పట్టుకుంటూ అలల తాకిడికి మరల సముద్రంలోకి కొట్టుకుపోకుండా తనని తాను రక్షించుకుంటున్నాడు. రాళ్లసందుల్లో చేతులుంచి తెగినా పట్టించుకోకుండా, భారంగా గాలి పీలుస్తూ పైకి ఎక్కి ఓ గాఢమైన నిట్టూర్పు వదిలాడు. ఆ రాతి గుట్టల పక్కనే దట్టమైన అడవి వ్యాపించి ఉన్నది. ఆ చిక్కటి అడవుల్లో ఏ ప్రమాదాలు పొంచి ఉన్నవో అన్న భయం అప్పుడు రెయిన్స్‌ఫోర్డ్‌కు కలగలేదు. అతడికి తెలిసిందల్లా ప్రస్తుతం తన శత్రువైన సముద్రాన్ని తప్పించుకుని బయటపడ్డాడు. అది చాలు. అతడికి ఎక్కడలేని నీరసం వచ్చింది. అడవి అంచున వెల్లకిలా పడిపోయి దీర్ఘనిద్రలోకి ఒరిగాడు.

కళ్లు తెరచి చూసేటప్పటికి సూర్యుడి స్థానాన్ని బట్టి మిట్టమధ్యాహ్నం దాటిందని అతిడికి అర్థమయ్యింది. నిద్ర అతడిలో కొత్త ఉత్సాహాన్ని నింపగా ఆకలి అతడిని వేధింపసాగింది. కాస్త సేదదీరిన మనస్సుతో అతడు చుట్టూరా పరికించాడు.

"పిస్టల్ పేలిందంటే మనుషులున్నట్టే, మనుషులున్నారంటే ఆహారమున్నట్లే" – అనుకున్నాడతడు. ఈ నిషేధిత స్థలంలో, దయ్యాల దీవిలో ఎటువంటి మనుషులునారబ్బా! దారి తెన్నూ లేని చిక్కటి అరణ్యమే తీరాన్ని కప్పివేసింది. ఎక్కడా ఏ రకమైన కాలిబాటా కానరాలేదు. దట్టంగా పరచుకున్న అడవిచెట్ల, లతల మధ్య ఎటువంటి పాదముద్రలూ లేవు. అడివిలోకి పోయి చిక్కుల్లో పడడం కన్నా తీరం వెంబడే పోవడం శ్రేయస్కరమనిపించి రెయిన్స్‌ఫోర్డ్ సముద్రపు నీటి అంచువెంబడే నడవసాగినాడు. తాను తీరానికి చేరిన చోటునుంచి కొద్దిదూరం పోగానే అతడు ఆగిపోయాడు.

ఏదో పెద్ద జంతువు గాయపడింది. బాధతో అడవిలోకి చొచ్చుకుపోయి నట్లుంది– అనుకున్నాడు.

రెయిన్స్‌ఫోర్డ్ అక్కడున్న పొదల్ని పరిశీలనగా చూసాడు. అడవి తీగెలు నలిగిపోయి ఉన్నాయి. వాటిపై రక్తపు మరకలు. నేలపై నాచుగడ్డి తొక్కబడినట్లున్నది. అడుగులు స్పష్టంగా లేవు. దూరంగా ఒక మెరుస్తున్న వస్తువు అతడి దృష్టినాకర్షించింది.

"ఇరవై రెండు" -తనలో తను అనుకున్నాడు రెయిన్స్‌ఫోర్డ్. "చిత్రంగా ఉందే. ఖచ్చితంగా ఏదో పెద్ద జంతువే. వేటగాడు ముందుగా దాన్ని తేలికరకం తుపాకితో కాల్చినట్టున్నాడు. ఈ క్రూరమృగం కూడా అంత తేలికగా దొరికినట్లు లేదు. నేను మొదట విన్న తుపాకి శబ్దాలు మూడు రౌండ్లు. బహుశా ఆ జంతువును గాయపరచి ఉంటాయి. దాన్ని వెదుక్కుంటూ వచ్చి వేటగాడు ఇక్కడ ఖతం చేసినట్లున్నాడు ఆఖరి షాట్‌తో!"

అతడు నేలపై ఏమన్నా వేటగాడి బూట్ల ఆనవాళ్లు దొరుకుతాయేమోనని వెదకినాడు. అవి కనిపించాయి. వాటినిబట్టి అతడు తాను వెళ్తున్నది సరైన దారి అని అనుకుంటూ కొండ శిఖరం వేపు నడక సాగించాడు. ఎంత త్వరగా పోదామనుకున్నా కాళ్లకు ఏదో కొయ్యో, పాకుడురాయో అడ్డం వచ్చి జారిపడబోయి నిభాయించుకుని ముందుకుపోయాడు. సాయంకాల సమయం దాటగా క్రమేపీ చీకటి అడవిని కమ్ముకురాసాగింది.

అతడి కళ్లకు దీపాలు దూరంగా కనిపించేసరికే చిమ్మచీకటి అడివిని, సముద్రాన్ని కప్పివేయసాగింది. తీరం మలుపు తిరగంగానే కనిపించిన అనేక దీపాల్ని చూసి దూరంగా ఏదో కుగ్రామం ఉంటుందని భ్రమించాడతడు. ముందుకు నడిచిన కొద్దీ అతడికి అర్థమయ్యింది. అవన్నీ ఒకే పెద్ద భవంతిలో ఉన్నాయని. విశాలమైన భవనం. దాని సూదిమొనల్లా ఉన్న గోపురాలు చీకటిలో ఆకాశం వేపు చూస్తున్నట్లున్నాయి. అతడి కళ్లు ఆ భవనం ఉన్న ప్రాంతాన్ని అంచనా వేయసాగినాయి. మూడు పక్కలా కొండలున్న ప్రాంతంలో దుర్భేధ్యమైన కోటలా నిర్మించబడిన భవనం అది. ఆ కొండల్ని సముద్రం తన అలల పెదవులతో చీకటి నీడల మాటున చుంబిస్తున్నట్లున్నది.

'భ్రాంతి' - ఎండమావిలా- అనుకున్నాడు రెయిన్స్‌ఫోర్డ్. కాని అది భ్రాంతి కాదు. ఎదురుగా పెద్ద ఇనుప బల్లేలతో అమర్చిన దృఢమైన గేటు కనిపించింది. ఆ రాతి మెట్లూ నిజమైనవే! ఆ తలుపును తట్టడానికున్న గొళ్లెం- వింతమృగం గార్గొయిల్ ముఖమూ యదార్థమే! అయినా ఏదో అసహజమైన వాతావరణం ఇక్కడి గాలిని నింపినట్లున్నది.

గార్గొయిల్ గొళ్లేన్ని పైకి లేపబోగా అది కీచుమన్న శబ్దాన్ని చేసింది, ఇంతకు ముందెవ్వరూ దానిని వాడనట్లు. పైకి లేపి వదలగానే 'బూమ్ఁఁ' పెద్ద శబ్దం. ఒళ్లు ఝల్లుమనేట్లు. తలుపు తెరచుకున్నది. ఎంత అకస్మాత్తుగా తెరచుకున్నదంటే తలుపుకేదో స్ప్రింగు ఉన్నట్లు. తలుపు తెరుచుకోగానే కళ్లు మిరుమిట్లుకొలిపే స్వర్ణకాంతిలా వెలుగు. దానిని తట్టుకోలేని అతని కళ్లు మూతలు పడి తెరచుకున్నాయి. ఎదురుగా ఓ మహాకాయుడి భీకర రూపం. దృఢంగా లావుగా, ఎత్తుగా, ముఖం మీది నల్లటి గడ్డం ఛాతీమీదకు విస్తరిస్తూ. అతడి చేతిలో పొడుగాటి గొట్టమున్న రివాల్వర్. అది సరాసరి రెయిన్స్‌ఫోర్డ్ గుండెకు గురిపెట్టబడి ఉంది.

దట్టమైన ఆ గడ్డపు ముఖంలోంచి ఓ ఛీత్కారధ్వని, తీక్షణంగా చూస్తున్న రెండు కళ్లు– రెయిన్స్‌ఫోర్డ్ వేపే.

"ప్రమాదమేమీ లేదు" – అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్. తనకున్న ప్రశస్తమైన చిరునవ్వుతో– నేను బందిపోటు దొంగను కాను. నౌకమీంచి సముద్రంలో ప్రమాద వశాత్తూ పడ్డాను. నాపేరు రెయిన్స్‌ఫోర్డ్. ఊరు న్యూయార్క్.

అతడి కళ్లలోని ఏహ్యాభావం తొలగలేదు. శిలలా నిలబడ్డ అతడి చేతిలోని ఎదురుగా ఉన్న రివాల్వర్ స్థానమూ మారలేదు. రెయిన్స్‌ఫోర్డ్ మాటలను విన్నట్లూ, విన్నా అర్థం చేసుకున్న దాఖలా కూడా లేదు. అతడు నల్లటి యూనిఫారం, గ్రే అస్ట్రఖాన్ అంచుతో కూడినది ధరించి మంచులో విగ్రహంలా ఉన్నాడు.

"నేను సాంగర్ రెయిన్స్‌ఫోర్డ్‌ను. న్యూయార్క్ మా పట్టణం. యాక్ట్‌లో ప్రయాణిస్తూ సముద్రంలో పడి నానా యాతనలూ పడి ఇక్కడకు చేరాను. ఆకలితో అలమటిస్తున్నాను" అన్నాడు మళ్లీ రెయిన్స్‌ఫోర్డ్.

అతగాడి జవాబల్లా రివాల్వర్ హామర్‌ని బొటనవేలుతో పైకి లేపడం. కాని మరుక్షణంలో అతడి ఖాళీగా ఉన్నచేయి పైకిలేచి మిలిటరీ సెల్యూట్ చేస్తుండగా, రెండుకాళ్లను పెద్దశబ్దంతో దగ్గరకు చేర్చి 'ఎటెన్షన్' పొజిషన్‌లో నిలబడ్డాడు. ఇంకోవ్యక్తి ఎవరో విశాలమైన చలువరాతి మెట్లమీదుగా వస్తుండడం రెయిన్స్‌ఫోర్డ్‌కు కనిపించింది. అతడు రెయిన్స్‌ఫోర్డ్ వద్దకు వచ్చి కరచాలనం చేసాడు.

"ప్రఖ్యాతిగాంచిన వేటగాడు, మిస్టర్ సాంగర్ రెయిన్స్‌ఫీల్డ్‌ను స్వాగతించడం మా అదృష్టంగా భావిస్తున్నాను. వెల్‌కమ్ – మా ఇంటిలోకి రండి!" అన్నాడా వ్యక్తి. నాగరికమైన పద్ధతిలో, అతడి ఆంగ్ల భాష ఉచ్చారణ ప్రత్యేకంగా ఉన్నది.

అసంకల్పితంగానే రెయిన్స్‌ఫోర్డ్ అతడితో చేతులు కలిపాడు.

"నేను మీ పుస్తకం - Hunting snow leopards in Tibet - టిబెట్‌లో మంచులో ఉండే చిరుతపులుల్ని వేటాడడం గురించి నేను ఆసక్తిగా చదివాను. అయామ్ జనరల్ జారాఫ్ (Zaroff)". –

రెయిన్స్‌ఫోర్డ్ అతడిని ఆపాదమస్తకం పరికించాడు. అందమైన విగ్రహం. కానిఅతడి ముఖంలో ఏదో విశిష్ట, విపరీత ఛాయలున్నాయనిపించిందెందుకో! ఒడ్డూ పొడుగూ ఉన్నవాడు. మధ్యవయస్సు దాటి ఉండవచ్చు. జుట్టు తెల్లగా నెరుస్తూ మెరుస్తున్నది. కాని అతడి దట్టమైన కనుబొమలు, పొడగాటి మొనదేలిన మీసం రెయిన్స్‌ఫోర్డ్ వచ్చిన చీకటంత నల్లగా ఉన్నాయి. కళ్లు కూడా నల్లగా ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. ఎత్తైన దవడ ఎముకలు, చక్కగా తీర్చిదిద్దినట్లున్న ముక్కు, పదునెక్కిన ముఖం – ఆజ్ఞలు జారీచేయడానికి అలవాటుపడ్డ నోరు, రాజరికపు ఠీవి అన్నీ మూర్తీభవించిన అరుదైన వ్యక్తిలా ఉన్నాడతడు. ఆ మహాకాయుడి వేపు చూసి ఏదో సంజ్ఞ చేసాడు. అప్పుడు అతగాడు తన రివాల్వర్‌ను పక్కకు తీసి, సెల్యూట్ చేసి వెళ్లిపోయాడు.

"ఇవాన్ చాలా నమ్మకమైన, గట్టి సేవకుడు" అన్నాడు జనరల్. "దురదృష్ట మేమిటంటే అతడు చెవిటి, మూగవాడు. సాధారణ వ్యక్తే గాని. వాళ్ల తెగలానే కాస్త రాక్షస ప్రవృత్తి కలవాడు."

"రష్యన్' అనుకుంటా!"

"కోసక్ (Cossack)" అన్నాడు జనరల్ నవ్వుతూ. నవ్వుతుంటే అతడి పదునైన దంతాలు కనిపించాయి.

"నేను కూడా!' స్వాగతం! దయచేయండి లోనికి! ఆరుబయట ముచ్చట్లు హర్షణీయం కాదిప్పుడు. తర్వాత మాట్లాడుకుందాం! ఇప్పుడు మీకు కావాల్సింది దుస్తులు, ఆహారం, విశ్రాంతి. అవన్నీ లభిస్తాయి. ఈ ప్రదేశం విశ్రాంతికి అనువైనది"

ఇవాన్ మరల ప్రత్యక్షమయ్యాడు. జనరల్ పెదాలు కదిలాయి కాని ఏ శబ్దమూ రాలేదు. ఇవాన్‌కు అర్థమైనట్లున్నది.

"ఇవాన్‌తో వెళ్లండి. నేను డిన్నర్ తీసుకోబోతుండగా మీరు వచ్చారు. నా దుస్తులు మీకు సరిపోతాయనుకుంటాను. దుస్తులు మార్చుకుని రండి. నేను ఎదురు చూస్తుంటాను" అన్నాడు జనరల్ జారాఫ్.

అది విశాలమైన గది. పైకప్పుపై దూలాలు, ఆరుగురు హాయిగా పడుకోగలిగిన పందిరిమంచం అన్నీ చక్కగా ఉన్నాయి. ఇవాన్ సాయంకాలం

వేసుకునే గౌను ఒకటి ఉంచినాడు. దానిపై లండన్ టైలర్ మార్క్ ఉన్నది. ఆ టైలర్ డ్యూక్ (ప్రభువు) రాంక్‌కు తక్కువవాళ్లకు బట్టలు కుట్టడు. ఆ సంగతి రెయిన్స్‌ఫోర్డ్‌కు తెలుసును.

భోజనాల గది మరీ ప్రత్యేకంగా ఉన్నది. మధ్యయుగపు పనితనం, అందం ఆ గదిలో కొట్టవస్తున్నట్లు కనిపిస్తున్నది. ఫ్యూడల్ ప్రభువుల భవనాల్లోలా ఓక్ వృక్షపు చెక్కలతో చేసిన పైకప్పు, విశాలమైన పొడగాటి బల్ల, కనీసం నలభైమంది భోజనాలకు కూర్చోవడానికి సరిపడిన హాలు, కుర్చీలు, గోడలపై అందంగా అలంకరించబడిన అనేక జంతువుల శిరస్సులు– సింహాలు, పులులు, ఏనుగులు, కడిమిదున్నలు, ఎలుగుబంట్లు –పెద్దవి. రెయిన్స్‌ఫోర్డ్ కూడా చూడనటువంటి పర్‌ఫెక్ట్ స్పెసిమన్లు. డైనింగ్ టేబుల్ దగ్గర 'జనరల్' కూర్చుని ఉన్నాడు, ఒంటరిగా.

"మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్! కాక్‌టైల్ తీసుకుంటారా?" అని గ్లాసు అందించాడు జనరల్. చాలా అద్భుతంగా ఉంది కాక్‌టెయిల్. డైనింగ్ టేబుల్ మీద ఉన్న లినెన్ వస్త్రాలు, క్రిస్టల్ గ్లాసులు, వెండి స్పూన్లు సరంజామా, చైనా పింగాణి సామాగ్రీ అన్నీ ఖరీదైనవి, విలాసవంతమైనవే.

రష్యన్లకెంతో ఇష్టమైన బోర్చ్ (Borsch) సూపు తాగుతుండగా జనరల్ అన్నాడు– "నాగరికతకు సుదూరంగా ఉన్నా ఇక్కడ నాకు కావాల్సిన వసతుల నేర్పరుచుకోగలిగాను, అయినా ఏదైనా లోపాలుంటే క్షమించాలి నన్ను" అన్నాడతడు క్షమాపణ కోర్తున్నట్లుగా. "మేం నిత్య వ్యవహారాలకు దూరంగా ఉన్నాం కదా, ఈ ఛాంపేన్ రుచి ఎలా ఉన్నది, సుదూర సముద్ర ప్రయాణం వలన చెడిపోలేదు కదా!"

"వీసమెత్తు చెడిపోలేదు" రెయిన్స్‌ఫోర్డ్ సమాధానమిచ్చాడు. ఎంత మంచి ఆతిథ్యం. విశ్వనాగరిక మనస్తత్వం. అనిఅనుకున్నా రెయిన్స్‌ఫోర్డ్ మనస్సు ఏదో కీడును శంకిస్తూనే ఉన్నది. అర్థమయ్యింది, తను ప్లేటునుంచి తలపైకెత్తి చూసినప్పుడల్లా, తనను నిశితంగా పరీక్షిస్తున్న జనరల్ కళ్లు ఏదో అంచనాలు వేస్తున్నట్లు కనిపించాయి.

"బహుశా" అన్నాడు జనరల్ జారాఫ్– "నీవు ఆశ్చర్యపడి వుంటావు నీపేరు నాకెలా తెలుసా అని. నీవు గమనించే వుంటావు నేను అన్నిరకాల పుస్తకాలు చదువుతానని, ముఖ్యంగా వేటకు సంబంధించినవి. ఇంగ్లీషు, ఫ్రెంచ్, రష్యన్ భాషల్లోవి. నాకు జీవితంలో మిగిలిన ఒకే ఒక ఉత్సాహభరితమైన కార్యక్రమం వేట. అదంటే నాకు ఎంతో ఇష్టం."

"గొప్ప గొప్ప మృగాల శిరస్సులను ఇక్కడ పెట్టారు. ఆ కేప్‌బఫెలో నేను చూసిన వాటన్నిటికన్నా పెద్దది" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్ – ఫిలెట్ మిగ్నాన్ రుచిచూస్తూ.

"అదా! నిజంగా అదొక రాక్షసిమృగం"

"మీమీదకు దూసుకువచ్చిందా?"

"చెట్టుమీదకు విసిరేసింది. నా కపాలం పగిలింది కూడా! కాని చివరకు నేనే గెల్చాను!" అన్నాడు జనరల్ జారాఫ్.

"నేనెప్పుడూ అదే అంటాను కేప్ బఫెలోను వేటాడ్డం అత్యంత ప్రమాదకరమని"

ఓ క్షణం పాటు జనరల్ ఏ సమాధానం చెప్పలేదు. గమ్మత్తైన నవ్వు చిందిస్తూ అతడు నెమ్మదిగా అన్నాడు–

"పొరపాటు! కేప్ బఫెలో వేట మరీ అంత ప్రమాదకరమైనది కాదు" – వైన్ రుచిచూస్తూ జనరల్ నెమ్మదిగా అన్నాడు– "ఈ ద్వీపంలో అంతకంటే ప్రమాదకరమైన వేటలో పాల్గొంటాను నేను"

రెయిన్స్‌ఫోర్డ్‌కు ఆశ్చర్యం వేసింది– "అంతకన్నా భయంకరమైన క్రూర మృగాలున్నాయా ఇక్కడ?" అడిగాడు అతడు.

జనరల్ తల ఊపాడు– "చాలా ప్రమాదకరమైనది".

"నిజంగా?"

"ఇక్కడ సహజంగా ఉన్నది కాదులే. నేను స్వయంగా స్టాక్ ఉంచాల్సి వచ్చింది"

"వేటిని దిగుమతి చేసుకున్నారు జనరల్?" ప్రశ్నించాడు రెయిన్స్‌ఫోర్డ్– "పులుల్నా?"

జనరల్ చిరునవ్వు నవ్వాడు. "నో! పులుల వేటమీద ఆసక్తి నాకెప్పుడో చచ్చిపోయింది. వాటి సాధ్యాసాధ్యాలను నేనెప్పుడో విశ్లేషణ చేసాను. ఇప్పుడు ఆ వేటలో థ్రిల్ లేదు. ప్రమాదమూ లేదు. మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్! నేను ప్రమాదం కొరకు జీవిస్తాను"

జనరల్ తన జేబులోంచి బంగారు సిగరెట్ డబ్బా తీసి, తన అతిధికి పొడుగాటి నల్లటి సిగరెట్‌ను వెండి మొనగలిగినది ఇచ్చాడు. మంచి సుగంధ ద్రవ్య పరిమళాన్ని అది వెదజల్లుతున్నది.

"మనిద్దరం మంచి వేటలో పాల్గొందాం. మీరూ, నేనూనూ" అన్నాడు జనరల్. "మీ కంపెనీ నాకు సంతోషదాయకం!"

"ఏ రకపు వేట" రెయిన్స్‌ఫోర్డ్ అడగబోయాడు.

"చెబ్తాను" అన్నాడు జనరల్. "మీకు చాలా సరదాగా ఉంటుందిలే. ఇది నా స్వంత ఆలోచన. నేను కనుక్కున్న క్రీడ. అరుదైన ఆట. ఇంకో గ్లాసు పోర్ట్‌వైన్ తీసుకుంటారా?"

"థాంక్యూ జనరల్"

రెండు గ్లాసులూ నింపాక జనరల్ అన్నాడు– "దేవుడు కొందరిని కవులుగా పుట్టిస్తాడు. కొందరిని రాజులుగా కొందరిని బిచ్చగాళ్లుగా సృష్టిస్తాడు. నన్నతడు వేటగాడిగా తయారు చేసాడు. నా చేయి తుపాకి పట్టుకోడానికి అనువైనది– అనేవాడు మా నాన్న. అతడు భాగ్యవంతుడు. దాదాపు రెండున్నర లక్షల ఎకరాల భూమికి అధిపతి. గొప్ప ఆటగాడు. నాకు అయిదేళ్ల వయస్సున్నపుడే చేతికి చిన్న తుపాకి (నాకోసం మాస్కోలో ప్రత్యేకంగా తయారు చేయించింది) ఇచ్చి పావురాలను వేటాడడం నేర్పాడు. నేను దానితో అతడి పందెపుకోడి పుంజులను కాలిస్తే, నన్ను శిక్షించకపోగా పైపెచ్చు నా నిపుణత్వానికి మెచ్చుకున్నాడు. ఏడేళ్ల వయసులోనే కకాసస్‌లో నేను తొలిసారిగా ఎలుగుబంటిని చంపాను. నా జీవితం ఓ దీర్ఘకాలపు క్రీడావినోదం. ఉన్నత కుటుంబీకుల పిల్లల్లానే నేనూ సైన్యంలో చేరాను. కొన్నాళ్లు కోసక్కుల అశ్వికదళ కమాండర్‌గా ఉన్నాను. కాని నా ఆసక్తి అంతా వేటపైనే. ప్రపంచంలోని అన్నిరకాల క్రూరమృగాల్ని వేటాడాను. ఎన్ని జంతువుల్ని చంపానో లెక్కకు అందదు."

జనరల్ తన సిగరెట్‌ను గట్టిగా దమ్ములాగాడు.

"రష్యాలో రాజరిక పతనం తరువాత నేను దేశాన్ని విడిచిపెట్టాను. జార్ పాలనలో అధికారిని కదా నేనక్కడ ఉండడం అసాధ్యమని తేలిపోయింది. ఎందరో ఉన్నత కుటుంబీకులు తమ ధన, మాన ప్రాణాల్ని, సర్వస్వం పోగొట్టుకున్నారు. అదృష్టవశాత్తు నేను అమెరికన్ సెక్యూరిటీల్లో చాలా మొత్తం ఇన్‌వెస్ట్ చేయడం వల్ల మోంటెకార్లోలో టీషాపులాంటిదో, పారిస్‌లో కారు నడపడం లాంటి దురవస్థకు లోను కాలేదు. వేట నా నిత్యకృత్యమైంది. రాకీ పర్వతాలలో గ్రిజ్లీ ఎలుగుబంట్లను, గంగానదిలో మొసళ్లను, తూర్పు ఆఫ్రికాలో రైనొసెరాస్‌లను వేటాడాను. ఆఫ్రికాలోనే ఆ 'కేప్ బఫెలో' నన్ను గాయపరచి ఆర్నెల్లు మంచంమీద పడి ఉండేట్లు చేసింది. స్వస్థత చేకూరగానే అమెజాన్ ప్రాంతంలో జాగ్వార్ చిరుతపులులను వేటాడాను.

ఎందుకంటే అవి చాలా తెలివైనవని వినికిడి కదా! కాని, అంత కన్నింగ్ కాదని ఋజువైనాక వాటిమీద ఆసక్తి తగ్గిపోయింది. తెలివిగల వేటగాడి ఎత్తులకు, అతడి చేతిలోని శక్తివంతమైన రైఫిల్ ముందు అవి చేతగాని పిల్లులైనాయి. నాకు చెప్పలేనంత ఆశాభంగం కలిగింది. తలనెప్పితో శిరస్సు బద్దలవుతున్నప్పుడు ఓ రాత్రి నా మనస్సులో  ఏదో వింత భయంకరమైన ఆలోచన ప్రవేశించింది. అవును! వేటలో నాకిప్పుడు మజాలేదు. అది బోర్ గొడ్తున్నది. కాని, గుర్తుంచుకో, వేట నా జీవన శైలి. అది నా ప్రాణం. అమెరికన్ వ్యాపారస్తులు తమ జీవన లక్ష్యమైన వ్యాపారంపై ఇంటరెస్ట్ తగ్గిందంటే గిలగిలలాడిపోతారని విన్నాను. నేనూ అంతే!"

"అవుననుకుంటా" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

జనరల్ నవ్వాడు– "నాకు అలా ధ్వంసమైపోవడం ఇష్టం లేదు. ఏదో ఒహాటి చేయాలి. నా మనసు విశ్లేషణాతత్త్వం గలది. మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్, అందుకే నేను ఈ వేటాడడంలోని మజాను ఆస్వాదించగలుగుతున్నాను"

"సందేహం లేదు, జనరల్ జారాఫ్"

"అందుచేత నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. ఎందుకని నాకిప్పుడు వేటపై ఆసక్తి సన్నగిల్లింది అని. మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్! కారణం చెప్పగలరా? నాకన్నా చిన్నవాడివి నీవు. నేను వేటాడినంత వేటాడి ఉండవు. చెప్పండి!"

"ఏమిటది?"

"వేటలో క్రీడాస్ఫూర్తి తగ్గడం. ఫలితం ముందే తెలిసిపోవడం, చాలా సులువైనదిగా అయిపోవడం, నా ఎర నాకు ఖచ్చితంగా చిక్కడం, అన్నిసార్లూ. పరిపూర్ణతను మించి విసుగు కలిగించేదింకేమీ ఉండదేమో!"

జనరల్ మరో సిగరెట్ వెలిగించాడు.

"ఏ జంతువూ నా గురి నుంచి తప్పించుకోలేదు. ఇదేమీ స్వోత్కర్ష కాదు. గణితశాస్త్ర సిద్ధాంతం. క్రూరమృగానికి ఉన్నవల్లా నాలుగు కాళ్లు, సహజ ప్రవృత్తి. సహజ ప్రవృత్తి సహేతుక కారణానికేనాడూ దీటుగా నిలబడలేదు. నేను చెబుతున్నా, ఇది నాకు అర్థమయ్యిన క్షణం నా జీవితంలో విషాదఘట్టం మొదలయ్యింది."

రెయిన్స్‌ఫోర్డ్ బల్లపైకి వంగి, చేతులాన్చి, తనకు ఆతిథ్యమిచ్చిన వ్యక్తి మాటలను జాగ్రత్తగా వింటున్నాడు.

"అప్పుడే నాకో ఆలోచన వచ్చింది నేనేం చెయ్యాలన్నది"

"ఏమిటది?"

ఏదన్నా అడ్డంకి వచ్చినప్పుడు దానిని విజయవంతంగా దాటినప్పుడు వచ్చే చిరునవ్వులాంటిది నవ్వుతూ జనరల్ అన్నాడు– "నేనొక కొత్త జంతువుని సృష్టించాల్సి వచ్చింది"

"కొత్త జంతువా! ఇదేమీ హాస్యం కాదుకదా!"

"హాస్యమా! లేదులేదు! నేనేనాడూ వేట గురించి మాట్లాడేప్పుడు ఛలోక్తులు విసరను. నాకు కొత్త జంతువు కావాలి. దొరికింది, అందుకనే ఈ ద్వీపాన్ని కొన్నాను. ఈ భవంతిని నిర్మించి ఇక్కడే క్రీడావినోదం చేస్తున్నాను. దీనితో సాటిరాగల క్రీడ లేనే లేదు. ప్రతిరోజూ వేటాడుతూనే ఉన్నాను. నాకు విసుగు పుట్టడమే లేదు. ఎందుకంటే నా 'ఎర' నా తెలివితేటలకు దీటైనది కావడం వల్ల"

రెయిన్స్‌ఫోర్డ్ ముఖంలో ఆశ్చర్యం తొంగిచూసింది.

"వేటకు సరిపోయే జంతువు ఎలా ఉండాలి?"–

జనరల్ చెబుతూనే ఉన్నాడు– "సరైన ఎరకు ఉండాల్సిన లక్షణాలేమిటి? ధైర్యం, తెలివితేటలు, వాటన్నిటికి మించి సహేతుకంగా ఆలోచించే లక్షణం ఉండాలి."

"జంతువు ఆలోచించడం, అదీ సహేతుకంగా! అసంభవం!" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

"మైడియర్ ఫెలో"– అన్నాడు జనరల్– "ఒకటున్నది"

"నీవనేది...." అంటూ రెయిన్స్‌ఫోర్డ్ గుటకలు మింగాడు.

"ఎందుకు కాకూడదు?"

"నీవు సీరియస్‌గా ఈ విషయం చెబుతున్నావని నేను అనుకోవడం లేదు జనరల్, జారాఫ్. ఇది చాలా అసహ్యకరమైన ఛలోక్తి"

"ఇది సీరియస్ విషయమే! నేనిదివరకే చెప్పాను. వేట విషయంలో నేను జోక్ చేయనని"

"వేటా! జనరల్ జారాఫ్, మీరు చెప్పేది మర్డర్ గురించి"

జనరల్ నిండుగా నవ్వాడు. రెయిన్స్‌ఫోర్డ్ వైపు పరీక్షగా చూస్తూ అన్నాడు– "నీలాంటి ఆధునిక నాగరిక యువకుడు ఇంకా రొమాంటిక్ అయిడియాలు, జీవితపు విలువల జంఝూటనలో మునిగిపోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది. యుద్ధంలో నీ అనుభవం ఏమైనట్లు?"

"యుద్ధంలో నేనెన్నడూ ఇటువంటి దారుణ హత్యలు, కోల్డ్ బ్లడెడ్ మర్డర్లు చేయలేదు" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

నవ్వు విపరీతం కాగా జనరల్ ఊగిపోయాడు– "ఎటువంటి వింత వ్యక్తివి నీవు? అమెరికాలో కూడా నీలాంటి చదువుకున్న యువకుడు ఇంత అమాయకుడు ఉండి వుండడు. నీ ఆలోచనలు విక్టోరియా కాలం నాటి పురాతనమైనవి. లిమోసిన్‌లో సిగరెట్ పొడి రాల్చే పెట్టెకోసం వెదకడం లాంటిది. ఖచ్చితంగా నీ పూర్వీకులు ప్యూరిటన్లు అయి వుంటారు. చాలామంది అమెరికన్లు నీలాంటి వాళ్లేననుకుంటా! నేను పందెం కాస్తాను మనిద్దరం కలిసి వేటకు వెళ్లినాక నీ ఆలోచనలు మారతాయని. నీకోసం నూతన థ్రిల్, మజా వేచి ఉన్నాయి"

"థాంక్యూ! నేను వేటగాడిని! హంతకుడిని కాలేను"

"అయ్యో! అవునా!" అన్నాడు జనరల్ ముఖకవళికల్లో ఏ మార్పూ లేకుండానే. "మర్డర్ అనే పదం సరైనది కాదు. అయినా నేను నీ అభ్యంతరాలకు సరైన పునాది లేదని నిరూపిస్తాను."

"సరే!"

''జీవితం జీవించడానికి. అది బలవంతుల హక్కు. దానిపై ఇచ్చిపుచ్చుకోడాలు బలవంతుల చేతుల్లో ఉంటాయి. ప్రపంచంలోని బలహీనులు ఇక్కడ బలవంతులకు ఆనందాన్నివ్వడానికి వినియోగించబడతారు. నేను బలవంతుడిని. నాకున్న వరాన్ని నేనెందుకు వినియోగించుకోకూడదు? నేను వేటాడదలచుకుంటే ఎవరికైనా ఎందుకు అభ్యంతరముండాలి? ఈ భూ ప్రపంచంపై పనికిరాని చెత్తను నేను వేటాడుతున్నాను, ముఖ్యంగా దారితప్పిన నావికుల్ని – లాన్సర్లు, నల్లవాళ్లు, చైనీయులు, తెల్లవాళ్లు, మాంగ్రెయిల్సు– సరైన పందెపుగుర్రం ఇటువంటివాళ్లు ఇరవై మందికన్నా విలువైనది"

"కాని వాళ్లు మనుషులు" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్ ఆగ్రహంతో

"అదే! నేను చెప్పేది అదే! అందుకే వాళ్లను వేటాడుతున్నది. వాళ్లు నాకు ఆనందాన్నిస్తారు. వాళ్లకు ఆలోచన ఉన్నది, తార్కిక చింతన ఉన్నది. అందుకే వాళ్లు ప్రమాదకరమైనవాళ్లు!"

"నీకు వాళ్లెక్కడ దొరుకుతారు?"

జనరల్ ఎడమకన్ను ఓ క్షణం ఆర్పి కన్నుగొట్టినట్లు చేసాడు– "ఈ ద్వీపం పేరు షిప్‌ట్రాప్ (నౌకల బోను). ఒక్కోసారి సముద్రపు దేవుడు నాకు సాయం

చేస్తాడు. అదృష్టం కరుణించనప్పుడు, విధికి నేను కాస్త తోడు వెళ్తాను. ఇటు ఈ కిటికీ వద్దకు రా!"

రెయిన్స్‌ఫోర్డ్ కిటికీ వద్దకు వెళ్లి సముద్రం వేపు చూసాడు.

"అదుగో! అటుచూడు!" అరిచాడు జనరల్ చీకటిలోకి చూపిస్తూ.

రెయిన్స్‌ఫోర్డ్‌కు అంతా చీకటిగానే కనిపించింది. జనరల్ ఒక బటన్ నొక్కగానే దూరంగా సముద్రంలో ఫ్లాష్‌లైట్లు వెలిగిన జాడ కనిపించింది.

జనరల్ ముసిముసినవ్వులు నవ్వాడు– "ఆ లైట్లు ఒక లేని కాలువను ప్రకటిస్తాయి. నౌకలు ఆ దారిలోకి రాగానే పదునైన రాళ్లతో నిండిన కొండలు తమ నోళ్లను సముద్రపు రాక్షసిలా తెరచి నౌకలను ధ్వంసం చేస్తాయి. ఇదిగో ఈ వాల్నట్‌ను నలిపినట్లు అవి నౌకలను నమిలి కొరికేస్తాయి" అంటూ జనరల్ తన చేతిలోని వాల్‌నట్‌ను నేలపై పడవేసి కాలితో తొక్కి నలిపేసాడు. "అవును, నా దగ్గర ఎలక్ట్రిసిటీ ఉన్నది. ఇక్కడ నాగరికత ప్రభావం ఉన్నది కదా!"

"నాగరికతా? నీవు మనుషుల్ని కాల్చేసేచోట!"

జనరల్ కళ్లల్లోకి కాసింత కోపం అలుముకున్నది నీడలా. అది ఒక సెకను పాటు మాత్రమే. అయినా చాలా ప్రశాంతంగా అన్నాడు "డియర్‌మి! ఎంత మంచి కుర్రాడివి నీవు! నీవు అనుకుంటున్నదేమీ నేను చేయనులే. అది అనాగరికం. నేను నా అతిథులను చాలా గౌరవంగా చూస్తాను. వారికి సరిపడినంత ఆహారం, వ్యాయామం లభిస్తుంది. మంచి ఆరోగ్యవంతులుగా వాళ్లు తయారవుతారు. రేపు నీ కళ్లతో నీవే చూద్దువుగానీలే!"

"ఏమంటున్నారు?"

"నా ట్రెయినింగ్ స్కూలు చూద్దువుగాని" జనరల్ నవ్వుతూ అన్నాడు. "అది సెల్లార్‌లో ఉన్నది. ఓ పన్నెండుమంది విద్యార్థులు అక్కడ శిక్షణ పొందుతున్నారు. వాళ్లు స్పానిష్ నౌక 'శాన్‌లుకార్'లో పోతూ దురదృష్టవశాత్తు కొండరాళ్లకు తగిలి నౌకధ్వంసం కాగా ఈ ద్వీపం చేరినవాళ్లు. చాలా క్వాలిటీ తక్కువ జనం, నౌకలో తిరగడం తెలిసినవాళ్లే తప్ప అడవిని చూసిన రకం కాదనుకుంటాను" అని జనరల్ తన చేయి పైకెత్తి సంజ్ఞ చేయగానే ఇవాన్ చిక్కటి టర్కిష్ కాఫీ తీసుకువచ్చాడు. రెయిన్స్‌ఫోర్డ్ ఎంతో కష్టంతో మౌనం పాటించగలిగాడు.

"ఇదొక ఆట" అన్నాడు జనరల్ ఏ విధమైన ఉద్వేగం కనబరచకుండా. "వాళ్లలో ఒకడిని వేటకు ఆహ్వానిస్తాను. మంచి ఆహారం, మంచి వేటకత్తి ఇచ్చి

నాకంటె మూడుగంటలు ముందు వెళ్లమంటాను. నేను ఆ తరవాత బయల్దేర్తాను. నా చేతిలో చిన్న పిస్టల్ రేంజిలోనూ, కాలిబర్‌లోనూ చిన్నది. అది మాత్రమే ఉంటుంది. నా ఎర నన్ను మూడురోజుల పాటు దొరక్కుండా తప్పించుకున్నదా, అతడే గెలిచినట్లు. నేను అతడిని పట్టుకోగలిగానా" జనరల్ నవ్వాడు– "అతడు ఓడిపోయినట్లు"

"ఒకవేళ అతడు ఒప్పుకోకపోతే"

"ఓహ్" జనరల్ అన్నాడు– "అతనికి రెండు అవకాశాలున్నాయి. వద్దనుకుంటే మానేయవచ్చుకూడా. నాతో వేటకు రావడం ఇష్టం లేకపోతే అతడిని నేను ఇవాన్‌కు అప్పజెప్తాను. ఇవాన్ ఒకప్పుడు గ్రేట్ వైట్‌జార్‌కు తలారిగా, నిందితుల్ని కొరడాతో కొట్టేవాడిగా పనిచేసాడు. అతడి వేటతీరు వేరేరకంగా ఉంటుంది. అందుకని ప్రతి ఒక్కరూ నాతోనే వేటకు వెళ్లడానికి ఒప్పుకుంటారు"

"ఒకవేళ వాళ్లు గెలిస్తే–"

జనరల్ ముఖంలోని నవ్వు మరింత విస్తృతమయ్యింది.

"ఈరోజు వరకు నేను ఓడిపోలేదు" – ఆ తరువాత అన్నాడు– "నీవు నన్ను గప్పాలు కొట్టేవాడిగా భావించవద్దు. ఎక్కువమంది నాకు సాధారణమైన సమస్యలనే సృష్టించారు. అప్పుడప్పుడూ తార్తార్ లాంటి తెలివైన వాళ్లు తారసపడతారు. ఒకడు దాదాపు గెలిచినంత పని చేసాడు. వాడిని పట్టుకోడానికి కుక్కల్ని వాడాల్సి వచ్చింది.

"కుక్కలా?"

"వేటకుక్కలు. ఇటురా! నీకు చూపిస్తాను"

జనరల్ ఒక కిటికీ దగ్గరకు రెయిన్స్‌ఫోర్డ్‌ను తీసుకువెళ్లాడు. కిటికీ లోంచి బయటకు ప్రవహిస్తున్న మసక కాంతిలో క్రింద కొన్ని వింత ఆకారాలు దాదాపు పన్నెండు నల్లని జంతువులు కనిపించాయి. వాటి కళ్లు ఆకుపచ్చగా మెరుస్తున్నాయి.

"మంచి శక్తివంతమైనవి" అన్నాడు జనరల్ సాలోచనగా.

"ప్రతిరాత్రి ఏడుగంటలకల్లా స్వేచ్ఛగా ఈ ఆవరణలో వదిలేయబడ్తాయి. ఎవరన్నా నా ఇంట్లోకి చొరబడడానికో లేక బయటకు పోడానికో ప్రయత్నిస్తే– అది వాళ్ల దురదృష్టం" అంటూ 'ఫోలీస్ బెర్గెలె' నుంచి ఒక పాటను కూనిరాగం తీసాడు.

"ఇప్పుడు మనం నా కొత్త కలెక్షను– శిరస్సులు చూద్దాం. నాతో లైబ్రరీకి రాగలవా!"

"ఈ రాత్రికి నన్ను మన్నించండి, జనరల్ జారాఫ్. నా ఒంట్లో అంత బాగుండలేదు"

"నిజమా!" జనరల్ అడిగాడు– "అవునవును. అంత దూరం ఈదినాక అలసట రావడం సహజమే. నీకు మంచి నిద్ర అవసరం, ఈ రాత్రంతా విశ్రాంతి తీసుకో. రేపటికల్లా కొత్తమనిషిగా తయారవుతావు. నేను పందెం కాస్తాను. ఆనక మనం వేటకువెళ్దాం! నా దగ్గర ఓ మంచి ఆలోచన వుంది"

రెయిన్స్‌ఫోర్డ్ త్వరగా అక్కడనుంచి వెళ్లిపోయాడు.

"ఈ రాత్రి నీవు నాతోపాటు రాకపోతున్నందుకు నాకు కాస్త విచారంగా ఉంది" జనరల్ అంటున్నాడు– ఈరోజు మంచి వేట అభిలషిస్తున్నాను. పెద్దగా బలంగా, నల్లగా, అతగాడు మంచి ఎరలానే ఉన్నాడు – గుడ్‌నైట్ మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్ ఈ రాత్రి నీకు మంచి నిద్ర పట్టునుగాక!"

మంచం పరుపు మంచిగా ఉన్నాయి, నైట్‌గౌన్ మృదువైన మెత్తని సిల్కుతో చేయబడినట్లున్నది. తనలోని ప్రతికణమూ అలిసిపోయినా రెయిన్స్‌ఫోర్డ్‌కు నిద్ర పట్టలేదు. కళ్లుతెరిచి అలానే పడుకున్నాడు. తన గదికి బయట ఏవో అడుగుల చప్పుడు, వినీ వినబడకుండా. లేచివెళ్లి తలుపు తీద్దామని ప్రయత్నించాడు కాని తలుపు తెరచుకోలేదు. కిటికీ దగ్గరకు వెళ్లి బయటకు చూసాడు. తన గది పైబురుజులో ఉన్నది. భవనంలో లైట్లు ఆర్పివేయబడ్డాయి. అంతా కటికచీకటి, నిశ్శబ్దం. చంద్రవంక కాంతి మసక మసకగా ఉండడంతో క్రింద కోర్టుయార్డ్‌లో అటుయిటూ పరిగెడ్తున్న వేటకుక్కలు, తాను పైనున్నది పసిగట్టి, ఆకుపచ్చని కళ్లతో క్రోధంగా పైకి చూస్తున్నాయి. రెయిన్స్‌ఫోర్డ్ మంచం దగ్గరకు పోయి మరల పడుకున్నాడు. నిద్ర రావడానికి అనేక రకాల ప్రయత్నాలు చేసాడు. తెల్లారేప్పటికి కాసింతసేపు ఇలా జోగాడో లేదో దూరంగా అడివిలో పిస్టల్ పేలిన చప్పుడు మంద్రంగా వినిపించింది.

జనరల్ జారాఫ్ మధ్యాహ్నభోజన సమయం వరకు దర్శనమివ్వలేదు. లంచ్ సమయంలో రెయిన్స్‌ఫోర్డ్ ఆరోగ్యం ఎలా ఉందని పరామర్శించాడు. ఆ సమయంలో జనరల్ మంచి ట్వీడ్ సూటులో కంట్రీ స్క్వైర్ – జమీందారులా కనిపించాడు.

"నాకు కూడ మనసంతా బాలేదు, మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్. క్రితం రాత్రి మరలా నా పాత కంప్లెయింట్ జాడలు కనిపించాయి! అదే కాస్త దిగులుగా ఉంది" అన్నాడు జనరల్.

ప్రశ్నార్థకంగా చూసిన రెయిన్స్‌ఫోర్డ్‌ను ఉద్దేశించి జనరల్ పలికాడు– “అదే! విసుగు పుట్టడం. చిరాకు, బోర్‌డమ్...!”

క్రెపెస్ సుజెటె రెండోసారి వడ్డించుకుంటూ జనరల్ వివరించాడు– “రాత్రి వేటలో మజాలేదు. వాడికి బుర్ర తిరిగినట్లుంది. వాడిని పట్టుకోవడం ఏం కష్టం కాలేదు. ఈ నావికులతో అదే ఇబ్బంది. బుర్ర తక్కువ. అడవుల్లో తిరిగే అనుభవం ఉండదు. తెలివి తక్కువ పనులు, తేలికగా పట్టుపడే పనులు చేసి సులభంగా దొరికిపోతారు. చాలా చిరాకుగా ఉంటుంది. ఇంకో గ్లాసు ఛాబ్లిస్ తీసుకుంటావా, మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్”–

“జనరల్,” – రెయిన్స్‌ఫోర్డ్ నిశ్చితంగా అడిగాడు– “నేను ఈ ద్వీపాన్ని వదిలి వెళ్లిపోతాను, ఇప్పుడే”

దెబ్బతిన్నట్లు ముఖం పెట్టి జనరల్ తన కనుబొమల్ని పైకెత్తి అడిగాడు. “మైడియర్ ఫెలో! నీవిప్పుడే కదా వచ్చింది. ఇంకా వేటకు కూడా వెళ్లలేదు”

“నేను ఈరోజు వెళ్దామనుకుంటున్నాను” రెయిన్స్‌ఫోర్డ్ అన్నాడు. జనరల్ నల్లటి కళ్లు తననే తీక్షణంగా చూస్తున్నాయని గమనించాడు. అకస్మాత్తుగా అవి ప్రకాశవంతమయ్యాయి.

రెయిన్స్‌ఫోర్డ్ గ్లాసును ఖరీదైన ఛాబ్లిస్‌తో నింపాడు.

“ఈ రాత్రి మనిద్దరం నీవు–నేను వేటకు వెళ్దాం” అన్నాడు జనరల్.

రెయిన్స్‌ఫోర్డ్ తల అడ్డంగా ఊపాడు– “లేదు, జనరల్”

“నేను వేటాడను!”

జనరల్ తన భుజాల్ని కదిలించాడు. నోట్లో మంచి ద్రాక్షపండును వేసుకుని చప్పరిస్తూ అన్నాడు– “నీ కోరికే నా యిష్టం! నీవేది కోరుకుంటే అదే చేద్దాం. నాతో వేటాడడం కన్నా, ఇవాన్‌తో వేటకు వెళ్లడం నీకిష్టమైతే సరే!”

జనరల్ తన చూపును పక్కనే చేతులు కట్టుకుని తీక్షణంగా చూస్తూన్న ఇవాన్ వేపు మళ్లించాడు.

“నీవు ఏం చేయబోతున్నావో!” అరిచాడు రెయిన్స్‌ఫోర్డ్.

“మైడియర్ ఫెలో! వేట గురించి జోక్ చేయనని చెప్పలేదా నేను. ఇది నిజంగా నాకు సరదాగా, ఉత్తేజకరంగా ఉంది. ఇప్పుడు నేను సరైన ప్రతిద్వంద్వితో

తలపడబోతున్నాను. అతనికి ఈ గ్లాసును పైకెత్తుతున్నాను" జనరల్ తన గ్లాసు పైకెత్తాడు. కాని, రెయిన్స్‌ఫోర్డ్ అతడి వేపు నిశితంగా చూస్తూనే ఉన్నాడు.

"నీకు ఈ ఆట నచ్చుతుంది" జనరల్ ఉత్సాహంగా అంటున్నాడు. "నీ బ్రెయిన్‌కూ నా బ్రెయిన్‌కూ పోటీ! నీ మెలకువలకూ నా ఆలోచనలకూ పోటీ; నీ బలం, ఓపికకూ నా బలం ఓపికకూ పోటీ. బహిరంగ చదరంగం. భలే క్రీడా వినోదం. పందెం కూడా విలువైనదే. అవునా?"

"నేను గెలిస్తే!" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

"గౌరవంగా నేను నా ఓటమిని ఒప్పుకుంటాను, మూడోరోజు అర్ధరాత్రికల్లా నిన్ను పట్టుకోలేకపోతే!" అన్నాడు జనరల్. "నా పడవ నిన్ను దగ్గర్లో ఉన్న ఊరికి చేరుస్తుంది. నన్ను నీవు నమ్మాలి. అలాగే నీవూ నాకు మాటివ్వాలి" జనరల్ ఆలోచిస్తూ అన్నాడు "ఇది వేటగాడి, ఆటగాడి మాట. స్వేచ్ఛ లభించినాక ఇక్కడ సంగతి ఎక్కడా పల్లెత్తి అనవద్దు"

"అటువంటి ఒప్పందాన్ని నేనంగీకరించను" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

"ఓహ్! సరే. అయినా దాన్నెందుకు ఇప్పుడు చర్చించడం. మూడురోజుల తర్వాత మనం వ్యూవుక్లికాట్ తాగుతూ మాట్లాడుకోవచ్చు, ఒకవేళ–"

జనరల్ తన గ్లాసులోని వైన్ చప్పరించాడు.

అతడిప్పుడు వ్యాపారస్తుడిలా మాట్లాడడం మొదలెట్టాడు– "ఇవాన్ నీకు దుస్తులు, ఆహారం, వేటకత్తి ఇస్తాడు. కాళ్లకు మొకాసిన్లు తొడుక్కుంటే మేలు. అవి అడుగుజాడలనివ్వవు. ఈ దీవికి ఆగ్నేయమూలగా ఇసుక ఊబినేల ఉన్నది అటు పోకు. దాన్ని మేం 'మృత్యుఊబి' అని పిలుస్తాం. ఒకడు అట్లాపోయి ఇరుక్కుపోయాడు. బాధాకరమైన విషయమేమిటంటే 'లాజరస్' వాడిననుసరించడం. నాబాధను నీవు అర్థం చేసుకోగలవు. మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్ నాకు లాజరస్ అంటే చాలా ఇష్టం. నా వేటకుక్కల గుంపులో అదే చాలా శక్తివంతంగా ఉండేది. నన్ను క్షమించాలి. మధ్యాహ్న భోజనం తరువాత కాసేపు విశ్రమించడం నాకు అలవాటు.–

నీకు నిద్రపోడానికి సమయం లేదు, వెంటనే బయల్దేరు. చీకటిపడ్డాకే నేను నిన్ను వెదుక్కుంటూ వస్తాను. పగటిపూటకన్నా రాత్రిపూట వేటాడ్డంలో మజా ఉంటుంది. అవును కదా! వా రివాయిర్! మిస్టర్ రెయిన్స్‌ఫోర్డ్ వా రివాయిర్!" వినయంగా తలవంచి అభివాదం చేసి జనరల్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

ఇంకో తలుపు తెరచుకుని ఇవాన్ వచ్చాడు. అతడి చేతిలో వేట దుస్తులు, ఆహారపు సంచి, వేటకత్తి ఉన్న తోలు ఒర, ఉన్నాయి. అతడి కుడిచేయి నడుముకున్న పటకా సంచిలో ఉన్న రివాల్వర్‌పై ఉన్నది.

వేట మొదలయ్యింది.

రెయిన్స్‌ఫోర్డ్ ఆ అడవిలోకి వచ్చి రెండుగంటలు దాటింది– "నేను అదుపు తప్పకూడదు. నేను అదుపు తప్పకూడదు. నా నరాల్ని కంట్రోలు చేసుకోవాలి"– పళ్లు బిగబట్టి నడుస్తున్నాడు.

భవనం గేటు మూసినప్పుడు అతడు పూర్తి మానసిక స్థైర్యంతో లేడు. ముందు ఏమనుకున్నాడంటే జనరల్ జారాఫ్‌కు తనకు మధ్య దూరాన్ని మెయింటెయిన్ చేస్తే చాలునని. అందుకనే అడవిలో పొదల మధ్యగా దూసుకుపోయాడు. ఏదో భయం చుట్టుముట్టగా దాన్ని తప్పించుకోడానికి పారిపోయినట్లు. ఇప్పుడు కాస్త మనోస్థిమితం చిక్కింది. తనపై తనకు పట్టు దక్కింది. ఆలోచనలు స్పష్టంగా ఉన్నాయి. ఏ గజిబిజి లేదు. తన పరిస్థితిని అంచనా వేసుకున్నాడు. పారిపోయే అవకాశం లేదు, ఎటు పరుగెత్తినా చివరకు సముద్రాన్ని చేరక తప్పదు. దూకితే ప్రమాదమే, తను నీటిలో ఉన్నట్లు ఊహించుకున్నాడు.

ఇప్పుడు అతడికి నన్ను పట్టుకోడానికన్నట్లు కొన్ని 'క్లూ'లు ఇస్తాను– అనుకున్నాడు రెయిన్స్‌ఫోర్డ్. ఇప్పటిదాకా ఒక గమ్యం లేకుండా పరిగెత్తాను ఎటు పోతున్నాడో తెలీకుండా. ఈసారి రకరకాల వలయాల్లో అడుగుజాడలు కనిపించేట్లు జాగ్రత్త పడ్డాడు. నక్కలు వేటాడేప్పుడు వేసే ఎత్తుల్ని అనుకరించాడు. ఈ కటిక చీకటిలో తప్పులు చేయకుండా ఉండడం అసంభవం. చెట్లకొమ్మలు, పొదల ముళ్లూ గీసుకుని చేతులూ కాళ్లూ నెప్పులతో నీరసాన్ని ప్రకటిస్తున్నాయి. నడిచే శక్తి వున్నా ప్రయోజనం లేనప్పుడు ఉన్న శక్తిని కాపాడుకోవాలి. ఇప్పుడు విశ్రాంతి తక్షణ అవసరం. ఇప్పటి వరకూ నక్కను అనుకరించాను. ఇప్పుడు కథలోని పిల్లి పాత్ర పోషిస్తాను– అనుకుని ఓ పెద్ద చెట్టు కనబడగా దాని దగ్గర తన అడుగుజాడలు ఉండకుండా జాగ్రత్తపడి, చెట్టుపైకెగబాకి పెద్ద కొమ్మపై బోర్లాపడుకున్నాడు. కాస్త విశ్రాంతి లభించగానే నూతన శక్తి వచ్చింది. తనపై తనకు విశ్వాసం కలిగింది. ఎంత పెద్ద వేటగాడైనా జనరల్ జారాఫ్ తనను పట్టుకోలేడనే నమ్మకం కలగగానే– నన్ను పట్టుకోవాలంటే డెవిల్‌కే సాధ్యం అంత చిత్రవిచిత్రంగా నేను 'క్లూ'లు ఇచ్చాను. చీకటిలో రావడానికి ఈ జనరల్ ఏమన్నా డెవిలా?–

దెబ్బతిన్న పాములా, ఆ రాత్రి చాలా నెమ్మదిగా నడిచింది. రెయిన్స్‌ఫోర్డ్‌కు నిద్ర పట్టలేదు. మృత ప్రపంచపు నిశ్శబ్దం ఆ అడవిని ఆక్రమించింది. మసక

మసకగా తెల్లవారుతున్నపుడు దూరాన ఏదో పక్షుల కలకలం రెయిన్స్‌ఫోర్డ్ దృష్టిని అటు మళ్లించింది. ఆ పొదల్లోంచి ఏదో వస్తున్నది, నెమ్మదిగా, నిశ్చయంగా, తాను వచ్చినట్లే వంకర వంకర దారిలో. చెట్టు కొమ్మకు దాదాపు అణచిపెట్టుకున్నట్లు రెయిన్స్‌ఫోర్డ్ తనను అదిమి పెట్టుకుని దట్టంగా ఉండి తన ఉనికిని దాచిన ఆకుల సందుల్లోంచి ఆ వస్తున్నదెవరా అని పరీక్షించసాగినాడు... ఎవరో ఒక మనిషి...

అతడు జనరల్ జారాఫ్. నేలమీద ఉన్న అడుగు జాడల్ని గమనిస్తూ వచ్చి దాదాపు చెట్టు వరకు వచ్చి ఆగినాడు. మోకాళ్లపై వంగి కూర్చుని నేలను పరిశీలించాడు. రెయిన్స్‌ఫోర్డ్‌కు వచ్చిన ఆలోచన ఏవిటంటే చిరుతపులిలా అతడిపై లంఘిద్దామని. కాని జనరల్ కుడిచేతిలోని చిన్ని ఆటోమాటిక్ పిస్టల్‌ను చూసి ఆగిపోయాడు.

వేటగాడు చాలాసార్లు తల పంకించాడు, ఏదో అర్థం కాని సమస్య చిక్కుముడి విప్పుతున్నట్లు. ఆ తరువాత లేచి నిలబడి తన సిగరెట్ కేస్ నుంచి నల్లని సిగరెట్ తీసి వెలిగించి దమ్ము లాగాడు. దాన్నుంచి వచ్చిన దట్టమైన సుగంధభరిత పరిమళం రెయిన్స్‌ఫోర్డ్ నాసికాపుటాలకు సోకింది.

రెయిన్స్‌ఫోర్డ్ ఊపిరి బిగబట్టాడు. జనరల్ కళ్లు నేలమీద నుంచి ఆ వృక్షపు కాండాన్ని అంగుళం అంగుళం గాలిస్తూ క్రమేపీ పైకి కొమ్మల వేపు సాగాయి. రెయిన్స్‌ఫోర్డ్ శరీరం దాదాపు ఘనీభవించింది. జనరల్ దృక్కులు రెయిన్స్‌ఫోర్డ్ ఉన్న కొమ్మ వరకు వచ్చి ఎందుకో ఆగిపోయాయి. జనరల్ పెదవులపై ఒక గమ్మత్తైన చిరునవ్వు విరిసింది. దర్జాగా ఒక దమ్ములాగి పొగను వలయంలా, రింగులా వదిలాడు. తరువాత నెమ్మదిగా వెనుదిరిగి వచ్చిన దారినే వడివడిగా వెళ్లిపోయాడు. అతడి బూట్లు చేస్తున్న సవ్వడి క్రమేపీ దూరమయ్యింది.

ఇంతసేపూ ఆపుకున్న ఊపిరి ఒక్కసారి బయటకు వచ్చింది వేడిగా! అతడికి వచ్చిన మొదటి ఆలోచన రెయిన్స్‌ఫోర్డ్‌ను వణికించింది. జనరల్ ఎంత క్లిష్టమైన అడుగు జాడలనైనా అనుసరించగలడు. 'క్లూ'లను వేగంగా అర్థం చేసుకోగలడు. తర్కంతో ఆలోచించగలడు. అదీ రాత్రికూడా! అంటే జనరల్‌కున్న శక్తి సామర్థ్యాలు నిస్సందేహంగా గొప్పవే. తన అదృష్టమల్లా అతడికి కనబడకపోవడం.

రెండో ఆలోచన రెయిన్స్‌ఫోర్డ్‌ను మరింత కృంగదీసింది. అతడి ఒంటిపై శీతల భయాన్ని దూసుకుపోయేలా చేసి ఆ ఆలోచన అతడి రక్తాన్ని గడ్డకట్టించి వణుకు పుట్టించింది. ఎందుకు జనరల్ ఇందాక నవ్వినట్లు? ఎందుకు వెనుదిరిగి వెళ్లిపోయినట్లు?

రెయిన్స్‌ఫోర్డ్‌కు అర్థమయ్యింది. నిజం మబ్బుల్లోంచి సూర్యుడు వచ్చినంత స్పష్టంగా ఉన్నది. జనరల్ తనతో ఆట ఆడుతున్నాడు. ఇంకో రోజు వినోదం కోసం తనను వదిలేసాడు. ఇతడు కోసక్ ఇప్పుడు పిల్లి, తను ఎలుక. రెయిన్స్‌ఫోర్డ్‌కు భయమంటే ఏమిటో తెలిసి వచ్చింది.

"నేను ధైర్యాన్ని కోల్పోను... కోల్పోను..."

చెట్టు మీద నుంచి జారుకుంటూ దిగి, అడవిలోకి పోయాడు. ఇప్పుడతడి మనసు ఈ విపత్తునెలా ఎదుర్కోవాలా అన్నదానిపై లగ్నమయ్యింది. చెట్టు దగ్గర్నుంచి మూడు వందల గజాల దూరంలో అతడికి ఓ ఎండిపోయిన పెద్ద మాను చిన్న చెట్టుకు ఒరిగి ఉండడం చూసాడు. భుజం మీది ఆహారపు సంచి పక్కనే పడవేసి, తోలు ఒరలోంచి కత్తి బయటకు తీసి ఇనుమడించిన ఉత్సహంతో పనికి ఉపక్రమించాడు.

తను అనుకున్న పనైపోయాక అక్కడి నుంచి వంద అడుగుల దూరంలో ఓ కొయ్య దుంగ వెనక దాక్కుని నిరీక్షించసాగాడు. ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండానే– అదిగో పిల్లి వస్తున్నది ఎలుకతో ఆట ఆడడానికి–

జాడ పసిగట్టిన వేటకుక్కలా జనరల్ జారాఫ్ అటే వస్తున్నాడు. అతడి నల్లటి కళ్లు చుట్టుపక్కల నిశితంగా చూస్తున్నాయి. ఎక్కడా నలిగిన గడ్డి, వంచిన కొమ్మ జాడ లేదు. ఒక్క గుర్తూ, పచ్చని నాచుపై అడుగులు గాని కానరాలేదు. అంత జాగ్రత్తగా వస్తున్న ఆ కోసక్కు కూడా, రెయిన్స్‌ఫోర్డ్ తయారు చేసిన దానిపై అడుగు పెట్టనే పెట్టాడు చూడకుండానే. అతడి కాలు బయటకు పొడుచుకు వచ్చినట్లున్న కర్రపుల్లకు తగిలింది. అది తగలగానే జనరల్ ఏదో కీడు శంకించి, కోతిలా వేగంగా వెనక్కి గంతు వేసాడు. అతడి కంటే వేగంగా ఆ ఎండు  చెట్టు మాను కదిలి విరిగి పడ్తూ సరాసరి జనరల్ భుజానికి గట్టిగా తగిలింది. అతడు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఆ ఎండుమాను కిందపడి నలిగిపోయేవాడే! ఒక్కక్షణం ముందుకు తూలి, మళ్లా  నిలదొక్కుకున్నాడు. అతడి చేతిలో రివాల్వర్ అలానే ఉంది. దెబ్బతగిలిన భుజాన్ని నిమురుకుంటూ అతడు అక్కడే నిలబడిపోయాడు. అటుపక్క రెయిన్స్‌ఫోర్డ్ హృదయాన్ని భయం మరల కమ్ముకున్నది. జనరల్ ఎకసెక్కం చేస్తూ నవ్విన నవ్వు అడవిలో ప్రతిధ్వనించింది.

"రెయిన్స్‌ఫోర్డ్! నామాట వినబడ్తుందనుకుంటాను. కంగాట్యులేషన్స్. మలయ్ మాన్‌కాచర్ (Malay Mancatcher) గురించి తెలిసినవాళ్లు బహు కొద్దిమందే. నేను మలక్కాలో వేటాడాను కనుక నాకూ దాని గురించి తెలుసు.

నీతో వేట సరదాగానే వుంది. మంచి మలుపు తిరుగుతున్నది. నేను ఇంటికిపోయి గాయానికి డ్రస్సింగ్ చేసుకోవాలి. ఇది చిన్న గాయమే. నేను మళ్లా వస్తాను. I shall be back"

అంటూనే జనరల్ తన భుజాన్ని నిమురుకుంటూ వెళ్లిపోయాడు. రెయిన్స్‌ఫోర్డ్ మరల పలాయనం ప్రారంభించాడు. ఎక్కడికిపోవాలి? ఏ ఆశా, ఏ గమ్యం లేని పలాయనం, పరుగు. అలా గంటలకొద్దీ పరిగెత్తుతూనే ఉన్నాడు. సాయంకాలమయ్యింది. క్రమేపీ చీకటి కమ్ముకువస్తున్నా అతడు పోతూనే ఉన్నాడు. పాదాలకున్న మోకాసిన్ల అడుగున నేల మెత్తగా అనిపించింది. పొదలు, లతలు దట్టంగా ఉన్నాయి. క్రిమి కీటకాలు, దోమలు అతడిని రాక్షసంగా కుడ్తున్నాయి.

ముందుకు అడుగేసే సరికి నేల కుంగుతున్నట్లనిపించింది. కాలు పైకి లాగుదామంటే మట్టి బురద లోనికి తీవ్రంగా గుంజుతున్నది. ఏదో పెద్ద జలగ కాలిని పట్టుకుని మట్టిలోకి లాక్కుపోతున్న భావన. శాయశక్తులా ప్రయత్నించి కాలు బయటకు లాగాడు. అతడికి తెలుసు తాను ఇప్పుడెక్కడున్నాడో. అదే మృత్యుఊబి, ఇసుక నేల.

ఎవరో తన నరాల్ని లాగి, గుంజి పెరికివేస్తున్న భావన కలిగింది. అదే సమయంలో మెత్తటి ఆ చిత్తడి నేల అతడికో ఆలోచననిచ్చింది. ఊబి నుంచి దాదాపు పన్నెండు అడుగుల దూరం వెనక్కు వెళ్లి పాతయుగపు బీవర్ పందికొక్కులా తవ్వడం మొదలెట్టాడు.

ఫ్రాన్సులో ఒకసారి ఇలాగే తవ్వి దాక్కుని సెకన్ల తేడాతో మృత్యువు నుంచి బయటపడ్డాడు. ఇప్పటితో పోలిస్తే అప్పుడు కాస్త నెమ్మదిగానే శ్రమించినట్లు గుర్తు. క్రమేపీ గోయి దాదాపు అతడి భుజాలు కనపడనంత లోతైంది. బయటకు వచ్చి కొన్ని చెట్టుకొమ్మల్ని వాడి మొనలుగా చెక్కి గోతికి అడుగున బాణాల్లా గుచ్చి ఉంచినాడు. మొన భాగంపైకి ఉండేట్లు వాటిని జాగ్రత్తగా అమర్చి గోతిపైన చెట్ల ఆకులు శాఖలతో ఆకుపచ్చని మూతలా తయారుచేసి చుట్టూ పరిసరాల్లో కలిసిపోయేట్లు జాగ్రత్తపడ్డాడు. ఒళ్లంతా చెమటతో తడిచిపోయింది. గోతిని తవ్విన శ్రమ వల్ల ఒళ్లంతా నెప్పులే, కాస్త ఊపిరి పీల్చుకుని, దగ్గర్లో ఓ పిడుగు దెబ్బకు కాలిన చెట్టు మాను వెనక దాక్కుని నిరీక్షించసాగినాడు.

అతడికి తెలుసు వేటగాడు వస్తున్నాడని. మెత్తటి నేలపై అడుగుల చప్పుడు వినబడ్తూనే ఉన్నది. రాత్రి గాలి జనరల్ తాగుతున్న సిగరెట్ సుగంధ పరిమళాన్ని తనవేపు మోసుకువచ్చింది. జనరల్ ఎందుకో వేగంగా వస్తున్నాడని రెయిన్స్‌ఫోర్డ్

భావించాడు. ప్రతి అడుగూ తూచి తూచి వేయడం లేదు. చెట్టు చాటున ఉన్న రెయిన్స్‌ఫోర్డ్‌కు జనరల్ కాని, తాను తవ్విన గోయి కాని కనిపించడం లేదు. ఒక్క నిముషంలో ఒక్క సంవత్సరం జీవించినట్లనిపించింది రెయిన్స్‌ఫోర్డ్‌కు. ఎప్పుడైతే ఎండు కొమ్మలు విరిగి, గోతి మీద మూత పగిలి, ఎవరో గోతిలో పడి లోన తానమర్చిన కొమ్మల మొనలు గుచ్చుకొని భయంకరమైన కేకపెట్టేసరికి, అతడు ఆనందంతో బిగ్గరగా అరుద్దామనుకుని, ఒక్క గంతువేసి ముందుకు వచ్చి మళ్లా వెనక్కువెళ్లి దాక్కున్నాడు.

గోతికి మూడు అడుగుల దూరంలో ఎవరో వ్యక్తి ఎలక్ట్రిక్ టార్చితో నిలబడి ఉండడం గమనించాడు.

"రెయిన్స్‌ఫోర్డ్! బాగా చేసావు. నీ బర్మీస్ టైగర్ పిట్ నా వేటకుక్కల్లో ప్రశస్తమైన దానిని బలిగొన్నది. ఈసారీ నీకు ఎక్కువ మార్కులు వచ్చినట్లే. అయినా మొత్తం వేట కుక్కల్ని వదిలి చూస్తాను ఎలా తప్పించుకుంటావో! ఇప్పుడు నేను ఇంటికి పోయి కాస్త విశ్రాంతి తీసుకుంటాను. థాంక్యూ ఫర్ ఎ మోస్ట్ ఎమ్యూజింగ్ ఈవెనింగ్!"

తెల్లారేసరికి రెయిన్స్‌ఫోర్డ్ తాను ఊబి పక్కనే ఉన్నట్లు గమనించాడు. దూరంగా ఏదో శబ్దం వినబడింది. ప్రతిక్షణం ఏవో కొత్త సంగతులు నేర్చుకోవాలేమో. ఆ శబ్దాలు క్రమేపీ దగ్గరవుతున్నాయి. అవి వేటకుక్కల అరుపులు.

రెయిన్స్‌ఫోర్డ్‌కు తెలుసు తాను చేయగలిగినవి రెండే పనులని. ఒకటి అక్కడే నిలబడి ఎదురుచూడడం. అది ఆత్మహత్యాసదృశం. రెండవది పారిపోవడం. అది ఆఖరి ఘట్టాన్ని వాయిదా వేయడం. అంతే! ఒక్క క్షణం ఆలోచించాడు. అవును. ఛాన్సు తీసుకుందాం! అనుకుని ఊబి నుంచి దూరంగా నడవసాగాడు.

వేట కుక్కల అరుపులు దగ్గరగా వినబడసాగాయి. దగ్గరగా, ఇంకా దగ్గరగా! కొండ గట్టుపైనున్న చెట్టు ఎక్కి ఆ అరుపులు వినవచ్చే వేపు చూసాడు. పావుమైలు దూరంలోపే దూరంగా పొదలు కదుల్తున్నట్లు కనిపించింది. అక్కడే కాస్త బక్కగా ఉండే జనరల్ జారాఫ్, అతడికి కొంచెం ముందుగా బలిష్ఠుడు, ఆజానుబాహుడైన ఇవాన్ అడివి పొదలను చెదరగొడ్తూ వస్తున్నారు. ఇవాన్ భుజాలు ముందుకు వంగి ఉన్నాయి, బహుశా అతడి చేతుల్లో వేటకుకలకు కట్టిన తాళ్లుండి ఉండాలి.

ఏ నిముషంలోనైనా వాళ్లు తనమీద దాడి చేయవచ్చు. రెయిన్స్‌ఫోర్డ్ మనస్సు అతి వేగంగా ఆలోచించసాగింది. తను ఉగాండాలో నేర్చుకున్న విద్యను ఇక్కడ

వాడాలనుకున్నాడు. చెట్టుకిందకు జారి, లేత కొమ్మను వంచి తన వేటకత్తిని దానికి కట్టి, కత్తి మొన దారికి సూటిగా ఉండేట్లు అమర్చాడు. కొమ్మకు అడవి ద్రాక్ష తీగ లాగి కట్టి, అక్కడ్నుంచి వేగంగా పరిగెత్తిపోయాడు. తాజా వాసన పసిగట్టగానే వేటకుక్కలు తీవ్రంగా మొరగసాగాయి. రెయిన్స్‌ఫోర్డ్‌కు ఇప్పుడు తెలిసింది వేటాడబడే జంతువు ఎలా బాధపడ్తుందో!

ఊపిరి తీసుకోడానికి ఒక్క క్షణం ఆగాల్సి వచ్చింది. వేటకుక్కల అరుపులు ఆగిపోయాయి. రెయిన్స్‌ఫోర్డ్ గుండె కూడా! వాళ్లు కత్తి ఉన్న చోటుకు వచ్చారన్నమాట.

గబగబా పక్కనున్న చెట్టుపైకెక్కి అటువేపు చూసాడు. తనను వెంబడిస్తున్న వాళ్లు ఆగిపోయారు. చెట్టుపైకి ఎక్కుతున్నపుడు అతడిలో మెదిలిన ఆశాదీపం చటుక్కున ఆరిపోయింది. దూరంగా జనరల్ జారాఫ్ కనిపిస్తూనే ఉన్నాడు. కాని, ఇవాన్ లేడు. తన వేటకత్తి చిట్కా బాగానే పని చేసింది.

రెయిన్స్‌ఫోర్డ్ చెట్టు మీద నుంచి కిందకు దూకే సరికి వేటకుక్కల అరుపులు మళ్లా మొదలయ్యాయి.

“ధైర్యం! ధైర్యం! ధైర్యం!” అని తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ రెయిన్స్‌ఫోర్డ్ పరిగెత్తడం ప్రారంభించాడు. దూరంగా చెట్ల మధ్య నుంచీ నీలి ఖాళీ కనిపించసాగింది. వేటకుక్కల అరుపులు దగ్గరగా వినబడ్తున్నాయి. ఇక వేరే మార్గం లేదు. రెయిన్స్‌ఫోర్డ్ వేగంగా ఆ నీలి ఖాళీ ప్రదేశం వేపు దూసుకుపోయాడు. అది సముద్రతీరం. దూరంగా భవంతి ఉన్న కొండరాళ్లు కనిపించాయి.

ఇరవై అడుగుల కింద సముద్రం గర్జిస్తూ, అలల చేతుల్తో ఆహ్వానిస్తున్నది. బుసలు కొడ్తున్నది. ఒక్కక్షణం సందేహించాడు. వేటకుక్కల అరుపులు దాదాపు దగ్గరలో వినబడ్తున్నాయి. దగ్గరకు వచ్చేసాయి. ఇంకేం ఆలోచించకుండా సముద్రంలోకి దూకేసాడు....

జనరల్ తన వేటకుక్కలతో సముద్రతీరం వద్దకు వచ్చి ఆగాడు. కొద్ది నిముషాల సేపు నీలి ఆకుపచ్చ జలార్ణవాన్ని గమనించి సమాధానపడినట్లు భుజాలు కదిలించాడు. అక్కడే కింద కూర్చుని తన దగ్గర ఉన్న వెండి ఫ్లాస్కు నుండి బ్రాందీ ఒక్క గుక్క తాగి, సిగరెట్ వెలిగించి ‘మేడమ్ బటర్‌ఫ్లై’ నుంచి ఒక ముక్క కూనిరాగం తీసాడు.

జనరల్ జారాఫ్ తన భోజనాల హాల్లో మంచి డిన్నర్ ఆరగించాడు. భోజనంతో పాటు ఒక బాటిల్ పోల్ రోజర్, సగం బాటిల్ ఛాంబర్టిన్ ఖాళీ చేసాడు.

కాని, రెండు చింతలు అతడి సంపూర్ణానందానికి అడ్డు వచ్చాయి. ఒకటి– ఇవాన్ స్థానాన్ని భర్తీ చేయడం కష్టమన్నది. రెండోది– ఎర తన వేటను తప్పించుకున్నదనీ. అమెరికన్ తన ఆట బాగానే ఆడాడు. అనుకున్నాడు జనరల్ భోజనానంతర డ్రింక్‌ను ఆస్వాదిస్తూ. లైబ్రరీకి పోయి కాసేపు మార్కస్ అరిలియస్ పుస్తకాలు తిరగేసాడు. మనస్సును నెమ్మది పరచుకోడానికి. రాత్రి పది గంటలకల్లా పడక గదిలోకి వెళ్లాడు. చక్కగా అలిసిపోయాను అని తనకు తాను చెప్పుకుని తలుపు గడియ వేసుకున్నాడు. బయట వెన్నెల అంతంత మాత్రంగా ఉంది. కిటికీ వద్దకు వెళ్లి కింద అటూయిటూ పరిగెడ్తున్న వేటకుక్కల్ని చూసి "బెటర్‌లక్ ఎనదర్ టైమ్"– అని కేకపెట్టాడు. అప్పుడు బెడ్‌రూం లైటు ఆన్ చేసాడు.

మంచం తెరల వెనక ఎవరో దాగి ఉన్నట్లు జనరల్ గమనించాడు.

"రెయిన్స్‌ఫోర్డ్! ఇక్కడికెలా రాగలిగావు" దాదాపు అరిచాడు జనరల్.

"ఈదుకుంటూ, అడివికన్నా ఇదే సులభమైంది" అన్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

జనరల్ గట్టిగా ఊపిరి పీల్చుకుని చిరునవ్వు నవ్వాడు.

"ఐ కంగ్రాట్యులేట్ యు! ఈ ఆట నీవు గెల్చావు"

రెయిన్స్‌ఫోర్డ్ నవ్వలేదు. "నేనింకా వేటాడబడ్తున్న జంతువునే!, జనరల్ జారాఫ్, సిద్ధం కా!" అన్నాడతడు.

జనరల్ వినయంగా అభివాదం చేస్తూ అన్నాడు– "అద్భుతం! మనలో ఒకరం వేటకుక్కలకు ఆనందం కలిగిద్దాం! రెండోవాడు ఈ ప్రశస్తమైన మంచంపై నిదురించవచ్చు. జాగ్రత్త! రెయిన్స్‌ఫోర్డ్!..."

* * * * *

"ఇంతకంటే మంచి మంచం మీద తానెప్పుడూ నిద్ర పోలేదు" అనుకున్నాడు రెయిన్స్‌ఫోర్డ్.

(మంచం మీద పడుకున్నాక కల వచ్చింది. అతడికీ ఈ వేటాట నచ్చింది.
ఉలిక్కిపడి నిద్రలేచాడు అతడు.)

---

## రిఛర్డ్ ఎడ్వర్డ్ కొన్నెల్ (17-10-1893 - 22-11-1949)

అమెరికన్ రచయిత, జర్నలిస్టు. 'The most Dangerous Game' అనే ఈ కథను 1924లో వ్రాసాడు. ఇతడు 'Meet Johan Doe'కు వ్రాసిన స్క్రీన్‌ప్లేకు 1942లో అకాడమీ అవార్డు లభించింది.

ఈ కథ 19-1-1924 నాడు Collier's Weeklyలో The Hounds of Zaroff అన్న పేరుతో ప్రచురించబడింది. ఈ కథ ఆధారంగా The Most Dangerous

Game (1932); A game of Death (1945), Run for the Sun (1956), Hard Target (1993), Surviving in the Game (1994) లాంటి సిన్మాలు నిర్మించబడ్డాయి.

**ఇటువంటివే కొన్ని యదార్ధ సంఘటనలు**

రాబర్ట్ హాన్సెన్ అనే సీరియల్ కిల్లర్ 1980 ప్రాంతాల్లో మహిళలను అపహరించి, వాళ్లను అలాస్కాలోని Knik నదీ లోయలో వదిలిపెట్టి కత్తి, రైఫిల్ పట్టుకుని వేటాడేవాడట.

1976లో హామెస్ నొయిల్, బాబ్ గర్న్సీ, ఛార్లెస్ గెయినెస్‌లు 'పెయింట్‌బాల్' అనే క్రీడను కనిపెట్టి వాళ్లు ఒకరినొకరు వేటాడుకుంటూ వినోదించారు.

రిఛర్డ్ కొన్నెల్ దాదాపు 22 కథలు, 13 స్క్రీన్‌ప్లేలు, నాలుగు నవలలు వ్రాసాడు.

# 6. చిహ్నాలూ - సంజ్ఞలూ
## (Symbols and Signs)

**– వ్లదిమీర్ నబొకొవ్**

గత నాలుగేళ్లుగా నాలుగోసారి వాళ్లకు మరల అదే సమస్య వచ్చి పడింది; మానసిక వికలాంగుడైన యువకుడికి పుట్టినరోజు బహుమతిగా ఏమివ్వాలని! అతడికి ఏ కోరికలూ లేవు, ఏ ఇష్టాలూ లేవు. మానవ నిర్మిత వస్తువులన్నీ అతడి దృష్టిలో చెడు పుట్టలు, సాతాను సంజనితాలు. తాను మాత్రమే ఆ తేనెతుట్టెలోని ఈగల సవ్వడి వినగలడు అనుకుంటున్నవాడు. అతడికి బాహ్య సుఖాలపై ప్రీతిలేదు, అతడి కుదించిన ప్రపంచంలో ఇంద్రియ సుఖాలకు చోటు లేదు. అతడిని భయపెట్టేవి, గాయపెట్టేవి అనుకున్న అనేక వస్తువుల్ని జాబితాలోంచి తొలిగించి (పనిముట్లు, వస్తువులు అతడు తీసుకోడు. అవి నిషేధించబడ్డాయి) అతడి తల్లిదండ్రులు సాధారణమైన, మామూలు బహుమతి – ఓ బుట్టలో పది రకాల ఫ్రూట్‌జెల్లీలున్న సీసాలనిద్దామని నిశ్చయించుకున్నారు.

అతడు పుట్టేసరికే వాళ్లకు వివాహమై చాలాకాలమయ్యింది. దాదాపు ఇరవై ఏళ్లు గడిచాయి. ఇప్పుడు పెద్దవాళ్లైపోయారు. ఆమె జుట్టు నెరసి, అజాగ్రత్తగా దువ్వినట్లున్నది. చౌకరకం నల్లటి దుస్తులను ధరించి ఉన్నది. ఆమె వయసులో ఉన్న ఇతర మహిళలు (ఉదాహరణకు మిసెస్ సోల్, పక్కింటి గృహిణి ముఖం ఎర్రగా, పింక్, మావ్ రంగుల్లో ఉండి తలపై బ్రూక్‌సైడ్ పూలు అమర్చిన టోపీ పెట్టుకుంటుంది)లా కాకుండా తెల్లగా, వసంతకాలపు వెలుగును తప్పుబడ్తున్న దానిలా ఉంటుంది. ఆమె భర్త వెనకటి రోజుల్లో బాగానే గడించిన వ్యాపారస్తుడు. ఆ దేశం నుంచి వచ్చి ఇప్పుడు న్యూయార్క్‌లో ఉంటూ, జీవనాధారం కోసం సోదరుడు ఇసాక్‌పై సంపూర్ణంగా ఆధారపడి ఉన్నాడు, ఇసాక్ నలభై ఏళ్ల నుంచి ఇక్కడే ఉండి స్థిరపడిన అమెరికన్. వాళ్లు ఇసాక్‌ను అరుదుగా చూస్తారు. అంతేగాక అతడికి రాజకుమారుడు (ప్రిన్స్) అని చిరునామం తగిలించారు.

ఆ శుక్రవారం, వాళ్ల కుమారుడి పుట్టినరోజు. ప్రతి విషయంలోనూ తప్పులు జరిగాయి. సబ్‌వే ట్రైయిన్ రెండు స్టేషన్ల మధ్య కరెంటు ఆగిపోయి నిలిచిపోయింది. దాదాపు పావుగంట సేపు, ఎవరి గుండె చప్పుడు వాళ్లకు, అది కాకపోతే పేపర్లు తిరగేస్తున్న చప్పుడు తప్ప ఇంకేమీ వినబడలేదు. తర్వాత వాళ్లు ఎక్కాల్సిన బస్సు ఆలస్యంగా రావడం, దానికోసం చాలాసేపు పొడుగాటి 'క్యూ'లో నిలబడాల్సి వచ్చింది.

బస్సు ఎక్కినాక దాంట్లో కిక్కిరిసి ఉన్న హైస్కూలు పిల్లల రణగొణ ధ్వనుల మధ్య గడిపి, దిగాల్సిన చోటు వచ్చి బస్సు దిగాక శానిటోరియానికి వెళ్లే దారిలో పెద్ద వర్షం. తీరా లోపలికి వెళ్లి చాలాసేపు వేచి ఉన్నాక, వాళ్ల కుమారుడికి బదులు (మామూలుగా అయితే ఆ పిల్లవాడు దిగాలుగా ఉన్న ముఖం, గడ్డం పెరిగి, మొటిమలతో గందరగోళంగా ఉండి కనిపించేవాడు) వాళ్లకు తెలిసిన నర్సు, పెద్దగా వీళ్లను పట్టించుకోని ఉద్యోగిని వచ్చి చెప్పింది. మీ పిల్లవాడు మరల ఆత్మహత్యా ప్రయత్నం చేసాడు. ప్రస్తుతానికి బాగానే ఉన్నాడు కాని మీరు కనిపిస్తే అతడు డిస్టర్బ్ అవుతాడేమో– అన్నది. ఆ శానిటోరియంలో సిబ్బంది కొరత ఉండడంతో అన్నీ కలగాపులగమై, అటువి ఇటు, ఇటువి అటు పారేస్తారు గనుక వాళ్లు తమ పుట్టినరోజు కానుకను ఈసారి వచ్చినప్పుడు ఇద్దామనుకుని నిర్ణయించుకున్నారు.

ఆ బిల్డింగ్ బయట ఆమె, తన భర్త గొడుగు తెరిచాక, అతడి చేతిని తన చేతిలోకి తీసుకున్నది. అతడు గొంతు సవరించుకుంటున్నాడు, సాధారణంగా అతడిని ఎవరైనా, ఏ సంఘటనైనా కలవర పరిస్తేనే అలా చేస్తాడు. వాళ్లిద్దరూ నడుచుకుంటూ రోడ్డుకు ఆ పక్కన ఉన్న బస్టాప్ వద్దకు చేరుకున్నాక అతడు గొడుగు మూసినాడు. వాళ్లకు కొద్ది అడుగుల దూరంలో వానకు ఊగుతూ, నీళ్లు కురుస్తున్న చెట్టుకింద ఉన్న నీళ్ల గుంటలో – ఇంకా రెక్కలు రాని పక్షిపిల్ల అసహాయంగా రెక్కలు కొట్టుకుంటూ అరుస్తున్నది.

చాలాదూరం ప్రయాణించి సబ్‌వే స్టేషన్ చేరుకునేంత వరకూ ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. గొడుగు కర్రను గట్టిగా పట్టుకున్న అతడి చేతుల్ని, వాటిపై ఉబికి ఉన్న నీలి నాళాన్ని, గోధుమరంగు మచ్చల్ని, ఒడిలినట్లున్న చర్మాన్ని చూసి ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మనసును వేరే విషయంపై లగ్నం చేద్దామనే ఉద్దేశంతో ఆమె చుట్టూరా చూడసాగింది. తనకు దగ్గర్లోనే ఓ వృద్ధురాలి భుజంపై తలవాల్చి ఏడుస్తున్న ఓ నల్లజుట్టు, ఎర్రటి రంగు పూసిన కాలిగోళ్లు గల ఆడపిల్లను చూడగానే జాలి, ఆశ్చర్యం కలిగాయి. ఎవరిలా ఉందామె? రెబెకా బొరిసోవ్నాలా లేదూ! ఆమె కూతురే గదా సొలొవిఛిక్‌లలో ఒకడిని వివాహ మాడింది. మిన్స్క్‌లో– చాలా ఏళ్ల క్రితం.

క్రితం సారి తమ పిల్లవాడు ఆత్మహత్య చేసుకోబోయిన విధానం, డాక్టరు చెప్పిన దాని ప్రకారం విలక్షణమైనది. అతడు సక్సెస్ అయ్యేవాడేమో కాని పక్కనే ఉన్న సహరోగి,– ఇతగాడు ఎగరడం నేర్చుకుంటున్నాడని – అసూయతో సరైన టైంకు ఆపేయబట్టి ఆ ప్రయత్నం విఫలమయ్యింది. అతడి ఆలోచన ఏవిటంటే తన ప్రపంచానికి ఒక రంధ్రం చేసి దాంట్లోంచి పారిపోవాలని.

ఆ పిల్లవాడికి ఉన్న భ్రాంతుల్ని క్రోడీకరించి ఒక సైంటిఫిక్ వ్యాసం వ్రాసి, నెలవారీ పత్రికలో ప్రచురించి ఆ శానిటోరియం డాక్టరు వీళ్లకూ ఒక ప్రతి ఇచ్చాడు. ఈ భార్యాభర్తలిద్దరికీ – రిఫరెన్షియల్ మానియా (Referential Mania) అనేది అంతకు ముందే సమస్యగా తెలిసి ఉన్నది. ఇప్పుడు ఆ డాక్టరు దాన్ని ఒక మానసిక శాస్త్రపు సమస్యగా మార్చాడు. ఇటువంటి సందర్భాలలో– మానసిక రోగి తన చుట్టూరా జరిగే విషయాల్ని తన వ్యక్తిత్వాన్ని, ఉనికిని సూచించే చిహ్నాలుగా భావిస్తాడు. ఆ కుట్రలోంచి మామూలు మనుషుల్ని మినహాయిస్తాడెందుకంటే వీళ్లకన్నా తాను మేధోపరంగా ఉన్నతుడనని భావిస్తాడు. అతడెక్కడికి వెళ్లినా ప్రకృతి సహజ సంఘటనలు అతడిపై నీడను కమ్ముతాయి. ఆకాశంలో మబ్బులు అతడి ఆగమనాన్ని ఒకదానితో ఒకటి చెప్పుకుంటాయి. కొన్ని ప్రత్యేకమైన సంజ్ఞల ద్వారా అవి తనను గురించిన ప్రతి విషయాన్ని వివరంగా తెలియజేసుకుంటాయి. అతడి అంతర్గత ఆలోచనలన్నీ చీకటి పడేసరికి ఆల్ఫాబెట్‌లోని అక్షర రూపంలో చుట్టూరా ఉన్న చెట్లతో చర్చించుకుంటాయి. గులకరాళ్లు, మరకలు, సూర్యకిరణాలు రకరకాల పద్ధతులలో చేరి తన విశ్లేషణకు సిద్ధంగా ఉంటాయి. వాటి సందేశాలను తాను మాత్రమే అర్థం చేసుకోగలడు. ప్రతి ఒక్కటీ విశ్లేషించదగిన అంశం లేదా చిహ్నం. ప్రతి దాంట్లోనూ తాను సారాంశం. నీతి రూపకం. తన చుట్టూతా గూఢచారులున్నారు. కొంతమంది కనబడకుండా పరిశీలిస్తుంటారు (అద్దపు ఉపరితలంలా, నిశ్చలమైన సరస్సు నీళ్లలా. కొందరు షాపు కిటికీల్లోని కోటుల్లా సాక్షులు. కొందరు హృదయాన్ని రగిలిస్తారు. మిగతావాళ్లు (పారే నీళ్లు, తుఫానులు) పిచ్చివాళ్లలా తనపై వికృత అభిప్రాయాలను కలిగి ఉండి, తను చేసే పనుల్ని విపరీత వ్యాఖ్యలు చేస్తారు. అందుచేత తను ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండి ఈ చిహ్నాలు, సంజ్ఞలు చెప్పే విషయాన్ని శ్రద్ధగా డీకోడ్, విశ్లేషణ చేసి అర్థం చేసుకోవాలి. తను పీల్చే గాలి కూడ గణించబడి రికార్డు చేయబడుతున్నది. ఇది తన చుట్టూరా ఉన్న ఈ పరిస్థితులకు మాత్రమే సంబంధించినది కాదు. దూరం పోయిన కొద్దీ పుకార్లు, నిందలు మహా ఉధృత ప్రవాహాలై పరిమాణంలో, విస్త్రతిలో విపరీతంగా పెరుగుతాయి. తన రక్తకణాల నీడలు అనేక మిలియన్ రెట్లు మాగ్నిఫై చేయబడి, మైదానాలను నింపివేస్తాయి. సుదూరంగా పెద్దపెద్ద పర్వతాలు గ్రానైట్ రాళ్లతో, ఫర్ వృక్షాలతో నిండి ఉండి అవి తన అసలు రూపాన్ని తెలియచెబ్తాయి.---

వాళ్లు ఈ సబ్‌వేలోని కలుషిత వాతావరణంలోంచి బయటకు వచ్చేసరికి సాయంకాలపు మసక వెలుగు, వీధి దీపాల కాంతిలో కలిసిపోయింది. రాత్రి భోజనానికి ఆమె చేపలను కొనుక్కు వెళ్లాలనుకుని, అతడి చేతికి జెల్లీ సీసాలున్న

బుట్టనిచ్చి, అతడిని ఇంటికి వెళ్లమన్నది. ఆమె మాట ప్రకారమే అతడు తామున్న అద్దె ఇంటికి, మూడో అంతస్తులో ఉన్న దాని దగ్గరకు వెళ్లాక గుర్తుకు వచ్చింది పొద్దున తాళం చెవులను ఆమెకే ఇచ్చినట్లు.

నిశ్శబ్దంగా అతడు మెట్ల మీద కూర్చున్నాడు. పది నిముషాల తర్వాత ఆమె ఆయాసపడుతూ మెట్లెక్కి రాగానే అతడు నిశ్శబ్దంగానే లేచి నిలబడినాడు. ఆమె తన మతిమరుపుకు నవ్వుతూ, తప్పు చేసినట్లు తల ఊపుతూ వచ్చి తాళం తీసింది. రెండు గదుల ఫ్లాట్ అది. ఇద్దరూ లోనికి వెళ్లారు. వెళ్ళీ వెళ్లగానే అతడు అద్దం ముందుకు వెళ్లి, నోటి మూలల్ని బలవంతంగా తెరచి, ఇబ్బంది పెడ్తున్న కొత్త కట్టుడు పళ్లను బయటకు లాగి పక్కనే పెట్టాడు. ఆమె టేబులు ఎరేంజ్ చేసేలోపుగా అతడు రష్యన్ వార్తాపత్రిక తిరగేసాడు. చదువుతూనే దంతాలు అవసరం లేని ఆహారాన్ని భుజించాడు. అతడి మూడ్స్ తెలిసిన ఆమె నిశ్శబ్దంగానే ఉండింది.

అతడు పడక గదిలోకి వెళ్లినాక కూడా ఆమె ముందుగదిలో నలిగిపోయిన పేక ముక్కలను, పాత ఫోటో ఆల్బమ్‌లను ముందు పెట్టుకుని కూర్చున్నది. బయట ఆవరణలో బూడిద డబ్బాలపై వాన చినుకులు శబ్దాలు చేస్తున్నవి. వెలుతురున్న కిటికీల్లోని ఓ కిటికీలోంచి– నల్లటి పాంటు ధరించిన ఒక వ్యక్తి తలకింద చేతులు పెట్టుకుని, మోచేతులు పైకెత్తబడగా, మంచం మీద వెల్లకిలా పడుకుని ఉండడం కనిపించింది.

కిటికీ మూసి ఆమె ఆల్బంలోని ఫోటోలను చూడసాగింది. పసిపాపలా అతడు అందరు పసిపాపల కన్నా విభిన్నంగా ఉన్నాడనిపించింది. ఆ చిన్నముఖంలో ఏదో ఆశ్చర్యం. లీప్‌జిగ్‌లో తమ జర్మన్ పరిచారిక, ఆమెకు కాబోయే భర్త ఫోటోలు ఆల్బం నుంచి జారిపడ్డాయి. అలా ఆమె పేజీలు తిరగేస్తుంటే– మిన్స్క్, విప్లవం, లీప్‌జిగ్, బెర్లిన్, మరలా లీప్‌జిగ్, ఇల్లు– మసక మసకగా కనిపిస్తున్నది. ఈ ఫోటోలో పిల్లవాడు నాలుగేళ్ల వయసులో తీసింది. పార్కులో, సిగ్గుపడుతూ, ముఖాన భృకుటి ఆశ్చర్యంతో ముడిపడ్తుండగా ఉడతను చూస్తున్న దృశ్యం. ఈమె ఆంటీ రోజా! హడావుడి మనిషి! ఎప్పుడూ ఏదో గొడవ చేస్తూనే ఉంటుంది. ఆమె జీవితం ఎప్పుడూ విసాద వార్తల్లోనే గడిచింది. చెడు వార్తలు, ఆర్థిక దివాళాలు, రైలు ప్రమాదాలు, కాన్సర్ కురుపులు చివరకు జర్మన్ల చేతుల్లో ఆమె, ఆమెకు కావాల్సిన వాళ్లతో సహా మృత్యువుకు అప్పగించబడింది. ఈ ఫోటో ఇతడు ఆరేళ్ల వయసులో తీసింది. పక్షులకు, మనుషుల చేతులు కాళ్లు పెట్టి చక్కటి చిత్రాలు గీచేవాడు. పెద్ద వాళ్లలాగా నిద్రపట్టక 'ఇన్‌సొమ్నియా'తో అవస్థ పడేవాడు. ఇతడి కజిన్ ఇప్పుడు ప్రఖ్యాతి చెందిన చదరంగపు ఆటగాడు. ఈ ఫోటో ఇతడికి ఎనిమిదేళ్ల వయసులో తీసింది... నడవాలో ఉన్న వాల్‌పేపర్ని చూసి భయపడేవాడు. పుస్తకంలో కొన్ని బొమ్మల్ని చూసి

జడుసుకునేవాడు. ఎందుకనో, ఏమో! ఇంతకీ ఆ బొమ్మలో ఏమున్నదో అని చూస్తే కొండగుట్టలు, ఆకులు లేని చెట్టుకు తగిలించబడిన పాత బండి చక్రం. అంతే.

ఇది ఏడేళ్ళ వయసులో తీసింది. అప్పుడే వాళ్లు, యూరప్ వదిలి పెట్టి ఇక్కడకు వచ్చింది. ఆమెకు అప్పుడు తాము పడిన ఛీతార్కాలు, దయ, జాలి గొలిపే అవస్థలు, ఆ ప్రయాణంలో అనుభవించిన అవమానాలు, కష్టాలు అన్నీ గుర్తుకు వచ్చాయి. అమెరికా చేరాక తన తోటి అనాగరిక విద్యార్థులతో అతడు పడిన అగచాట్లు జ్ఞప్తికి వచ్చాయి. ఆ తరువాత న్యుమోనియా, చానాళ్లపాటు రోగిష్ఠిగా మంచం మీద ఉండాల్సిరావడం, అప్పుడే ఈ భయాలు, భ్రాంతులు మొదలైనాయి. అతడి తల్లిదండ్రులు వాటిని తెలివైన విద్యార్థికుండే విపరీత లక్షణాలుగా భావించారు. ఆ భ్రాంతులు ముదిరి, తార్కికంగా ఒకదాని కొకటి కలపబడి, మామూలు మనసులకు అర్థంకాని చిక్కు సమస్యలుగా మారినాయి.

ఇవన్నీటినీ ఆమె భరించింది. బతకడమంటే ఒక ఆనందం తర్వాత మరో ఆనందాన్ని కోల్పోవడమే కదా! తన గురించే అయితే అవి ఆనందాలు కాదు బతుకు బాగుపడుతుందేమోనన్న ఆశలు. ఆమె తాను, తన భర్త మళ్లీమళ్లీ పడిన కష్టాల్ని గుర్తుకు తెచ్చుకున్నది. కనబడని దెయ్యాలో, మహా భూతాలో తన కుమారుడిని హింసిస్తున్న విషయాల్ని మననం చేసుకున్నది. ప్రపంచంలో ఉన్న గణించబడని మార్దవాన్ని, మమతను, దాని ఉపయోగ రాహిత్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నది. ఆ మమత అణగదొక్కబడో, వృధా చేయబడో, ఉన్మాదంగానో మార్చబడినాక సమాజం చేరదీయని అసంఖ్యాకమైన చిన్నపిల్లలు ఊడ్చబడని మూలల్లో నక్కినక్కి తమలో తాము మాట్లాడుకుంటూ, పాడుకుంటూ, కుదించబడిన తమ తమ లోకాల్లో జీవిస్తున్నారు, రైతుకు కనిపించకుండా ఉండని అందమైన పిచ్చిమొక్కల్లా!

అప్పటికే అర్థరాత్రి అయినట్లుంది. ఆమె తన భర్త మూలుగు విన్నది. అతడు తన నైట్ గౌనులో (ఏస్ట్రాఖాన్ కాలర్ ఉన్న పాతకోటు అంటేనే అతడికిష్టం. కొత్త నీలి అంగీకన్నా) తడబడుతూ వచ్చాడు.

"నాకు నిద్ర పట్టడంలేదు" అరిచాడతడు.

"ఎందుకని? బాగా అలిసిపోయావుగా!"

"నాకు నిద్ర పట్టడం లేదు. ఎందుకంటే నేను చనిపోబోతున్నాను" అని సోఫాలో పడుకున్నాడు.

"కడుపులో ఏమన్నా తిప్పుతోందా! డాక్టర్ సోలోవ్‌ను పిలవమంటావా?" అడిగిందామె.

"డాక్టర్లు వద్దు. వద్దు" అని మూలిగాడతడు. "ఈ డాక్టర్లను దయ్యాలు తీసుకుపోనూ! మనం అతడిని అక్కడ నుంచి తీసుకురావాలి. లేకుంటే మనం కారణమవుతాం.... మనం కారణమవుతాం!" అంటూ అతడు లేచి కూర్చున్నాడు. తన పిడికిలితో నుదుటి మీద కొట్టుకున్నాడు.

"అలాగే లే! రేపు ఉదయమే పోయి తీసుకువద్దాం!" అన్నదామె సాలోచనగా.

"నాకు 'టీ' కావాలి" అని అతడు బాత్‌రూం వేపు వెళ్లాడు.

కష్టం మీద వంగి ఆమె నేల మీదకు పడిన కొన్ని పేకముక్కల్ని, ఫోటోలను తీసింది – Knave of Hearts, Nine of spades, the ace of spades, ఎలిసా, ఆమె కాబోయే భర్త ఫోటోలు. ఈలోగా అతడు బాత్‌రూం నుంచి హుషారుగా వచ్చాడు. "నేనంతా ప్లాన్ చేసాను. అతడికి మన పడక గది ఇద్దాం. సగం రాత్రి అతడితో ఉండి సగం రాత్రి ఈ సోఫాలో పడుకుందాం తడవలు తడవలుగా నీవూ నేనూనూ. వారానికి రెండు సార్లు డాక్టర్లు వచ్చి చూసేట్లు ఏర్పాటు చేద్దాం. ప్రిన్స్ ఏమైనా అనుకోనీ! అతడేమీ అనుకోడులే ఈ పద్ధతే కాస్త ఖర్చు తగ్గిస్తుంది కదా!"

టెలిఫోన్ మోగింది. ఫోన్ కాల్ వచ్చే సమయం కాదిది. అతడు గది మధ్యలో నిలబడి కాలితో జారిపోయిన స్లిప్పర్ కోసం వెదుకుతూ, చిన్నపిల్లాడిలా, బోసినోటితో నవ్వుతూ భార్యవంక చూసినాడు, అతడి కంటే ఆమెకు ఇంగ్లీషు ఎక్కువ వచ్చు కనుక ఆమే సాధారణంగా ఫోన్ రిసీవ్ చేసుకుంటుంది.

"నేను ఛార్లీతో మాట్లాడవచ్చా?" ఎవరిదో బాలిక గొంతు.

"ఏ నంబరు కావాలమ్మా నీకు? ఇది రాంగ్ నంబర్"

ఆమె ఫోన్‌ను రిసీవర్ మీద ఉంచి తన చేతిని గుండెపై ఉంచుకున్నది. "నాకు భయం వేసింది" అన్నదామె– "పిల్లవాడి గురించేమోనని"–

అతడు ఓ చిరునవ్వు నవ్వి మరల తన సంభాషణ మొదలెట్టాడు. తెల్లవారంగానే వెళ్లి అతడిని ఇక్కడకు తీసుకువద్దాం. అతడికి ఏ ఆపదా రాకుండా ఉండడానికి ఇంట్లో ఉన్న కత్తులూ వగైరా పదునైన సామాన్లని డ్రాయర్లో పెట్టి తాళం వేద్దాం. ఎంత వరస్ట్ కండిషన్లో కూడా అతడు ఇతరులకు అపకారం తలపెట్టే రకం కాదు.

టెలిఫోన్ రెండోసారి రింగయ్యింది. వాళ్ళ గుండెలు జల్లుమన్నాయి.

మరలా అదే గొంతు ఛార్లీ గురించి అడిగింది.

"నీ దగ్గర ఉన్న నెంబరు సరైనది కాదు. నేను చెప్పనా నీవేం చేస్తున్నావో, జీరోకు బదులు 'O' అక్షరాన్ని నొక్కుతున్నావు" అని చెప్పి ఫోన్ పెట్టేసిందామె.

గుండెల్లో కాస్త దడ తగ్గగానే... అర్ధరాత్రి పూట టీ తాగడానికి ఇద్దరూ సంసిద్ధులైనారు. అప్పుడప్పుడూ గ్లాసు పైకెత్తి వలయంగా తిప్పుతూ పంచదార కరిగేలా కదిలిస్తున్నాడతడు. అతడి బట్టతలకు పక్కగా ఉన్న రక్తనాళం ఉబ్బి కనిపిస్తున్నది. గడ్డంపై వెండి వెంట్రుకలు మెరుస్తున్నవి. పిల్లవాడికి ఇద్దామనుకున్న పుట్టినరోజు కానుక బల్లపై ఉంది. ఆమె అతడికి మరలా గ్లాసునిండా 'టీ' పోస్తుంటే అతడు కళ్లకు జోడు తగిలించుకుని, సంతోషంగా జెల్లీ సీసాలు, పసుపు పచ్చగా, ఆకుపచ్చగా, ఎర్రగా మెరుస్తున్న వాటిని చూస్తూ తడి పెదాలతో వాటి పేర్లు– ఏప్రికాట్, గ్రేప్, బీచ్‌ప్లమ్, క్విన్స్ – ఇలా చదువుతూ క్రాబ్ ఏపిల్ దగ్గరకు వచ్చేసరికి మరలా ఫోన్ మోగింది.

---

## వ్లదిమీర్ నబొకోవ్ (Vladimir Nabokov 1899-1977)

వ్లదిమీర్ నబొకోవ్ వ్రాసిన ఈ కథ మే 15, 1948 నాడు న్యూయార్క్ పత్రికలో 'సింబల్స్ అండ్ సైన్స్'గా ప్రచురితమైంది. నబొకొవ్ మరల దానిని ఒరిజినల్ పేరు సైన్స్ అండ్ సింబల్స్‌గా, 'నబొకొవ్ డజన్'లో ప్రచురించాడు.

నబొకొవ్ ఈ కథను 'కథాంతర్గత కథ'గా వర్ణించాడు. ముగింపు కూడా పాఠకులు తమ తమ దృక్పథాలను బట్టి ఊహించేందుకు వీలుగా ఉంటుందని వ్యాఖ్యానించాడతడు.

22 ఏప్రిల్ 1899లో జన్మించిన నబొకొవ్ మొదటి తొమ్మిది నవలలు రష్యన్ భాషలో వ్రాయబడినాయి. కాని అతడికి పేరు తెచ్చినవి ఇంగ్లీషు భాషలో వ్రాసిన నవలలే. 1955లో వ్రాసిన Lolita లోలిటా – Modern Library Hundred Best Novels లో నాలుగో స్థానాన్ని, Palefire (1962) యాభై మూడవ స్థానాన్ని అతడి జ్ఞాపకాల సంకలనం Speak, Memory - నాన్‌ఫిక్షన్ జాబితాలో ఎనిమిదవ స్థానాన్ని సంపాదించుకున్నాయి.

"Telling by means of suggestion or implication is one of the most important of all the short story's short hand conventions. It means that a short story writer does not directly tell us things so much as let us guess or know them by implying them" **- Sean O Faolin**

# 7. దక్షిణానికి పోయే రహదారిపై
## (Southbound on the Freeway)

**– మే స్వెన్‌సన్**
**May Swenson (1913-1989)**

అంతరిక్ష లోకం నుంచి వచ్చిన విహారయాత్రికుడు
గాలిలో తన నౌక నాపి ఇట్లా అనుకున్నాడు:–

ఈ గ్రహంలోని జీవులు తయారుచేయబడినాయి,
గాజు, లోహాల గాఢమైన పొందికతో.

చూడవచ్చు నీవు వాటి లోపలి పేగుల్ని,
పారదర్శకమైన భాగాల గుండా!

వాటి పాదాలుంటాయి గుండ్రంగా,
తిరుగుతుంటాయి ఇరుసుపై వేగంగా,
పరిగెడ్తాయి పొడుగాటి కొలమానపు టేపులపై
తెల్లటి రేఖలున్న నల్లటి రిబ్బన్లపై!

వాటికి నాలుగు కళ్లున్నాయి
వెనక రెండు ఎర్రగా మెరుస్తాయి.

ఒక్కోసారి నీవు చూడవచ్చు
ఓ అయిదు కళ్ల జీవిని; దాని నెత్తిపై
వేగంగా తిరిగే ఎర్రని నేత్రాన్ని,

అతడెవరో గొప్పవ్యక్తి కాబోలు,
అందరూ అతడిని గౌరవిస్తూ
దారి ఇచ్చి నెమ్మదిగా పోతారు.
అతడు వాళ్లను వేగంగా దాటుకుంటూ
వెనుక నుంచి ముందుకు దూసుకుపోతాడు.

వాళ్లు పోతున్నపుడు 'హిస్' అనే సవ్వడి,
అంగుళపు గుర్తుల టేపులపై అలజడి.

ఆ కఠినమైన దేహాల్లో
కదలాడే మెత్తటి ఆకారాలు
అవి వాటి పేగులా?
లేక మెదడు, నరాలా?

---

## మే స్వెన్సన్ (May Swenson 1913-1989)

లోగాన్, ఉటాలో పుట్టి పెరిగిన స్వెన్సన్ జంతు జీవనం గురించి, మానవ ఉనికి యొక్క విభ్రాంతికరమైన విషయాలను కవిత్వీకరిస్తుంది. E.E. కమ్మిన్స్‌లా తను కూడా రకరకాల టైపొగ్రాఫిక్ అల్లికలతో తన కవితలను అందంగా కనబరుస్తుంది.

ఈ కవిత ఒక పొడుపు కథలా ఉంటుంది. ఇతర గ్రహాల నుంచి వచ్చిన యాత్రికులు, నిరంతరాయంగా రహదారులపై పోతున్న మన కార్లను చూసి సందేహ పడినట్లు – మనకు అర్థం కావడం లేదా మనకన్నా మనం కనిపెట్టిన వస్తువులే ముఖ్యమై, మానవుడిని అడుగుకు నెట్టేస్తున్నాయని!

# 8. వధ్యశిలపై గొర్రెపిల్ల
## (Lamb to the Slaughter)

**– రోయాల్డ్ డాల్**

గది వెచ్చగా శుభ్రంగా వుంది. కిటికీ తెరలు వేసి ఉన్నాయి. రెండు టేబుల్ ల్యాంపులు వెలుగుతున్నాయి. ఒకటి తనవేపు రెండోది ఎదురుగా ఉన్న ఖాళీ కుర్చీ వేపు ఉన్నది. ఆమె వెనక ఉన్న బల్లపై రెండు పెద్ద గ్లాసులు, సోడా, విస్కీ, ఫ్రెష్ ఐస్ క్యూబులున్న థర్మాస్ ఫ్లాస్క్ ఉన్నాయి.

మేరీ మలోని తన భర్త డ్యూటీ ముగించి రావడం కోసం ఎదురు చూస్తున్నది.

అప్పుడప్పుడూ పెద్ద కంగారు లేకుండానే తల పైకెత్తి గోడ గడియారం వేపు చూస్తూ సాగిపోతున్న ప్రతిక్షణమూ అతడు వచ్చే టైంకు దగ్గర చేస్తాయన్న ఆనందంతో ఆమె ఉన్నది. ఆమె అతడి కోసం చేసిన ఏర్పాట్లు సంతోషం కలిగించాయి కాబోలు ఆమెలో చిరునవ్వులు విరిసాయి. ఏదో డిజైన్ కుడుతూ తల ఓ పక్కకు వాల్చి ప్రశాంతంగా తన పని చేసుకుపోతున్నదామె. ఆమె చర్మం – ఆరోనెల గర్భిణీ ఆమె) – అద్భుతమైన మృదుత్వాన్ని మెరుపును సంతరించుకున్నది. చక్కని నోరు, నిర్మలంగా ఉన్న కళ్లు మునుపటి కన్నా పెద్దగా విశాలంగా కనిపిస్తున్నాయి.

టైం పది నిముషాలు తక్కువ అయిదు కాగానే ఆమె అసంకల్పితంగానే బయట గులకరాళ్లలో కారు ఆగిన చప్పుడు, కారు డోరు వేసిన శబ్దం, కిటికీ పక్కగా వస్తున్న పద ధ్వని, తాళాన్ని తీస్తున్నప్పుడయ్యే క్లిక్ ధ్వని వింటూనే ఉన్నది. తను చేస్తున్న కుట్టుపని ఆపి, లేచి తలుపు దగ్గరకు వెళ్లి అతడు వస్తుంటే ముద్దు ఇద్దామని ముందుకు వెళ్లింది.

"హల్లో డార్లింగ్" అన్నదామె.

"హల్లో!" అన్నాడతడు.

అతడి కోటు తీసుకుని క్లోజెట్‌లో పెట్టి, బల్ల దగ్గరకు వెళ్లి అతడి కోసం ఓ స్ట్రాంగ్, తన కోసం కాస్త మామూలు డ్రింక్ కలిపి మరల వచ్చి తన కుర్చీలో కూర్చుని కుట్టడం ప్రారంభించింది. అతడు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని రెండు చేతుల్తో విస్కీగ్లాసును పట్టుకుని కదిలిస్తుంటే మంచుముక్కలు గ్లాసు పక్కన మెరుస్తున్నాయి.

ఆమెకు, ఈ సమయమంటే ఎంతో ఇష్టం– ఇద్దరూ ఎదురెదురు కూర్చుని సన్నిహితంగా కాలం గడపడం. ఆమెకు తెలుసు మొదటి గ్లాసు అయ్యేంత వరకు అతడు నోరు మెదపడని. అందుకని ఆమె నిశ్శబ్దంగా కూర్చుని, ఉదయం నుంచి ఇంట్లో తనతోపాటు ఉన్న ఒంటరితనాన్ని వెళ్లగొట్టి, అతడి సామీప్యతను ఆనందిస్తున్నది. తన వాడు తన పక్కనే ఉండడం – ఆమెకు బీచ్‌లో సన్‌బాత్ ఆనందించేవాళ్లకు సూర్యుడు కనిపించడం లాంటిది. అతడి మగతనపు కాంతి వారిద్దరూ ఒంటరిగా ఉన్నప్పుడు ఆమెపై పడి ప్రతిఫలిస్తుంది. అతడు రిలాక్స్‌డ్‌గా, వదులుగా తన కుర్చీలో కూర్చునే తీరు, గుమ్మంలోంచి ప్రవేశించే స్టైల్, గదిలో నెమ్మదిగా, ఠీవిగా, పెద్దపెద్ద అంగలతో పచార్లు చేసే పద్ధతి ఆమెకు ఇష్టం. తనను నిశితంగా, గాఢంగా చూసే అతడి చూపులు, గమ్మత్తుగా ఉండే నోరు, అలిసి వచ్చినప్పుడు అతడు నిశ్శబ్దంగా ఉండే విధానం, విస్కీ కొంత లోనికి పోయి అతడిని సేదదీర్చే వరకూ అతడు ఉలుకూ పలుకూ లేకుండా ఉండడం ఇవన్నీ అన్నీ ఆమెకు చాలా చాలా ఇష్టం.

"అలిసిపోయావా, డార్లింగ్?"

"అవును" అన్నాడతడు. "అలిసిపోయాను బాగా" అంటూనే అతడు ఎప్పుడూ లేనిది ఈరోజు తన చేతిలోని గ్లాసు పైకెత్తి దానిలో ఉన్న విస్కీని ఒక్క గుక్కలో తాగేసాడు. ఆమె చూడలేదు కాని మంచుముక్కలు ఖాళీ గ్లాసులో పడినప్పుడు చేసే శబ్దాన్ని బట్టి ఆమె అలా ఊహించుకోగలిగింది. అతడు ఒకక్షణం ఆగి, కాస్త ముందుకు వంగి, పైకి లేచి ఇంకో గ్లాసు నింపుకోవడానికి నెమ్మదిగా నడుస్తున్నాడు.

"నేను తెస్తాను" అన్నదామె ఒక్క ఉదుటున లేస్తూ–

"కూర్చో" అన్నాడతడు.

అతడు తన గ్లాసును లేత పసుపు రంగులో ఉన్న విస్కీతో నింపుకుని వచ్చినాడు. అది మరీ స్ట్రాంగ్.

"నీ స్లిప్పర్స్ తేనా, డార్లింగ్?"

"వద్దు"

అతడు విస్కీని కొద్దికొద్దిగా చప్పరిస్తున్నాడు. సోడా కలపని విస్కీ నూనెలా సుడులు తిరుగుతున్నది.

"నీలాంటి సీనియర్ పోలీసు ఆఫీసర్ రోజల్లా తిరగాల్సి రావడం సరైన పద్ధతి కాదనుకుంటాను. ఇట్ ఈజ్ ఎ షేమ్!" అన్నదామె.

అతడు మాట్లాడలేదు. అందుకని ఆమె మౌనంగా కుట్టడంలో నిమగ్నమయ్యింది. కాని, అతడు గ్లాసు పైకెత్తినప్పుడల్లా మంచు ముక్కలు అంచుకు తగిలి చేస్తున్న శబ్దం వింటూనే ఉన్నది.

"డార్లింగ్" అన్నదామె. "ఏమన్నా ఛీజ్ తీసుకురానా! ఈరోజు గురువారం కదా సప్పర్ ఏమీ రెడీ చేయలేదు"

"వద్దు" అన్నాడతడు ముక్తసరిగా.

"బయటకు వెళ్లి తినడం ఇష్టంలేకపోయినట్లయితే ఏం ఫరవాలేదు. ఇంట్లో సరిపడినంత మాంసం, కూరగాయలు ఉన్నాయి. క్షణాల్లో వంట తయారు చేస్తాను. నీవు కుర్చీలోంచి కదలాల్సిన అవసరం రానివ్వను" అన్నదామె.

ఆమె కళ్లు అతడి సమాధానం కోసం ఎదురుచూసాయి. కనీసం ఓ చిరునవ్వు, తలపంకింపు – అవేమీ అతడివేపు నుండీ రాలేదు.

"సరే! ముందుగా కొంత ఛీజ్, క్రాకర్లు తెస్తాను"

"నాకవేం వద్దు" అన్నాడతడు.

ఆమె తన కుర్చీలో ఇబ్బందిగా కదిలింది. ఆమె విశాల నయనాలు అతడి ముఖాన్ని పరీక్షగా చూస్తున్నాయి.

"నీకు సాయంకాల భోజనం అవసరం కదా! నేను అవలీలగా చేయగలను. నీకోసం నేను చేస్తాను. లాంబ్ చోప్స్ చేయమంటావా, పోనీ పోర్క్. నీకేది కావాలంటే అది. అన్నీ ఫ్రిజ్‌లో ఉన్నాయి"

"మరచిపో" అన్నాడతడు.

"కాని, డార్లింగ్, నీవు తినాలి! నేను వంట చేస్తాను క్షణంలో, తరువాత నీకిష్టముంటే తిందువుగాని లేకుంటే లేదు." ఆమె లేచి నిలబడి తను కుడ్తున్నదాన్ని దీపం పక్కనే ఉంచింది.

"కూర్చో" అన్నాడతడు. "ఒక్కనిముషం కూర్చో!"

ఆమెలో ఏదో అనుకోని భయం మొదలైంది.

"కూర్చో" అన్నాడతడు.

నెమ్మదిగా ఆమె కుర్చీలో కూలబడింది. ఆమె విశాల నయనాలు లేడికళ్లలా భయభయంగా బెదురుతున్నట్లు అతని వేపు చూస్తున్నాయి. అతడు రెండో గ్లాసు ఫినిష్ చేసి గ్లాసులోకి తీవ్రంగా చూస్తున్నాడు.

"సావధానంగా విను" అన్నాడతడు. "నీకు ఈ విషయం చెప్పాలనుకుంటున్నాను"

"ఏమిటి డార్లింగ్? ఏమిటది?" అన్నదామె.

అతడు శిలలా బిగుసుకుపోయాడు. వంచిన అతడి తలపై దీపపు నీడ పై సగభాగాన్ని వదిలి చుబుకాన్ని నోటిని ఆక్రమించింది. అతడి ఎడమ వేపు కంటి కండరాలు కదిలినట్లు ఆమె అనుకున్నది.

"ఇది నీకు షాక్ కలిగిస్తుందేమోనని నా భయం" అన్నాడతడు. "నీకు ఎలా చెప్పాలా అని ఎంతో ఆలోచించి, చివరకు వెంటనే చెప్పడం మంచిదన్న నిర్ణయానికి వచ్చాను. నన్ను మరీ నిందించవనే అనుకుంటున్నాను"

అతడు తన మనసులో మాట చెప్పాడు. అది చెప్పడానికి పెద్ద ఎక్కువ సమయం పట్టలేదు. బహుశా నాలుగయిదు నిముషాలు, అంతే! అది వింటూ ఆమె నిశ్చలంగా అతడి వంకే చూస్తూ ఉండిపోయింది. విభ్రాంతితో కూడిన భయం ఆమె విశాల నయనాలలో మెదుల్తుండగా ఆమె, అతడు చెబ్తున్న ఒక్కొక్కమాటను, వాక్యాన్ని జీర్ణించుకోవడానికి ప్రయత్నం చేస్తుంటే, అంత దగ్గరగా ఉన్న అతడు ప్రతి మాటతో ఆమెకు దూరంగా, మరింత దూరంగా వెళ్లిపోతున్నాడు.

"ఈ సంగతి ఈ పరిస్థితుల్లో చెప్పడం సరికాదని నాకు తెలుసు కాని, వేరే మార్గం లేదు. భయపడకు, నేను నీ అవసరాలకు సరిపడా డబ్బిస్తాను. నీవు సౌఖ్యంగా ఉండేట్లు చూస్తాను. దీనికోసం పెద్ద గొడవ పడనక్కరలేదు. అది ఉండకూడదు. నా ఉద్యోగానికి అది మంచిది కాదు" అన్నాడతడు.

ఆమె మొదట ఆ విషయాన్ని నమ్మలేకపోయింది. ఆ భావననే తిరస్కరించబోయింది. అతడేం చెప్పలేదు అదంతా తన ఊహ అనుకున్నది. ఇదేమీ పట్టించుకోకుండా తన పని తాను ముగించి, నిద్రపోయి, తెల్లవారే లేస్తే బహుశా అంతా మామూలు స్థితికి వస్తుందేమో!

"నీకు సప్పర్ తెస్తాను" గుసగుసలాడ్తున్నట్లు వినీవినబడకుండా ఉన్నదామె స్వరం. ఈసారి అతడు తన అభ్యంతరం తెలుపలేదు.

ఆమె గదిలో నడుస్తుంటే పాదాలు నేలకు తగుల్తున్నట్లనిపించలేదామెకు. ఏదో వికారం, వాంతి వస్తున్నట్లనిపించింది. ఇప్పుడంతా యాంత్రికంగా ఉంది. మెట్లు దిగి సెల్లార్‌లోకి వెళ్లింది, లైట్ స్విచ్ ఆన్ చేసింది. డీప్ ఫ్రిజ్‌లో తన చేతికి అందిన మొదటి వస్తువును పట్టుకున్నది. దాన్ని బయటకు తీసి, దానివేపు చూసింది. దాని చుట్టూరా కాగితం చుట్టి ఉన్నది. ఆ కాగితం తీసి మరలా దానివేపు చూసింది.

గొర్రెపిల్ల కాలు. A leg of lamb. డీప్ ఫ్రిజ్‌లో ఉండటం వల్ల చల్లగా, బరువుగా, గట్టిగా మంచుతో కూడి ఉన్నది.

సరే. ఈ పూట గొర్రెమాంసం తినవచ్చు అనుకుని దాన్ని పట్టుకుని పైకి వచ్చింది. రెండు చేతుల్తో సన్నటి కాడలాంటి మాంస ఖండం చివర ఎముకను గట్టిగా పట్టుకుని లివింగ్ రూంలోకి వచ్చేసరికి అతడు కిటికీలోంచి బయటకు చూస్తూ నిలబడి ఉన్నాడు. అతడి వెనకభాగం ఇటువేపు ఉన్నది. ఆమె ఆగింది.

ఆమె అడుగుల చప్పుడు విని అతడు వెనక్కు తిరగకుండానే అన్నాడు– "నాకోసం సప్పర్ చేయడానికి శ్రమపడవద్దు. నేను బయటకు వెళ్తున్నాను"

ఆ క్షణంలో, మేరీ మలొని, అతడి దగ్గరకు వెళ్లి ఏమీ ఆలోచించకుండా, ఏ వ్యవధీ ఇవ్వకుండా గట్టిగా పట్టుకున్న గొర్రెకాలి మాంసఖండాన్ని బాగా పైకిలేపి ఈతడి నెత్తిమీద గట్టిగా కొట్టింది.

ఇనుప కడ్డీతోనో స్టీలు గదలాంటి దానితో కొట్టగలిగిన దెబ్బ కొట్టింది.

అంత దెబ్బకొట్టి ఒక్క అడుగు వెనక్కు వేసి, వేచి చూస్తుండగా, నాలుగయిదు సెకండ్లపాటు అతడు అలాగే నిలబడిన వాడు నిలబడినట్లే ఉండి, నెమ్మదిగా ఒక పక్కకు ఒరిగి, ధడాలున నేలపై తివాచీ మీద పడిపోయాడు.

అలా భీకరంగా పడిపోవడం, చప్పుడు, టేబుల్ బోర్లా పడడం – ఇవన్నీ ఆమెను షాక్‌లోంచి తేరుకునేట్లు చేసాయి. నెమ్మదిగా ఆమె చేతన స్థితిలోకి వచ్చింది. ఏదో శీతలస్థితి, ఆశ్చర్యం, భయం ఇవన్నీ కలగాపులగమై ఆమె నిశ్చేతనంగా పడివున్న శరీరం వేపు చూసింది. ఇంకా ఆమె చేతుల్లో గొర్రెపిల్ల మాంసఖండం అలానే ఉన్నది శీతలంగా, మంచుగదలా!

"సరేసరే! అతడిని నేను చంపేసాను" అనుకున్నదామె.

ఇంతలోనే ఆమె మనసు స్వచ్ఛంగా భావరహితంగా ఎలా మారిందో ఆమెకే అర్థం కాలేదు. అతివేగంగా ఆమె ఆలోచించసాగింది. డిటెక్టివ్ భార్యగా ఆమెకు తెలుసు ఆ నేరానికి శిక్ష ఏమిటో! అయితే ఏమిటి! ఏం తేడా ఉంటుంది తన జీవితంలో! నిజానికి అది ఒక రిలీఫ్! భారం తగ్గిన స్థితి. మరి తనకు పుట్టబోయే పసివాడి సంగతేమిటి? గర్భిణీస్త్రీ హంతకురాలైతే ఎటువంటి శిక్ష విధిస్తారు? తల్లిని, బిడ్డను చంపేస్తారా? పదో నెలలో ప్రసవం అయ్యేవరకూ ఆగుతారా? ఏం చేస్తారు వాళ్లు?

మేరీ మలొనికి ఏమీ అర్థం కాలేదు. ఎటువంటి ఛాన్సూ తీసుకోదలచుకో లేదామె.

వంటగదిలోకి ఆ మాంసఖండాన్ని తీసుకువెళ్లింది. ఒక పాన్‌లో పెట్టి, ఓవెన్‌ను 'హై' చేసి, లోపలకు నెట్టి తలుపు వేసింది. తరువాత తన చేతుల్ని కడుక్కుని, పడక గదిలోకి పరిగెత్తింది. అద్దం ముందు కూర్చుని, ముఖం శుభ్రంగా తుడుచుకుని, పెదాలకు, బుగ్గలకు టచప్ చేసి, చిరునవ్వు నవ్వే ప్రయత్నం చేసింది. గమ్మత్తుగా ఉన్నదా చిరునవ్వు. మళ్లా ప్రయత్నించింది.

"హలో సామ్" అన్నది బిగ్గరగా.

ఆమె గొంతు ఆమెకే వింతగా అనిపించింది.

"నాకు బంగాళాదుంపలు కావాలి. సామ్! ఒక బఠాణీ కాన్ కూడా ఇవ్వు!

ఇప్పుడు గొంతు ఫరవాలేదు. చిరునవ్వు, స్వరమూ దాదాపు మామూలు స్థితికి వచ్చేసాయి. అట్లా పలుమార్లు రిహార్సల్ చేసిందామె. తరువాత గబగబా మెట్లు దిగి, కోటు తొడుక్కుని, వెనక గుమ్మం ద్వారా తోటలోకి, అక్కడ నుంచి వీధిలోకి వచ్చింది.

ఇంకా ఆరుగంటలు కాలేదు. పచారీ షాపులో లైట్లు వెలుగుతూనే ఉన్నాయి.

"హల్లో సామ్" అన్నదామె నవ్వుతూ, కౌంటర్ వెనక ఉన్న వ్యక్తినుద్దేశించి.

"గుడ్ ఈవెనింగ్, మిసెస్ మలొని. హౌ ఆర్ యూ"

"నాకు బంగాళదుంపలు కావాలి. సామ్! ఒక బఠాణీ కాన్ కూడా ఇవ్వు!"

అతడు వెనక్కి తిరిగి అల్మైరాలో ఉన్న బఠాణి కాన్ తీసాడు.

"పాట్రిక్ అలిసిపోయి వచ్చాడు. ఈ రోజు బయట తినలేనన్నాడు" ఆమె చెప్పుకుపోయింది. "నీకు తెలుసు కదా మేం ప్రతి గురువారం బయట భోజనం చేస్తామని. ఇప్పుడేమో ఇంట్లో కూరగాయలు నిండుకున్నాయి".

"మాంసం కావాలా, మిసెస్ మలోని?"

"అక్కర్లేదు. థాంక్స్. ఇంట్లో మంచి గొర్రెపిల్ల కాలు మాంసఖండం ఉంది. రియల్ నైస్ లెగ్ ఆఫ్ లాంబ్. ఫ్రిజ్‌లో ఉన్నది" అన్నదామె.

"ఓ"

"ఫ్రిజ్‌లో గడ్డకట్టిన మాంసం వండటం నాకిష్టం ఉండదు. కాని ఛాన్సు తీసుకుంటున్నానివ్వాళ. ఏం కాదుగా?"

"నాకు తెలిసినంత వరకూ పెద్ద తేడా ఏమీ ఉండదు" అన్నాడు సామ్. "నీకు ఇదాహో బంగాళాదుంపలు కావాలా?"

"ఆc రెండు చాలు" అన్నదామె.

"ఇంకెమన్నా కావాలా" అని అడిగాడు సామ్ ఆమె వేపు మెచ్చుకోలుగా చూస్తూ– "భోజనం తర్వాత? తర్వాత ఏమిస్తావు?"

"నీవేం సలహా యిస్తావు, సామ్?"

అతడు తన షాపును కలయజూసి అన్నాడు–

"పెద్ద ఛీజ్ మాటేమిటి. నాకు తెలుసు అది అతడికిష్టమని"

"పర్‌ఫెక్ట్" అన్నదామె. "హి లవ్స్ ఇట్!"

ఆమె కొన్నవన్నీ పాక్‌చేసి ఇచ్చాడతడు. పైకం చెల్లించి, తన ముఖంపై మంచి ప్రకాశవంతమైన నవ్వు పులుముకుని అన్నదామె– "థాంక్యూ సామ్, గుడ్‌నైట్!"

త్వరత్వరగా ఇంటికి వస్తూ ఆమె ఆలోచించసాగింది. తనకు తాను ఏం చెప్పుకున్నదంటే తానిప్పుడు ఇంటికి పోతున్నది, తన భర్త సప్పర్ కోసం ఎదురు చూస్తున్నాడు, తను వెళ్లి చక్కగా వంటచేసి, రుచికరంగా ఉండేట్లు చూసి, పాపం అలిసిపోయి వచ్చిన అతనికి సంతోషంగా వడ్డించాలి. ఒకవేళ తను లోపలికి వెళ్లేసరికి ఏదైనా అనుకోనిది విషాదకరమైనదో, భయంకరమైనదో కనబడితే సహజంగా అది 'షాక్' కలిగిస్తుంది కదా! అప్పుడామె భయంతో, దుఃఖంతో తల్లకిందులైపోదూ! ఇదుగో, ఆమె అటువంటి దృశ్యాన్ని అనుకోవడం లేదు. కూరగాయల్ని తీసుకుని ఇంటికి పోతున్నదంతే! మిసెస్ పాట్రిక్ మలొని గురువారం సాయంకాలం కూరగాయలు తీసుకుని తన భర్తకు వంట వండి వడ్డిద్దామని హడావుడిగా పోతున్నది.

"అది సరైన దారి, పద్ధతి" అనుకున్నదామె. "అన్నీ సక్రమ పద్ధతిలో చేయి. సహజంగా ఉండు. నటించాల్సిన పని పెట్టుకోవద్దు"

అంచేత, ఆమె వంటగదిలోకి వెనక తలుపులోంచి ప్రవేశించేప్పుడు ఏదో కూనిరాగం పాడుకుంటూ చిరునవ్వు నవ్వుతూ ప్రవేశించింది.

"పాట్రిక్! హౌ ఆర్ యూ డార్లింగ్?" అన్నదామె.

తన చేతిలోని పార్సిల్‌ను బల్లమీద పెట్టి, ముందు గదిలోకి వెళ్లింది. అక్కడ అతడు నేల మీద బోర్లా పడి ఉన్నాడు. అతడి కాళ్లు కడుపులోకి ముడుచుకుని ఉన్నాయి. ఒకచేయి శరీరం వెనక మెలిదిరిగి ఉన్నది. నిజంగానే ఆమెకది షాక్.

విభ్రాంతి. వెనకటి ప్రేమ, ఎదురుచూపులూ, నిరీక్షణా అన్నీ ఒక్కసారే సముద్రంలా ఉప్పొంగి అతడి దగ్గరకు పరిగెత్తింది. అతడి పక్కనే మోకాళ్లపై కూలబడి వెక్కివెక్కి ఏడ్చింది, గుండె పగిలేలా! అది సులభమే! ఏ నటనా అక్కర్లేదు. అవసరం పడలేదు.

కొద్ది నిముషాల తర్వాత లేచి ఫోన్ దగ్గరకు వెళ్లింది. ఆమెకు పోలీస్ స్టేషను నంబరు తెలుసు. అవతల వ్యక్తి ఫోన్ తీయగానే ఆమె అరిచింది– "త్వరగా! త్వరగా రావాలి! పాట్రిక్ చచ్చిపోయాడు"

"ఎవరు మాట్లాడేది?"

"మిసెస్ మలొని. మిసెస్ పాట్రిక్ మలొని"

"పాట్రిక్ మలొని చచ్చిపోయాడా? ఎలా?"

"చచ్చిపోయాడు" అన్నదామె ఏడుస్తూ– "నేలమీద పడి ఉన్నాడు. చచ్చిపోయాడనుకుంటాను".

"వెంటనే వస్తున్నాం" అన్నాడతడు.

కారు వెంటనే వచ్చిన చప్పుడైంది. ముందు తలుపు తీసేసరికి ఇద్దరు పోలీసులు లోపలికి వచ్చారు. వాళ్లు ఆమెకు తెలుసు. అక్కడి పోలీసులందరూ ఆమెకు తెలిసినవాళ్లే. ఘొల్లుమని ఏడుస్తూ ఆమె భాక్ నూనాన్ చేతుల్లోకి ఒరిగిపోయింది. అతడు ఆమెను నెమ్మదిగా కూర్చీలో కూర్చోబెట్టి తన సహచరుడి వద్దకు వెళ్లాడు. ఓమాల్లె ఆ మృతదేహం పక్కన మోకాళ్లపై వంగి చూస్తున్నాడు.

"చచ్చిపోయాడా?" అరిచిందామె.

"అవును. చచ్చిపోయాడు. ఏం జరిగింది?"

క్లుప్తంగా ఆమె తన కథ చెప్పింది. తను పచారీ షాపుకు వెళ్లడం, తిరిగి రావడం– ఇదంతా మాట్లాడుతూ, ఏడుస్తూ, మధ్యమధ్యలో మాట్లాడుతూనే. ఈలోగా నూనాన్ చచ్చిపోయిన పాట్రిక్ తల వెనుక రక్తం గడ్డకట్టిన సంగతి గమనించాడు. దాన్ని ఒ'మాల్లెకు చూపించాడు. అతడు వెంటనే ఫోన్ దగ్గరకు వెళ్లాడు.

త్వరగానే, పోలీసు నిపుణులు రావడం మొదలైంది. ముందుగా డాక్టరు, తరువాత ఇద్దరు డిటెక్టివులు, – వాళ్లలో ఒకడిపేరు ఆమెకు తెలుసు. తరువాత పోలీస్ ఫొటొగ్రాఫర్ వచ్చి ఫోటోలు, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్ వచ్చి ఫింగర్‌ప్రింట్లూ అవీ తీసుకున్నారు. శవం పక్కన అనేక రకాల సంభాషణలు మొదలై ముగిసాయి. డిటెక్టివులు ఆమెను అనేక ప్రశ్నలడిగారు. చాలా మర్యాదగా ప్రవర్తించారు. ఆమె తన కథ మరల మొదటి నుంచి చివరకు చెప్పింది.

పాట్రిక్ వచ్చినప్పుడు తానేదో కుడ్తున్నది. అతడు అలసిపోయి ఉన్నాడు. ఓవెన్‌లో తాను ఎలా మాంసఖండం పెట్టిందీ... అదింకా అక్కడే ఉన్నది– ఉడుకుతూ; తరువాత వెనక గుమ్మం గుండా పచారీ షాపుకు వెళ్లడం, తిరిగి వచ్చి చూసేసరికి అతడు కిందపడి ఉన్నాడు.

"ఏ పచారీ షాపు?" ఓ డిటెక్టివ్ అడిగాడు.

ఆమె చెప్పగానే, అతడు తన పక్కవాడితో ఏదో గుసగుసలాడాడు. అతడు వెంటనే వీధిలోకి వెళ్లిపోయాడు.

పదిహేను నిముషాల్లో వెళ్లినవాడు తిరిగి వచ్చాడు. అతడి చేతిలో నోట్సు ఉన్నది. మళ్లీ కాసేపు గుసగుసలు. వెక్కిళ్లు, ఏడ్పులు. మధ్యమధ్యలో వాళ్ల మాటలు వింటున్నది– "మామూలుగానే ఉన్నది... సంతోషంగా కనబడిందట... మంచి సప్పర్ తయారు చేయాలని... బఠాణీలు... ఛీజ్ కేక్... ఇంపాజిబుల్ ఆమె...."

ఫొటోగ్రాఫర్, డాక్టర్, వెళ్లిపోయారు. ఇద్దరు మనుషులు స్ట్రెచర్ తీసుకు వచ్చి దానిపై మృతదేహాన్ని తీసుకుపోయారు. తరువాత ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్ వెళ్లిపోయాడు. మిగిలిందల్లా ఇద్దరు డిటెక్టివ్‌లు, ఇద్దరు పోలీసులు. వాళ్లు ఆమెతో గౌరవంగా మాట్లాడారు. నూనాన్ అడిగాడు– ఎక్కడకన్నా వెళ్లే ఉద్దేశముందా? మీ సోదరి ఇంటికో, లేకుంటే మా ఇంటికి వెళ్లు. నా భార్య నిన్ను జాగ్రత్తగా చూసుకుంటుంది; ఈ రాత్రికి – అన్నాడతడు.

"లేదు!" అన్నదామె. ఇక్కడి నుంచి ఒక్క గజం కూడా కదిలే ఉద్దేశం లేదన్నదామె. ఆమె కళ్ల నుంచి దుఃఖాశ్రువులు రాలి పడ్తూనే ఉన్నాయి. ఆమె ఇక్కడే ఉంటే వారికేమీ అభ్యంతరం లేదు కదా! కాస్త తేరుకున్నాక, స్థిమితపడ్డాక వెళితే ఇబ్బంది ఉండదు కదా! ఇప్పుడు ఇక్కడ నుంచి వెళ్లడం నావల్ల కాదేమో!

"అటువంటప్పుడు కాసేపు పడుకుని విశ్రాంతి తీసుకోకూడదూ?" జాక్ నూనాన్ సలహా యిచ్చాడు.

"నో" అన్నదామె. కాసేపు నన్ను ఈ కుర్చీలోనే కూలబడనివ్వండి. కొద్దిసేపైనాక, మనసు స్థిమిత పడ్డాక లోపలికి వెళ్తాను".

వాళ్లు ఆమె నక్కడే వదిలి తమ విధుల్లో మునిగిపోయారు. ఏమైనా క్లూస్ దొరుకుతాయేమోనని ఇల్లంతా శోధించసాగారు. డిటెక్టివులలో ఒకడు ఆమెను కొన్ని ప్రశ్నలడిగాడు. జాక్‌నూనాన్ అటుగా వెళ్లినప్పుడల్లా ఆమెను పలకరించేవాడు. వాళ్లు అన్నారు– ఆమె భర్తనెవరో తలపై బండ వస్తువుతో మోది చంపారని. ఖచ్చితంగా

భారీ ఇనుప వస్తువు. గదలాంటిది. వాళ్లు దానికోసమే వెదుకుతున్నారు. స్టీలు కడ్డీనో, ఇనుప కలశమో అట్లాంటిది. హంతకులు దానిని తమతోపాటు తీసుకువెళ్లి ఉండవచ్చు. లేదా పారవేసి ఉండవచ్చు దూరంగా, లేదా ఇక్కడే ఎక్కడో దాచి ఉండవచ్చు.

"పాతకథే!" అన్నాడతడు. "ఆయుధం ఎక్కడ ఉన్నదో కనిపెట్టు. హంతకుడు నీకు దొరుకుతాడు"

తరువాత డిటెక్టివులలో ఒకతను వచ్చి ఆమె పక్కన కూర్చున్నాడు. ఇంట్లో ఏదైనా అటువంటి బరువైన లోహపు వస్తువు ఉన్నదా? తను కూడా కాస్త లేచి ఏదైనా అటువంటిది పోయినట్లు గమనిస్తే, కేసు ఓ కొలిక్కి వచ్చినట్లే. పెద్ద స్పానర్ లాంటిది; లేదా లోహపాత్ర.

"మా ఇంట్లో అటువంటివేమీ లేవు" అన్నదామె.

"పెద్ద స్పానర్?" అడిగాడతడు.

"అటువంటిదీ లేదు. గారేజీలో ఉండవచ్చు"

వాళ్లు వెదుకుతూనే ఉన్నారు. సెల్లారు, గారేజి, పైనా కిందా లోపలా అన్నిచోట్లా వెదికారు. ఆమెకు తెలుసు ఇంటి చుట్టూరా పోలీసులున్నారని. బయట గులకరాళ్లలో అడుగుల చప్పుడు, కర్టెన్ల మధ్యలోంచి అప్పుడప్పుడూ కనిపిస్తున్న టార్చ్‌లైట్ కాంతి; అప్పటికే సమయం రాత్రి తొమ్మిది కావస్తున్నది. ఇంట్లోని గదులు శోధిస్తున్నవాళ్లు అలిసిపోయినట్లున్నారు. కొంత ఆశాభంగం కూడా!

జాక్ నూనాన్ అటుగా పోతున్నాడు. ఆమె పిలిచింది.

"జాక్! నాకాస్త డ్రింక్ కలిపి ఇవ్వగలరా, దయచేసి"

"తప్పకుండా! ఏం కావాలి?... విస్కీ?" అన్నాడతడు.

"కొద్దిగా, లైట్‌గా, అది నాకు కాస్త ఊరటనిస్తుందేమో!" అన్నదామె.

అతడామెకు గ్లాసు అందించాడు.

"నీవు కూడా కొంచెం తీసుకో!" అన్నదామె. "బాగా అలిసిపోయినట్లున్నావు. ప్లీజ్. నాకోసం కొంచెం తీసుకో!"

"తీసుకోకూడదు విధి నిర్వహణలో ఉన్నపుడు. సరే నీ మాట మీద కొద్దిగా తీసుకుంటాను" అన్నాడతడు.

ఒకరి తర్వాత ఒకరు వచ్చి ఆమె బలవంతంపై కొద్దిగా విస్కీ తీసుకున్నారు. ఆమె ముందు గ్లాసులతో నిలబడి తాగడం ఇబ్బందిగా ఉన్నది వాళ్లకు. తాగుతూనే ఆమెను ఓదార్చసాగారు, అనువైన మాటలతో సార్జంట్ నూనాన్ వంటగదిలోకి వెళ్లి హడావుడిగా బయటకు వచ్చాడు. "చూడు, మిసెస్ మలోనీ! ఓవెన్ ఇంకా ఆన్ చేసే ఉన్నది. లోపల మాంసం ఉడుకుతున్నట్లున్నది"

"అయ్యో! మరిచిపోయాను" అన్నదామె.

"ఓవెన్ ఆఫ్ చేయనా?" అన్నాడు జాక్.

"థాంక్యూ సోమచ్" అన్నదామె.

సార్జంట్ రెండోసారి రాగానే ఆమె కన్నీళ్లతో నిండిన నయనాలతో పిలిచింది "జాక్ నూనాన్!"

"ఏమిటి" అని అడిగాడతడు.

"నీవు, మీరందరూ నాకో సాయం చేయగలరా?" అందామె దుఃఖిస్తూనే.

"మేం చేయగలిగినంత చేస్తాం, మిసెస్ మలోనీ!" అన్నరు వాళ్లు.

"మీరందరూ అలిసిపోయి ఉన్నారు. మీరు పాట్రిక్ స్నేహితులు కూడా! అతడిని చంపిన వ్యక్తిని పట్టుకోదలుచుకున్నారు. ఇప్పుడు తొమ్మిదిగంటలు దాటింది. మీకు ఆకలిగా ఉండి ఉంటుంది. మీకు ఆతిథ్యం ఇవ్వకపోతే నన్ను పాట్రిక్ క్షమించడు. దేవుడు అతడి ఆత్మకు శాంతి నొసగునుగాక! అతని ఇంట్లో నేను మీకు సరైన ఆతిథ్యమివ్వకపోతే నాకది సబబనిపించదు. ఆ ఓవెన్‌లో ఉన్న గొర్రెపిల్ల కాలి మాంస ఖండాన్ని మీరు తినకూడదా! అదీపాటికి సరిగా తయారై రుచికరంగా ఉండి ఉంటుంది!"

"లేదు లేదు. వద్దువద్దు" అన్నాడు సార్జంట్ నూనాన్.

"ప్లీజ్" అన్నదామె వాళ్లను అభ్యర్థిస్తూ. "దయచేసి ఎంగిలి పడండి. నేనిప్పుడేమీ తినలేని స్థితిలో ఉన్నాను. అతడు లేని ఈ ఇంట్లో నేనేమీ ముట్టలేను. మీరు తీసుకోవచ్చు. మీరు తినడం నాకుపకారం చేసినట్లే. తరువాత యధావిధిగా మీ పనులు మీరు పూర్తి చేసుకోవచ్చు"

వాళ్లు నలుగురూ చాలాసేపు సందేహించారు. అయితే, ఆకలి వాళ్లని ప్రలోభ పెట్టింది. చివరకు వాళ్లు వంటగదిలోకి వెళ్లి పళ్లేల్లో వాళ్లకు కావల్సినంత వడ్డించుకున్నారు. ఆమె తాను కూర్చున్నచోటే కూర్చుని తెరచిన తలుపుల గుండా

వాళ్లు మాట్లాడుకుంటున్నది వినసాగింది. నోటినిండా మాంసంతో వాళ్లు మాట్లాడుకుంటున్న మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.

"ఇంకాస్త తీసుకో, ఛార్లీ?"

"వద్దు, కొంచెం మిగులుద్దాం!"

"ఆమె మొత్తం తినివేయమన్నది కదా. ఆమె చెప్పలేదా అదే తనకు ఉపకారం చేసినట్లని"

"ఓ.కే! ఇంకాస్త వడ్డించు"

"హంతకుడెవడో పెద్ద ఇనుప వస్తువుతో మన పాట్రిక్ తల పగలగొట్టాడు" అన్నాడొకడు వాళ్లలో– "డాక్టర్ ఏమంటాడంటే స్లెడ్జ్ హామర్‌లాంటి బండ సుత్తితో కొడితే పగిలినట్లు పాట్రిక్ కపాలం ముక్కలు చెక్కలయ్యిందట"

"అందుకే అటువంటి హత్యాయుధాన్ని పట్టుకోవడం తేలిక!"

"అదే నేనూ అనేది?"

"ఎవరైనా సరే అంత హత్యాయుధాన్ని వెంబడేసుకుని ఎక్కువ కాలం తిరగలేడు కదా!"

వాళ్లలో ఒకతడు త్రేన్చాడు.

"నా అభిప్రాయం, ఆ హత్యాయుధం ఇక్కడే, ఎక్కడో ఈ చుట్టుపక్కలే ఉన్నది"

"మన ముక్కులకిందే ఉన్నదేమో, ఏమంటావు, జాక్?"

పక్కగదిలో, మేరి మలొని చక్కిలిగిలి పెట్టినట్లు నవ్వుకున్నది.

✧✧✧✧✧

---

## రోయల్డ్ డాల్ (Roald Dahl 1916-1990)

డాల్ తల్లిదండ్రులు నార్వే దేశానికి చెందినవాళ్లు. రోయల్డ్ డాల్ గ్లామోర్గాన్‌లో 1916లో జన్మించాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో రాయల్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసాడు. లిబియాలో తీవ్రంగా గాయపడినాడు. 1942లో వాషింగ్‌టన్‌లో ఎయిర్ ఎటాచిగా నియమితుడైనాక కథలు వ్రాయడం

ప్రారంభించాడు. తరువాత ఇంటెలిజెన్స్ విభాగంలో, వింగ్ కమాండర్‌గా ఉన్నత పదవులనదిష్ఠించాడు. యుద్ధపు అనుభవాలతో నిండిన తొలి పన్నెండు కథల్ని అమెరికన్ మాగజైన్లలో, తరువాత 'Over you' అనే కథా సంపుటిగా ప్రచురించాడు. అతడి కథలు ఎన్నో భాషల్లోకి అనువాదమై బెస్ట్ సెల్లర్స్‌గా పేరు తెచ్చుకున్నవి.

Some one like you, Kiss kiss; 29 kisses from Roald Dahl, Switch bitch, Ah, sweet mystery of life లాంటి పుస్తకాలు, టెలివిజన్ సిరీస్, పెంగ్విన్‌లో వెలువడిన Tales of the unexpected, More tales of the unexpected ఇవన్నీ సంచలనాత్మకాలే. My uncle oswald అనే నవల అత్యంత ప్రసిద్ధికెక్కినది. పిల్లల కథలు, ఘోస్ట్ స్టోరీస్, ఆత్మకథల్లాంటి – Boy, Going slow బహుళ ప్రజాదరణ పొందాయి.

'Roald Dahl - The absolute master of the twist-in-the-tale"

**-Observer**

# 9. కానుక
## (The Gift)

**– రే బ్రాడ్‌బరీ**
**Ray Bradbury**

రేపు క్రిస్టమస్. ముగ్గురూ ఇంటర్ ప్లానెటరీ రాకెట్ పోర్ట్ వేపు వెళ్తుంటే తల్లీదండ్రి వర్రీ అవుతున్నారు. ఆ పిల్లవాడు మొట్టమొదటి సారిగా ఆకాశయానం చేస్తున్నాడు. అందుచేత ప్రతి విషయమూ సక్రమంగా ఉండేట్లు జాగ్రత్త పడ్డారు. అయినా కస్టమ్స్ టేబుల్ దగ్గర వాళ్లు కుమారుడికిచ్చిన క్రిస్టమస్ బహుమతి వాళ్లకిచ్చిన పర్మిటెడ్ లిమిట్ కన్నా కొద్దిగ్రాములు ఎక్కువగా ఉండడంతో అక్కడే వదిలిపెట్టాల్సి వచ్చింది. చక్కగా గిఫ్ట్‌రాప్ చేయబడిన ఆ పెట్టెలో చిన్ని క్రిస్టమస్ చెట్టు, అందంగా అలంకరించబడి, తెల్లని కొవ్వొత్తులతో కూడినది వదిలేసి వెళ్లాల్సి రావడంతో క్రిస్టమస్ వేడుకను, ప్రేమను పోగొట్టుకున్నారనిపించింది వాళ్లకు.

టెర్మినల్ గది దగ్గర వాళ్ల కుమారుడు ఎదురు చూస్తున్నాడు. అంతర్గహయాన సిబ్బందితో గొడవ పడినా ప్రయోజనం లేకపోవడంతో పిల్లవాడికేం చెప్పాలా అని వాళ్లిద్దరూ అతడివేపు వెళ్తూ గుసగుసలాడుకుంటున్నారు.

"ఏం చేద్దాం?"

"ఏం చేయగలం? మన చేతిలో ఏముంది?"

"చెత్త రూల్సు. పనికిరాని నిబంధనలు"

"వాడికెంతో ఇష్టమైన బహుమతి"

సైరన్ శబ్దం చెవులు చిల్లులు పడేలా మోగింది. అందరూ త్వరత్వరగా 'మార్స్ రాకెట్' వేపు వెళ్తున్నారు. అందరికన్నా వెనకగా తల్లీ, తండ్రీ, వారిమధ్యలో పాలిపోయిన మొహంతో నిశ్శబ్దంగా, పిల్లవాడు.

"నేను ఏదో ఒకటి చేస్తాను" అన్నాడు తండ్రి.

"ఏమిటి...?" అడిగాడు పిల్లవాడు.

రాకెట్ గగనంలోకి దూసుకుపోయింది. వాళ్లు డార్క్ స్పేస్‌లోకి వేగంగా వెళ్లిపోయారు. అగ్నిజ్వాలల్ని, పొగల్ని విరజిమ్ముతూ రాకెట్ అతివేగంగా పోతున్న ఆరోజు భూమిపై డిసెంబర్ 24, 2052. వాళ్లు వెళ్తున్న ప్రదేశంలో కాలం తెలీదు, నెల, సంవత్సరం, గంటలు, గణనం లేదు. న్యూయార్క్ కాలమాన ప్రకారం ఉన్న

తన గడియారం వేపు చూస్తూ, అప్పుడే నిద్రలేచిన ఆ బాలుడు "నేను పోర్ట్‌హోల్ దగ్గరకు వెళ్లి చూడవచ్చునా" అని అడిగాడు.

పక్క గదిలో ఓ కిటికీలాంటిది, మందమైన గాజుతో చేసింది ఉన్నది.

"ఇప్పుడే కాదు" తండ్రి బదులిచ్చాడు. "నేను నిన్ను కాసేపాగినాక తీసుకువెళ్తాను"

"ఇప్పుడు మనమెక్కడ ఉన్నాం, ఎటుపోతున్నామో చూడాలనుకుంటున్నాను" అన్నాడు ఆ పిల్లవాడు.

"సరేలే! కాసేపు నిన్ను ఆగమనడానికి ప్రత్యేక కారణముంది" అన్నాడు తండ్రి.

మెలకువగానే ఉన్న బాలుడు అటూ ఇటూ కదులుతూ వాళ్లు అక్కడ వదిలేసి వచ్చిన బహుమతి క్రిస్టమస్ గిఫ్ట్ గురించి, క్రిస్టమస్ సీజన్ గురించి, క్రిస్టమస్ చెట్టు గురించి, దానికి అలంకరించిన తెల్లటి కొవ్వొత్తుల గురించి ఆలోచిస్తున్నాడు. అయిదు నిముషాలైనా కాలేదు లేచి కూర్చుని, తనకో ప్లాను తట్టిందని విశ్వసించాడు. అది గనక నెరవేరితే ఈ ప్రయాణం ఆనందంగా సాగినట్టే.

"ఇంకో గంటన్నరలో క్రిస్టమస్" అన్నాడు తండ్రి.

"ఓహ్!" అన్నది ఆ పిల్లవాడి తల్లి. ఎందుకు ఈ సమయంలో ఆ విషయాన్ని లేవనెత్తాడా అని. పిల్లవాడు మరచిపోతాడని ఆశతో ఉన్నదామె.

ఆ బాలుడి మొహం ఎర్రగా కందగడ్డలా మారింది. పెదాలు కంపిస్తున్నాయి. "నాకు తెలుసు. నాకు తెలుసు, మరి నా క్రిస్టమస్ బహుమతి! క్రిస్టమస్ ట్రీ! క్రిస్టమస్ ట్రీ! నీవు ఇస్తానన్నావుగా..."

"తప్పకుండా! ఇంకా మంచిది" నమ్మబలికాడు తండ్రి.

"ఎలా..." సందేహాస్పదపు దృక్కులతో ఆమె–

"నన్ను నమ్మండి" అన్నాడతడు. "నా మాటమీద నమ్మకం ఉంచండి. నేనిప్పుడే వస్తాను"

అతడు వాళ్లను వదిలి వెళ్లి ఇరవై నిముషాలైనాక అతడు వచ్చి అన్నాడు చిరునవ్వుతో "సమయం దగ్గర పడింది"

"వాచీ ఇవ్వవా!" తండ్రినడిగి వాచీ తీసుకుని మౌనంగా ఆ పిల్లవాడు గడియారపు ముళ్ల కదలికల్ని చూస్తూ ఆ గంట సమయాన్ని ఓ యుగంలా గడిపాడు.

"అదుగో! క్రిస్టమస్ టైం వచ్చేసింది... క్రిస్టమస్! ఏది నా క్రిస్టమస్ ప్రజెంట్!"

"నాతో రా!" అని పిల్లవాడి చేయి పట్టుకుని వాళ్లు, వాళ్లున్న గది దాటి, రాంప్ మీదుగా హాల్లోకి వచ్చి కిటికీ ఉన్న డెక్ వేపు వెళ్లారు.

"నాకేం అర్థం కావడం లేదు" అంటూనే ఉన్నదామె.

"తెలుస్తుంది. ఓపిక పట్టు మరి" అన్నాడు అతడు.

ఎదురుగా ఉన్న పెద్ద గది దగ్గరకు రాగానే తలుపు మీద మూడుసార్లు, తరువాత రెండు సార్లు ఓ 'కోడ్'లా తట్టినాడు. తలుపు తెరచుకున్నది. లోనున్న లైట్ ఆఫ్ అయ్యింది. చీకటిలో ఎవరివో గొంతులు.

"లోపలికి పద!" అన్నాడు ఆ పిల్లవాడి తండ్రి.

"చీకటి. ఏం కనిపించడం లేదు" అన్నదామె.

"అమ్మా! నేను నీ చేయి పట్టుకుంటాను" అన్నాడు పిల్లవాడు. వాళ్లు ముగ్గురూ గదిలోకి అడుగుపెట్టగానే తలుపు మూసుకున్నది. గదిలో కటిక చీకటి. వాళ్ల ముందు కిటికీలా ఉన్నపెద్ద గాజు కన్ను తెరచుకున్నది. నాలుగు అడుగుల ఎత్తు ఆరడుగుల వెడల్పు ఉన్న పెద్ద కిటికీ. దాంట్లోంచి బయట స్పేస్‌లోకి చూడవచ్చు.

ఆ పిల్లవాడు ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టాడు.

అతడి వెనుక ఉన్న తల్లిదండ్రుల పరిస్థితీ అంతే!

ఆ చీకటి గదిలో ఉన్న వాళ్లు గానం చేస్తున్నారు.

"మెర్రీ క్రిస్టమస్! చిన్నా" అన్నాడు తండ్రి.

గదిలో ఉన్నవారు పాత క్రిస్టమస్ గీతాలను ఆలపించసాగారు. ఆ బాలుడు తన మొహాన్ని ఆ గాజు అద్దానికి దగ్గరగా తెచ్చి గట్టిగా అదుముకుంటూ బయటకు చూస్తున్నాడు. అలానే చూస్తూ చూస్తూ ఆ విశాల విశ్వంలోకి, ఆ చీకటి రాత్రిలో జ్వలిస్తూ, మెరుస్తూ ఉన్న పది బిలియన్ బిలియన్ల తెల్లటి, అందమైన కొవ్వొత్తి వెలుగులను చూస్తూ చూస్తూనే ఉన్నాడు...

✧✧✧✧✧

---

## రే బ్రాడ్‌బరీ (Ray Bradbury 1920- )

ఆగష్టు 22, 1920లో వాకెగాన్, ఇల్లినాయిస్‌లో జన్మించినాడు రే బ్రాడ్‌బరి. తను పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు తాను చదివిన పుస్తకాలు, చూసిన దృశ్యాలు, సంఘటనలు, అన్నీ జ్ఞాపకాలుగా సవివరంగా గుర్తున్నాయంటాడు. యాభై ఏళ్లుగా

నిర్విరామంగా వ్రాస్తున్న తనకు అవే ఇన్‌స్పిరేషన్‌గా పేర్కొనే బ్రాడ్‌బరీ తనను తాను విశిష్ట కథకుడిగా, మాజిక్ రియలిస్ట్‌గా పేర్కొన్నాడు.

అతడి రచనల నిండా చిన్నప్పటి జ్ఞాపకాలు, ఊహలు, అద్భుతాలు, పీడకలలు, భ్రాంతులు – వీనస్ లాంటి అతిలోక సుందరీమణుల చిత్రాలు, టైమ్ ట్రావెల్, గ్రహాంతర ప్రయాణాలు, వయసు పెరగని పిల్లలు, ఆగని వర్షాలు – ఇవన్నీ కలిసి అద్భుత వర్ణచిత్రాల్లా చదువరులను అలరిస్తాయి.

అతడి కథలు నవీన శాస్త్రంపై ఉన్న మూఢనమ్మకాల్ని విశద పరుస్తూ హెచ్చరిక చేస్తుంటాయి. చదువరుల ఊహాలకందకుండా కథనాన్ని నడపడంలో బ్రాడ్‌బరీది అందెవేసిన చేయి.

"The Young boy in me believed in immortality, Previous births and I have let him have his head. He has written my stories and books for me"

# 10. బహుమతి
## (The Gift)

**- లీ-యంగ్-లీ**

నా అరచేతిలో గుచ్చుకున్న ఇనుపరేకును తీస్తూ
నాన్న లోగొంతులో నాకోకథ చెప్పాడు, నొప్పి తెలియకూడదని-
నేను ఆయన ప్రశాంత వదనాన్ని చూస్తూ, కత్తిని గమనించలేదు.
కథ పూర్తి అయ్యేలోపునే ఇనుప ముక్కను తీసాడు-
నెప్పితో చచ్చిపోతాననుకున్న నేను మరలా బతికిన భావన.

ఆ కథ నాకిప్పుడు గుర్తులేదు.
కాని, ఆయన గొంతు ఇంకా వినిపిస్తూనే ఉన్నది.
నిశ్చలమైన నీరున్న బావి, ఒక ప్రార్థన,
ఆ మృదువైన చేతులు నాకింకా గుర్తే
రెండింతల సున్నితత్వపు ప్రేమ
నా ముఖాన్ని స్పృశించాయి ఆప్యాయంగా-
క్రమశిక్షణ అనే అగ్నిజ్వాలల్ని
నా శిరస్సుపైన నిలిపాడు ఆయన.

నీవు ఆ మధ్యాహ్నం వచ్చి ఉండుంటే
నీవు ఒక మనిషి ఒక బాలుడి చేతిలో
ఏదో నాటుతున్నాడని అనుకుని ఉండేవాడివి,
ఓ వెండి అశ్రువు, ఓ చిన్ని జ్వాల అక్కడ చూసేవాడివి.
నీవా బాలుడిని అనుసరించి ఉంటే
నీవిక్కడికి వచ్చి ఉండేవాడివి,
నా భార్య కుడి హస్తాన్ని నేను అందుకుంటున్న ఈ చోటుకు.

నేను ఆమె బొటనవేలు గోరునెలా కత్తిరిస్తున్నానో చూడు!
లోనికి గుచ్చుకున్న ముల్లునెలా తీస్తున్నానో గమనించు!
నా తండ్రి నా చేతిలో గుచ్చుకున్న ఇనుప శలాకను
తీస్తున్నపుడు నాకు ఏడేళ్ల వయసు.

ఆ ముక్కను నా రెండు వేళ్ల మధ్య పట్టుకుని
నేనేమీ ఆలోచించలేదు
అది నన్ను పాతిపెడ్తుందని, చంపబోయిందని తిట్టలేదు.
దానికి చిన్ని హంతకుడని పేరు పెట్టలేదు.
లోహం నా హృదయంలోకి చొచ్చుకుపోయినట్లు
నా గాయాన్ని పైకెత్తి బిగ్గరగా ఏడ్వలేదు-
'మృత్యువు! నా చావు దగ్గరకు వస్తోంది!' అని అరవలేదు.
నేను చిన్నపిల్లవాడిలానే చేసాను.
అతడు నాకిచ్చిన ఆ ఇనుప ముక్కను దాచుకుంటూ-
నేను నా తండ్రిని ప్రేమగా ముద్దాడాను.

✧✧✧✧✧

---

## లి-యంగ్‌లీ (Li Young Lee (1957-)

లి-యంగ్‌లీ జకార్తాలో జన్మించాడు. అతడి ముత్తాత రిపబ్లిక్ ఆఫ్ చైనాకు తొలి అధ్యక్షుడు. తండ్రి విప్లవనేత మావో సె టుంగ్‌కు వ్యక్తిగత వైద్యుడు. ఈ కవిత అతడి గురించే వ్రాయబడినది. చైనాలో విప్లవం ఉధృతంగా ఉన్నపుడు ఆ కుటుంబం ఇండోనేషియాలో తలదాచుకోవలసి వచ్చింది. అక్కడే లి-యంగ్-లీ జన్మించాడు. నియంత సుకర్నో అతడి తండ్రిని జైలుపాలు చేసాడు. పంధొమ్మిది నెలల తరువాత హాంకాంగ్‌కు అక్కడ నుంచి లి-యాంగ్-లీకు ఆరేళ్ల వయసున్నపుడు న్యూయార్క్‌కు చేరుకున్నాడు.

లి-యంగ్-లీ తమ కుటుంబ చరిత్రను The Wings of Seed : A Remembrance (1995) అనే గ్రంథంగా వెలువరించాడు. Rose, The city in which I love you అవార్డు పొందిన కవితా సంకలనాలు. లీ ప్రస్తుతం చికాగోలో నివసిస్తున్నాడు.

"I Know I am not a poet. But I want to be one and I know only of one path. Serious and Passionate apprenticeship, which involves a strange combination of awe and argument with the masters"

# 11. జ్ఞానులు తెచ్చిన బహుమతి
## (The Gift of the Magi)

– ఓ హెన్రీ

***(ముగ్గురు జ్ఞానులు ఆకాశంలో వెలుగుతున్న ధృవతారను చూసి దాని కాంతిననుసరిస్తూ పశువుల చావడిలో ఉన్న పసివాడు జీసస్ వద్దకు వచ్చి స్వర్ణం, గుగ్గిలం, సుగంధ ద్రవ్యాలు కానుకలుగా సమర్పించారు. అవే తొలి క్రిస్టమస్ కానుకలు)***

ఒక డాలర్ ఎనభై ఏడు సెంట్లు. అంతే! వాటిలో అరవై సెంట్లు పెన్నీల రూపంలో ఉన్నాయి. పచారీ షాపువాడినీ, కూరగాయల వాడినీ సతాయించి సతాయించి, వాళ్లను పిసినార్లుగా లెక్కకట్టబోతే తట్టుకోలేక, ఏమీ అనలేక ఉగ్గబట్టుకున్న కోపంతో వాళ్ల బుగ్గలెరుపెక్కేలా చేసి పెన్నీ పెన్నీ కూడబెట్టిన పైకమది. డెల్లా మూడుసార్లు లెక్కబెట్టింది. మరుసటిరోజు క్రిస్టమస్.

ఏం చేయగలదు పాపం! పాత రంగు వెలిసిన సోఫాలో కూలబడి ముక్కడం, మూలగడం కన్నా. డెల్లా అదేపని చేసింది. జీవితమంటే అంతేగదా, ఏడ్పులూ, ఎగబీల్చడాలూ, చిరునవ్వులూ– ఎగబీల్చడం ఎక్కువైంది.

ఆమె ఏడ్పు తగ్గి ఎగబీల్చడంలో ఉంది. ఆమె ఉన్న ఇల్లు ఎలా ఉందంటే వారానికి ఎనిమిది డాలర్ల అద్దెకు ఎటువంటి ఇల్లు దొరుకుతుందో అట్లాగే ఉంది. మరీ బిచ్చగాళ్ల కొంప కాదుగానీ, అంతకంటే గొప్పగా ఏమీలేదు.

ముఖద్వారం దగ్గర ఉత్తరాల పెట్టె ఉందిగానీ, దాంట్లోకి ఏ ఉత్తరం వేయలేము. కరెంటు స్విచ్ కాలింగ్ బెల్ కోసం వుందిగానీ, అది ఏనాడూ మోగిన పాపానపోలేదు. అక్కడో విజిటింగ్ కార్డు లాంటిది ఉంది. దానిపై 'మిస్టర్ జేమ్స్ డిల్లింఘామ్ యంగ్' అని వ్రాసి ఉంది.

వారానికి ముప్ఫై డాలర్లు సంపాదిస్తున్న రోజుల్లో డిల్లింఘామ్ కాస్త సౌఖ్యంగా బతికిన మాట వాస్తవం. ఇప్పుడు రాబడి వారానికి ఇరవై డాలర్లకు తగ్గింది, డిల్లింఘామ్ అనబడ్డ అక్షరాలు వన్నెతగ్గాయి. చివరి అక్షరాలు క్రమేపీ రంగుమాసి ఒక 'D' అక్షరం మాత్రం మిగిలేట్టుంది. ఎప్పుడు మిస్టర్ జేమ్స్ డిల్లింఘామ్ ఇంటికి వచ్చినా అతడిని ఎంతో ప్రేమగా 'జిమ్' అని పిలుస్తూ, ఆప్యాయంగా గుండెలకు హత్తుకునే మిసెస్ జేమ్స్ డిల్లింఘామ్ యంగ్ ఉన్నది, ఆమెపేరు 'డెల్లా' అని మనకు తెలుసు. అంతా మంచిగా సవ్యంగానే ఉందా యింట్లో.

డెల్లా ఏడుపు ఆపింది. కందిన బుగ్గలపై కాసింత పౌడర్ రాసుకుంది. కిటికీ పక్కనే నిలబడి బూడిదరంగు ఆవరణలోని, బూడిదరంగు కంచెపై నడుస్తున్న బూడిదరంగు పిల్లి వంక నిరాసక్తంగా చూసింది. రేపు క్రిస్టమస్. ఆమె దగ్గర ఒక డాలర్ ఎనభై ఏడు సెంట్లు మాత్రమే ఉన్నాయి. ఆ పైకం కూడబెట్టడానికి నెలల పర్యంతం పెన్నీ, పెన్నీ దాస్తే ఆ మాత్రం పోగడింది. వారానికి ఇరవై డాలర్లతో ఏం మిగల్చగలం? తను అనుకున్నదానికంటే ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఎప్పుడూ అంతే! ఆ డాలరు ఎనభై ఏడు సెంట్లతో 'జిమ్'కు ఏ బహుమతి కొనగలదు తను? సంతోషంగా ఉన్న ప్రతి నిముషమూ ఆమె అతడికేమైనా మంచి బహుమతి కొని ఇవ్వాలనే ప్లాన్ చేస్తున్నది. ఒక మంచి వస్తువు ఉపయోగపడేది, మన్నికైనది, అరుదైనది – జిమ్ లాంటి మంచివ్యక్తి వద్ద ఎప్పుడూ ఉండతగినది.

రెండు కిటికీల మధ్య నిలువుటద్దం ఉన్నది ఆ గదిలో. వారానికి ఎనిమిది డాలర్ల అద్దెకు దొరికే ఫ్లాట్లు కొన్నిటిలో ఇవి ఉండడం నీవు గమనించే ఉంటావు. బాగా సన్నటి, చురుకైన మనిషి తన ప్రతిబింబాన్ని నిలువు చారల్లో గమనిస్తూ ఖచ్చితంగా తనే అని నిర్ధారణ చేసుకోవచ్చు. డెల్లా సన్నగా ఉంటుంది కనుక ఆమెకు ఆ అద్దంలో తనని తాను సరిగా ఎలా చూసుకోవాలో తెలుసు.

కిటికీ దగ్గర నుంచి 'డెల్లా' సుడిగాలిలా వచ్చి అద్దం ముందు నిలబడింది. ఆమె కళ్లు కాంతివంతంగా మెరిసినా ఇరవై సెకండ్లలో ఆమె ముఖం వెలుగును కోల్పోయింది. వేగంగా ఆమె తన శిరోజాలను జాలువారేలా పడనిచ్చి వాటి పొడుగును అంచనా వేసింది.

జేమ్స్ డిల్లింఘామ్ యంగ్ దంపతుల దగ్గర ఉన్న రెండు వస్తువుల గురించి వారు గర్వపడతారు. ఒకటి– జిమ్ దగ్గర ఉన్న తాత తండ్రులనాటి బంగారు గడియారం. రెండోది– డెల్లా శిరోజాలు.

ఒకవేళ షేబారాణి వీళ్ల అపార్ట్‌మెంట్ పక్కదాంట్లో ఉండి ఉంటే; కిటికీలోంచి డెల్లా గనక తన శిరోజాల్ని బయట గాలిలో ఆరబెడ్తుంటే చూసేవాళ్లకి షేబారాణి ఆభరణాలు, నవరత్న ఖచిత నగలు డెల్లా శిరోజాల ముందు బలాదూర్ అనిపిస్తాయి. ఒకవేళ సొలొమాన్ ప్రభువు గనుక ద్వారపాలకుడై, అతడి స్వర్ణనిధులన్నీ భూగర్భ గృహంలో గుట్టలుగా పడి ఉన్నా 'జిమ్' అటుగా వస్తూపోతున్నపుడల్లా తన బంగారు గడియారాన్ని చూపించి, అతగాడు అసూయతో తన గడ్డాన్ని బరుక్కునేట్లు చేసేవాడు.

ఇప్పుడేమో, డెల్లా అందమైన శిరోజాలు గోధుమరంగు నీటి అలల్లా మెరుస్తూ ప్రవహిస్తున్న భ్రాంతిని కలుగజేస్తున్నాయి. అవి ఆమె మోకాళ్లను దాటి

గాలికి వయ్యారంగా కదులుత్తూ సుందరమైన వస్త్రమేదో ఆమె సన్నటి శరీరాన్ని నాజూకుగా కప్పినట్లు కనిపిస్తున్నాయి. ఆమె తన జుట్టును ముడిలా పైకిలేపి మరలా క్రిందకు వదిలేసింది. ఎంత పొడుగైన శిరోజాలు! ఎంత అందమైనవి! ఒక్క నిముషం ఆగిన ఆమె కంటినుంచి ఒకటో రెండో కన్నీటి బొట్లు జారి క్రింద ఉన్న పాత ఎర్రటి తివాచీపై పడి మెరిసాయి.

వెంటనే ఆమె బ్రౌన్ జాకెట్ తొడుక్కుంది. బ్రౌన్ హాట్ తలపై పెట్టుకున్నది. వేగంగా సుడిగాలిలా తిరిగి, కనులలో అద్భుతమైన మెరుపు ఇంకా మెరుస్తుండగానే, తలుపు తెరచుకుని, మెట్లు దిగి వీధిలోకి వెళ్లింది.

ఆమె ఆగిన చోట బోర్డుపై ఇలా వ్రాసి ఉన్నది– "మేడమ్ సొఫ్రొని, అన్ని రకాల శిరోజాలంకార వస్తువులు" ఒక్క ఉదుటున పైకి వెళ్లి, భారంగా ఊపిరి పీలుస్తూ నిలబడింది. భారీగా, తెల్లగా, శీతల దృక్కులతో మేడమ్ సొఫ్రొని ఎదురుగా ఉన్నది.

"నా శిరోజాలను కొంటారా?" అడిగింది డెల్లా.

"నా వ్యాపారం అదే కదా! నీ హాట్ తీసి చూపించు. అంచనా వేస్తాను" అన్నది మేడమ్ సొఫ్రొని.

గోధుమ వన్నెల జలపాతం మెరుస్తూ ఉరికింది. "ఇరవై డాలర్లు" – అన్నది మేడమ్ సొఫ్రొని, జలపాతాన్ని తన అరచేతుల్తో అంచనా వేస్తూ.

"త్వరగా ఇవ్వు" అన్నది డెల్లా.

తర్వాత రెండు గంటలు గులాబి రెక్కలపై నడచిపోయాయి. బాగుందా పోలిక? జిమ్ బహుమతి కోసం ఆమె షాపులన్నీ గాలిస్తోంది.

ఆమె అనుకున్నది దొరికింది ఎంతో ప్రయాస పడగా, పడగా! అది 'జిమ్'కు మాత్రమే తగినది. ఇంకెవ్వరికీ తగనిదీనూ. అటువంటిది ఇంకే షాపులోనూ లేదు. అన్ని షాపుల్నీ కూలంకషంగా వెదికింది కదా! అది ప్లాటినం ఛెయిన్. చిన్నది, చాలా అందంగా, ప్రత్యేకంగా ఉన్న డిజైన్. ఏదో ఆషామాషీ ఛెయిన్‌లా కాక, డబ్బుకు తగిన విలువ ఉన్నదిలా అనిపిస్తున్నది. మంచి వస్తువులన్నీ అలానే ఉంటాయి కదా! అంత విలువైన గడియారానికి సరిజోడు ఈ ఛెయిన్. అసలు దాన్ని చూడగానే డెల్లా అనుకున్నది అది 'జిమ్' కోసమే తయారు చేయబడిందని. అది అతడిలానే – ప్రశాంతత, విలువ – ఈ మాట ఇద్దరికీ చెందుతుంది. ఇరవై ఒక్క డాలర్లు తీసుకున్నారు వాళ్లు. ఎనభై ఏడు సెంట్లతో ఆమె ఇంటికి చేరుకున్నది. జిమ్ ఎప్పుడు

టైం చూసుకోవాలన్నా ఉండే ఇబ్బంది దీనితో తీరుతుంది. ఇప్పుడు ఆ గడియారాని ఉన్న తోలుపట్టీ తీసి ఈ ఛెయిన్ తగిలిస్తే ఆ బంగారు గడియారానికి మరింత శోభ రాదూ!

డెల్లా ఇంటికి వచ్చేసరికి, ఉద్రేకంలోని నిషా తగ్గిపోయి పొదుపు, తర్కం ఇలాంటివి కొంచెం కొంచెం పొడచూపసాగినాయి. శిరోజాలకు ఇనుప రింగుల్ని తగిలించి, గాస్ వెలిగించి, ప్రేమకోసం జరిగిన నష్టాన్ని సరిదిద్దడానికి ప్రయత్నం చేయసాగింది. అదెప్పుడూ బృహత్ప్రయత్నమే, మిత్రుడా, చాలా పెద్ద పని.

నలభై నిముషాల్లో ఆమెకు మిగిలిన నిడుపాటి జుట్టు కాస్త వంకీలు వంకీలుగా మారి, ఆమె ఇప్పుడు అచ్చం స్కూలు పిల్లాడిలా అద్భుతంగా, వింతగా కనిపించింది. అద్దం ముందు నిలబడి తానెలా ఉన్నది విమర్శనాత్మకంగా, జాగ్రత్తగా అంచనా వేసుకున్నది.

"జిమ్ నన్ను చంపేస్తాడేమో" అనుకున్నదామె. ఇంకోసారి నావేపు చూసి "కోనీ ద్వీపపు కోరస్ గరల్" అని తిట్టి తరవాత చంపేస్తాడు. నేను మాత్రం ఏం చేయగలను. నా దగ్గరున్న ఒక డాలర్ ఎనభై ఏడు సెంట్లతో–

ఏడు గంటలకల్లా కాఫీ కాచి, చోప్స్ వండడానికి స్టవ్ మీద ఫ్రైయింగ్ పాన్‌ను వేడి చేయసాగింది.

జిమ్ ఆలస్యంగా రాడేనాడూ! డెల్లా తన అరచేతిలో ఆ ప్లాటినం ఛెయిన్‌ను రెండు వరుసలుగా ఉంచుకుని, బల్లకు ఒక మూలలో, తలుపుకు దగ్గర కూర్చున్నది. అతడి అడుగుల చప్పుడు వినగానే ఒక్కక్షణం ఎందుకో ఆమె వదనం పాలిపోయింది. ప్రతి చిన్న విషయానికీ మౌనంగా ప్రార్థించే ఆమె పెదవులు నిశ్శబ్దంగా కదిలాయి. "దేవుడా! నేనింకా అందంగానే ఉన్నానని అతడు అనుకొనేట్లు చేయి తండ్రీ!"

తలుపు తెరచుకుని జిమ్ లోపలికి వచ్చి తలుపు మూసాడు. ఎందుకో అతడు నీరసంగా, ఉద్విగ్నంగా ఉన్నట్లు కనిపించాడు. పాపం, ఇరవై రెండేళ్లకే సంసార భారం. కొత్త ఓవర్ కోటు కావాలతడికి అత్యవసరంగా, చేతులకు గ్లవుస్ కూడా లేవు.

పక్షి జాడ తెలిసిన వేటగాడిలా జిమ్ నిశ్శబ్దంగా శిలలా నిలబడినాడు. అతడి కళ్లు 'డెల్లా' పై వాలి నిశ్చలమైనాయి. ఆ చూపుల్లో ఏముందో ఆమె చెప్పలేకపోయింది. అందుకనే ఆమె భయపడింది. అది కోపమా– ఆశ్చర్యమా, అనంగీకారమా, ఆందోళనా – ఇవేమీ కావు. సెంటిమెంటూ కాదు. ఆమె

భయపడినదేదీ కాదు. ఆమె వేపు అలానే చూస్తున్న అతడి ముఖంలో ఇదమిత్థంకాని భావమేదో నిండి ఉన్నది.

తన కుర్చీలోంచీ బయటపడి డెల్లా అతడిని సమీపించింది.

“జిమ్, డార్లింగ్” ఆమె ఏడుస్తూ అరచింది– “నా వేపు అలా చూడకు. నా జుట్టు కత్తిరించి అమ్మాను. ఎందుకంటే నీకు క్రిస్టమస్ బహుమతి ఇవ్వకుండా నేను బతకలేననిపించింది. జుట్టుదేముంది మరల త్వరగానే పెరుగుతుంది. నీవేమీ అనుకోవు కదా! వేరే మార్గం లేకపోయింది. అందుకే అలా చేసాను. నా జుట్టు చాలా వేగంగా పెరుగుతుంది, జిమ్! మెర్రీ క్రిస్టమస్ అను! మనం హాయిగా ఉందాం! నీకు తెలియదు నీకోసం ఎంత చక్కని, అందమైన కానుక తెచ్చానో!”

“నీ జుట్టు కత్తిరించావా” అన్నాడు జిమ్ చాలా కష్టం మీద అక్షరాలు కూడబలుక్కుని, ఎంత ఆలోచించినా కారణం అర్థం కానివాడిలా.

“కత్తిరించి అమ్మేసాను. జుట్టు లేకపోయినా నేను నీదానినేగా! నేను నేనేగా, కాదా?” అన్నదామె.

జిమ్ ఎందుకో గది అంతా కలయజూసాడు.

“నీ జుట్టు పోయిందంటావు” అన్నాడతడు కాస్త మూర్ఖంగా

“దానికోసం వెదకనక్కర్లేదు” అన్నది డెల్లా. “ఆ జుట్టును అమ్మేసాను. ఇది క్రిస్టమస్ సమయం కదా! నాతో మంచిగా ఉండు జిమ్! అది నీకోసమే ఖర్చుపెట్టాను. బహుశా నా తలపై వెంట్రుకలు లెక్క వేయబడ్డాయేమో!– కాని నీపై నాకున్న ప్రేమను ఎవరూ లెక్క కట్టలేరు. చోప్స్ వండనా ఈ పూటకు, జిమ్” అన్నదామె మధురంగా, ప్రేమగా!

తానున్న ధ్యానస్థితి నుంచి జిమ్ త్వరగానే బయటపడ్డాడు. డెల్లాను తన కౌగిలిలోకి తీసుకున్నాడు. పది సెకన్లపాటు మనం ఇంకో విషయాన్ని తరచి చూద్దాం. వారానికి ఎనిమిది డాలర్లు కావచ్చు లేదా మిలియన్ డాలర్లు కావచ్చు – ఏమిటి పెద్ద తేడా? గణిత శాస్త్రజ్ఞుడూ, హాస్యగాడూ ఇద్దరూ తప్పు చెప్పవచ్చు. ‘మాగి’ విలువైన బహుమతులను తెచ్చి ఉండవచ్చు. కాని అవి అక్కడ లేవు కదా! దీని గురించి తర్వాత చర్చిద్దాం.

జిమ్ తన ఓవర్ కోటులోంచి ఓ పాకెట్ తీసి టేబుల్ మీదకు విసిరాడు.

“తప్పుగా అనుకోకు, డెల్” అన్నాడతడు. “నా గురించి జుట్టు కత్తిరించుకోడమో, షాంపూ కొనడమో, ఇంకొకటో, ఇంకొకటో నా డెల్‌ను తక్కువ

చేయదు. నీవు గనక ఆ పాకేజీ విప్పావనుకో నీకర్థమవుతుంది ఇందాకట్నుంచీ నేనెందుకిలా ఉన్నానో" అన్నాడతడు.

"తెల్లటి మృదువైన వేళ్లు నెమ్మదిగా ఆ పాకెట్‌ను విప్పాయి. అంతులేని ఆనందంతో వెలువడిన కేక, మరుక్షణం, పాపం, స్త్రీ సహజమైన వెక్కిళ్లు, కన్నీళ్లుగా మారి, ఆ ఫ్లాట్ యజమాని ఆమెను ఓదార్చడానికి విశ్వప్రయత్నం చేయాల్సి వచ్చింది.

ఎందుకంటే ఆ పాకెట్‌లో దువ్వెనలున్నాయి. రకరకాల దువ్వెనలు - దువ్వెనల సెట్టు - బ్రాడ్‌వే కిటికీలో చూసి డెల్లా ముచ్చటపడింది. పూజలు చేసింది. అందమైన దువ్వెనలు, తాబేలు చిప్పతో చేసినవి, వజ్రాల అంచులున్నవి. పోయిన గోధుమ వన్నె శిరోజాలతో చక్కగా కలిసిపోయేవి. అవి చాలా ఖరీదైనవని ఆమెకు తెలుసు, ఆమె హృదయం వాటికై ఇన్నాళ్లూ ఎలా తపించిందో, కొనలేని తమ పరిస్థితులకు ఎలా కృంగి మిన్నకున్నదో ఆమెకు తెలుసు. ఇప్పుడు ఆ దువ్వెనలు ఆమె స్వంతం. కాని అవి అలంకరింపబడాల్సిన శిరోజాలు మాత్రం లేవు.

ఆమె అతడిని తన హృదయానికి హత్తుకున్నది. అతడి కళ్లలోకి చూస్తూ, చెమ్మగిల్లిన కళ్లతో, చిరునవ్వుతో అంటూనే ఉన్నది- "నా జుట్టు చాలా వేగంగా పెరుగుతుంది, జిమ్"...

జిమ్ ఇంకా తను తెచ్చిన క్రిస్టమస్ బహుమతి చూడనేలేదు. నెమ్మదిగా తన అరచేతిని తెరిచి చూపించిందామె. ఆ నల్లని లోహపు ఛెయిన్ ఆమె ప్రకాశవంతమైన, శక్తివంతమైన ఆత్మలా మెరవసాగింది.

"ఎంత బాగుందో చూసావా, జిమ్! బ్రహ్మాండంగా ఉంది కదూ! రోజుకు వందసార్లు వాచీని చూడవచ్చు, దీనిని తగిలించి. ఏదీ నీ గడియారం? దానికి ఈ ఛెయిన్ ఎలా నప్పుతుందో చూద్దాం!"

గడియారం ఇవ్వడానికి బదులు అతడు ఆ ఇరుకు సోఫాలో కూలబడి చేతులు తలవెనక పెట్టుకుని చిరునవ్వు నవ్వాడు.

"డెల్" అన్నాడతడు- "మనమిప్పుడు మన క్రిస్టమస్ బహుమతులను కాస్త పక్కన ఉంచుదాం. వాటిని ప్రస్తుతం వాడుకోలేం. నేను నా గడియారాన్ని అమ్మి నీకు దువ్వెనల్ని తెచ్చాను. పద. పోయి చోప్స్ వండు. భోంచేద్దాం!"

"మాగీ" మీకు తెలుసుకదా - ముగ్గురు జ్ఞానులు. అద్భుతమైన వ్యక్తులు. పశువుల చావడిలో ఉన్న శిశువుకు బహుమతులు తెచ్చినవారు. వాళ్లే క్రిస్టమస్ బహుమతులను తెచ్చిన తొలివారు. తెలివిగల వారు గనుక వారు తెచ్చిన

బహుమతులు మార్చుకోడానికి వీలైనవే తెచ్చారు. ఇప్పుడు నేను చెప్పిన ఈ ఇద్దరు అమాయకులు ఒకరి కొరకు ఒకరు తమకున్న అత్యంత విలువైన వస్తువుల్ని త్యాగం చేసారు.

అయినా నేనంటాను, ఈ కాలపు తెలివిగలవాళ్ళకన్నా వారిద్దరే అసలైన జ్ఞానులు. కానుకలు ఇచ్చి పుచ్చుకునే వాళ్లందరికి ఆదర్శప్రాయులు. ప్రపంచానికి, ప్రజలకు మార్గదర్శకులు. ప్రేమకు సరైన నిర్వచనాలు వాళ్లు. వాళ్లే జ్ఞానులు. They are the Magi..

✧✧✧✧✧

---

## ఓ హెన్రీ (O' Henry 1862-1910)

ఇతని అసలు పేరు విలియం సిడ్నీ పోర్టర్. గ్రీన్స్‌బరొ, నార్త్ కరొలినాలో పెరిగాడు. ఇరవైయవ ఏట టెక్సాస్ వెళ్లి, రాంచర్‌గా, బాంక్ టెల్లర్‌గా పనిచేస్తూనే The Rolling Stone అనే హాస్య పత్రికను నడిపాడు.

ఫస్ట్ నేషనల్ బాంక్ ఆఫ్ ఆస్టిన్‌ను వేయి డాలర్లకు ముంచాడని ఆరోపణలు రావడంతో అక్కడ నుంచి పారిపోయి సెంట్రల్ అమెరికా చేరుకున్నాడు. హొండూరస్‌లో దేశ బహిష్కృతులైన జెన్నింగ్స్ సోదరులతో కలిసి సరదాగా గడిపాడు. భార్య మంచాన పడడంతో మరల ఆస్టిన్ వచ్చాడు. అరెస్ట్ చేయబడి అయిదేళ్ల జైలుశిక్ష అనుభవించాడు. నిజానికి బాంకుకు అతడి వల్ల నష్టం రాలేదు కాని పారిపోవడం అతడిని జైలుపాలు చేసింది.

మూడేళ్లు మాత్రమే జైలు శిక్ష అనుభవించి 1901లో న్యూయార్క్ వెళ్లాడు. జైలులో ఉన్నప్పుడు పరిచయమైన ప్రిజన్ గార్డ్స్‌లలో ఒకతడిపేరు Orrin Henry - బహుశా అతడి పేరును బట్టే తన పేరును O' Henry గా మార్చుకుని ఉండవచ్చు నంటారు. న్యూయార్క్ అంటే అతనికెంతో ఇష్టం.

దాదాపు ఆరువందల కథలు వ్రాసినాడు. ఒక్క 1904లోనే 65 కథలు వ్రాసిన O'Henry తాగుడుకు లోనై, క్షయ వ్యాధికి గురై నలభై ఏడవ యేట కన్నుమూసాడు. అతడి ఆఖరి మాటలు–

- "Pull up the shades so I can see New York. I don't want to go home in the dark?"

# 12. కానుకలు
## (Gifts)

- ఎడ్మండ్. హెచ్. సియర్స్
**Edmond H. Sears**

తూర్పుదేశపు ప్రభువులం మేము
కానుకలు తీసుకుని ఇటు వచ్చినాము.
పొలాలు, బీళ్లు, కొండలు, నీళ్లు
అన్నిటిని దాటితిమి ఆ తార దారిన!

ఓ అద్భుత కాంతిదీపమా! తారామణిరూపమా!
రాజ ఠీవితో వెలుగొందు రాత్రి నక్షత్రమా!
పయనమేల నీవు పడమటి దిక్కుకు?
నవ ప్రఫుల్ల కాంతిలో నడిపించు మమ్ములను.

బెత్లెహేం మైదానాన పుట్టెనొక రాజు
అతని కిరీటానికై తెచ్చానీ బంగారు కణిక
ఆనాడూ ఏనాడూ ఆతడే ఏలిక

సాంబ్రాణి తెచ్చానా సామాన్యుడి కొరకు,
ఈ సుగంధ ద్రవ్యాలింకెవరికో కాదు,
పరిమళమా, పైకెగసి ప్రభువునర్చించుమా!

దుఃఖము, బాధ, రక్తము, మరణము
సమాధిలో భూస్థాపితం కాగా
జీవాన్నిచ్చే గుగ్గిలాన్ని తెచ్చాను నేను.

ప్రభువు, దేవుడు, త్యాగమూర్తి
శిశువు ప్రభువుగా ఎదిగిన రీతి
అల్లెలూయా! అల్లెలూయా!
భూమ్యాకాశాలు ప్రతిధ్వనించిన గీతి.

# 13. సాల్వడార్
# కాస్త ముందో, వెనకో

**- శాంద్రా సిస్నెరాస్**

సాల్వడార్ - గొంగళి పురుగు రంగు కళ్లున్నవాడు
సాల్వడార్ - వంకర జుట్టు, వంకర పళ్లున్నవాడు,
సాల్వడార్ - టీచర్‌కు గుర్తుండని పేరు కలవాడు.
ఎవరికీ స్నేహితుడుకాని ఆ పిల్లవాడు పరిగెత్తుతున్నాడు-

ఏదో దారివెంబడి ఎక్కడికో, నల్లని ఇళ్లు చెడు వాతావరణం రంగులో ఉండే చోట, ఓ చెక్క తలుపు వెనక ఇంట్లో నిద్రపోతున్న తమ్ముళ్లను లేపి, వాళ్లకు బూట్లు తొడిగి, నెత్తిపై నీళ్లుజల్లి, వేళ్లతో జుట్టు దువ్వి, సత్తుగిన్నెలోని పాలలో కార్న్‌ఫ్లేక్స్ వేసి వాళ్లకు తాగించి, ఆ ఉదయపు మసక చీకటిలో పదపద అంటున్నాడు.

సాల్వడార్ - కాస్త ముందో, వెనకో, త్వరగానో, ఆలస్యంగానో తన తమ్ముళ్లను వెంటబెట్టుకుని వస్తాడు. పసిపాపతో తీరిక లేకుండా ఉన్న అమ్మకు పనుల్లో సాయం చేసి; సెసిలియో, ఆర్టురిటొలను హడావుడి పెట్టి తీసుకు వస్తుంటే, ఇవ్వాళ కూడా నిన్నటిలానే ఆర్టురిటొ తన చేతిలోని క్రెయాన్‌ల పెట్టె కింద పడవేస్తే, వంద చిన్నిచిన్ని వేళ్లలాంటి ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, నీలి, నల్లని ముక్కలు, పడుతూ గంతులేస్తూ చెల్లాచెదరవుతూ తారు గుంటల్ని దాటిపోతున్నపుడు, రహదారిపై పోతున్న జనాన్ని, జాలిగల రక్షక భటురాలు, సాల్వడార్ వాటిని ఏరుకునేంత వరకూ ఆపుతుంది.

తన ముడతలు పడ్డ చొక్కాలో సాల్వడార్, తనని తాను స్పష్టం చేసుకోవాల్సిన గొంతుతో, మాట్లాడిన ప్రతి పదానికి క్షమాపణ కోరుతూ, ఆ నలభై పౌండ్ల బరువున్న బక్క పిల్లాడు, ఒంటి నిండా గాయాల మచ్చలున్న బాలుడు, పడిన బాధలు చరిత్రగా, కాళ్లూ చేతులూ ఈకలూ, చిరుగుల దుస్తులతో కప్పబడి, కళ్లలో ఏ మూల, గుండెలో ఏ మూల, ఆ ఉరః పంజరంలో ఏదైతే రెండు పిడికిళ్లతో దడదడా కొట్టుకుంటుందో, ఆ గుండె సాల్వడార్‌కు ఏం తెలుసో దాన్నే అదీ తెలుసుకుని; ఆ చిన్ని శరీరం వంద గాలి బెలూన్ల ఆనందాన్ని, ఒక విషాదపు గిటార్ స్వరాన్నీ ఇముడ్చుకోలేని, సాల్వడార్, అందరిలాంటి బాలుడే. స్కూలు ఆవరణ గేటు పక్కన ఉన్న చిన్ని తలుపునుంచి, లోనికి అదృశ్యమవుతున్న తమలాంటి బాలురు;

అదృష్టవంతుల్ని చూస్తూ- సాల్వడార్ తన తమ్ముళ్లతో- "మనం వేచి ఉండాలి" అని చెబుతూ సెసిలియో, ఆర్టురిటొల చేతులు పట్టుకుని వడివడిగా నడుస్తూ

అటే ఆశగా చూస్తూ- చూస్తూ ఉండగానే...

పాఠశాల ఆవరణలోని అనేక రంగుల్ని, మోచేతులు, మణికట్టులు అటుయిటూ మారి అనేక పాదరక్షలు పరిగెడ్తుండగా, క్రమేపీ అవన్నీ తమ కళ్లముందు చిన్నవిగా, మరింత చిన్నవిగా, దూరపు ఆకాశపు ప్రకాశవంతమైన అంచులో కలిసిపోతూ, గాలి పటాల జ్ఞాపకాలలో గాలిలో రెపరెపలాడి అదృశ్యమైపోతాయి. చూస్తూనే ఉంటాడు సాల్వడార్ మరలా రేపు తన తమ్ముళ్లతో వస్తాడు.

✧✧✧✧✧

---

**సాండ్రా సిస్నెరాస్ (Sandra Cicneros 1954-)**

సాండ్రా సిస్నెరాస్ చికాగోలో జన్మించింది. ఆమెకు ఆరుగురు సోదరులు, 'ఆరు హంసలు' కథలోలా. సిస్నెరాస్‌కు అర్థం 'హంసలకు కాపలాదారు' అని. ఆమె కథల పుస్తకం Woman Hollering Creek లో లాటినొ పిల్లల గొంతులు స్పష్టంగా కనిపిస్తాయి. Vignette లు వ్రాయడంలో ఆమెకు ఆమే సాటి. (Vignette అంటే a short literary sketch or portrait).

# 14. జాగ్రత్త! చదవకండి ఈ కవిత!
## (Beware! Donot Read this Poem!)

– ఇస్మాయెల్ రీడ్

ఈ రాత్రి
ఒళ్లు గగుర్పొడిచే పాట
ఓ ముసల్దాని గురించి,
ఆమెకు ఎంత గర్వమంటే
ఆమె చుట్టూరా అనేక అద్దాలు!
ఆ పిచ్చి ఎంత ముదిరిందంటే
తన ఇంటిలోపల తాళాలేసుకుని
ఆమె జీవితమే అద్దాలుగా మారిపోయింది.

ఒక రోజున గ్రామస్థులు
దాడి చేసారామె ఇంటిపై,
వాళ్లకన్నా వేగంగా ఆమె
ఒక అద్దంలోకి అదృశ్యమయ్యింది.

ఆ తరువాత
ఆ ఇంటిని అద్దెకు తీసుకున్న ప్రతి కుటుంబం
పోగొట్టుకున్నది తాము ప్రేమించే ఒకరిని–
ఆ అద్దంలో ఉన్న ముసలిదానికి.

మొదట ఒక చిన్న బాలిక
తరువాత ఓ యువతి
ఆనక ఆమె భర్త

ఈ పాటకున్న ఆకలి అనాదిగా ప్రసిద్ధమైనదే
అది ఎందరినో బలిగొన్నది.

ఈ పాటకు దూరంగా ఉండు
ఇది నీ పాదాలను లాగేస్తుంది;
ఈ పాటకు దూరంగా ఉండు
ఇది నీ కాళ్లను లాగేస్తుంది;
ఈ పాటకు దూరంగా ఉండు

ఇది ఆశబోతు అద్దం
నీవు ఈ పాటలోకి దూరావు.
నడుం నుంచి కింది దాకా–
ఎవరూ నిన్ను వినలేరు, వినగలరా?

ఈ పాట నీ గొంతు వరకు వచ్చింది
        తేనుపు–బెల్చ్–Belch-
ఈ పాటకు మర్యాద లేదు
ఈ పాట నుంచి బయటకు పిలవలేవు
అందుచేత కాస్త స్థిమితపడు
ఈ పాటతో ప్రయాణించు
ఈ పాటలోకి చేరిపో

ఈ పాటను ఎదిరించకు
దీనికి నీ కళ్లున్నాయి
ఈ పాటకు అతడి తల ఉంది
ఈ పాటకు అతడి చేతులున్నాయి
ఈ పాటకు అతడి వేళ్లున్నాయి
ఈ పాటకు అతడి వేళ్ల కొసలున్నాయి

ఈ పాటే పాఠకుడు
పాఠకుడే ఈ పాట

(1968లో దాదాపు లక్ష మంది వ్యక్తులు అదృశ్యమైనారని U.S. Bureau of Missing Persons లెక్కకట్టింది. ఎంత వెదికినా ఎటువంటి క్లూలు, జాడలు కనిపించలేదు. వాళ్ల స్నేహితుల జీవితాల్లో మాత్రం 'వెలితి' మిగిలిపోయింది)

✧✧✧✧✧

---

## ఇస్మాయిల్ రీడ్ (Ishmael Reed 1938- )

ఓక్‌లాండ్, కాలిఫోర్నియాలో నివసించే ఇస్మాయెల్ – Writing is fighting - అని నమ్ముతాడు. ఎన్నో వ్యంగ్యాత్మకమైన నవలలు వ్రాసిన ఇస్మాయెల్ శైలి ఆఫ్రికన్ అమెరికన్ మాండలికాలు, ఇంగ్లీషు భాషతో కలిసి, హిప్ జార్గన్‌తో నృత్యం చేస్తూ ఉంటుంది.

"My novels and poems are meant to be read aloud. That is why Jazz musicians have been able to adapt my stuff"

# 15. మా నాన్నతో నృత్యం
## (My Papa's Waltz)

**– థియొడొరి రోత్‌కి**

నీ నోటి విస్కీ వాసనకు
చిన్నపిల్లలకు కళ్లు తిరుగుతాయి.
కాని నేను మృత్యువులా హత్తుకున్నాను
అటువంటి నృత్యం అంత తేలిక కాదు.

వంటగది అరల్లోని పాత్రలన్నీ
నేలపై పడే దాకా మనం గంతులేసాం
మా అమ్మ ముఖం
మూర్తీభవించిన అసంతృప్తిగా ముడిపడేది.

నా మణికట్టును పట్టుకున్న అరచేయి
ఒక కణుపు వద్ద కమిలి ఉన్నది.
నీవు తప్పుగా వేసిన ప్రతి అడుగు వద్దా
నా కుడిచెవిని ఒక కొక్కెం గీసుకుంటున్నది.

మట్టితో గట్టిపడిన నీ అరచేతితో
నా నెత్తిపై నీవు కాలాన్ని తాళం వేస్తూ
నాతో నృత్యం చేస్తూనే, నిద్రపుచ్చేవాడివి,
నేనింకా నీ చొక్కాకు వేలాడుతుండగానే.

✧✧✧✧✧

---

**థియొడొరి రోత్‌కి (Theodore Roethke 1908-1963)**

థియొడొరి రోత్‌కి ఆజానుబాహుడైన వ్యక్తి. చిన్నచిన్న ప్రాణుల గురించి, ప్రకృతి రహస్యాల గురించి, మానవ జీవిత పార్శ్వాలలో ప్రకృతి ప్రతిఫలనాల గురించి కవిత్వీకరించినవాడు.

జర్మన్ నుంచి వలస వచ్చి మిచిగాన్‌లో స్థిరపడిన కుటుంబంలో జన్మించిన థియొడొరి రోత్‌కి గొప్ప అధ్యాపకుడిగా పెన్సిల్వేనియా, వెర్మాంట్, సీటిల్‌లో పేరు పొందినాడు.

# 16. పొగమంచు
## (Fog)

**– కారల్ శాండ్‌బర్గ్**

పొగమంచు వస్తుంది,
చిన్ని పిల్లి పాదాలపై.

రేవుపై, పట్టణంపై
తొంగి కూర్చుని
నిశ్శబ్దంగా చూస్తూ
ఆనక, దట్టంగా అల్లుకుపోతుంది.

✧✧✧✧✧

---

**కారల్ శాండ్‌బర్గ్ (Carl Sandburg 1878-1967)**

స్వీడన్ నుంచి వలస వచ్చి, ఇల్లినాయిస్‌లో స్థిరపడిన కుటుంబంలో జన్మించిన శాండ్‌బర్గ్, అమెరికన్ కవిత్వంలో అద్భుతమైన మార్పును తెచ్చాడు. ఫ్రీవర్స్‌లో అమెరికన్ల భాషను లయబద్ధంగా పలకవచ్చని నిరూపించాడు. ప్రతి అమెరికన్ ఇంటికీ తెలిసిన కవిగా, శ్రామికజన పక్షపాతిగా అతడు మిలియన్లకొద్దీ ప్రజలకు చేరువైనాడు. The American Songbag అనే పాటల సంకలనం అమెరికన్ మ్యూజిక్ హిస్టరీలో ఓ మైలురాయి. ఇల్లినాయిస్‌కు మరో పుత్రుడైన అబ్రహం లింకన్‌పై అతడు వ్రాసిన ఉద్గ్రంథానికి పులిట్జర్ ప్రైజ్ లభించింది.

# 17. కోతి చెయ్యి
## (The Monkey's Paw)

**– డబ్ల్యూ. డబ్ల్యూ జాకబ్స్**

**(కోరుకునేప్పుడు జాగ్రత్తగా ఉండు, అది నెరవేరవచ్చు)**

**(Be careful what you wish for, You may receive it.**

-Anonymous)

## <u>మొదటి భాగం</u>

తడిగా, చెమ్మగా ఉన్న ఆ శీతల రాత్రిలో లాబర్నమ్ భవంతిలోని చిన్న గది కిటికీల తెరలు మూసి వేయబడి, ప్రకాశవంతంగా వెలుగుతున్న నెగడు వలన వెచ్చగా ఉన్నది. తండ్రీ కొడుకులు చదరంగం ఆడుతున్నారు. తండ్రికి కొన్ని పెద్ద ఎత్తులు, ఒక్కసారిగా ఆట గెలుచుకునేవి తెలుసు. వాటిని వేస్తూ తన రాజును అనవసరంగా, అకారణంగా ఇరుకున పెడ్తుంటే పక్కనున్న జుట్టు నెరసిన మహిళ వెచ్చగా చలి కాగుతూ, ప్రశాంతంగా కుట్టుకుంటూనే ఆ ఎత్తులను చూసి అనాల్సిన మాటలు అననే అన్నది.

"వెధవ గాలి!" అన్నాడు మిస్టర్ వైట్. తను చేసిన పొరపాటు గ్రహించి, తన కుమారుడు దానిని గమనించకుండా ఉండాలనే ఎత్తుగడతో.

"నేను వింటున్నా!" అన్నాడు కొడుకు – తండ్రి ఎత్తు పసిగట్టి – చేయి చాచి ఎత్తు వేస్తూ "చెక్"

"అతడు ఈ రాత్రి వస్తాడని నేననుకోవడం లేదు" అన్నాడు తండ్రి తన ఎత్తు వేస్తూ.

"మేట్! చెక్‌మేట్" సమాధానమిచ్చాడు కొడుకు.

"దారుణమైన పరిస్థితిలో ఉన్నాం మనం" అన్నాడు మిస్టర్ వైట్ దూకుడుగా – "ఈ అనాగరికమైన, భయంకరమైన, మృగాలు తిరిగేచోటున, దూరంగా విసిరిగొట్టినట్లున్న ఈ పాడుబడ్డ కొంపలో మనం ఉండాల్సిన రావడం. దారంతా చిత్తడి నేల. మధ్యలో వాగులు. జనం ఏమనుకుంటున్నారో తెలీదు గాని, రెండిళ్లు రోడ్డు పక్కనే ఉన్నాయి కాబట్టి ఏ సమస్యా రాదనుకుంటా?"

"దాన్ని వదిలేయ్, డియర్" అన్నది అతడి భార్య మృదువుగా– "తర్వాత ఆట నీవు గెలుస్తావులే"

మిస్టర్ వైట్ తలెత్తేసరికి తల్లీకొడుకుల మధ్య ప్రసరించిన చూపు చూసి అతడి మాటలు పెదాల దగ్గరే ఆగిపోయాయి. నెరసిన గడ్డంలో ఓ అపరాధపు చిరునవ్వు మెరిసి అదృశ్యమయ్యింది.

"అడుగో! వస్తున్నాడతడు" అన్నాడు కొడుకు – హెర్‌బర్ట్ వైట్ – బయట ధడేల్‌మని మోగిన గేటు చప్పుడు, తలుపు వేపు వస్తున్న అడుగుల చప్పుడు విని.

మర్యాదపూర్వకంగా లేచిన వృద్ధుడు త్వరత్వరగా తలుపు తీసి బయటకు వెళ్లి వచ్చిన అతిథిని ఆహ్వానిస్తున్నాడు. అతిథి కూడా ఏదో చెబుతున్నాడు. మిసెస్ వైట్ – టుట్, టుట్" అని దగ్గింది. ఆమె భర్త లోనికి వచ్చాడు. అతడి వెనకే ఆజానుబాహుడైన వ్యక్తి – చిన్ని కళ్లు, ఎర్రగా బలిష్ఠంగా ఉన్నాడు.

"సార్జంట్–మేజర్ మారిస్" పరిచయం చేసాడు.

సార్జంట్ మేజర్ అందరితో చేతులు కలిపి తనకు నెగడు పక్కనే ఇచ్చిన కుర్చీలో కూర్చుని, వృద్ధుడు విస్కీ బాటిల్, గ్లాసులు బయటకు తీసి, పొయ్యిపై కెటిల్ (రాగిపాత్ర)ను ఉంచడాన్ని ఆసక్తిగా, సంతృప్తిగా గమనిస్తున్నాడు.

మూడో గ్లాసు దగ్గర అతిథి కళ్లు ప్రకాశవంతమయ్యాయి. ఆ చిన్ని కుటుంబం అతడు చెప్పబోయే మాటల్ని, కథల్ని వినడానికి అప్రమత్తమయ్యింది. సుదూర దేశాల్నించి అతడు తనతో మోసుకువచ్చిన విశేషాన్ని వినడానికి ఎవరికైనా ఉత్సుకత ఉంటుంది కదా! అతడు తన కుర్చీలో స్థిమితపడి. అద్భుతమైన వింతల్ని, ఘనకార్యాల్ని, యుద్ధాల్ని, చీడపీడల్ని, వింత మనుషుల్ని, విచిత్ర ఆచారాన్ని అనంతంగా చెప్పుకుపోతున్నాడు.

"ఇరవై ఒక్క ఏళ్లయ్యింది" అన్నాడు మిస్టర్ వైట్. తన భార్య, కుమారుడి వైపు చూస్తూ– "అతడు వేర్‌హవుస్ (గిడ్డంగి)లో పనిచేస్తూ ఉండే వాడు ఇక్కడి నుంచి వెళ్లే ముందు, నూనూగు మీసాల యువకుడిలా– "ఇప్పుడు చూడండి!"

"పెద్ద ఇబ్బందులు పడినట్లు లేదు" అన్నది వృద్ధురాలు వినయంగా

"నేనూ ఇండియాకు వెళ్దామనుకున్నాను. కాస్త అటూ యిటూ తిరిగి చూద్దామని, అంతే!" అన్నాడు వృద్ధుడు.

"ఇక్కడ ఉండడమే మేలు" అన్నాడు సార్జంట్ మేజర్, తల పంకిస్తూ. తన చేతిలోని ఖాళీగ్లాసు పక్కనబెట్టి, పట్టుకుని ఊపుతూ.

"అక్కడి పాత దేవాలయాల్ని, ఫకీర్లని, మంత్రగాళ్లని, ఇంద్రజాలం చేసేవాళ్లని చూడాలని నా కోరిక" అన్నాడు వృద్ధుడు. "నీవేదో చెప్పావు మంకీస్ పా అనో 'కోతి చెయ్యి' అనో అదేమిటి, మారిస్?"

"ఏం లేదు" అన్నాడు సైనికుడు. "అంత చెప్పుకునేదేమీ లేదు దాంట్లో! ఏం లేదు"

"కోతి చెయ్యా? మంకీస్ పా!" ఆశ్చర్యంగా అడిగిందా వృద్ధురాలు.

"అదే! కొద్దిపాటి మాజిక్ అనవచ్చు" అన్నాడు సార్జంట్ మేజర్.

అతడి ముగ్గురు శ్రోతలు ఆసక్తిగా ముందుకు వంగారు. వాళ్ల అతిథి అన్యమనస్కంగా ఖాళీగ్లాసును తన పెదాల దగ్గరకు పోనిచ్చి మరల కింద పెట్టాడు. మిస్టర్ వైట్ మరలా దానిని నింపాడు.

"చూడ్డానికి అది ఎండిపోయిన 'కోతి చేయి'లా ఉంటుంది" అన్నాడు సార్జంట్ మేజర్ తన కోటుజేబులోకి చేయి పోనిచ్చి బైటికి తీసాడు. దాన్ని చూసీ చూడగానే మిసెస్ వైట్ ముఖం మీద అసహ్యం కనబడుతుండగా వెనక్కి తగ్గింది. కాని, ఆమె కుమారుడు దానిని పట్టుకుని పరీక్షించసాగాడు.

"ఏమిటి దీంట్లో ప్రత్యేకత?" అన్నాడు మిస్టర్ వైట్ దానిని తన చేతిలోకి తీసుకుంటూ. తనూ పరీక్షించి బల్లపై ఉంచాడు.

"ఓ వృద్ధుడైన ఫకీర్ దానిని మంత్రనిక్షిప్తం చేసాడు" అన్నాడు సార్జంట్ మేజర్. "గొప్ప సాధువు పవిత్రుడు, మంత్రవేత్త. విధి జనుల జీవితాల్ని నియంత్రిస్తుందని, దానికి అడ్డుపడిన వాళ్లకు దుఃఖం తప్పదని నిరూపించదలుచుకున్నాడు. అందుకే అతడు దానిపై ఒక మంత్రం (స్పెల్) లాంటిది పెట్టాడు. ఎవరైనా ముగ్గురు వ్యక్తులు, ఒక్కొక్కళ్లూ మూడేసి వరాలు కోరుకోవచ్చు!

అతడెంత గంభీరంగా, నెమ్మదిగా చెప్పాడంటే నవ్వుదామనుకున్న వాళ్లు కూడా గంభీరంగా ఉండిపోయారు.

"మరి మీరెందుకు మూడు కోరికలు కోరుకోలేదు" అడిగాడు హెర్బర్ట్ వైట్ తెలివిగా.

అనుభవజ్ఞుడు చిన్న పిల్లవాడ్ని చూసినట్లు చూసి అన్నాడు– "నేను కోరుకున్నాను!" కాని అతడి ఎర్రటి మొహం పాలిపోయింది.

"మరి నీ మూడు కోరికలూ తీరాయా" అడిగింది మిసెస్ వైట్.

"అవును" అన్నాడతడు గ్లాసును తన పళ్లకు తాకిస్తూ.

"ఇంకెవరన్నా కోరుకున్నారా?" ఆమె మరల అడిగింది.

"మొదటివాడు మూడు కోరికలు కోరుకున్నాడు. మొదటి రెండు ఏమిటో తెలీదు, కాని, మూడోది చావు కావాలనుకున్నాడు. అట్లా ఈ 'మంకీస్ పా' నా చేతికి వచ్చింది" అతడి గొంతు ఎంత కరకుగా ఉందంటే అక్కడ నిశ్శబ్దం ఘనీభవించింది.

"నీవు గనక మూడు కోరికలూ కోరుకుని వుంటే, దీనితో నీకు అవసరం లేనట్లే కదా, మారిస్! మరి దీన్ని మోసుకుంటూ ఎందుకు తిరుగుతున్నావు?" అడిగాడు మిస్టర్ వైట్.

ఆ సైనికుడు తల అడ్డంగా ఊపాడు. "బహుశా ఏదో ఒక ఖరీదైన అలవాటులా కాబోలు" నెమ్మదిగా అన్నాడు– "ఎవరికైనా అమ్ముదామని అనుకున్నా. కాని, అమ్మను. ఇది నాకిప్పటికే బోలెడంత దుఃఖాన్ని కలిగించింది. అంతేకాక ఎవరు కొంటారు దీనిని? ఇదంతా ఒక పిట్టకథ అనుకుంటారు. అంతేకాక దీని మహత్తు పరీక్షించి తరువాత డబ్బిస్తామంటారు"

"ఇంకో మూడు కోరికలు కోరుకుంటే నెరవేర్తాయా?" అడిగాడు వృద్ధుడు అతడివేపు ఓరకంటితో చూస్తూ–

"నాకు తెలీదు, నాకు తెలీదు" అన్నాడతడు.

ఆ 'కోతి చేయి'ని బల్లమీద నుంచి తీసి రెండు క్షణాలు బొటనవేలు, చూపుడు వేలు మధ్య పట్టుకుని అటూయిటూ ఊపి, చట్టుక్కున పొయ్యిలోని మంటలోకి విసిరేసాడు.

మిస్టర్ వైట్ చిన్న కేకబెట్టి కిందకు వంగి దానిని బయటకు లాగాడు.

"దానిని కాలిపోనిస్తే మంచిది" అన్నాడు సైనికుడు.

"నీకు అక్కర్లేకపోతే, మారిస్, నాకివ్వు" అన్నాడు మిస్టర్ వైట్.

"ఇవ్వను" అన్నాడతడి స్నేహితుడు, నిశ్చయంగా. "నేను దానిని మంటల్లోకి విసిరేసాను. నీవు ఉంచుకోదలుచుకుంటే అది నీ యిష్టం. ఆ తరువాత జరిగే పరిణామాలకు నన్ను నిందించవచ్చు. దాన్ని మంటల్లో తగలేయి, జ్ఞానమున్నవాడిగా"

మిస్టర్ వైట్ దానిని తన చేతిలోకి తీసుకున్నాడు. జాగ్రత్తగా పరిశీలిస్తూ– "ఎలా కోరుకోవాలి" అన్నాడు.

"కుడిచేత్తో పట్టుకుని, బిగ్గరగా కోరుకో" అన్నాడు సార్జంట్ మేజర్. "మరలా చెబుతున్నాను. రాబోయే పరిణామాలను గుర్తుంచుకో!"

"అరేబియన్ నైట్స్ కథల్లా ఉంది కదూ!" అన్నది మిసెస్ వైట్. ఆమె లేచి సాయంత్ర భోజనానికి ఏర్పాట్లు చేయసాగింది. "నాకు నాలుగు జతల చేతులుండాలని కోరుకోరాదూ" అన్నదామె.

ఆమె భర్త కోతి చేయిని పట్టుకుని ఏదో అనబోయినట్లు నటించాడు. వాళ్లు ముగ్గురూ పకపకా నవ్వారు. కాని, సార్జంట్ మేజర్, అతడి చేయి పట్టుకుని ఆపి సీరియస్‌గా అన్నాడు–

"ఏదైనా కోరుకోదలిస్తే" అన్నాడతడు గంభీరంగా-----

– "ఆలోచించి కోరుకోండి"...

మిస్టర్ వైట్ దానిని తిరిగి తన కోటు జేబులో పెట్టుకున్నాడు. అందరూ భోజనాల దగ్గర కూర్చున్నారు. ఆ హడావుడిలో ముచ్చట్లలో పడి ఆ కోతిచెయ్యి సంగతి మరచిపోయారు. భోజనాల తరువాత ఆ సైనికుడు ఇండియాలో తాను చూసిన విశేషాల రెండో భాగం ఎంతో ఆసక్తికరంగా చెబుతూ తన శ్రోతలను అలరించాడు.

ఆఖరి ట్రెయిన్‌ను అందుకోవడానికి వెళ్లిపోయిన అతిథిని సాగనంపి వచ్చి, ఇంటి తలుపు వేస్తూ హెర్‌బర్ట్ అన్నాడు– "అతడు చెప్పిన కథల్లో నిజముందో లేదో తెలుసుకోవాలంటే ఈ 'కోతి చెయ్యి'ని పరీక్షిస్తే చాలు. అవన్నీ కోతలా, నిజాలా తెలిసిపోతాయి" అన్నాడతడు.

"ఏమన్నా ఇచ్చావా అతగాడికి?" అడిగాడు కుమారుడు.

"కొద్దిమొత్తం!" అన్నాడు మిస్టర్‌వైట్. "అతడు ససేమిరా తీసుకోనన్నాడు. నేనే బలవంతపెట్టి ఆ మొత్తం ఇచ్చాను. దాన్ని పారేయమని, తగలబెట్టమని మళ్లీమళ్లీ చెప్పాడతడు".

"నిజమే" అన్నాడతడు భయపడ్తున్నట్లు నటిస్తూ– "ఎందుకూ, మనం ధనవంతులం కావచ్చు. డబ్బుతోపాటు పేరూ సంపాదించుకోవచ్చు. హాయిగా ఉండవచ్చు. చక్రవర్తివి కావాలని కోరుకో. నాన్నా, అప్పుడు భార్యావిధేయుడిగా ఉండాల్సిన పని తప్పుతుంది"

తన వెంట అట్లకాడతో వెంటబడిన తల్లిని తప్పించుకుంటూ అతడు బల్ల చుట్టూ పరిగెత్తాడు.

తన జేబులోంచి ఆ 'కోతి చెయ్యి'ని బయటకు తీసి మిస్టర్ వైట్ దానివేపు సందేహాస్పదంగా చూసాడు. "ఏం కోరుకోవాలో నాకు తెలీడం లేదు, నిజంగా!" అన్నాడతడు నెమ్మదిగా– "నాకనిపిస్తున్నది నాక్కావాల్సినవన్నీ నా దగ్గరే ఉన్నాయని!"

"ఇంటి బాకీ తీర్చివేస్తే నీకు సంతోషమే కదా!" అన్నాడు హెర్‌బర్ట్ – తన చెయ్యి తండ్రి భుజంపై వేసి– "రెండు వందల పౌండ్లు కోరుకో! చాలు కదా!"

ఆ వృద్ధుడు తన అవివేకానికి సిగ్గుపడుతూ ఆ కోతిచెయ్యిని పట్టుకున్నాడు. అతడి కుమారుడు తల్లి చూపులకు కాస్త తగ్గి కూర్చుని కొద్దిపాటి కూనిరాగాలు తీసాడు.

"నేను రెండు వందల పౌండ్లు కోరుకుంటున్నాను" అన్నాడా వృద్ధుడు స్పష్టంగా, కోతిచెయ్యి పైకెత్తి పట్టుకుని.

పక్కనే ఉన్న పియానో నుంచి ఒక విచిత్రమైన స్వరం వినబడింది. ముసలివాడు కేకపెట్టాడు. తల్లీ కొడుకూ అతడివేపు పరిగెత్తారు.

"అది కదిలింది" అన్నాడతడు నేలపై పడి ఉన్న వస్తువును చూపిస్తూ– "నేను కోరుకుంటున్నపుడు అది నా చేతిలో పాములా మెలి తిరిగింది"

"నాకేమీ డబ్బు కనిపించలేదు" అంటూ అతడు ఆ కోతి చెయ్యిని తీసి బల్లపై ఉంచాడు– "బహుశా నా జన్మలో నేను చూడనేమో"– అన్నాడు హెర్‌బర్ట్.

"అలా ఊహించుకుని ఉంటావు. నీ భ్రమ" అన్నదామె.

"సరే! అయ్యిందేదో అయ్యింది. ఏ అపాయమూ జరగలేదు. కాని నన్ను కుదిపేసింది పెద్ద షాక్‌లా" అన్నాడతడు. అతడి కళ్లల్లో ఇంకా భయం పోలేదు.

మగవాళ్లు మరలా నెగడు పక్కన కూర్చుని తీరికగా పైపు వెలిగించి పొగ తాగారు. బయట గాలి ఉధృతం ఎక్కువైంది. పైన తలుపులు దబదబమని మోగుతున్న చప్పుడు ఆ వృద్ధుడిని కలవర పరచింది. అసాధారణమైన, నిరాశాపూరితమైన నిశ్శబ్దం ఏదో దిగులుతో కూడుకున్నది వారిని ఆవరించింది. కాసేపు అలానే కూర్చుని వాళ్లు నిద్రపోవడానికి లేచారు.

"నేననుకుంటున్నాను రాత్రికి పెద్ద సంచిలో ఆ డబ్బంతా మూటకట్టి నీ మంచం మధ్యలో ఉంటుంది" అన్నాడు హెర్‌బర్ట్ తల్లిదండ్రులకు గుడ్‌నైట్ చెబుతూ– "బీరువా మీద ఏదో దయ్యం లాంటిది కూర్చుని నీవు ఆ డబ్బుల్ని దాస్తుంటే చూస్తూ ఉంటుంది" అని వెళ్లిపోయాడు.

మిస్టర్ వైట్ చీకటిలో చాలాసేపు అలానే కూర్చుని ఆరిపోతున్న నెగడు వేపు చూస్తూనే ఉన్నాడు. దాంట్లో రకరకాల ముఖాలు కనిపించసాగాయి. ఆఖరుగా కనిపించింది చాలా భయంకరంగా ఉన్నది. కోతిలా, కొండముచ్చులా ఉన్న ఆ ముఖం వేపు అతడు ఆశ్చర్యభయాలతో చూసాడు. అది మరింత స్పష్టంగా కనిపిస్తున్నట్లుంటే, తన భ్రాంతికి నవ్వుకుని, ఆ ముఖంపై నీళ్లు కొడ్దామని గ్లాసు పట్టుకోబోయాడు. అయితే అతడి చేతికి 'కోతిచెయ్యి' తగిలింది. చిన్న వణుకుతో

అతడు తన చేతిని కోటుకు తుడుచుకుని, మంచం దగ్గరకు వెళ్లి నిద్రకు ఉపక్రమించాడు.

## II

శీతాకాలపు ఉదయ భానుని కిరణాలు బ్రెక్‌ఫాస్ట్ టేబుల్ మీద కాంతులీనుతుండగా అతడు నిన్న రాత్రి తాను భయపడిన విషయం గుర్తుకు వచ్చి తనలో తాను నవ్వుకున్నాడు. నిన్నటి దిగులుతో కూడిన నిశీధి వాతావరణం స్థానే ఈరోజు కాస్త హుషారు, చిరునవ్వులతో కూడిన సందడి కనిపించింది. ఆ మురికి ఎండిపోయిన కోతి చెయ్యిని పక్కనే ఉన్న బీరువా అరలోకి విసిరేసి ఏదో విలువ లేని పనికిరాని వస్తువును శ్రద్ధ లేకుండా పడేసినట్లు పడేసాడతడు.

"ఈ సైనికులందరూ ఒకే రకమనుకుంటాను" అన్నది మెసెస్ వైట్. "మనం అటువంటి చెత్త, ఉబుసుపోక విషయాలను ఉత్కంఠతతో విన్నాం. అయినా మన పిచ్చిగాని కోరికలేమన్నా అలా కోరగానే తీరిపోయే రోజులా ఇవి? రెండు వందల పౌండ్లు ఎక్కడి నుంచి ఊడిపడ్తాయి?"

"ఆకాశం నుంచి, ధడేలున" అన్నాడు హెర్‌బర్ట్.

"మారిస్ అన్నదానిబట్టి అవి సహజంగానే వస్తాయి" అన్నాడు మిస్టర్ వైట్. "నీవు దానిని యాదృచ్ఛికమనే అనుకునేట్లు, ఆ కోరికలు నెరవేర్తాయట!"

"నేను వచ్చేలోపున ఆ డబ్బు సంచి తెరవమాక!" అన్నాడు హర్‌బార్ట్ హాస్యంగానే - బల్ల దగ్గర్నుంచీ లేస్తూ- డబ్బు చేతబడిన తరువాత పిసినారి అయిపోయావనుకో నిన్ను మేము వదిలేయాల్సొస్తుంది"-

అతడి తల్లి నవ్వింది. అతడు బయటకు వెళ్తుంటే తలుపు వరకు సాగనంపి, అతడు వెళ్తున్న దారివేపు పరికించి చూసి నెమ్మదిగా లోనికి వచ్చింది. ఆమెకు తన భర్తను ఉడికించడం హాయిగా, నవ్వులాటగానే అనిపించినా, ఆ రోజంతా ఎప్పుడైనా పొరబాటున పోస్ట్‌మాన్ తలుపు తడతాడేమోనని తలుపు వంక చూస్తూనే ఉన్నది. పోస్ట్‌మాన్ తలుపు తట్టగానే హడావుడిగా తలుపు తీసిన ఆమె చేతిలోకి టైలర్ బిల్లు రాగానే కాస్త ఆశాభంగం కాస్త నవ్వుతో ఆమె సార్జంట్ మేజర్‌ల పనుల్ని ఎత్తిపొడుస్తూ మాట్లాడి కాస్త ఉపశమనం చెందింది.

"హెర్‌బర్ట్ వచ్చాక మళ్లా హాస్యం చేస్తాడు!" అన్నదామె డిన్నర్ టేబుల్ దగ్గర కూర్చుంటూ.

"అయితే నేను ఒక్కటి మాత్రం నిశ్చయంగా చెప్పగలను" అన్నాడు మిస్టర్ వైట్. "ఆ కోతి చెయ్యి నేను పట్టుకున్నప్పుడు కదిలిన మాట వాస్తవం".

"నీవలా భ్రమపడ్డావు" అన్నదామె మృదువుగా.

"లేదు లేదు. అది కదిలింది. నేను ఖచ్చితంగా చెబుతున్నాను. నీవు నమ్ము. అది కదిలింది" అన్నాడు అతడు– "ఏమిటలా చూస్తున్నావు?"

ఆమె సమాధానమివ్వలేదు. ఆమె ఇంటి ఆవరణ బయట ఎవరో తెలీని వ్యక్తి తచ్చాడుతున్నట్లు గమనించింది. ఆమెకింకా ఆ రెండు వందల పౌండ్ల సంగతి మనసులో కదలాడుతున్నది కాబోలు. ఇంటిబయట ఉన్న ఆ వ్యక్తి లోనికి రావాలా, వద్దా అని సంశయిస్తూన్నట్లు ఆమెకు అనిపించింది. అతడు చక్కగా, నీటుగా, డ్రస్ చేసుకుని, తలపై సిల్క్‌హాట్ ధరించి ఉన్నాడు. మూడుసార్లు అతడు బయట గేటు వద్ద ఆగి, కాస్త ముందుకు నడచి, మరలా గేటు వద్దకు వచ్చి నాలుగోసారి వచ్చినపుడు దానిపై చేయివేసి ఓ క్షణం తటపటాయించి, ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా తలుపు భళ్లున తెరచుకుని ఇంటి ఆవరణలోకి వచ్చాడు. అసంకల్పితంగానే మిసెస్ వైట్ తాను వేసుకున్న ఏప్రాను ముడి విప్పి ఏప్రాన్‌ను తీసి కుర్చీపై ఉంచి బయటకు వెళ్లింది, అతడిని ఆహ్వానిద్దామని.

ఆ కొత్త వ్యక్తి బెరుకుగా లోనికి వచ్చాడు. ఆమెవేపు బిడియపడ్తూ చూసి, ఆ ముసలావిడ గది అస్తవ్యస్తంగా ఉండడానికి సంజాయిషీ ఇస్తుంటే దానిని వినీ విననట్లు అతడు చాలా మర్యాదగా, వినయంగా ప్రవర్తించాడు. కుర్చీపైన ఆమె భర్త తోటలోకి వెళ్లేప్పుడు వేసుకునేది వేలాడుతున్నది. ఆమె అతడేమన్నా చెబుతాడేమోనని ఆతృతగా ఎదురుచూసింది కాని, అతడు చాలాసేపు మౌనంగా ఉన్నాడు.

తన జేబులోంచి జేబు రుమాలు తీసి ముఖాన్ని తుడుచుకుంటూ అతడన్నాడు– "నేను... నన్ను... మా అండ్ మెగ్గిన్స్ కంపెనీ వాళ్లు పంపారు!"

ఆ ముసలావిడ ఆతృతగా అడిగింది– "ఏమిటి! ఎందుకు? హెర్‌బర్ట్‌కు ఏమీ కాలేదు కదా! ఏమయ్యింది? ఏమయ్యింది?"

"ఓపిక! ఓపిక పట్టు!" అన్నాడు ఆమె భర్త ఆందోళనతో– "అప్పుడే ఏదేదో ఆలోచించకు. చెడువార్తలేమీ తీసుకురాలేదుగా మీరేమీ సర్" – అంటూ అతడు ఆ వచ్చిన కొత్త వ్యక్తివేపు దిగాలుగా చూసాడు.

"అయామ్ సారీ..." నసిగాడు ఆ కొత్త వ్యక్తి.

"దెబ్బలేమన్నా తగిలాయా?" తల్లి గట్టిగా అడిగింది.

''బాగా తగిలాయి'' అన్నాడతడు తల వంచుకుని– నెమ్మదిగా, ప్రశాంతంగా– "అయితే అతడికి నెప్పి తెలియదు".

“ఓ... థాంక్‌గాడ్” అన్నదామె తన చేతుల్ని నలుపుకుంటూ– థాంక్‌గాడ్! థాంక్‌గాడ్!...

కాని ఆ వ్యక్తి మొహంలో ఏదో నిర్వేదం, కొట్టవచ్చిన ఆందోళన చూసి ఆమె మధ్యలోనే ఆగిపోయింది. ఊపిరి బిగబట్టుకుని నెమ్మదిగా తన భర్తవేపు తిరిగి, వణుకుతున్న తన చేతితో అతడి చేతిని స్పృశించింది. చాలాసేపు నిశ్శబ్దం.

“అతడు మెషినరీలో నలిగిపోయాడు” అన్నాడా వ్యక్తి నెమ్మదిగా.

“మెషినరీలో నలిగిపోయాడా?” అన్నాడు మిస్టర్ వైట్ విభ్రాంతిలోనే

“అవును, నలిగిపోయాడు”

కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూ అతడు తన భార్య వణుకుతున్న చేతుల్ని మృదువుగా సముదాయిస్తున్నట్లు స్పృశించాడు. నలభై ఏళ్ల గాఢానుబంధపు స్పర్శ అది.

“అతడొక్కడే మాకున్నది” అన్నాడతడు కొత్తవ్యక్తితో–

–కన్నీళ్లను దిగమింగుకుంటూ “చాలా దుఃఖంగా ఉంది”– అన్నాడు.

ఆ వచ్చిన వ్యక్తి పొడిగా దగ్గి, లేచి కిటికీ వద్దకు వెళ్లాడు. “తమ ప్రగాఢ సానుభూతిని తెలపమని, మీతో పంచుకొమ్మనీ కంపెనీ నన్ను పంపింది. ఈలోటు ఎవరూ తీర్చ గలిగేది కాదు” అన్నాడతడు. ఇటు తిరగకుండానే– “నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను... వాళ్ల సేవకుడిగా, వాళ్ల ఆదేశానుసారమే నేను ఇక్కడికి వచ్చాను” అన్నాడతడు.

సమాధానం రాలేదు. ముసలావిడ ముఖం పాలిపోయినట్లు తెల్లగా మారింది. ఆమె చూపులు ఎక్కడో తీక్షణంగా చూస్తున్నాయి. ఊపిరి చప్పుడు వినబడడం లేదు. ఆమె భర్త మొహంలో ఏదో కలవరం, అతడి స్నేహితుడు సార్జంట్ మేజర్ మాటలు జ్ఞప్తికి వచ్చినట్లు–

“మా అండ్ మెగ్గిన్స్ కంపెనీకు ఈ విషయంలో ఎటువంటి సంబంధం లేదు. వ్యక్తి నిర్లక్ష్యం వలన జరిగే ప్రమాదాలకు కంపెనీ బాధ్యత వహించదు. అయినా మానవతా దృక్పథంతో, మీ కుమారుడు చేసిన సేవలకు కొంత పరిహారం ఇవ్వడానికి కంపెనీ నిశ్చయించింది” అన్నాడా కొత్త వ్యక్తి.

మిస్టర్ వైట్ భయభయంగా ఆ వ్యక్తి వేపు చూస్తూ లేచి నిలబడి, తడబడే అడుగుల్తో అతడి వేపు వెళ్తూ అడిగాడు– “ఎంత?”

"రెండు వందల పౌండ్లు"

భార్య పెట్టిన కేక అతడికి వినబడిందో లేదో ఆ వృద్ధుడి ముఖాన ఓ విచిత్రమైన చిరునవ్వు ప్రత్యక్షమై వెలిగి ఆరిపోయింది. చూపు లేనివాడిలా అతడు చేతులు తడుముకుంటూ నిలుచున్నవాడు నిలుచున్నట్లే అచేతనంగా నేలపైకి దబుక్కున పడిపోయాడు.

## III

రెండు మైళ్ల దూరంలో ఉన్న కొత్త స్మశాన వాటికలో ఆ వృద్ధ దంపతులు తమ చనిపోయిన కుమారుడిని ఖననం చేసి, విషాదం గూడుకట్టుకున్న మూర్తుల్లా, మౌనంగా ఇంటినీడల్లోకి ప్రవేశించారు. ఎంత త్వరగా ఆ పనులన్నీ అయిపోయా యంటే వాళ్లకు కాలంపై స్పృహ రాలేదు. ఇంకేదో జరగబోతున్నట్లు దానికై వేచి చూడాలన్నట్లు– అది తమ మీద ఉన్న ఈ భారాన్ని తొలగిస్తుందేమోనన్న ఆశ, వృద్ధులైన వాళ్ల ఎదలు భరించలేనంత బరువు... దిగులు...

రోజులు గడిచిపోతున్నాయి. జీవితంతో సమాధానపడాల్సిందే ఎవరైనా! ఆశ చచ్చిన జీవితాల్లో మిగిలేది నిర్లిప్తతే కదా. కొందరు దానిని పట్టించుకోకపోవడమని తప్పుగా అనుకుంటారు. ఆ ఇంటిలో నిశ్శబ్దం తిష్ఠ వేసుకున్నది. మాట్లాడుకోడానికి ఏమున్నదిప్పుడు వాళ్ల మధ్య? చెట్టంత కొడుకు లేడాయె! నవ్వుతూ తుళ్లుతూ నాన్నను ఆటపట్టించే అతగాడేడీ? రోజులు ఎంతో భారంగా గడుస్తున్నాయా వృద్ధ దంపతులకు–

వారం రోజులు పైగా గడిచాయి. అర్ధరాత్రి అకస్మాత్తుగా మెలకువ వచ్చి చేయి చాచిన వృద్ధుడికి తన మంచం అటుపక్క ఖాళీగా ఉన్నట్లు అనిపించింది. గది చీకటిగా ఉన్నా, అతడికి కిటికీ దగ్గర్నుంచీ వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దం, ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం– అతడు లేచి కూర్చుని, ఆ శబ్దాన్ని జాగ్రత్తగా విన్నాడు. ఆ వృద్ధురాలు కిటికీ దగ్గర విలపిస్తూ నిలబడి ఉన్నది.

"ఇటురా" అన్నాడతడు– "చలిబెడ్తుంది".

"నా కొడుక్కి ఇంతకంటే శీతలంగా ఉండి ఉంటుంది" అన్నదామె ఒక్కసారి భోరున ఏడుస్తూ.

ఆమె వెక్కిళ్లు అతడి చెవుల వరకు వచ్చి ఆగిపోయాయి. గాఢ నిద్రలో మేలుకున్నాడో ఏమో మంచం మీద కూర్చునే కునికిపాట్లు పడుతూన్న అతడు– తన భార్య పెట్టిన అరుపుకు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"ఆ చెయ్యి!" అన్నదామె పిచ్చిగా "కోతి చెయ్యి!" Mankey's Paw!

అతడు అటూ ఇటూ చూసాడు- "ఎక్కడ? ఏమిటి? ఏమయ్యింది?" ఆందోళనగా అడిగాడతడు. ఆమె తడబడుతూ నడుస్తూ అతడి వేపుకు వచ్చింది.

"అది నాకు కావాలి" అన్నదామె ప్రశాంతంగా. "దాన్ని నీవు ధ్వంసం చేయలేదు కదా?"

"అది కింది అరలో ఉంది" అన్నాడతడు ఆశ్చర్యంగా- "అయినా ఇప్పుడదెందుకు?"

ఆమె ఏడుస్తూ, నవ్వుతూ- అతడి బుగ్గపై ముద్దు పెడ్తూ అన్నది- "నాకిప్పుడే ఈ ఆలోచన వచ్చింది. ఎందుకు నాకు ఇన్నాళ్ళూ తట్టలేదు? నీకెందుకు రాలేదు?"

"ఏమిటి?" అన్నాడతడు.

"ఇంకో రెండు కోరికలు కోరుకోవచ్చు కదా!" అందామె.

వేగంగా- "మనం ఒక్కటే గదా కోరుకున్నది"

"ఒక్కటి చాల్లేదా?" అన్నాడతడు కోపంగా.

"లేదు" అన్నదామె విజయం తొణికిసలాడ్తున్న మాటలతో.

"మనమింకో కోరిక కోరుకుందాం. కిందకు వెళ్లి వెంటనే దాన్ని తీసుకురా! మన హెర్‌బర్ట్ సజీవంగా రావాలని కోరుకుందాం! వెళ్లు! వెళ్లు త్వరగా!"

"ఆ వృద్ధుడు మంచం మీది నుంచి లేచి వణుకుతున్న చేతుల్తో తనపైని దుప్పటిని పక్కకు తొలగించాడు. "దేవుడా! ఈమెకు పిచ్చిపట్టింది".

"పో! తొందరగా తీసుకురా!" అరిచిందామె.

"నా కొడుకా! అయ్యో నా కొడుకా!"

ఆమె భర్త కొవ్వొత్తి వెలిగించి అన్నాడు-

"కాస్త నిద్రపో. నీవేం కోరుకుంటున్నావో నీకు తెలీదు" అన్నాడు.

"మన మొదటి కోరిక నెరవేరింది" అన్నదామె. "రెండోదెందుకు నెరవేరదు?"

"అది యాదృచ్ఛికం!" అన్నాడతడు.

"వెళ్లు! ఆ కోతి చెయ్యిని పట్టుకో! కోరు!" అన్నదామె విసురుగా.

ఆ వృద్ధుడు ఆమెవేపు చూసాడు. అతడి గొంతు వణికింది. "కొడుకు చనిపోయి పది రోజులైంది. అంతేకాక నేనేమి చెప్పగలను నీతో యీ దుఃఖంలో.

అప్పుడే అతడి దుస్తుల్నిబట్టి మనవాడని పోల్చుకోగలిగాము. చూడడానికి ఆరోజునే నీకు అంతభయంకరంగా అనిపించిందే, ఇప్పుడెలా చూడగలవు?" అన్నాడు గద్గదికంగా.

"అతడిని తీసుకురా!" అన్నదామె కర్కశంగా భర్తను తలుపువేపు తోస్తూ– "నేను పాలిచ్చి పెంచిన పిల్లవాడిని చూడడానికి నేను భయపడ్తానా?"

మిస్టర్ వైట్ ఆ చీకటిలోనే తడుముకుంటూ కిందకు వెళ్లాడు. కింద బల్లకున్న అర దగ్గర వెదికాడు. ఆ కోతి చెయ్యి తాను ఉంచిన స్థానంలోనే ఉన్నది, అయితే అతడి మనస్సు పరిపరివిధాలా కీడును శంకించసాగింది. తన మనస్సులోని కోరిక బయటపడి పాతిపెట్టబడి, కుళ్ళిన శరీరంతో తన కుమారుడు ఇంటికి వస్తే– ఊహే ఇంత భయంకరంగా ఉన్నదే! ఆ గది నుంచి పారిపోవాలనుకున్నాడతడు. ఊపిరి బిగబట్టి కళ్లు తిరుగుతున్నట్లు అనిపించి బలవంతం మీద నిలదొక్కుకున్నాడు. తీరా చూసేసరికి తలుపుకు దూరంగా ఉన్నాడతడు. ఒళ్లంతా చెమటలు పోయగా, గోడను ఆసరాగా పట్టుకుంటూ అతడు బల్ల చుట్టూరా తిరిగి, చేతిలో ఆ 'కోతి చెయ్యి' అలానే పట్టుకుని పై గదిలోకి వచ్చాడు.

ఆమె ముఖంలో కూడా మార్పు కనిపించింది అతడికి. మొహం పాలిపోయి దేనికోసమో నిరీక్షిస్తున్నట్లున్న కళ్లు. తన భయమే అట్లా కనిపిస్తుందా ఆమె ముఖంలో అనుకున్నాడతడు. కాని ఆమెను చూస్తేనే అతడికి భయం వేసింది.

"కోరు!" అన్నదామె తీవ్రంగా.

"అది తగదు. మూర్ఖత్వం. క్రూరమైనది కూడా!" అన్నాడతడు తడబడుతూ.

"కోరుకో!" అన్నదామె గట్టిగా

అతడు తన చేతిని పైకెత్తి "నా కుమారుడు సజీవుడు కావాలి" అన్నాడు.

ఆ వస్తువు– అదే– ఆ కోతిచెయ్యి జలజలా జారి నేలపై పడింది. దానివేపు భయంగా చూస్తూ, వణుకుతూ అతడు కుర్చీలో కూలబడ్డాడు. అతడి భార్య మండుతున్న కళ్లతో, కిటికీ వద్దకు వెళ్లి తెరలను తొలగదోసింది.

చలి తీవ్రంగా ఉన్నా అతడు, కిటికీ వద్ద నిలబడి బయటకు చూస్తున్న తన భార్యవేపు అప్పుడప్పుడు చూపు సారిస్తూ అలాగే కూర్చుండిపోయాడు. చైనా పింగాణీ స్టాండుపైనున్న దాదాపు అయిపోవచ్చిన కొవ్వొత్తి గోడలపైన, పైకప్పుపైన కదుల్తున్న నీడలను ప్రసరిస్తూన్నది. అలా ఆ కొవ్వొత్తి కొద్ది నిముషాలు రెపరెపలాడి, ఒక్కసారి పెద్దగా వెలిగి ఆరిపోయింది. వాళ్లనుకున్నది ఏమీ జరగకపోయేసరికి

దానిపై నమ్మకం సడలడంతో కాస్త మానసికమైన ఊరట లభించగా వృద్ధుడు మంచం దగ్గరకు వెళ్లి దానిపై కూర్చున్నాడు. ఒక నిముషం తరువాత అతడి భార్య కూడా కిటికీ తలుపు మూసి నిశ్శబ్దంగా వచ్చి పక్కనే కూర్చున్నది.

గడియారపు 'టిక్, టిక్' శబ్దం వింటూ వాళ్లిద్దరూ మౌనంగా కూర్చున్నారు. గాఢంగా కమ్ముకున్న నిశ్శబ్దం మధ్యలో మెట్లమీద కిర్రుమని చప్పుడు, ఆ తరువాత ఒక ఎలుక కీచుమంటూ గోడలోని కన్నం వేపు పరిగెత్తింది. చీకటి భరించరానిదిగా ఉండగా, ఆ వృద్ధుడు శక్తి కూడగట్టుకుని అగ్గిపెట్టె తీసి, అగ్గిపుల్ల వెలిగించి కొవ్వొత్తి తెచ్చుకోడానికి కిందకు వెళ్లసాగాడు.

మెట్లకు దిగువ అగ్గిపుల్ల ఆరిపోయింది. ఇంకో అగ్గిపుల్ల వెలిగిద్దామని ఆగాడతడు. అదేక్షణంలో ముందు తలుపుపైన ఎవరో నెమ్మదిగా తట్టిన చప్పుడు.

అతడి చేతిలోని అగ్గిపెట్టె కిందపడగా, అగ్గిపుల్లలు చెల్లాచెదురుగా పడినాయి. అతడలానే శిలలా నిలబడిపోయినాడు. తలుపును తట్టిన శబ్దం మరలా వినబడింది. భయంతో అతడు వడివడిగా మెట్లెక్కి పైగదిలోకి వెళ్లి తలుపు మూసేశాడు. ఈసారి మరింత గట్టిగా తలుపు తట్టిన చప్పుడు.

"ఎవరది?" అన్నదామె గట్టిగా–

"ఎలుక" అన్నాడు వృద్ధుడు– "ఎలుక, నా కాలికి అడ్డం పడింది"

ఆమె మంచంపై స్థిరంగా కూర్చుంది. ఈసారి ఇంకా గట్టిగా తలుపు తట్టిన చప్పుడు. ఆ శబ్దానికి ఇంటిగోడలు కంపించి ప్రతిధ్వనించాయి.

"అతడు హెర్‌బర్ట్"–

ఆమె కిందకు పరిగెత్తబోయింది. ఆమెకన్నా ముందుగానే అతడు తలుపు దగ్గరకు పరిగెత్తి చేయి పట్టుకుని ఆమెను ఆపాడు.

"ఏం చేయబోతున్నావు?" అడిగాడతడు.

"అతడు మనబ్బాయి హెర్‌బర్ట్" అందామె అతడిని విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ– "రెండు మైళ్ల దూరం నుంచీ రావద్దూ. అయినా నన్నెందుకు ఆపుతున్నావు, నన్ను పోనీయ్! నేను తలుపు తెరవాలి"

"నా మాట విను! తలుపు తెరవకు" అన్నాడతడు దుఃఖంతో గొంతు బొంగురు పోతుండగా.

"నీ కొడుకును చూడ్డానికే నీవు భయపడ్తున్నావా!" అందామె విడిపించు కుంటూ– "నన్ను వెళ్లనివ్వు; నేను వస్తున్నా హెర్‌బర్ట్! నేను వస్తున్నాను"

తలుపు తట్టిన శబ్దం మరోసారి, ఇంకోసారి. ఒక్క ఉదుటున ఆమె ఆ వృద్ధుడి పట్టు వదిలించుకుని పైగది తలుపు తెరచుకుని మెట్లు దిగసాగింది. ఆమె వెనకనే ఆ వృద్ధుడు ఆమెను తలుపు తెరవ వద్దని బతిమలాడుతూ. తలుపు గడియ తీయగలిగింది గాని పైన బిగించిన గొళ్ళెం అందలేదు ఆమెకు. ఆమె రొప్పుతూ అరిచింది “గొళ్ళెం!” ఆమె అరిచింది బిగ్గరగా– “రా కిందకు! నాకు అందడం లేదు”

అప్పటికే అతడు తన చేతిలోంచి జారిపడిన ‘కోతిచెయ్యి’ కోసం నేలపై చీకట్లో వెదుకుతున్నాడు. బయటనున్నది లోనికి వచ్చేలోపున ఏదైనా చెయ్యాలని అతడి ప్రయత్నం. తలుపు దబదబ మోగుతుండగానే ఆమె కుర్చీ లాక్కువచ్చి తలుపుకు ఆన్చింది. గొళ్ళెం తీద్దామన్న ఉద్దేశంతో కాబోలు. కుర్చీ లాగిన శబ్దం, గొళ్ళెం తీస్తున్న శబ్దం వినబడుతుండగానే అతడికి వెదకుతున్న ‘కోతిచెయ్యి’ దొరికింది. దాన్ని పట్టుకుని అతడు తన మూడో కోరిక కోరాడు.

తలుపు తట్టుడు చటుక్కున ఆగిపోయింది. కాని వాటి ప్రతిధ్వనులింకా ఇంటిలో వినిపిస్తుండగానే ఆమె, గొళ్ళెం తీసి, కుర్చీని పక్కకు లాగి తలుపు తెరచింది. చల్లటి గాలి విసురుగా గదిని నింపి మెట్లవేపు ఈడ్చికొట్టింది. నిస్పృహ, ఆశాభంగంతో నిండిన ఆమె అరుపును వినగానే అతడికి ధైర్యం రాగా మెట్లు దిగి పరిగెత్తుకువచ్చి ఆమె పక్కనే నిలబడినాడు. ఆ తరువాత బయట గేటు వరకు వెళ్లి చూసాడు. అటుపక్క మిణుకు మిణుకుమంటూ వెలుగుతున్న వీధి దీపం కాంతిలో దారి ప్రశాంతంగా, నిర్మానుష్యంగా ఉన్నది.

✧✧✧✧✧

---

### విలియం వైమార్క్ జాకబ్స్ (William Wymark Jacobs 1863-1943)

విలియం వైమార్క్ జాకబ్స్ – ఆంగ్ల రచయిత, కథకుడు. అతడి రచనలలో అత్యంత ప్రసిద్ధికెక్కినది **"The Monkey's Paw" (కోతిచెయ్యి)** అనే హారర్ స్టోరీ. ఇది సెప్టెంబర్ 1902లో ప్రచురితమైంది.

ఈ కథ ఎంత ప్రాచుర్యాన్ని పొందిందంటే ఎన్నో నాటకాలు, రేడియో నాటికలు, నవలలు, కథలు, సినిమాలు, కామిక్స్‌లకు ఆధారమైనదీ కథ. ఈ కథలో మూడు సంఖ్య ప్రధానపాత్ర వహిస్తుంది. కోతిచెయ్యి లేదా Monkey's Paw కు సాధువు నిర్ణయించిన ప్రకారం అది ముగ్గురు వ్యక్తులకు మూడేసి కోరికలను తీర్చగలదు. మొదటివాడు చావును కోరుకున్నాడు. రెండవ వాడు సార్జంట్ మేజర్.

మూడవవాడు మిస్టర్ వైట్. మూడు గ్లాసులు విస్కీ తాగినాకే సార్జంట్ మేజర్ ఈ కథ చెబుతాడు. మూడుసార్లు గట్టిగా చెబుతాడు "ఈ 'కోతిచెయ్యి' తీసుకోవద్దు. పారేయ్" అని; మా అండ్ మెగ్గిన్స్ నుండి వచ్చిన వ్యక్తి కూడా మూడుసార్లు గేటు వద్దకు వచ్చి వెనుదిరిగి మరలా వస్తాడు. మిసెస్ వైట్ మూడుసార్లు తన భర్తను గట్టిగా అడుగుతుంది హెర్‌బెర్ట్ వచ్చేలా కోరుకోమని. హెర్‌బర్ట్ శవం బతికి వచ్చి మూడుసార్లు తలుపు తట్టినాకే ఆమెకు వినబడ్తుంది. ఈ కథ కూడా మూడు భాగాలుగా వ్రాయబడింది. మొదటి భాగం కథ తుఫానులో, రెండవది శీతాకాలపు ఉదయాన, మూడవ భాగం శీతాకాలపు అర్ధరాత్రి నడుస్తాయి.

పాశ్చాత్య నాగరికతలో మూడు (3)కున్న పోలికలను జాకబ్స్ ఈ కథలో విస్తృతంగా వాడినాడు. "Bad Luck Comes in threes" అన్నది పేరుబడిన ఉవాచ. పవిత్ర–ట్రినిటి –త్రిమూర్తితత్వం – Father, Son, Holy Spirit అందరకూ తెలిసిందే. క్రిస్టియన్ థియోలజీలో నాన్ క్రిస్టియన్ టొటెమ్ (కోతిచెయ్యి) ను నమ్మడం ట్రినిటిని అగౌరవపరచినట్లుగా భావిస్తారు.

ఈ కథలోని Monkey's Paw - కోరికకు, దురాశకు చిహ్నం.

"Be Careful What you wish for, You may receive it" ఏదైనా వరమో, కోరికో కోరుకునేప్పుడు ఆలోచన, సంయమనం అవసరం. దురాశ, ఆలోచనను నశింపచేసి స్వార్థాన్ని పైకుబికిస్తుంది. ఈ వృద్ధ దంపతులు కోరుకున్న రెండు వందల పౌండ్లు తమ కుమారుడి మరణం వల్ల లభించడం యాదృచ్ఛికమే కావచ్చు కాని వారికి అశనిపాతమే కదా!

"జీవితమే ఒక చదరంగం" అన్న సూక్తి కూడ ఈ కథ – తండ్రీ కొడుకులు చదరంగం ఆడుతున్న సన్నివేశంతో ప్రారంభమై– అనవసరపు రిస్కులు తీసుకునే వ్యక్తి ప్రమాదాల పాలవుతాడన్న విషయాన్ని అన్యాపదేశంగా చెబ్తుంది. చదరంగంలో ఆడినట్లే కోరికలు కోరడంలో కూడ మిస్టర్ వైట్ వేసిన ఎత్తులు వాళ్ల జీవితంలో అంతులేని విషాదాన్ని సృష్టిస్తాయి.

# 18. పాఠశాల
## (School)

**- డోనాల్డ్ బార్థల్మె**

శుభం భూయాత్! మేమనుకున్నాం పిల్లలు చెట్లు నాటడం నేర్చుకోవడం మంచిది. ఎందుకంటే అదీ చదువులో ఒక భాగమే... ఎలాగంటే, నీకు తెలుసుగదా– మూలాల్లోకి పోవడం... బాధ్యత, సంరక్షణ, పోషణ ఇవన్నీ వ్యక్తిగతంగా ఆచరించడం – ఇవన్నీ ఈ విస్తృత జ్ఞాన సముపార్జనలో ఒక ముఖ్యాంశంగా– మేము భావించాం. పిల్లలు చెట్లు నాటారు. కొద్ది రోజులకే అన్నీ ఎండిపోయాయి. నారింజ చెట్లే అన్నీ. కారణం తెలీదు కాని, అన్నీ చచ్చిపోయాయి. నేలలో లోపమో లేక, నర్సరీ వాళ్లు సరైన మొక్కలను ఇవ్వలేదో తెలీదు. మేమయితే ఫిర్యాదు చేసాం. పిల్లలు మొత్తం ముప్ఫైమంది. ప్రతి ఒక్కరికి ఒక మొక్క ఇచ్చాం. దాన్ని నాటి, నీరు పోసి పెంచి సంరక్షించే బాధ్యత నాటినవాడిదే. ఇప్పుడు ఆ పిల్లలంతా ఎండిన గోధుమరంగు పుల్లల వేపు అదోలా చూస్తున్నారు. నాలో ఏదో దిగులు.

ఈ విషయం మరీ అంత బాధగా ఉండేది కాదేమోకాని, ఈ మొక్కలు ఎండిపోవడానికి రెండు వారాలకు ముందు పాములన్నీ చచ్చిపోయాయి. ఎందుకని? చివరకు తేలిందేమిటంటే– సమ్మెవలన నాలుగు రోజులు బాయిలర్ మూసేశారు. చలికి తట్టుకోలేక అవన్నీ చచ్చిపోయాయి. సమ్మె కారణాన్ని చూపించి పిల్లలకు సర్దిచెప్పవచ్చు. అంతేకాక తల్లిదండ్రులెవరూ పికెట్ చేస్తున్న లైను దాటి పిల్లల్ని పంపడానికి ఇష్టపడలేదు సమ్మె ముగిసి మరల పరిస్థితులు యధాస్థితిలోకి వచ్చేసరికి పాములు– వాటిని ఎవ్వరూ కదిలించని ప్రదేశానికి వెళ్లిపోయాయి.

ఔషధ వనం సంగతంటే అది ఎక్కువ నీళ్లు పోయడం వల్ల దెబ్బతిన్న దనుకుంటా! పిల్లలు వాటిని జాగ్రత్తగా సంరక్షించుకోవాలని అనుకుని మేం చూడనప్పుడల్లా కొద్దికొద్దిగా నీరు వాటి అవసరానికి మించి పోసినట్టున్నారు. లేక ఎవరైనా కుట్రపన్నారంటావా? నేను అలా అనుకోను కాని, అటువంటి పుకారేదో అందరిమధ్యన నలిగింది. మా మనుసులో ఏదో అనుమానం, కుట్ర అని ఎందుకంటు న్నానంటే ఇంతకుముందు ఇలానే మూకుమ్మడిగా... జెర్బిల్స్, తెల్ల ఎలుకలు, సాలమాండర్‌లు... చచ్చిపోయాయి. పిల్లలకు అర్థమయ్యిందేమిటంటే ప్లాస్టిక్ సంచుల్లో వాటిని పట్టుకుని తిరగడం వాటికి మంచిదికాదని.

ట్రోపికల్ ఫిష్– ఉష్ణప్రాంతాల్లో పెరిగే చేపలు అవి చనిపోవడం సహజమే! దాంట్లో ఆశ్చర్యం లేదు. ఎన్ని? ఎన్నో లెక్కపెట్టామా, ఏమిటి? అవి వాటి పొట్టలు పైకి రాగా నీటి ఉపరితలాన తేలుతూ– వాటి గురించి చెప్పాల్సిన పాఠం, షెడ్యూల్ ప్రకారం అప్పుడే ఉందాయె! ఏం చేయగలం మేము. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరమూ అంతే– త్వరగా సిలబస్ పూర్తిచేస్తే చాలు. చేపల్దేముంది, వచ్చే సంవత్సరం మళ్లీ తెప్పించుకోవచ్చు, ఎప్పటిలానే!

కుక్కపిల్లను తీసుకురావడానికి వీల్లేదు ఈ పాఠశాలలోకి. ఎందుకంటే అదంతే! రూల్సు ఒప్పుకోవు. అయితే ఏమయ్యిందంటే మర్డొక్ బాలిక వస్తుంటే గ్రిస్టెడి ట్రక్కు కింద చిన్ని కుక్కపిల్ల పడుకుని ఉండడం చూసింది. డ్రైవర్ ట్రక్కును స్టార్ట్ చేసాడు. కుక్కపిల్ల ఎక్కడ ట్రక్కు వెనక చక్రాల క్రింద పడుతుందేమోనని, ఆ బాలిక కుక్కపిల్లను తన పుస్తకాల సంచిలో ఉంచి స్కూలుకు తెచ్చింది. అలా మా దగ్గరకు ఆ కుక్కపిల్ల చేరింది. దాన్ని చూడగానే నేననుకున్నాను, దేవుడా, ఈ కుక్కపిల్ల ఇక్కడ రెండు వారాలకన్నా ఎక్కువ బతుకుతుందా? అని... అట్లాగే జరిగింది. రూలు ప్రకారం కుక్కపిల్ల క్లాస్‌రూమ్‌లో ఉండకూడదు, కాని, ఉంది కదా. ఇప్పుడేం చెయ్యాలి? పిల్లల ముందు అది అటుయిటూ పరిగెత్తుతూ యాప్, యాప్ అని అరుస్తున్నది. దానికి నా పేరు పెట్టారు– 'ఎడ్గార్' అని. దాని వెనకే పరిగెత్తుతూ– 'హే ఎడ్గార్! నైస్ ఎడ్గార్!' అని అంటూ వాళ్లు పకపక నవ్వుతూ గోలగోల చేయసాగారు. వాళ్లకా ద్వంద్వార్థం నచ్చినట్లుంది. నాకూ సరదాగానే ఉండింది. నాకే పట్టింపులు లేవు పెద్దగా! స్టోర్ రూంలో దానికో చిన్న ఇల్లు కట్టారు. వాళ్లు చేయగలిగినవి చేసారు. డిస్టెంపర్ వాసనకు కావచ్చు లేదా దానికి ఇవ్వాల్సిన సూదిమందులు ఇవ్వలేదేమో! పిల్లలు వచ్చేలోపునే దానిని బయటకు తీసాను. ప్రతిరోజు ఉదయం నేను స్టోర్‌రూం ఛెక్ చేసేవాడినెందుకంటే నాకు తెలుసు అది ఎక్కువ కాలం బతికి ఉండదని. దాన్ని కస్టోడియన్–సంరక్షకుడికి అప్పగించాను.

ఇదుగో ఈ కొరియన్ అనాధ పిల్లాడి గురించి. క్లాస్ –అతడిని దత్తత తీసుకున్నది. ప్రతినెలా ప్రతి విద్యార్థి ఓ పావలా తెచ్చి ఇవ్వాలి అతడి పోషణార్థం, ఆ పిల్లవాడి పేరు 'కిమ్'. దురదృష్టమేమిటంటే ఇక్కడకు వచ్చేప్పటికే అతగాడి ఆరోగ్యం బాగోలేదనుకుంటా! వాళ్లు అతడి మరణానికి కారణం చెప్పలేదు కాని, ఆ ఉత్తరంలో మమ్మల్ని ఇంకో కుర్రాడిని దత్తత చేసుకోమని సలహా యిస్తూ కొన్ని ఆసక్తికరమైన కేస్ హిస్టరీలనూ పంపారు. కాని మాకు గుండె ధైర్యం చాల్లేదు. క్లాసు ఎంతో ఖేదపడింది. ఎవరూ నాతో ఏమీ అనలేదు కాని వాళ్లు ఈ పాఠశాలలో ఏదో తప్పు జరుగుతుందని భావిస్తున్నారని అనిపించింది. నాకైతే ఏ తప్పు కనిపించలేదెందుకంటే, నేను ఇంతకన్నా ఘోరమైనవీ చూసాను. ఇంతకన్నా

మెరుగైనవీ చూసాను. ఇవి దురదృష్టపు ఘడియలు. ఈరోజుల్లోనే చాలామంది పెద్దవాళ్లు, తల్లిదండ్రుల మరణాల్ని చూసాము. రెండు గుండెపోట్లు, రెండు ఆత్మహత్యలు, కారు ప్రమాదంలో నలుగురి మరణం; ఒక స్ట్రోక్ అంతేకాక వృద్ధులు– పితామహుల వయస్సున్న వాళ్లు ఆడ, మగా ఈ సంవత్సరం కాస్త ఎక్కువ మందే చనిపోయారు– అనిపించింది. చివరగా ఈ విషాదం.

మాథ్యూ వీన్, టోని మాఫ్రౌగార్డొ బయట ఆడుకుంటున్నారు. ఆ పక్కనే కొత్త ఫెడరల్ ఆఫీస్ బిల్డింగ్ కోసం తవ్విన లోతైన గుంటలున్నాయి. పెద్దపెద్ద కొయ్య దూలాలు ఆ గోతుల అంచు పక్కన పేర్చినట్లున్నారు. ఇప్పుడది పెద్ద కోర్టుకేసు అయ్యింది. కొయ్య దూలాల్ని సరిగా బందోబస్తుగా ఉంచలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నాకైతే అది నిజమో కాదో తెలీదు. మొత్తానికి ఈ సంవత్సరం విషాదాన్ని మిగిల్చిన సంవత్సరం. అసాధారణమైన సంవత్సరం.

నేను మరిచేపోయాను బిల్లీ బ్రాండ్ట్ నాన్నను ఎవడో ముసుగువ్యక్తి కత్తితో దారుణంగా పొడిచాడన్న సంగతి మీకు చెప్పడం.

ఒకరోజున క్లాసులో చర్చ జరిగింది. పిల్లలడిగారు– “వీళ్లంతా ఎక్కడికి వెళ్లారు? చెట్లు, సాలమాండర్, చేపలు, ఎడ్గార్, అమ్మలు, నాన్నలు, మాథ్యూ, టోనీ ఎక్కడకు వెళ్లారు?”

నేనన్నాను– “నాకు తెలీదు, నాకు తెలీదు”, వాళ్లడిగారు “ఎవరికి తెలుసు”

నేనన్నాను– “ఎవరికీ తెలీదు” – వాళ్లడిగారు– “మరణం జీవితానికి అర్థం ఇస్తుందా?” నేనన్నాను– “కాదు, జీవితమే జీవితానికి అర్థమిస్తుందన్నాను.” వాళ్లన్నారు– “ఈ లౌకిక జీవనానికి కొలమానం మృత్యువే కదా! – ప్రతిరోజూ ఆ దిశవేపే కదా... పయనం?” అన్నారు వాళ్లు; “కావచ్చు” అన్నాను నేను.

వాళ్లన్నారు– “మాకిది నచ్చలేదు”

“మీ అభిప్రాయం సరైనదే!” అన్నాన్నేను.

“ఇది అవమానకరమైనది” అన్నారు వాళ్లు; అవునన్నాను నేను.

వాళ్లడిగారు– “నీవిప్పుడు నీ అసిస్టెంటు హెలెన్‌ను మా ముందు ప్రేమించగలవా? అదెలా ఉంటుందో చూస్తాము, మాకు తెలుసు నీకు హెలెన్ అంటే ఇష్టమని” అన్నారువాళ్లు.

నాకు హెలెన్ అంటే ఇష్టమే కాని వాళ్లడిగింది చేయలేనన్నాను. “మేము దాని గురించి చాలా విన్నాము, కాని చూడలేదు” అన్నారు వాళ్లు.

"నా ఉద్యోగం ఊడుతుంది. అంతేకాక మీరడిగింది ఇలా ప్రయోగంలా, డిమాన్‌స్ట్రేషన్‌లా చూపించేది కాదు" అన్నాను నేను.

హెలెన్ కిటికీలోంచి బయటకు చూస్తున్నది.

వాళ్లు బతిమలాడారు– "ప్లీజ్, ప్లీజ్, మేక్ లవ్ విత్ హెలెన్! మేము ఒక విలువ గురించి తెలుసుకోవాలనుకుంటున్నాము. ఇవన్నీ – ఈ మరణాలు చూసి మేం భయపడ్డాం!"

"మీరు భయపడాల్సిన పనిలేదు" (నేను చాలాసార్లు భయపడ్డాను) అన్నాన్నేను. "విలువలనేవి అన్నిచోట్లా ఉంటాయి"

హెలెన్ వచ్చి నన్ను కౌగలించుకున్నది. నేను ఆమె కనుబొమలపై కొద్దిసార్లు ముద్దు పెట్టుకున్నాను. మేం అలాగే ఉండిపోయాం. పిల్లలు చాలా ఉత్సాహంగా ఉన్నారు.

తలుపు తట్టిన శబ్దం. నేను వెళ్లి తలుపు తెరిచాను. కొత్త జెర్బిల్ లోనికి నడుచుకుంటూ వచ్చింది. పిల్లలు ఉద్రేకంగా, ఆనందంగా అరుస్తున్నారు.

✧✧✧✧✧

---

## డొనాల్డ్ బార్థెల్మె (Donald Barthelme - 1931-1989)

డొనాల్డ్ బార్థెల్మె అమెరికన్ రచయిత. పోస్ట్‌మోడర్నిజం శైలిలో అనేక కథలు వ్రాసి ప్రఖ్యాతిగాంచాడు. రిపోర్టర్‌గా, ఆర్ట్ డైరెక్టర్‌గా, అనేక విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా పనిచేసాడు. పదకొండు కథాసంపుటాలు, నాలుగు నవలలు, ఇంకా అనేక గ్రంథాలు వ్రాసిన డొనాల్డ్ బార్థెల్మె కథ 'The School' ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది.

హూస్టన్ యూనివర్శిటీలో అతడు కొందరు మిత్రులతో కలిసి రూపొందించిన క్రియేటివ్ రైటింగ్ ప్రోగ్రాం ఎందరో రచయితలకు మార్గదర్శనం చేసింది.

1974లో ప్రచురితమైన 'The School' కథ – ఒక ఉపాధ్యాయుడు తన మిత్రుడితో ఆ స్కూల్లో వరసగా జరిగిన సంఘటనలను వివరిస్తున్నట్లుంటుంది. 'మరణం జీవితానికి అర్థమిస్తుందా' అనే ప్రశ్న పాఠశాలలో పిల్లలు అడిగినప్పుడు అసహజంగా ఉన్నా జీవిత పాఠశాలలో మనలాంటి పిల్లలు ప్రతిరోజు మనలో మనం చర్చించుకునే ప్రశ్నే కదా!

మృత్యువు, భయం, బాధ్యత, అమాయకత్వాన్ని కోల్పోవడం, జననం, ఇవన్నీ సింబాలిక్‌గా ఈ కథలో రచయిత చూపిస్తాడు.

# 19. మధ్యవర్తులు
## (Interlopers)

**- సాకి**

కార్పాథియన్ పర్వతాలకు తూర్పుదిక్కున ఉన్న అడవి, పెద్దపెద్ద చెట్లు, పొదలు, రకరకాల జంతువులు, అయితే, అతడు ఆ శీతాకాలపు రాత్రి ఏదో క్రూరమృగాన్ని వేటాడడానికి వచ్చినట్లు మౌనంగా నిలబడి జాగ్రత్తగా అడివి శబ్దాల్ని వింటున్నాడు. అతడి చేతిలోని తుపాకి రేంజిలోకి, అతడి దృష్టి పోగలిగినంత దూరంలోకి ఇంకా ఏ జంతువూ రాలేదు. ఎందుకంటే అతడి మనసు వేటగాడు వెదికే న్యాయసమ్మతమైన జంతువుల మీద కాదు; ఉల్రిచ్ వాన్ గ్రాడ్‌విట్జ్ ఆ రాత్రి తన మానవ శత్రువు కోసం మాటువేసి ఉన్నాడు.

గ్రాడ్‌విట్జ్‌కు చెందిన అడవి ప్రాంతం చాలా విశాలమైనదే కాక వేటాడతగ్గ జంతువులతో నిండి ఉంది. అంచున ఉన్న అడవి మాత్రం పలచగా ఉండి వేటకు అనువైనది కాదు, కాని అది యజమాని దృష్టిలో ఎంతో విలువైనది. ఎందుకంటే తమ తాతగారి కాలంలో, ఎంతో పేరు పొందిన న్యాయస్థానపు తీర్పు వల్ల దాన్ని ఆక్రమించుకున్న పొరుగువాడి చేతుల్లోంచి విముక్తమై, మరల తమ అధీనంలోకి వచ్చింది. అయినా తమ మొండి పట్టువదలని ఆ శత్రు కుటుంబం అనేక మార్లు వీళ్ల భూభాగంపై దాడులు చేస్తూ, తమ ప్రాంతపు వన్యప్రాణి సంపదను కొల్లగొడ్తూనే ఉన్నారు. ఇదేకాక ఇతర తగాదాలు కూడా గోరంతవి కొండంతలై రెండు కుటుంబాల మధ్య, గత మూడు తరాలుగా, పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థితికి వచ్చాయి. సరిహద్దు తగాదాలు ముదిరి అవి వ్యక్తిగత పగలుగా మారి ఉల్రిచ్ ఇటు కుటుంబ పెద్దగా మారినాక అతడికి ఉన్న ధ్యేయమల్లా తన శత్రువును హతమార్చడమే అన్నట్లుగా నిర్ణయమయ్యింది. అతడి శత్రువు జార్జి నీయమ్ (Georg Znaeym) అటు నుంచి శతృత్వానికి వారసుడై తన యధాశక్తి ఉల్రిచ్ అటవీ ప్రాంతంపై దాడులు చేస్తూ వారసత్వాన్ని నిలబెడ్తూ వస్తున్నాడు.

కాస్త ఇరుపక్షాలు ప్రయత్నిస్తే చల్లారిపోయే సమస్యే! కాని వ్యక్తిగత వైషమ్యాలు దానికి అడ్డువచ్చాయి. ఇద్దరూ అనుచరుల్ని సమకూర్చుకున్నారు. ఒకరి రక్తం ఇంకొకరు కళ్లచూడాలనేదే వాళ్లకు జీవితాశయమైంది. ఈ శీతల రాత్రి ఉల్రిచ్ తన అనుచరులతో నాలుగు కాళ్ల మృగాల కోసం కాక, రెండు కాళ్ల శత్రువులు చట్టవ్యతిరేకంగా తన అటవీ ప్రాంతంలోకి చొరబడితే వాళ్ల అంతు చూడాలని

ఇటు సర్వ సరంజాతో వచ్చాడు. రోబక్ లేళ్లు, మామూలుగా గుహల్లో నిదరపోయేవి ఎందుకో జంతువులు కూడా వేగంగా పారిపోతున్నట్లు కనిపించాయతడికి. మిగతా జంతువులు కూడా ఏదో ప్రమాదం ముంచుకువస్తున్నట్లు పరుగులు దీస్తున్నవి. అది ఎటునుంచి వస్తుందో ఉల్రిచ్ పసిగట్టగలిగాడు.

తన అనుచరుల నుంచి విడివడి కొండ దిగి దిగువ చెట్ల సందుల్లోంచి, పొదలు, లతల పక్కల నుంచి వస్తున్న గాలి తరగల ఈల ధ్వనుల్ని తప్పించుకుంటూ, తన అడవిలోకి చొరబడ్తున్న వేటగాళ్ల కోసం వెదకుతున్నాడు. ఇక్కడే, ఈ చీకటి నడక, ఒంటరిగా, జార్జ్ నీయమ్ దొరకాలి. ఒక్కడే – మనిషికి మనిషి, – దొరకాలి – వాడి అంతు చూస్తాను. ఈ ఆలోచన క్రమేపీ తీవ్రమైన కోరికగా బలపడసాగింది. ఆ దుర్మార్గుడు జార్జ్ దొరకాలి – దొరికితేనా అనుకుంటూ ఆ పెద్ద బీచ్ వృక్షపు మొదలు దాటి కాస్త ముందుకు అడుగు వేసాడు.

ఎదురుగా తన చిరకాల శత్రువు!

ఇద్దరు శత్రువులూ ఒక దీర్ఘక్షణంసేపు ఒకరినొకరు తీక్షణంగా చూస్తూ శిలల్లా నిలబడ్డారు. ఇద్దరి చేతుల్లోనూ రైఫుల్స్, ఇద్దరి హృదయాల నిండా ద్వేషం, మనస్సులో ఎదుటి వాడిని హతమార్చాలనే తీవ్రమైన కోరిక, ఒక జీవితకాలపు కోరిక; ఉద్వేగంతో నిండిన కామన ఇప్పుడు వాళ్ల ముందుకు తరుముతున్నట్లు వచ్చింది. అయితే నవీన నాగరిక సమాజంలో శిక్షణ పొందిన ఏ వ్యక్తీ ఎదుటివాడిని నిర్దాక్షిణ్యంగా షూట్ చేసి శీతల రక్తంలోకి నెట్టే ముందు ఒక్కమాట, తన మనసులో ఇన్నాళ్లూ గూడుకట్టుకున్న ద్వేష పదాల్ని చెప్పకుండా ఎట్లా చంపుతాడు?

ఆ ఒక్క క్షణకాలపు సందిగ్ధం చేతల్లోకి వచ్చేప్పటికే ఆలస్యమైపోయింది. ప్రకృతి భీభత్సం వాళ్లకన్నా వేగంగా స్పందించింది. అప్పటి వరకు ఓ మోస్తరుగా ఉన్న గాలి ఒక్కసారి ప్రళయ భయంకరంగా మారి చెట్లూ పొదలూ అల్లల్లాడి పోయాయి. వాళ్లు నిశ్చేష్టులై చూస్తూ ఉండగానే భీకరమైన ఉరుములు మెరుపుల్తో వాళ్ల పక్కనే ఉన్న బీచ్ చెట్టు వాళ్లు పక్కకు దూకే సమయం ఇవ్వకుండా పెద్ద శబ్దంతో విరిగిపడింది.

ఉల్రిచ్ వాన్ గ్రాడ్‌విట్జ్ నేలమీద వెల్లకిలా పడ్డాడు. ఒక చేయి మెలిదిరిగి విరిగినట్లు నడుం వెనక్కి ఉండగా రెండోచేయి చెట్టుకొమ్మలా వేలాడుతున్నది. రెండు కాళ్లూ కుప్పగా తన మీద పడ్డ చెట్టు మొదలు కింద నలిగిపోయాయి, కదిలే వీలు లేకుండా ఉన్నాయి. వేటాడేప్పుడు వేసుకునే బూట్ల వల్ల పాదాలు రక్షింపబడ్డాయి కాని కాళ్ల ఎముకలు విరిగి, ఎవరన్నా వచ్చి తనకు సాయం చేస్తే గాని బయట పడి

లేవలేని స్థితిలో ఉన్నాడతడు. కొమ్మలు గీసుకుని మొహం నిండా గాయాలే! కళ్లు ఆర్పి కనురెప్పల మీంచి కారుతున్న రక్తాన్ని కాస్త పక్కకు నెట్టి తన చుట్టూ ఉన్న విధ్వంసాన్ని అంచనా వేయడానికి ప్రయత్నించాడతడు.

తన పక్కనే చేతులు చాస్తే అందేంత దూరంలోనే జార్జి నీయమ్, బతికే ఉన్నాడు కాని అతడూ తనలానే చెట్టు కింద చిక్కుకుని అసహాయుడై అలమటిస్తున్నాడు. అతడి చుట్టూరా దట్టంగా కమ్ముకున్న కొమ్మలు రెమ్మలు ఆకులు.

తను బతికున్నందుకు కాస్త మనఃస్థిమితం, శత్రువు అసహాయస్థితిలో ఉన్నందుకు ధూర్త ఆనందం ఓ క్షణం పాటు ఉల్రిచ్ పెదాలపై వింత ద్వంద్వ పదాలున్న దీవెనలు తిట్లను పలికించింది. జార్జి కళ్లపై కారిన రక్తం గడ్డకట్టి అతడిని దాదాపు అంధుడిని చేయగా అతడు ఓ క్షణం పాటు బయటపడడానికి చేస్తున్న ప్రయత్నాన్ని విరమించి, చుట్టూ ఏం జరుగుతుందో వినడానికి ప్రయత్నించి, చివరకు ఓ తిరస్కార పూరితమైన నవ్వు నవ్వాడు.

"అయితే నీవు చావలేదన్నమాట, చావకపోయినా దొరికిపోయావు కదా! చాలా వేగంగా, నేలకు నొక్కివేయబడ్డావు. అదీ, అదీ, న్యాయమంటే! అవునా? ఉల్రిచ్ వాన్ గ్రాడ్‌విట్జ్ తాను దొంగిలించిన అడవి ఉచ్చులో తానే చిక్కుకున్నాడు. అదీ ప్రకృతి న్యాయం! హా!హా!హా!" అంటూ అతడు మళ్లీ నవ్వాడు- ఎగతాళి చేస్తున్నట్లు, రాక్షసత్వం నిండిన నవ్వుతో -అతడు జార్జినీయమ్-

"నేను నా స్వంత అడవిలో, నా చెట్లకింద చిక్కుకుపోయాను సరే" తిరిగి అరిచాడు ఉల్రిచ్ - "మరి నీ పరిస్థితేమిటి? నా అనుచరులు వచ్చి నిన్ను బంధించినప్పుడు అప్పుడనుకుంటావు- ఈ చొరబాటు దొంగతనం పొరుగువాడి అడవిలో చేయకుండా ఉంటే నాకీ పరిస్థితి వచ్చి ఉండేది కాదు కదా అని వలవలా ఏడుస్తావు, సిగ్గులేదు నీకు!"

జార్జి ఒక్కక్షణం మాట్లాడలేదు. ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు- "నీ అనుచరులు వచ్చి నిన్ను బయటకు తీస్తే నీ శరీరంలో ఎంతభాగం మిగిలుంటుం దనుకుంటున్నావు? నేనూ నా మనుషుల్తో వచ్చాను. వాళ్లు నా వెనకే వస్తున్నారు. వాళ్లు ముందు వచ్చి నన్ను విడిపిస్తారు. నన్ను విడిపించాక వాళ్లకు నీ కాళ్లమీద ఉన్న ఆ చెట్టు మొద్దును నీ మొహం మీద పడేసి పచ్చడి చేయడం పెద్ద పనేం కాదు. నీవాళ్లు వచ్చేసరికి నీవు పెద్ద బీచ్ మొదలు కింద చచ్చి పడి ఉంటావు. నేను ఆచారం ప్రకారం నీ కుటుంబానికి సంతాప సందేశం ఘనంగా పంపుతాను"

"భలే సలహా ఇచ్చావు సుమా!" అన్నాడు ఉల్రిచ్ భీకరంగా– "నేను నా అనుచరుల్ని పది నిముషాల వ్యవధిలో రమ్మన్నాను. ఏడుగురు ఈ సరికే బయల్దేరి ఉంటారు. వాళ్లు వచ్చి నన్ను బయటకు తీయగానే నీ సలహా నేను పాటిస్తాను. నీవు చట్టానికి విరుద్ధంగా నా అడవిలో వేటాడినందుకు అందరూ అంగీకరించిన శిక్షనే అనుభవిస్తావు. నేరస్తుడి కుటుంబానికి సంతాప సందేశం పంపాల్సిన అవసరం లేదు"

"మంచిది" అరిచాడు జార్జి – "మనం ఈ తగాదాను చచ్చేవరకూ సాగిద్దాం. నీవూ నీ అనుచరులూ, నేనూ నా సేవకులూ – మధ్యలో ఎవరి మధ్యవర్తిత్వం మనకు వద్దు. నీకు చావు వస్తుంది, నీవు నాశనమైపోతావు ఉల్రిచ్ వాన్‌గ్రాడ్‌విట్జ్!"

"నీకూ అంతే, జార్జి నీయమ్, అడవి దొంగా, దుర్మార్గుడా!"

ఇద్దరూ ఒకరినొకరు దూషించుకుంటూ ఎదుటివాడి శాశ్వత పరాజయాన్ని కాంక్షిస్తున్నారు. కాని ఇద్దరికీ తెలుసు తమ అనుచరులు రావడానికి ఇంకా సమయం పడుతుందని. ఎవరి అనుచరులు ముందుగా అక్కడకు చేరుకుంటారనేది కేవలం ఛాన్సే గాని ఛాయిస్ కాదు.

ఇద్దరూ ఆ చెట్టుమొద్దు కింద నుంచి బయట పడడానికి చేసే ప్రయత్నాలు ఆపేసారు అది వృథా ప్రయాస అని గ్రహించాక. ఉల్రిచ్ చాలా కష్టంతో దెబ్బ తగలని చేతిని నెమ్మదిగా తన కోటు జేబులోకి పోనిచ్చి వైన్‌ఫ్లాస్క్‌ను బయటకు తీసాడు. అయినా దాని స్క్రూటైపు మూత తీసి, దాంట్లోని ద్రవాన్ని నోట్లో పోసుకోడానికి చాలానే సమయం పట్టింది. కాని ఆ కాస్త ద్రవం అతడికి అమృతతుల్యంగా అనిపించింది. చలికాలమే అయినా ఇంకా మంచు కురవడం లేదు గనక చెట్టు మొదలు కింద చిక్కుకుపోయిన వీళ్లకు మంచు దెబ్బ తగల్లేదు. వైన్ గొంతులో నుంచి జారుతూ వెచ్చని అనుభూతిని కలిగిస్తూ, ఒకింత స్వస్థతనిచ్చింది ఉల్రిచ్‌కు. అతడు తన పక్కనే పడి ఉన్న పొరుగువాడి వేపు చూసాడు. తన శత్రువు నెప్పితో, అలసటతో మూలుగుతున్నాడు. అతడిపై జాలి కలిగింది ఉల్రిచ్‌కు.

"నేను వైన్ ఫ్లాస్క్ విసుర్తాను నీవేపు అందుకో!" అన్నాడు ఉల్రిచ్. "మంచి వైన్ ఇది. కాస్త కంఫర్ట్! వెచ్చగా ఉంటుంది ఈ సమయాన, ఇదన్నా తాగుదాం ఇద్దరిలో ఒకళ్లం ఈ రాత్రి చచ్చేలోపున"

"వద్దు. నాకేమీ కనబడడం లేదు. నా కళ్లచుట్టూ రక్తం గడ్డకట్టి ఉంది. అయినా శత్రువుతో కలిసి నేను వైన్ తాగను" అన్నాడు జార్జి.

ఉల్రిచ్ కొద్ది నిముషాల పాటు మౌనంగా ఉండి గాలి చేస్తున్న భయం గొలిపే శబ్దాలను విన్నాడు. తన పక్కనే పడి వున్న అతడిని చూసినప్పుడు అతడి మెదడులో ఏదో ఆలోచన ప్రారంభమై అది క్రమేపీ బలపడసాగింది. తన శత్రువు నెప్పితో, అలసటతో చేస్తున్న వృధా ప్రయత్నాలను, మూలుగుల్ని విన్నప్పుడల్లా ఆ ఆలోచన మరింత బలపడింది. అటువంటి నెప్పి, బాధ, అలసట తను కూడా అనుభవిస్తున్నాడు కదా! నెమ్మదిగా అతడిలోని ద్వేషం, శత్రుభావం కొద్దికొద్దిగా సమసిపోసాగాయి.

"పొరుగువాడా!" అన్నాడతడు "నీ మనుషులు వచ్చాక నీ యిష్టం వచ్చినట్లు చేద్దువు గాని, మంచిదే! ఒక వేళ నా అనుచరులే ముందు వస్తే, వాళ్లు ముందుగా నీకు సాయం చేస్తారు. నాకు నీమీద ఇప్పుడు ద్వేషం లేదు. నా మనసు మారింది. నీవు నాకు అతిథివి. ఇన్నాళ్లు దెయ్యాల్లా పోట్లాడుకున్నాం, దేనికోసం? ఈ చిన్న అడవి ముక్క కోసం, కనీసం చిన్న గాలిని తట్టుకోలేని ఈ చెట్లకోసం. ఇక్కడ ఇలా పడి, ఆలోచిస్తుంటే నాకనిపిస్తున్నది మనం ఎంత మూర్ఖంగా ప్రవర్తించామో! సరిహద్దు తగాదాల కన్నా ముఖ్యమైనది, ఆనందించతగ్గవి జీవితంలో ఎన్ని లేవు? నీవు అంగీకరిస్తే మన మధ్య ఉన్న శత్రుత్వాన్ని పాతిపెడ్తాను. నిన్ను నా మిత్రుడిగా ఉండమని కోరుతున్నాను!"

జార్జి నీయమ్ ఎంతసేపు మౌనంగా ఉన్నాడంటే ఉల్రిచ్‌కు అనుమానం వచ్చింది అతడు నెప్పితో మూర్ఛపడిపోయాడేమో, అందుకే తన మాటలు వినలేదేమో? ఇంతలో అతడు నెమ్మదిగా ఒక్కోమాటే మాట్లాడినాడు.

"మనిద్దరం కలిసి సంతలో నడుస్తుంటే ఈ ప్రాంతమంతా ఎలా ఆశ్చర్యంగా మనవేపు చూస్తారో కదా! ఎక్కడ చూసినా మన గురించే మాట్లాడుకోరూ. బతికున్న వాడెవడూ నీయమ్, వాన్ గ్రాడ్ విట్జ్‌లు స్నేహపూర్వకంగా మాట్లాడుకోవడం చూసి ఎరగరే! మన శత్రుత్వం సమసిపోతే అడవి కాపలాదారులెంత శాంతంగా బతుకుతారు! మనమధ్య శాంతి, స్నేహం నెలకొంటే ఇంక ఏ మధ్యవర్తులతో, బయటివాళ్లతో అవసరమేమున్నది! నీవు 'సిల్వెస్టర్ రాత్రి' నాడు నా యింటికి రావాలి. నీ కోటలో విందుకు నేను వస్తాను... ఇక నీ అడవిలో నేను తుపాకీ కాల్చబోను, నీవు నన్ను అతిధిగా ఆహ్వానిస్తే తప్ప. నీవు కూడ నా అడవిలోని చిత్తడినేలల్లో పక్షుల్ని వేటాడడానికి రావచ్చు. మనం సఖ్యంగా ఉంటే మనిద్దరికి ఇక్కడ తిరుగేమున్నది. నిన్ను ద్వేషిస్తూ ఉండటమే పనిగా పెట్టుకున్న నేను ఆనందించిందేమీ లేదు. నేను కూడా నా మనసు మార్చుకున్నాను. గత అర్ధగంట నుంచి నాలోనూ

ఏదో తపన, ఆలోచన మొదలయ్యింది. నీవు నీ వైన్ ఫ్లాస్క్ నాకందించడానికి సిద్ధపడినప్పుడు... ఉల్రిచ్ వాన్ గ్రాడ్‌విట్జ్ – నీతో స్నేహం నాకు అంగీకారమే!”

కొద్దిసేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. వాళ్ల మనసుల్లో ఇప్పుడు ఎంతో ప్రశాంతత. ఈ శాంతి ఒడంబడికతో జరగబోయే ఎన్నో అద్భుత పరిణామాల్ని వాళ్లు నాటకీయంగా ఊహించుకుంటున్నారు. ఆ చల్లని, చీకటి అరణ్యంలో శీతల గాలులు చెట్ల కొమ్మల్ని, ఆకులు రాలిన మొండి శాఖల్ని కదిలిస్తూ చేస్తున్న అసాధారణ, వింత, భీతిగొలిపే శబ్దాన్ని వింటూ వాళ్లిద్దరూ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. తమ అనుచరులు వచ్చి తమను ఈ దారుణమైన పరిస్థితి నుంచి రక్షించగలరనే ఆశ. ఇద్దరూ ఇప్పుడూ తమ అనుచరులే ముందు వస్తే బాగుండునని, ఎదుటి వాడిని ముందు రక్షించి తమ ఔన్నత్యాన్ని, మంచితనాన్ని ప్రకటించాలని, శత్రువును మిత్రుడిగా చేసుకున్న గౌరవానికి అర్హుడు కావాలని తలపోస్తున్నారు.

గాలి వేగం కాస్త తగ్గింది. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఉల్రిచ్ అన్నాడు.

“ఇద్దరం సహాయం కోసం అరుద్దాం! గట్టిగా అరిస్తే ఈ నిశ్శబ్దంలో మన కేకలు కాస్త దూరం వినబడవచ్చు!”

“ఈ చెట్లూ, పొదల మధ్య నుంచి మన కేకలు అంతదూరం పోవడం కష్టమే – అయినా ప్రయత్నం చేద్దాం ఇద్దరం కలిసి” అన్నాడు జార్జి.

ఇద్దరూ గొంతెత్తి బిగ్గరగా వేట సమయపు కేకపెట్టారు.

“ఇంకోసారి” అన్నాడు ఉల్రిచ్ కొద్ది నిముషాల తరువాత– తిరుగు సమాధానం హల్లో అని వినిపించకపోయేసరికి– “నేనేదో విన్నాను, అనుకున్నాను”

“నాకు ఈ దరిద్రపు గాలి చప్పుడు తప్ప ఇంకేమీ వినబడలేదు” అన్నాడు జార్జి బొంగురుగా.

మరల కొద్ది నిముషాల సేపు నిశ్శబ్దం. ఉల్రిచ్ సంతోషంతో కేకపెట్టాడు.

“నాకు అడవిలో ఏదో నీడలు కదుల్తున్నట్లు కనిపించాయి. నేను వచ్చిన కొండ దిగువ దారి నుంచే అవి వస్తున్నాయి”

ఇద్దరూ గొంతెత్తి తమ శాయశక్తులా ఒక్కసారిగా కేకపెట్టారు.

“వాళ్లు విన్నారు. ఆగిపోయి, మరలా మనవేపు వస్తున్నారు. కొండవాలు నుంచి పరిగెత్తుకుంటూ వస్తున్నారు” అరిచాడు ఉల్రిచ్.

"ఎంతమంది?" జార్జి అడిగాడు.

"సరిగా చెప్పలేను కాని, తొమ్మిది పదిమంది ఉండవచ్చు" అన్నాడు ఉల్రిచ్.

"అయితే వాళ్లు నీ వాళ్లే! నాతోపాటు ఏడుగురే వచ్చారు" అన్నాడు జార్జి.

"వాళ్లు చాలా వేగంగా వస్తున్నారు. గట్టివాళ్లు" అన్నాడు ఉల్రిచ్ ఆనందంగా.

"వాళ్లు నీ మనుషులేనా?" అడిగాడు జార్జి "నీ మనుషులేనంటావా?" మరల మరల అడిగాడు, ఉల్రిచ్ సమాధానం చెప్పకపోయేసరికి.

"కాదు" అన్నాడు ఉల్రిచ్ అదోలా నవ్వుతూ.

"ఎవరు వాళ్లు" అడిగాడు జార్జి కళ్లు నిక్కబొడుచుకుని చూడ్డానికి ప్రయత్నిస్తూ, దేన్నైతే ఎదుటివాడు చూడవద్దనుకుంటున్నాడో దాన్ని.

"తోడేళ్లు" – తగాదా తీర్చడానికి వస్తున్న మధ్యవర్తులు!

✧✧✧✧✧

---

## సాకి (Saki 1870-1916)

హెక్టార్ హ్యూఘ్ మన్రొ (Hector Hugh Munro) బర్మాలో జన్మించిన హెక్టార్ తండ్రి మిలటరీ ఆఫీసర్. తల్లి అకస్మాత్తుగా చనిపోవడంతో ఇంగ్లాండ్‌లో నాయనమ్మ, ఇద్దరు నిరంకుశ అత్తల మధ్య పెరిగాడు. తల్లిదండ్రులకితడు మూడవ సంతానం. తలుపులు తెరవని ఇంట్లో అత్తలు ఇతడిని రోగగ్రస్తుడిగా భావించి పదో ఏడు వరకూ స్కూలుకు పంపలేదు.

పర్షియన్ కవి ఒమర్ ఖయ్యాం వ్రాసిన రుబాయత్‌లలో – మధువునందించే స్త్రీ పేరైన 'సాకి'ని తన కలం పేరుగా రచనలు చేసాడు మన్రొ. The Open Window, The story teller లాంటి అనేక కథలు అద్భుతమైన లేదా భయంకరమైన మలుపులతో సమాప్తమై పాఠకులను ఆశ్చర్యంలో ముంచేస్తాయి.

# 20. లాటరీ

## (The Lottery - 1948)

**– షిర్లీ జాక్‌సన్**

జూన్ 27వ తేదీ ఉదయం చాలా ప్రశాంతంగా వెచ్చగా, ప్రకాశ వంతమైన వేసవి ఎండతో, ఎక్కడ చూసినా విరిసిన వివిధ వర్ణ పుష్పాల సొబగులతో, ఆకుపచ్చటి గడ్డి తివాచీ పరిచినట్లున్న నేలతో అత్యంత ఆకర్షణీయంగా ఉన్నది. ఉదయం పదిగంటలకల్లా గ్రామస్థులంతా పోస్ట్ ఆఫీస్‌కు బ్యాంక్‌కు మధ్య ఉన్న కూడలిలోకి చేరుకుంటున్నారు. ఇతర గ్రామాలు కొన్నిటిలో ఎక్కువ జనాభా ఉన్న చోట 'లాటరీ' తతంగం రెండు రోజులు పడ్తుంది కనక అక్కడ 26వ తారీఖునే మొదలయ్యింది. ఈ గ్రామంలో మూడు వందలమందే ఉన్నారు, అందుచేత, మొత్తం కార్యక్రమమంతా రెండు గంటల్లోపే అయిపోయి, జనం ఎవరి ఇళ్లకు వాళ్లు పోయి మధ్యాహ్న భోజనం కానియ్యవచ్చు.

పిల్లలు ముందుగా గుమికూడారు. వేసవి శలవులు కాబట్టి వాళ్ల మొహాల్లో స్వేచ్ఛ స్పష్టంగా కానవస్తున్నది. కాసేపు మౌనంగా ఉన్న వాళ్లు, గుంపుగా తయారు కాగానే ఆటల్లో, మాటల్లో పడ్డారు. సంభాషణంతా వాళ్ల టీచర్, క్లాస్‌రూం, పుస్తకాలు, మందలింపులు వీటి గురించే!

బాబీమార్టిన్ తన జేబుల్నిండా రాళ్లు నింపుకున్నాడు. మిగతా పిల్లలు కూడా అదే పని చేసారు. ఎవరికి వాళ్లు గుండ్రంగా, మృదువుగా ఉన్న గులకరాళ్లను ఎన్నుకున్నారు. బాబీ, హారీజోన్, డికి డెలాక్రాయిక్స్– గ్రామస్థులు అతడిని డెలాక్రాయి అని పిలుస్తారు– ఒక మూలగా రాళ్లు గుట్టగా పేర్చి ఇతర పిల్లలు అటువేపు రాకుండా జాగ్రత్తపడుతున్నారు. ఆడపిల్లలు ఒకపక్కన నిలబడి వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటూ, అక్కడ ఉన్న దుమ్ము కొట్టుకున్న వీధి వేపు చూస్తున్నారు. వాళ్లలో చిన్నవాళ్లు అన్నల, అక్కల చేతుల్ని పట్టుకుని వేలాడుతున్నారు.

మగవాళ్లు ఒక్కరొక్కరే రాసాగారు. వచ్చినవాళ్లు తమ పిల్లల్ని గమనిస్తూ నాట్లు, వర్షం, ట్రాక్టర్లు, పన్నులు వీటి గురించి మాట్లాడుకుంటున్నారు. రాళ్లకు దూరంగా నిలబడిన వీళ్లు చిన్నచిన్న ఛలోక్తులు చెప్పుకుంటూ చిరునవ్వులు నవ్వుకుంటున్నారు. ఆడవాళ్లు కాస్త మాసిన దుస్తులు, స్వెట్టర్లు తొడుక్కుని తమ మగవాళ్లవెనకే వచ్చారు. ఒకరినొకరు పలకరించుకుంటూ వాళ్ల తమ భర్తలున్న

చోటుకు పోయి నిలబడి తమతమ పిల్లల్ని పేర్లతో పిలుస్తుంటే పిల్లలు అయిష్టంగా, నెమ్మదిగా నాలుగయిదుసార్లు పిలిచినాక వాళ్ల దగ్గరకు వెళ్తున్నారు. బాబీమార్టిన్ వచ్చినవాడు ఓ క్షణం వాళ్లమ్మ చేయి పట్టుకుని, మరుక్షణంలో ఆ మూల ఉన్న రాళ్లగుట్ట దగ్గరకు పరిగెత్తాడు గలగలా నవ్వుతూ. అతగాడి తండ్రి గద్దించగానే, బాబీ మాడ్పుమొహంతో వెంటనే వచ్చి తండ్రికి, అన్నకు మధ్య చేతులు కట్టుకు నిలబడినాడు.

లాటరీ, స్క్వేర్ డాన్సులు, టీన్ క్లబ్బు, హాలోవీన్ ప్రోగ్రామ్ ఇవన్నీ మిస్టర్ సమ్మర్ ఆధ్వర్యంలో నిర్వహించబడినాయి. అతడు ఇటువంటి పనులు చాలా ఉత్సాహంతో చేస్తాడు. గుండ్రటి మొహం, హుషారైన శైలి, బొగ్గు వ్యాపారం చేస్తాడతడు. గ్రామస్థులకు అతడంటే జాలి ఎందుకంటే అతడికి పిల్లలు లేరు, అతడి భార్య బాగోదు. అతడు నల్లటి చెక్కపెట్టెతో ఆ కూడలిలోకి వచ్చేసరికి గ్రామస్థులలో ఏదో కలకలం. అతడు అందరికీ అభివాదం చేస్తూ– "ఈరోజు కాస్త ఆలస్యమైంది" అన్నాడు. మిస్టర్ గ్రేవ్స్ ఆ ఊరి పోస్ట్‌మాస్టరు అతడిని అనుసరించి వచ్చాడు. కూడలి మధ్యలో ఓ స్టూలు ఉంచి దానిపై ఆ నల్లటి పెట్టెను పెట్టాడు మిస్టర్ సమ్మర్స్. గ్రామస్థులు ఆ పెట్టె చుట్టూరా కాస్త ఎడంగా నిలబడి ఉన్నారు. "ఎవరన్నా వచ్చి సాయం చేయండి, మిత్రులారా!" అని మిస్టర్ సమ్మర్స్ అన్నప్పుడు గ్రామస్థులు కొందరు సందేహించినా మిస్టర్ మార్టిన్, అతడి పెద్దకొడుకు బాక్స్టర్ ముందుకు వచ్చి పెట్టెను కదలకుండా పట్టుకోగా మిస్టర్ సమ్మర్స్ ఆ పెట్టెలోని కాగితాలను బాగా కిందా మీదా చేసాడు.

లాటరీకి వాడే పరంపర సరంజామా ఎప్పుడో గతించినా, ఈ నల్లటి పెట్టె మాత్రం చాలాకాలం నుంచి అంటే ఊళ్లో అందరికంటె వృద్ధుడైన వార్నర్ పుట్టక మునుపు నుంచి ఉన్నది. మిస్టర్ సమ్మర్స్ కొత్త పెట్టె తయారు చేయిద్దామని అన్నా గ్రామస్థులు పాత పెట్టె మీద ఉన్న సెంటిమెంట్‌తో ఒప్పుకోలేదు. అంతేకాక ఈ పెట్టె కూడా, అంతకు ముందున్న పెట్టె చెక్కల నుంచి తయారు చేసిందేనని, ఆ పాత పెట్టె ఈ ఊళ్లో గ్రామస్థులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న రోజుల నాటిదని విశ్వసిస్తారు. ప్రతి సంవత్సరం, లాటరీ అయిపోయాక మిస్టర్ సమ్మర్స్ ఆ ప్రస్తావన తీసుకురావడం, ఎవరూ మాట్లాడకపోవడంతో చర్చ లేకుండా ఆ విషయం మరుగున పడడం మామూలైపోయింది. ఆ నల్లపెట్టె అక్కడక్కడా రంగు వెలవడమే కాక, చెక్క కూడా పగుళ్లు పడి దెబ్బతిన్నది.

మిస్టర్ మార్టిన్, అతడి పెద్ద కుమారుడు బాక్స్టర్ ఆ నల్లపెట్టెను గట్టిగా పట్టుకున్నాడు. మిస్టర్ సమ్మర్స్ పెట్టె లోపలి కాగితాలను బాగా కలియదిప్పాడు. వెనకటి ఆచారాల్లో చాలా తతంగం మరపున పడి చిన్నిచిన్ని చెక్కముక్కల స్థానే కాగితాలు వాడుకలోకి వచ్చాయి. గ్రామం చిన్నగా ఉన్నపుడు చెక్కముక్కలు ఒ.కే., కాని మూడు వందలు దాటుతున్న జనాభా ఉన్నపుడు, ఇంకా పెరుగుతుంటే చెక్కముక్కల కన్నా నల్లపెట్టెలో సరిగా ఇమిడేవి వాడడం సబబని మిస్టర్ సమ్మర్స్ వాదన. లాటరీకు ముందు రోజు రాత్రి మిస్టర్ సమ్మర్స్, మిస్టర్ గ్రేవ్స్ చిన్న చిన్న కాగితాల స్లిప్స్ తయారుచేసి నల్లపెట్టెలో ఉంచి ఆ రాత్రి దానిని మిస్టర్ సమ్మర్స్ బొగ్గు దుకాణంలో భద్రపరచి తెల్లారే తీసుకువచ్చారు. దాన్ని ఒక సంవత్సరం మిస్టర్ గ్రేవ్స్ పొలం ఇంటిలో, ఒక సంవత్సరం పోస్ట్ఆఫీస్‌లో, ఇంకో సంవత్సరం మార్టిన్ చిల్లర దుకాణంలో ఉంచి భద్రపరచడం చేసేవారు.

మిస్టర్ సమ్మర్స్ లాటరీ గురించి ప్రకటించే ముందు చాలా తతంగం ఉంటుంది. కుటుంబ యజమానుల పట్టిక తయారుచేయాలి, పోస్ట్‌మాస్టరు వచ్చి మిస్టర్ సమ్మర్స్‌ను అధికారికంగా లాటరీ నిర్వాహకుడిగా ప్రకటించాలి. వెనకటి రోజుల్లో నిర్వాహకుడు ఏవో మంత్రాలు చదివేవాడని, ప్రార్థన చేసేవాడని కొంతమంది వృద్ధులంటారు. నల్లపెట్టె పట్టుకుని నిర్వాహకుడు గ్రామస్థుల దగ్గరకు వెళ్లేవాడని, కాని అది ఏళ్లు గడచినకొద్దీ ఇటువంటివి చేయడం మానివేశారంటారు. ఆ రోజుల్లో 'డ్రా' కోసం పెట్టె వద్దకు వచ్చిన ప్రతి వ్యక్తికీ నిర్వాహకుడు అభివాదం చేసేవాడని, ఇప్పుడు నిర్వాహకుడు మాత్రమే పెట్టె దగ్గరకు వచ్చిన వాళ్లతో మాట్లాడ్తున్నాడని వాళ్లు అనుకుంటున్నారు. మిస్టర్ సమ్మర్స్ ఈ కార్యనిర్వహణలో దక్షుడిగా పేరు తెచ్చుకున్నాడు. అతగాడు తెల్లటిచొక్కా, బ్లూజీన్స్ ధరించి, ఒక చేయి నల్లపెట్టెపై ఉంచి, అధికారికంగా, మిస్టర్ గ్రేవ్స్, మార్టిన్స్‌తో అనర్గళంగా మాట్లాడుతూనే ఉన్నాడు.

మిస్టర్ సమ్మర్స్ మాట్లాడడం ముగించి గుమికూడిన గ్రామస్థుల వేపు తిరిగాడు. అప్పుడే మిసెస్ హచిన్‌సన్ త్వరత్వరగా వచ్చి గుంపులో చేరింది. "మరిచేపోయాను ఇవ్వాళ రోజేమిటో" అన్నదామె మిసెస్ డెలాక్రాయితో. ఇద్దరూ నవ్వారు. "మా ముసలాయన కొయ్యదుంగలు పేరుస్తున్నాడనుకున్నా ఇంటి వెనక పక్క" ఆమె చెబుతున్నాది– "నేను కిటికీలోంచి చూసేసరికి అతడూ, పిల్లలు మాయం. అప్పుడు నాకు గుర్తుకు వచ్చింది ఇవ్వాళ ఇరవై ఏడో తారీఖని. వెంటనే పరుగెత్తుకు వచ్చా" ఆమె తన చేతుల్ని ఏప్రాన్‌కు తుడుచుకున్నది.

మిసెస్ డిలాక్రాయి అన్నది– "సరైన సమయానికే వచ్చావు. వాళ్ళింకా ఏదో మాట్లాడుకుంటూనే ఉన్నారు".

మిసెస్ హచిన్‌సన్ మెడ కాస్త నిక్కబొడుచుకుని చూసేసరికి ఎదురుగా తన భర్త పిల్లలు కనిపించారు మెసెస్ డెలాక్రాయికి 'బై' చెప్పి ఆమె గుంపు మధ్య నుంచి తన వాళ్ల దగ్గరకు పోతుంటే ఒకళ్లిద్దరు హాస్యమాడారు దారి ఇస్తూ– "హచిన్‌సన్! ఇదుగో వస్తోంది మీ ఆవిడ"– "మొత్తానికి చేరుకుంది మరచిపోకుండా" – ఆమె తన భర్త వద్దకు రాగానే మిస్టర్ సమ్మర్స్ అన్నాడు– "టెస్సీ! నీవు రాకుండానే కార్యక్రమం అయిపోయుండేది". "ఏమిటీ! అయినా కడుగుతున్న గిన్నెల్ని మధ్యలో వదిలేసి రాకూడదు కదా, అవునా 'జో' – అన్నదామె నవ్వుతూ. అక్కడున్న జనం కూడా నవ్వుతూ తమతమ స్థానాల్లో సర్దుకున్నారు.

"కార్యక్రమం మొదలెడ్దామా! తొందరగా ముగిస్తే తొందరగా వెళ్లిపోవచ్చు. ఇంకెవరైనా రావాల్సిన వాళ్లున్నారా?" –అడిగాడు మిస్టర్ సమ్మర్స్ గంభీరంగా.

"డన్‌బార్" చాలామంది పిలిచారు– "డన్‌బార్, డన్‌బార్!". మిస్టర్ సమ్మర్స్ తన చేతిలోని లిస్టు చూసి "క్లైడ్ డన్‌బార్! అతడి కాలు విరిగింది కదా! ఎవరు తీస్తున్నారు చీటీని అతడికి బదులు?" అన్నాడు.

"నేను" అన్నదొకామె ముందుకు వచ్చి.

మిస్టర్ సమ్మర్ ఆమె ముఖంలోకి చూసాడు. 'భర్త తరపున భార్య' – మీకు వయసొచ్చిన పిల్లవాడు లేడూ – అడిగాడతడు. నిజానికి ఆ ఊళ్లో అందరూ ఒకరికొకరు తెలుసు. అయినా కార్యక్రమ అధికారిక నిర్వహణ గనక మిస్టర్ సమ్మర్స్ అలా అడిగి ఆమె సమాధానానికి ఎదురు చూస్తున్నాడు.

"హొరేస్‌కు ఇంకా పదహారేళ్లు నిండలేదు" అన్నది మిసెస్ డన్‌బార్ – "ఈ సంవత్సరం ముసలాయనకు బదులు నేనే డ్రా తీయాలనుకుంటా"

"సరే!" అన్నాడు మిస్టర్ సమ్మర్స్ – తన దగ్గరున్న లిస్టు చూస్తూ– "వాట్సన్ బాయ్ సంగతేమిటి?"

ఓ పొడుగాటి బాలుడు నిలబడ్డాడు– "నేను నా తరపున, మా అమ్మ తరపున తీస్తాను" అతడు కలత చెందిన కళ్లతో తల పంకిస్తూ అంటుంటే గుంపులో చాలా గొంతులు వినిపించాయి– "మంచివాడివి లాక్! మీ అమ్మ మగాణ్ణి కన్నది!"

"వెల్! అందరూ వచ్చినట్లేగా, వృద్ధుడు వార్నర్ వచ్చాడా?" అడిగాడు మిస్టర్ సమ్మర్స్.

"వచ్చాను" అన్నాడు గుంపులోంచి వార్నర్. మిస్టర్ సమ్మర్స్ తలూపాడు.

మిస్టర్ సమ్మర్స్ లిస్ట్ వేపు తల తిప్పేసరికి అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. "అందరూ సిద్ధమేనా?" – ఇప్పుడు పేర్లు చదువుతాను. కుటుంబ పెద్ద పేరు ముందు – మగవాళ్లు వచ్చి నల్లపెట్టెలోంచి కాగితం తీసుకుని మడతపెట్టి దాని వంక చూడకుండా అందరూ అయిపోయేంత వరకూ అలానే ఉంచుకోవాలి, సరేనా!" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

ఇప్పటికే ఎన్నోసార్లు చేసినవాళ్లు కాబట్టి వాళ్లు ఈ మాటల్ని సగం సగమే విన్నారు. ఎక్కువ మౌనంగా ఉన్నారు. పెదాల్ని తడుపుకుంటూ, చుట్టూ చూడకుండా. మిస్టర్ సమ్మర్స్ తన చేయి పైకెత్తి 'ఏడమ్స్' – అని పిలిచాడు. గుంపులోంచి ఒక వ్యక్తి ముందుకు వచ్చాడు – 'హి, స్టీవ్' అన్నాడు మిస్టర్ సమ్మర్స్; 'హి,జో' అన్నాడు ఏడమ్స్. ఇద్దరూ నవ్వుకున్నారు. మిస్టర్ ఏడమ్స్ నల్లపెట్టెలోంచి మడతపెట్టిన కాగితాన్ని తీసుకుని చకచకా వెళ్లి తన స్థానంలో నిలబడ్డాడు. తన కుటుంబానికి కొంచెం ఎడంగా, తన చేతివేపు చూడకుండా!

'అల్లెన్, ఏండర్సన్, బెంథామ్' పిలిచాడు మిస్టర్ సమ్మర్స్.

"మొన్ననే జరిగినట్లుంది 'లాటరీ' అన్నది మిసెస్ డెలాక్రాయి మిసెస్ గ్రేవ్స్‌తో.

"నాకైతే క్రితం వారమే అయినట్లుంది. కాలం చాలా వేగంగా పోతోంది" అన్నది మిసెస్ గ్రేవ్స్.

"క్లార్క్, డెలాక్రాయి"–

"అడుగో, మా ముసలాయన పోతున్నాడు" అంటూ ఆమె ఊపిరి బిగబట్టింది, అతడు వెళ్తున్నవేపు చూస్తూ.

"డన్‌బార్" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

మిసెస్ డన్‌బార్ వెళ్తుంటే మహిళలు ఆమెను ప్రోత్సహించారు. "గో ఆన్ జేనీ! వెళ్లు ధైర్యంగా!"

"ఇప్పుడు మేమే!" అన్నది మిసెస్ గ్రేవ్స్. ఆమె చూస్తుండగానే మిస్టర్ గ్రేవ్స్ వచ్చి, మిస్టర్ సమ్మర్స్‌ను పలకరించి, నల్లపెట్టెలోంచి ఒక స్లిప్ తీసుకుని

తన స్థానానికి వెళ్లిపోయాడు. ఇప్పటికీ గుంపులో చాలామంది మగవాళ్ల చేతుల్లో మడతపెట్టిన కాగితాలు ఉన్నాయి. వాళ్లు చేతుల్ని అటుయిటూ కదుపుతున్నారు ఏదో తెలియని దిగులుతో. మిసెస్ డన్‌బార్ తన చేతిలోని స్లిప్పుతో తన ఇద్దరు పిల్లల పక్కనే నిలబడి ఉన్నది.

"హారబర్ట్... హచిన్‌సన్"

"బిల్! వెళ్లు" అన్నది మిసెస్ హచిన్‌సన్. అక్కడున్నవాళ్లు నవ్వారు.

"జోన్స్"–

మిస్టర్ అడమ్స్ వృద్ధుడైన వార్నర్‌తో అంటున్నాడు– "ఉత్తర గ్రామంలో వాళ్లు ఈ లాటరీ తీసేయాలని అనుకుంటున్నారట".

ముసలాయన బుస్సుమన్నాడు– "పిచ్చి సన్నాసులు. ఈ రోజుల్లో కుర్రాళ్లకు మంచికి చెడుకు తేడా తెలీదు. ఇప్పుడు ఇది తీసేస్తారు. తరువాత గుహల్లోకి వెళ్దాం. పనేం చేయవద్దు. తిని కూర్చుని కాలక్షేపం చేద్దాం– అనుకుంటారు. గుర్తు లేదా 'జూన్‌లో లాటరీ తీయి, మక్కజొన్నలు మస్తుగా పండుతాయి' – నానుడి. పంటలు పండకబోతే దుంపలు, గింజలు, గడ్డి తిని బతకాలి. ఒక మాట చెబుతాను. 'లాటరీ' అనేది ఎప్పుడూ ఉన్నదే! ఇదిగో అటు చూడు జో సమ్మర్స్ అందరితోనూ పరాచికాలాడుతున్నాడు!" అన్నాడాయన.

"కొన్ని చోట్ల లాటరీలు తీసేశారు" అన్నది మిసెస్ ఏడమ్స్.

"అక్కడ కష్టాలు, నాశనం తప్పదు" అన్నాడు ముసలాయన.

"మార్టిన్, ఓవర్ డైక్, ...పెర్సీ" బాబీమార్టిన్ తన తండ్రి నల్లపెట్టె వేపు వెళ్లడం చూసాడు.

"త్వరగా అయిపోతే బాగుండును. త్వరత్వరగా" అన్నది మిసెస్ డన్‌బార్ తన పెద్దకొడుకుతో.

"దాదాపు అయిపోవచ్చింది" అన్నాడతడు.

"పరిగెత్తుకు వెళ్లి మీ నాన్నకు చెప్పాలి" అన్నదామె.

మిస్టర్ సమ్మర్స్ తన పేరు ప్రకటించి వెళ్లి స్వయంగా ఒక స్లిప్పు తీసుకున్నాడు. తర్వాత పిలిచాడు 'వార్నర్!'

"డెబ్భైఏడో సంవత్సరం" ఈ లాటరీలో నేనుండబట్టి – "డెబ్భై ఏడోసారి" అన్నాడతడు.

"వాట్సన్"

పొడుగాటి బాలుడు కాస్త గాభరాగా వస్తుంటే ఎవరో అన్నారు– "కంగారు పడకు, జాక్!"

మిస్టర్ సమ్మర్స్ అన్నాడు "నెమ్మదిగా తీసుకో, పుత్రా!"

"జనిని"

ఆ తరువాత చాలాసేపు నిశ్శబ్దం. ఊపిరి నిలిచిపోయినట్లు. మిస్టర్ సమ్మర్స్ తన చేతిని పైకెత్తి కాగితపు ముక్కను గాలిలో చూపించాడు. "అందరూ చూపించండి" ఒక నిముషం ఎవరూ మాట్లాడలేదు. కదల్లేదు. తరువాత అందరూ కాగితాలు తెరిచి చూసారు.

తక్షణం ఆడవాళ్లు ఒక్కసారిగా మాట్లాడసాగినారు. "ఎవరు? ఎవరికి వచ్చింది? డన్‌బార్స్! వాట్సన్స్..." గొంతులు మూకుమ్మడిగా అంటున్నాయి– "ఈసారి హచిన్‌సన్ 'బిల్' – బిల్‌హచిన్‌సన్‌కు వచ్చింది డ్రా!"

"పో! మీ నాన్నకు చెప్పు" – అన్నది మిసెస్ డన్‌బార్ పిల్లాడితో.

జనం దృష్టి ఇప్పుడు హచిన్‌సన్స్ మీదకు మళ్లింది. బిల్ హచిన్‌సన్ మౌనంగా కదలకుండా నిలబడి తన దగ్గర ఉన్న కాగితం వేపు చూస్తున్నాడు. టెస్సీ హచిన్‌సన్ మిస్టర్ సమ్మర్స్ వేపు చూసి అరిచింది– "నీవు అతడికి ఎక్కువ సమయం ఇవ్వలేదు తను అనుకున్న స్లిప్ తీసుకోడానికి. నేను చూసాను. ఇది సరైనది కాదు"

"సరిగా ప్రవర్తించు టెస్సీ" అన్నది మిసెస్ డెలాక్రాయి.

"మనందరికీ ఒకే రకమైన అవకాశం ఇవ్వబడింది" అన్నది మిసెస్ గ్రేవ్స్.

"షటప్, టెస్సీ!" అన్నాడు బిల్ హచిన్‌సన్.

"వెల్! అంతా త్వరగా అయిపోయింది. మిగతా పని కూడా సకాలంలో పూర్తి చేయాలి. బిల్! నీవు హచిన్‌సన్ కుటుంబానికి డ్రా తీసావు. నీకు సంబంధించి ఇంకేమన్నా బాధ్యతలున్నాయా?"

"డాన్, ఈవాలున్నారు. వాళ్లకీ అవకాశం ఇవ్వచ్చుగా" అరిచింది మిసెస్ హచిన్‌సన్.

"కుమార్తెలు వాళ్ల భర్తల కుటుంబానికి చెందినవాళ్లు, టెస్సీ ఈ సంగతి నీకూ ఇక్కడున్న అందరికీ తెలుసు!" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

"ఇది న్యాయం కాదు" అన్నది మిసెస్ హచిన్‌సన్.

"నా కుమార్తె ఆమె భర్త తరపున డ్రాలో ఉంటుంది. నా తరపున పిల్లలున్నారు. అంతే!" అన్నాడు బిల్ హచిన్‌సన్.

"నీ కుటుంబం తరపున నీవే డ్రా తీస్తావు. అంతేకదా!" అడిగాడు మిస్టర్ సమ్మర్స్.

"అవును" అన్నాడు బిల్ హచిన్‌సన్.

"ఎంతమంది పిల్లలు" అడిగాడు మిస్టర్ సమ్మర్స్ అధికారికంగా.

"ముగ్గురు" సమాధానమిచ్చాడు బిల్ హచిన్‌సన్–

"బిల్ జూనియర్, నాన్సీ, డావి, టెస్సీ, నేను"

"సరే! హారీ! వాళ్ల టిక్కెట్లు తెచ్చావా" అడిగాడు మిస్టర్ సమ్మర్స్.

మిస్టర్ గ్రేవ్స్ తాను తీసుకువచ్చిన కాగితాలను చూపించాడు. "వాటినీ, బిల్ దగ్గర ఉన్నదానినీ నల్లపెట్టెలో వేయి" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

"మళ్లీ మొత్తం ఇంకోసారి చేస్తే బాగుంటుంది" అన్నది మిసెస్ హచిన్‌సన్ నెమ్మదిగా– "ఇది న్యాయం కాదు. నీవు అతడికి తగినంత సమయం ఇవ్వలేదు. అందరూ చూసారది"

మిస్టర్ గ్రేవ్స్ అయిదు కాగితాలను తెచ్చి పెట్టెలో వేసాడు. మిగతా వాళ్ల కాగితాలు నేలపై పడి గాలికి కొట్టుకుపోయాయి.

"వినండి, నా మాట" – అంటున్నది మిసెస్ హచిన్‌సన్.

"గుర్తుంచుకోండి" అన్నాడు మిస్టర్ సమ్మర్స్– అందరూ కాగితాలు తీసుకునేంత వరకూ ఏ ఒక్కరూ మడతలు విప్పి చూడకూడదు. "రెడీ బిల్!".... .....హారీ! నీవు చిన్ని డేవీకి సాయం చేయి"

మిస్టర్ గ్రేవ్స్ తనతోపాటు హుషారుగా వచ్చిన పిల్లవాడిని నల్లపెట్టె దగ్గరకు తీసుకువెళ్లాడు.

"దాంట్లోంచి ఒక పేపర్ తీసుకో" అన్నాడు మిస్టర్ సమ్మర్స్– డావీ పెట్టెలో చేయిపెట్టి ఓ నవ్వు నవ్వినాడు. "ఒకటే పేపర్ తీసుకో! హారీ, అతడు తీసినాక నీవతడి చేతిని పట్టుకుని ఉండు"–

మిస్టర్ గ్రేవ్స్ డావీ చేతిలోని మడతపెట్టిన కాగితాన్ని తీసుకుని తన పిడికిలిలో పెట్టుకున్నాడు చిన్నారి డేవీ అతడి పక్కనే నిలబడి ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"తరువాత నాన్సీ" అన్నాడు మిస్టర్ సమ్మర్స్. నాన్సీకి పన్నెండేళ్లు. ఆమె సొగసుగా అటు వెళ్తుంటే ఆమె స్నేహితులంతా ఊపిరి బిగబట్టి చూడసాగినారు. ఆమె వెళ్లి బ్లాక్‌బాక్స్‌లోంచి కాగితం తీసి పట్టుకున్నది.

"బిల్ జూనియర్" అన్నాడు మిస్టర్ సమ్మర్స్. ఎర్రబడిన ముఖంతో బిల్లీ జూనియర్ తడబడుతూ వెళ్లి, దాదాపు ఆ పెట్టెను పడవేయబోయి ఒక పేపర్ తెచ్చాడు.

"టెస్సీ" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

ఆమె ఒక్కక్షణం సందేహించి, అందరివేపు తిరస్కారంగా చూసి, పెదాలు బిగించుకువెళ్లి, పెట్టెలోంచి ఓ కాగితం తీసి, చెయ్యి వెనక్కు పెట్టుకుంది.

"బిల్" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

బిల్ హచిన్‌సన్ వెళ్లి ఆఖరి కాగితం తీసుకువచ్చాడు.

అక్కడ చేరిన గుంపు నిశ్శబ్దంగా ఉన్నారు. ఒక బాలిక గుసగుసలాడింది– "నాన్సీ కాకపోతే బాగుండును" – అయితే ఆ మాట అన్ని దిక్కులకూ వ్యాపించింది.

"ఇవి వెనకటి రోజులు కావు" –ముసలాయన వార్నర్ గొణిగాడు. "వెనకటి మనుషులు కారు ఇప్పటివాళ్లు"

"సరే! కాగితాలు తెరవండి! హారీ, నీవు చిన్ని డేవీ కాగితం తెరచి చూడు" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

మిస్టర్ గ్రేవ్స్ కాగితం తెరుస్తుంటే అక్కడి జనమంతా ఊపిరి బిగబట్టారు. బ్లాంక్‌గా, ఖాళీగా ఉన్న కాగితాన్ని మిస్టర్ గాలిలోకి ఎత్తి పట్టుకుని అందరికీ చూపించాడు. అందరూ హృదయభారం దూరమైనట్టు ఓ నిట్టూర్పు విడిచారు.

నానీ, బిల్ జూనియర్లు తమ కాగితాల్ని తెరిచారు. అవీ ఖాళీగానే ఉన్నాయి. వాళ్లిద్దరూ నవ్వుతూ తమ కాగితాల్ని చేత్తో పట్టుకుని జనం వేపు తిరిగి చూపించారు.

"టెస్సీ" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

అటువేపు నుంచి అలికిడి లేకపోయేసరికి అతడు బిల్ వేపు చూసాడు. బిల్ హచిన్‌సన్ తన కాగితం తెరచి చూపించాడు. అదీ ఖాళీయే!

"టెస్సీ!" మిస్టర్ సమ్మర్స్ అన్నాడు నెమ్మదిగా. "బిల్ ఆమె కాగితం చూపించు!"–

బిల్ హచిన్‌సన్ నెమ్మదిగా తన భార్యవేపు వెళ్లి బలవంతాన ఆమె చేతిలోని కాగితం తీసుకుని తెరచి చూపించాడు. దానిపై నల్లని చుక్క.

మిస్టర్ సమ్మర్స్– బొగ్గుల దుకాణం ఆఫీస్‌లోని పెన్సిల్‌తో పెట్టిన– చుక్క. బిల్ హచిన్‌సన్ ఆ కాగితాన్ని అందరికీ చూపించేసరికి జనంలో కలకలం.

"కానీయండి! ఈ తంతు తొందరగా ముగించేద్దాం!" అన్నాడు మిస్టర్ సమ్మర్స్.

గ్రామస్థులు ఏనాడో ఈ వింత ఆచారం ఎందుకు పుట్టుకు వచ్చిందో మరచిపోయారు, ఆ నల్లటి పెట్టె పుట్టు పూర్వోత్తరాలూ మరచిపోయారు గాని, రాళ్లను ఎలా విసరాలో మరచిపోలేదు.

పిల్లలిందాక పోగుచేసిన రాళ్లకుప్ప ఆ మూలన అలానే ఉన్నది. డెలాక్రాయి తను రెండు చేతుల్తో మోయగలిగిన పెద్ద రాయి పట్టుకుని వచ్చి మిసెస్ డన్‌బార్‌తో అన్నది "రా! త్వరగా! ఒక పనైపోతుంది"

మిసెస్ డన్‌బార్ రెండు చేతుల్నిండా రాళ్లున్నాయి. "నేను పరుగెత్తలేను. నీవు ముందు పద! నేను నీ వెనకే వస్తాను" అన్నది ఆయాసపడుతూ.

పిల్లల దగ్గర రాళ్లున్నాయి.

వాళ్లు డేవీ హచిన్‌సన్‌కూ చిన్నిచిన్ని రాళ్లిచ్చారు.

"టెస్సీ హచిన్‌సన్ ఇప్పుడు ఆ కూడలి మధ్యలో ఖాళీ ప్రదేశంలో నిలబడి రెండు చేతుల్ని తనను కాపాడుకోడానికన్నట్లు అడ్డం పెట్టుకున్నది. జనం ఆమె చుట్టూ మూగుతున్నారు. "ఇది అన్యాయం" ఆమె అరిచింది. ఒకరాయి వచ్చి ఆమె తలకు ఎడంపక్క తగిలింది. ముసలాయన వార్నర్ అరుస్తున్నాడు– "పదండి, పదండి, అందరూ!" స్టీవ్ ఏడమ్స్ గ్రామస్థుల ముందు వరసలో ఉన్నాడు. అతడి పక్కనే మిసెస్ గ్రేవ్స్.

"ఇది అన్యాయం! ఇది అక్రమం" అంటూనే ఉన్నది మిసెస్ హచిన్‌సన్ – గుంపు ఆమెను చుట్టుముట్టింది.

✧✧✧✧✧

---

## షిర్లె జాక్‌సన్ (Shirley Jackson 1916-1965)

**'The Lottery'** జూన్ 26, 1948 నాడు న్యూయార్కర్ మాగజైన్‌లో ప్రచురితమైన ఈ కథ ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నది. అమెరికన్ కథా సాహిత్యంలో గొప్ప కథలలో ఒకటిగా పేరు తెచ్చుకున్న ఈ కథ గుంపు మనస్తత్వాన్ని - Collective mentality -కి అద్దం పడుతుంది. "It is a chilling tale of conformity gone mad". పాఠకులు ఈ కథ చదివి న్యూయార్కర్‌కు సబ్‌స్క్రిప్షన్లు కాన్సిల్ చేసారు. ఆ వేసవి కాలమంతా రోజుకు పన్నెండు పదమూడు ద్వేషపూరితమైన ఉత్తరాలు వ్రాసి షిర్లె జాక్‌సన్‌ను ఆత్మరక్షణలోకి నెట్టారు. సౌత్ ఆఫ్రికాలో ఈ కథను నిషేధించారు కూడా.

ఈ కథలో సంఘటనలు, పేర్లు సింబాలిక్‌గా ఉండి మనుషుల్లో దాగిన ఆదిమకాలపు ప్రవృత్తిని బహిర్గత పరుస్తాయి. మార్టిన్ (కోతి); హారీ (హెయిరీ ఏప్), డెలాక్రాయి (ఆప్-ద-క్రాస్), ఆడమ్, గ్రేవ్స్ వీళ్లందరూ కోతి నుంచి వచ్చిన మనిషిని, చివరకు చేరుకునే సమాధిని సూచిస్తుంటారు.

రాళ్లతో కొట్టడం అనేది పురాతన కాలపు శిక్ష, అది ఈనాడు కూడా అక్కడక్కడ అమలు పరచబడడం మనకు తెలుసు.

రెండు గంటల్లో షిర్లీజాక్సన్ వ్రాసిన కథ 'లాటరీ' సృష్టించిన సంచలనం బహుశా ఏ కథా సృష్టించలేదేమో" అంటారు.

షిర్లె జాక్‌సన్ ఆరు నవలలు, నాలుగు కథాసంకలనాలు, చిన్నపిల్లల పుస్తకాలు నాలుగు, అసంఖ్యాక కథలు వ్రాసి ఎందరో రచయితల్ని ప్రభావితం చేసి, అమెరికన్ సాహిత్యంలో తనదైన ముద్ర వేసింది.

# 21. శిలాక్షరాలు
## (Project for a cliff face)

**- జాన్ సియార్డి**

శిలలపై అక్షరాలు చెక్కే శిల్పి అనుకున్నాడు-
నేను చనిపోయే ముందు ఈ కొండ ముఖంపై
కొన్ని శిలాక్షరాలను చెక్కుతాను.
క్రింద నేను వ్రాస్తున్న అక్షరాలుగా,
అవి సహజంగా ఉబికి వస్తే, వాటిలో
నా నైపుణ్యాన్నంతా నిబిడ్చి
అద్భుత కళారూపాన్ని సృష్టించిన ఆనందాన్ని పొందుతాను.

**"మనిషి పుట్టక మునుపు కాలమున్నది.**
**ఆ తరువాత కూడా కాలముంటుంది.**
**ఏదైతే ఉన్నదో దానినే నేను మాట్లాడుతాను.**
**వీటిని చదవగలగిన మనిషి ఉన్నంత కాలం**
**ఎవరూ వీటిని నమ్మరు,**
**ఆ తరువాత, వీటిని నమ్మాలో, లేదో**
**ఎవరికీ తెలీదు"**

✧✧✧✧✧

---

**జాన్ సియార్డి (John Ciardi 1916-1986)**

జాన్ ఆంథొని సియార్డి అమెరికన్ కవి, అనువాదకుడు. 'How does a Poem means?' అనే పుస్తకం ఎంతో పేరు తెచ్చిపెట్టింది. The Saturday Review editor గా అతడు ఎందరో యువ కవులకు మార్గదర్శకుడైనాడు.

# 22. ఆశ

## (Hope is the thing with feathers)

**- ఎమిలి డికిన్‌సన్**

ఆశ అనేది రెక్కలున్న పక్షి
ఆత్మపై గూడు కట్టుకుంటుంది
పదాలు లేని స్వరాలాపన చేస్తూ
ఆగకుండా పాడుతూనే ఉంటుంది.

సముద్రపు హోరులో వినబడ్తుంది.
తుఫానులో తుళ్లిపడ్తుంది.
ఎందరినో వెచ్చగా ఉంచిన
చిన్న గూడును చెదరగొడ్తుంది.

శీతల ధృవాల్లో కనుగొన్నాను
వింత సముద్రాల్లో విన్నాను
ఎంత విపత్కర పరిస్థితుల్లోనూ
అది ఒక్కముక్క అడగలేదు- నా నుంచి.

✧✧✧✧✧

---

**ఎమిలి ఎలిజబెత్ డికిన్‌సన్ (Emily Dickenson 1830-1886)**

తన జీవితకాలంలో దాదాపు 1800 కవితలు వ్రాసిన ఎమిలీ తన ఇంటిలో ఒంటరిగా కాలం గడపడానికే ఇష్టపడేది. ఆమె బ్రతికున్నపుడు ఓ పన్నెండు కవితలు మాత్రమే ప్రచురింపబడినా ఆమె ఈనాడు అమెరికన్ కవులలో ముఖ్యురాలిగా పరిగణించబడ్తున్నది. మృత్యుసౌందర్యాన్ని ఆమె అంత అద్భుతంగా వర్ణించినవారు అరుదని చెప్పవచ్చు.

# 23. హార్లెమ్
## (Harlem)

**– లాంగ్‌స్టన్ హ్యూఘెస్**

అణచిపెట్టబడిన స్వప్న మేమవుతుంది?
ఎండలో పడేసిన ద్రాక్షలా
ఎండిపోతుందా?
పుండులా సలుపుతూ
ఉండిపోతుందా?
కుళ్లిన మాంసంలా
కంపు కొడ్తుందా?
చిక్కని రసంపై చక్కెరలా
గట్టిపడ్తుందా?
బహుశా పెద్ద బరువులా
కృంగదీస్తుందేమో.
లేక
**ఒక్కసారిగా విస్ఫోటిస్తుందా?**

✧✧✧✧✧

---

**లాంగ్‌స్టన్ హ్యూఘెస్ (Longstan Hughes 1902-1967)**

అమోఘమైన వాక్ శక్తితో లాంగ్‌స్టన్ హ్యూఘెస్ ఒక్క కవితా వ్రాయకుండానే క్లాస్ పొయిట్‌గా గుర్తింపబడినాడు. ఆనక అతడు వ్రాసిన కవితలు బాగానే ప్రాచుర్యాన్ని పొందాయి. అమెరికన్ సాహిత్యంలోని అడ్డుగోడలు బద్దలుగొట్టి జాజ్ రిథమ్స్‌ను, వీధిభాషను ప్రవేశపెట్టినాడు.

"Poetry is the human soul entire squeezed like a lemon into atomic words".

# 24. నేను వెళ్లని దారి

## (The Road not Taken)

**- రాబర్ట్ ఫ్రాస్ట్**

పసుపు పచ్చ అడవిలో రెండు దారులు
ఏదో ఒక దానిపై వెళ్లగలను నేను
ఒంటరి యాత్రికుణ్ణి, చాలాసేపు నిలబడి
చూడగలిగినంత దూరం చూసాను పరీక్షగా
పెరిగిన చెట్లూ పొదల మధ్య అదృశ్యమైన ఒక దారిని;

తర్వాత చూసాను రెండో త్రోవను
నాకెందుకో ఈ దారి నచ్చినట్లున్నది
పచ్చగడ్డి పరిచినట్లు ఉన్నదా దారి.
ఎందరో నడచిన మొదటి దారి
పూర్తిగా నలిగిపోయి పిలుస్తోంది నన్ను.

ఆ రెండు దారులు నిండా ఆ ఉదయం
రాలిన ఆకులపై వేసే పదముద్రలూ-
మొదటి దారిన మరోసారి పోదామనుకుని
ఆ మార్గం ఇంకో మార్గానికి దారి తీస్తుందని తెలిసీ
మరలా వస్తానో, రానో అని సందేహించాను.

ఒక నిట్టూర్పు విడిచి ఈ మాట చెబుతూ ఉండవచ్చు
యుగయుగాలు గడిచినాక ఈ మాటను-
ఒక అడవిలో రెండు దారులు విడిపోతున్నాయి
నేను తక్కువమంది నడచిన దారిన వెళ్లాను
అదే తెచ్చింది నాలో అసలైన తేడాను.

✧✧✧✧✧

---

**రాబర్ట్ ఫ్రాస్ట్ (Robert Frost 1874-1963)**

తన కవిత్వానికి నాలుగుసార్లు పులిట్జర్ బహుమతిని; 1960లో కాంగ్రెషనల్ గోల్డ్‌మెడల్ పొందిన ప్రఖ్యాత అమెరికన్ కవి.

# 25. నేను ఆడదాన్ని కానా?

## (Am I not a Woman?)

– సోజర్నర్ ట్రూత్

అక్కడున్న మగవాడు అంటున్నాడు
మహిళకు మగాడి సాయం కావాలిట
బురద గుంటలు దాటడానికి, బండెక్కడానికి
మంచిస్థానం ఎక్కడ కావాలన్నా సరేనట!
నాకెవరూ ఆ సాయం చెయ్యలేదు
బండెక్కడాలూ, బురదగుంటలు దాటించడాలూ
మంచి స్థానం చూపించడాలూ...

మరి నేను ఆడదాన్ని కానా?
నావేపు చూడు
నా చేతుల్ని చూడు!

నేను పొలం దున్నాను, విత్తులు విత్తాను
ధాన్యాన్ని నూరాను, బండ్లకెత్తాను
ఏ మగాడూ నా అంత పని చేయలేదు

మరి నేను ఆడదాన్ని కానా?
ఎంత పనైనా చేస్తాను
మగాడు తిన్నంత తింటాను
ఏదైనా తేడా వచ్చినపుడు
కొరడా దెబ్బలూ తింటున్నాను

మరి నేను ఆడదాన్ని కానా?
పదముగ్గుర్ని కన్నాను, అందరూ,
బానిసలుగా అమ్ముడుపోవడమూ కన్నాను
కన్న కడుపు కోతతో కుమిలిపోతున్నపుడు
నా ఘోష విన్నదెవరు, జీసస్ తప్ప?

మరి నేను ఆడదాన్ని కానా?
ఆ నల్లటి సూటులో ఉన్నాయన అంటున్నాడు
మగాడికున్న హక్కులు మహిళలకు అక్కర్లేదట-
క్రీస్తు స్త్రీ కాదు గదా అని సాగదీస్తున్నాడు-
మీ క్రీస్తు ఎక్కడి నుంచి వచ్చాడు?

ఆ కరుణామయుడు, స్త్రీ నుంచే కాదా?
మగాడికేం సంబంధం క్రీస్తుతో!
దేవుడు చేసిన మొదటిస్త్రీ, తానొక్కతే
ప్రపంచాన్నే తలకిందులు చేయగలిగినప్పుడు
అందరూ మహిళలూ కలిస్తే
వాళ్లే ఈ ప్రపంచాన్ని సరిచేయగలరు.

✧✧✧✧✧

---

## సోజర్నర్ ట్రూత్ (Sojourner Truth 1797-1883)

సోజర్నర్ ట్రూత్, అల్స్టర్ కాంటీ, న్యూయార్క్‌లో బానిసత్వంలో పుట్టింది. ఆమెపేరు ఇసబెల్లా. 1827లో న్యూయార్క్ స్టేట్ బానిసత్వాన్ని నిషేధించడానికి ముందే ఆమెను ఇసాక్ వాన్ వాగనర్ కొనుక్కుని ఆమెకు స్వేచ్ఛనిచ్చాడు.

1829-1843 వరకు తన ఇద్దరు పిల్లలతో ఆమె న్యూయార్క్ పట్టణంలో పరిచారికగా పనిచేసింది. ఆ తరువాత ఆమెకు దైవదర్శనమై తన పేరును దైవాదేశం ప్రకారం 'సోజర్నర్ ట్రూత్'గా మార్చుకుని దేశమంతా తిరుగుతూ బానిసత్వానికి వ్యతిరేకంగా, స్త్రీల హక్కులను సమర్థిస్తూ దైవసందేశాన్ని వ్యాప్తి చేసింది.

1850లో మిచిగాన్‌లో స్థిరపడింది. అంతర్యుద్ధంలో ఆఫ్రికన్ అమెరికన్లకు సాయపడింది. 1864లో అబ్రహాంలింకన్‌ను వైట్‌హౌస్‌లో కలుసుకున్నది. ఆమె ఉపన్యాసాలు వినడానికి ప్రజలు తండోపతండాలుగా వచ్చేవారు.

1851లో ఆమె ఇచ్చిన ఉపన్యాసానికి ప్రతిరూపమే ఈ కవిత.

# 26. గ్రద్ధ
## (The Eagle)

**- ఆల్ఫ్రెడ్ లార్డ్ టెన్నిసన్**

తన వంకీ హస్తాలతో
　　అంచును పట్టుకున్నాడు గట్టిగా
ఒంటరి దేశాల్లో
　　సూర్యుడికి దగ్గరగా అతడు
నీలి ప్రపంచం చుట్టుముట్టగా
　　నిలబడి ఉన్నాడు నిశ్చలంగా!
అతడికి దిగువగా కదుల్తున్నది
　　అలల మడతలతో సముద్రం
కొండ గోడలపై నుంచి
　　అతడు చూస్తున్నాడు కిందకు
పిడుగులా క్షణంలో
　　దూసుకుపోయాడు దిగువకు.

✧✧✧✧✧

---

**ఆల్ఫ్రెడ్ లార్డ్ టెన్నిసన్ (Alfred Lord Tennyson 1809-1892)**

ఆల్ఫ్రెడ్ టెన్నిసన్ బ్రిటిష్ కవులలో ప్రసిద్ధి గాంచినవాడు; Poet Laureate of Great Britain and Ireland గా విఖ్యాతి చెందినవాడు. తన కవితా వాక్యాలు పలుమార్లు ఉటంకించబడే సూక్తులుగా ప్రసిద్ధికెక్కినవాడు.

# 27. గరుడపక్షుల ప్రేమాయణం
## (The Dalliance of the Eagles)

**- వాల్ట్ విట్‌మాన్**

నదీ దారి వెంబడి- (నా మధ్యాహ్నపు నడక, విశ్రాంతి)-
-పోతున్నపుడు గాలిలో అకస్మాత్తుగా చప్పుడు
గరుడపక్షుల ప్రేమాయణం ఆకాశవీధిలో-
కాళ్లగోళ్లు చటుక్కున కలిసి భీకరంగా తిరుగుతున్న సజీవచక్రం
టపటపా కొట్టుకుంటున్న నాలుగు రెక్కలు, రెండు ముక్కలు
దృఢంగా బంధించబడి వేగంగా తిరుగుతున్న ముద్దలా-
పడుతూ, తిరుగుతూ, సమూహమవుతున్న వలయాలు
నిట్టనిలువుగా నేలపైకి జారిపడుతూ
నదీ ఉపరితలంపై ఆగి, ఒక్కటైనట్లు, ఒక్కక్షణపు నిశ్చలత
గాలిలో కదలకుండా ఘనీభవ స్థితి.
విడిపోవడం, కాలిగోళ్లు వదులై
రెక్కలు విప్పారి, ఈకలు విస్తరించి
ఏటవాలుగా వేర్వేరు దిక్కులకు ఎగిరిపోతూ
ఆమె ఆమెదారిలో-
అతడు అతడి దారిని
వెదుక్కుంటూ-

✧✧✧✧✧

---

**వాల్ట్ విట్‌మాన్ (Walt Whitman 1819-1912)**

వాల్ట్ విట్‌మాన్ అమెరికన్ రచయిత, కవి, వ్యాసకర్త, మానవతావాది. Father of free verse గా పేర్కొనబడినవాడు. అతడి 'Leaves of grass' మరియు ఇతర సంకలనాలు విమర్శలకు, పొగడ్తలకు గురై ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి.

# 28. అద్దం
## (Mirror)

**– సిల్వియా ప్లాత్**

వెండితో చేయబడ్డ దానిని నేను,
ఖచ్చితంగా ఉంటాను.
దేన్ని చూస్తే దానిని వెంటనే మింగేస్తాను,
ఉన్నదానిని ఉన్నట్లే, ప్రేమ, అయిష్టం లాంటి పొరలు కప్పకుండానే!
నేను క్రూరురాలిని కాదు, నిజాన్ని నిర్భయంగా చెబుతాను–

నాలుగు మూలలున్న చిన్నిదేవుడి నేత్రాన్ని నేను,
ఎదురుగా ఉన్న గోడని చూస్తూ ఎక్కువ సమయాన్ని ధ్యానంలో గడుపుతాను.
అది గులాబిరంగులో, పొక్కులు పొక్కులుగా ఉంటుంది పగిలి,
ఎన్నాళనుంచి దానినలా చూస్తున్నానో, అది నా ఎదలో భాగమైనది.
ముఖాలు, చీకటి మమ్మల్ని విడదీసినప్పుడు
అది వెలిగి ఆరుతూ ఉంటుంది.

ఇప్పుడు నేనొక సముద్రాన్ని, ఒక స్త్రీ నా ముందు నిలబడి
తనెలా ఉంటుందో చూసుకోవాలని తపిస్తుంది.
ఆనక ఆమె అబద్ధాలకోరులైన కొవ్వొత్తి, చందమామల వేపు
తిరుగుతుంది. నేనామె వెనకను ప్రతిఫలిస్తాను–
కన్నీళ్లతో, వణుకుతున్న చేతుల్తో ఆమె నాకు కృతజ్ఞత తెలుపుతుంది.

నేను ఆమెకు చాలా ముఖ్యమైన దానిని. నా ముందుకు వస్తూ
పోతూ ఉంటుందామె. ప్రతి ఉదయం చీకటిని తొలగించేది
ఆమె వదనమే. తనదైన ఒక బాలికను
నాలో ముంచేసింది ఆమె. రోజు తరువాత రోజు
నాలో ఒక వృద్ధురాలు తలెత్తుతున్నది,
ఒక భీకరమైన చేపలా!

✧✧✧✧✧

---

### సిల్వియా ప్లాత్ (Sylvia Plath 1932-1963)

The Colossus and other poems, Ariel లాంటి కవితా సంకలనాల్ని వెలువరించింది. సహకవి Ted Hughes ను వివాహం చేసుకున్నది. 1963లో తీవ్రమైన డిప్రెషన్‌తో ఆత్మహత్యకు పాల్పడింది.

# 29. స్త్రీ
## (Woman)

**- నిక్కి గియోవాన్ని**

పొలాల్లో పచ్చగడ్డిగా
పెరగాలనుకున్నదామె.
డాండెలియాన్ కావడానికి
అతడు ఒప్పుకోలేదు.

ఆకులమాటు నుంచి రాగాలు తీసే
రాబిన్ పక్షిగా ఉండాలనుకున్నది.
ఆసరా ఇచ్చే చెట్టుగా ఉండడానికి
అతడు తిరస్కరించాడు.

తనకు తాను సాలెగూడు అల్లుకుని
ఆశ్రయం కోసం అతడివేపు చూసింది.
నిటారుగా నిలబడిన అతడు
ఆమెకై ఓ మూల కాలేనన్నాడు.

ఆమె పుస్తకంగా మారినా
అతడు చదవనన్నాడు.
ఆమె ఒక మొలకగా మారితే
అతడు ఆమెను పెరగనీయలేదు.

ఆమె ఒక స్త్రీగా
ఉండడానికి నిశ్చయించుకున్నది
అతడు మగవాడిగా ఉండడానికి
ఇష్టపడలేదు
ఆమె నిర్ణయించుకున్నది
అదే మంచిదని.

✧✧✧✧✧

---

**నిక్కి గియోవాన్ని (Nikki Giovanni 1943- )**

నిక్కి గియోవాన్ని అమెరికన్ రచయిత్రి, స్త్రీవాది, ఉపన్యాసకురాలు. ప్రస్తుతం Virginia Tech లో ఇంగ్లీషు ప్రొఫెసర్.

# 30. ఒక గంటలో జరిగిన కథ

## (The Story of an hour)

**– కేట్ ఛోపిన్**

మిసెస్ లూయిసీ మల్లార్డ్‌కు గుండెజబ్బు ఉందని తెలుసు గనక ఆమె భర్త చనిపోయిన విషయాన్ని ఆమెకు ఎంతో సున్నితంగా, జాగ్రత్తగా చెప్పాల్సి వచ్చింది.

ఆ విషయాన్ని ఆమెకు ఎంతో సన్నిహితంగా ఉండే ఆమె సహోదరి జోసెఫిన్, నెమ్మదిగా, అర్ధవంతమైన వాక్యపు శకలాలుగా, సమాచారాన్ని కాస్త దాచి, కాస్త అర్ధమయ్యేట్లు సూచనలు చేసింది. ఆ సమయంలో ఆమె భర్త ఆత్మీయ స్నేహితుడు రిఛర్డ్ అక్కడే ఉన్నాడు. వాస్తవానికి అతడికే రైలు ప్రమాదం విషయం తెలిసింది. అతడు వార్తాపత్రిక కార్యాలయంలో 'బ్రెంట్లీమల్లార్డ్' పేరు చనిపోయిన వాళ్ల లిస్టులో మొదటగా ఉండడం చూసాడు. రెండో టెలిగ్రాం కూడా మల్లార్డ్ మరణాన్ని ధృవపరిచాక మాత్రమే ఆ విషయాన్ని అతడు మిగతా వాళ్లకు చెప్పాలని ఆతురతపడినాడు.

ఆమె ఆ విషయం వింటున్నపుడే ఒక విధమైన మందకొడి స్థితిలోకి వెళ్లిపోయింది. అందరు స్త్రీలలా ఆమె స్పందించలేదు. ఒక్కసారి మాత్రం, అన్నీ వదిలేసుకున్నదానిలా, తన సోదరి చేతుల్లో వాలి, వలవలా ఏడ్చింది. దుఃఖపు తుఫాను ఉపశమించగానే తన గదిలోకి వెళ్లిపోయింది ఒంటరిగా; ఎవరినీ తనతో రానివ్వలేదు.

ఆ గదిలో తెరచిన కిటికీ ఎదురుగా వాలుకుర్చీ ఉన్నది. అలసట, నిస్త్రాణ తరుముకు రాగా ఆమె ఆ కుర్చీలో కూలబడిపోయి, తన ఆత్మను అన్వేషిస్తున్నట్లు అర్ధ నిమీలిత నేత్రియై, దీర్ఘ నిశ్శబ్దంలో మునిగిపోయింది.

తన ఇంటి ముందున్న ఖాళీస్థలంలోని చెట్లు నూతన జవసత్వాలను పొంది ఉన్నట్లు వర్షపు చక్కని సుగంధ పరిమళం గాలిని ఆవహించినట్లు ఆమె భావించింది. వీధిలో వర్తకుడెవరో తన వస్తువులను అమ్మడానికి కేకలు పెడ్తున్నాడు. సుదూరంగా ఎవరో పాడుతున్న పాట మంద్రంగా ఆమె చెవులను సోకింది. అసంఖ్యాకమైన పిచ్చుకలు ఆకుల మాటున కిచకిచలాడ్తున్నాయి.

పశ్చిమదిక్కున గుమికూడిన మబ్బుల దొంతరల మధ్య నీలిమాసికల్లా ఆకాశం అక్కడక్కడా తొంగిచూస్తున్నది.

నిద్రలో కలగని వెక్కివెక్కి ఏడ్చే పసిపిల్లాడిలా, ఆమె దుఃఖోద్విగ్నయై, వాలుకుర్చీలో తలను బాగా వెనక్కినెట్టి శిలలా కూర్చున్నది. వెక్కిళ్లు ఆమె గొంతులోకి వచ్చి శిలను సజీవంగా ఉంచుతున్నవి.

ఒకప్పుడు ఎంతో అందంగా, ప్రశాంతంగా ఉన్న వదనం ఆమెది. ఇప్పుడామె కళ్లలో ఏదో నిరాశా భరితమైన చూపు సుదూరాన ఉన్న నీలి ఆకాశపు మాసికలలో దాక్కున్నది. అది ఆలోచనల ప్రతిఫలం కాదు, స్తంభించిన ఆలోచనా స్వరూపం.

తనపైకి ఏదో రాబోతున్నదని తెలిసి, ఆమె దానికై వేచి చూస్తున్నది భయభయంగా! ఏమిటది? ఆమెకు తెలీదు. దాన్నేమనాలో కూడా ఆమెకు అర్థం కావడం లేదు. కాని దానిని ఆమె స్పృశించగలుగుతున్నది. అది నింగి నుంచి తనవేపు వీస్తున్న గాలిలో శబ్దాలుగా, సుగంధంగా, వర్ణాలుగా నిండి ఉన్నది.

ఇప్పుడు ఆమె రొమ్ము ఎగిరెగిరి పడుతూ ఉండగా తన మీదకు వస్తూ తనను ఆవహించబోతున్న దానిని గుర్తించి, దానిని సంకల్ప బలంతో నెట్టివేయడానికి ప్రయత్నించింది. కాని ఆమె మనసూ, ఆమె సన్నటి చేతుల్లానే బలహీనంగా ఉన్నది.

ఆ ప్రయత్నాన్ని మానుకునేప్పుడు ఆమె పెదాలు విడివడి ఏదోమాట బయటపడింది. మరల మరల ఆమె స్వేచ్ఛ, స్వేచ్ఛ, స్వేచ్ఛ – అంటూనే ఉన్నది. శూన్యదృక్కులు, భీతితో కూడిన చూపులు తనను ఆవహించిన దానితో కలిసి కళ్ల నుండి బయటకు పోగా, దృష్టి నిశితమై ప్రకాశవంతమైంది. ఆమె గుండె దడదడ కొట్టుకోగా వేడిరక్తం శరీరమంతా వేగంగా ప్రవహించి ఆమె శరీరంలోని ప్రతి అంగుళం భాగమూ ఉత్తేజితమైంది.

తనను ఇంతగా బంధించినదది 'రాక్షసానందం'– అవునా, కాదా అని అడగడానికి ఆమె ఆగలేదు. ఏదో నిర్మలమైన దివ్యానుభూతి ఆ భావనను తొలగదీసింది.

ఆమెకు తెలుసు మరణంలో ప్రశాంతత నొందిన దయాపూరితమైన ఆ ముకుళిత హస్తాలను, ప్రేమతో నిండిన ఆ వదనాన్ని, ఇప్పుడు మృత్యు పరిష్వంగంలో చూడగానే మరల దుఃఖం తనను చీకటిలా కమ్ముకుంటుందని; కాని, ఆమె దానికన్నా ఎక్కువ దూరం, ఇంకా ఎన్నో సంవత్సరాలు తన స్వంతం

కానున్నవాటి గురించి ఆలోచించింది. వాటిని ఆహ్వానిస్తూ తన చేతుల్ని బారజాపింది.

ఆ రాబోయే సంవత్సరాలలో ఆమె ఎవరికోసమో జీవించాల్సిన అవసరం లేదు. తాను తన కోసం బతుకుతుంది. మగవాళ్లు, ఆడవాళ్లు ఒకరిపై ఒకరు విధించుకునే ఆంక్షలూ, బాధ్యతలూ ఇప్పుడుండవు. తాననుకుంటున్నది మంచో, చెడో తెలియదు కాని ఆ ఆలోచన తన మనోవీధిలో ఓ క్షణంసేపు తళుక్కున మెరిసింది.

ఆమె అతడిని ప్రేమించింది, కొద్దిసార్లు. ఎక్కువసార్లు ప్రేమించలేదు కూడా! ఇప్పుడు ఆ విషయంతో పనేమిటి? సమాధానం దొరకని పజిల్ లాంటి ప్రేమ గురించి ఆలోచించడమెందుకు, తనని తాను స్వేచ్ఛాజీవిగా ప్రకటించుకున్న ఈ క్షణాన!

"స్వేచ్ఛ! మనసుకు, శరీరానికి– స్వేచ్ఛ" – అనుకుంటూనే ఉన్నదామె!

జోసెఫిన్ మూసిన తలుపుకు అటుపక్క మోకాళ్లపై కూర్చుని తాళం రంధ్రం దగ్గర నోరుపెట్టి బిగ్గరగా అరుస్తున్నది– విజ్ఞప్తి చేస్తున్నది– "లూయిసి, తలుపు తీయి! నా మాట విను! తలుపు తెరువు– నీ ఆరోగ్యం పాడైపోతుంది. ఏం చేస్తున్నావు లోపల, లూయిసి? దేవుడి మీద ఆన? తలుపు తెరువు!"

"వెళ్లు! నాకేం కాలేదు! నాకే రోగమూ రాదు!" అన్నదామె. తానిప్పుడు జీవన ఔషధం, సంజీవనీ సేవిస్తున్నది ఆ తెరచి ఉన్న కిటికీ గుండా! ఆరోగ్యమెందుకు చెడుతుంది?

ఆమె ఆలోచనలు ఇంతింతై విశ్వరూపం దాలుస్తున్నాయి. రాబోయే రోజులు వసంతకాలం, వేసవికాలం, అన్ని ఋతువులను ఎలా గడపాలి? తానేం చేయాలి? ఆ రోజులన్నీ తన స్వంతం. తన జీవితం చిరకాలం వర్ధిల్లాలని ఆమె ప్రార్థన చేసింది. ఇంకొన్నాళ్లు బతకాలంటేనే భయపడ్డ ఆమెలో నిన్నటికి ఈరోజుకీ ఎంత మార్పు!

చాలాసేపటికి లేచి తన సోదరి విజ్ఞప్తులను మన్నించి తలుపు తెరచింది లూయిసి. ఆమె కళ్లు ఏదో అనూహ్యమైన విజయం సాధించిన వెలుగుతో మిలమిల లాడ్తున్నాయి. విజయాధిదేవతలా ఆమె నడుస్తూ వచ్చి తన సోదరి

జోసెఫిన్ నడుం పట్టుకుని మెట్లు దిగగా ఇద్దరూ కిందికి వచ్చారు. రిఛర్డ్ ఇంకా అక్కడే నిలబడి ఆమె రావడం కోసం ఎదురుచూస్తున్నాడు.

ముందు తలుపును ఎవరో తెరుస్తున్నారు. తలుపు తెరవబడింది. లోనికి వచ్చింది ఎవరో కాదు– బ్రెంటీ మల్లార్డ్ – ప్రయాణ బడలికలో, చేతిసంచి, గొడుగు పట్టుకుని నెమ్మదిగా లోపల అడుగుబెట్టాడు. అతడు ప్రమాదం జరిగిన చోటుకు దూరంగా ఉన్నాడట. ప్రమాదం జరిగినట్టే అతడికి తెలీదు. జోసెఫిన్ పెట్టిన కేక విని అతడు ఆశ్చర్యపోయాడు. రిఛర్డ్ మాత్రం అతడి భార్యకు వెంటనే కనబడనీకుండా ఉండడానికా అన్నట్లు అడ్డం వచ్చాడు.

కాని, అప్పటికే ఆలస్యమయ్యింది...

డాక్టర్లు వచ్చి లూయిసీని పరీక్ష చేసి చెప్పారు– ఆమె గుండెజబ్బుతో చనిపోయింది– బహుశా పట్టలేని ఆనందంతో కావచ్చు.

✧✧✧✧✧

---

**కేట్ ఛొపిన్ (Kate Chopin (Katherine O'Flahety) 1850-1904)**

కేట్ ఛొపిన్ అమెరికన్ కథా రచయిత్రి. ఇరవై శతాబ్దపు స్త్రీవాద రచయితలలో తొలి తరం రచయిత్రిగా పేరు గడించినది. The Awakening ఆమె రచనలలో ప్రసిద్ధమైనది.

# 31. బక్కెట్టు మీద స్వారీ చేసేవాడు
## (The Bucket Rider)

**– ఫ్రాంజ్ కాఫ్కా**

బొగ్గులయిపోయాయి. బక్కెట్టు ఖాళీ. పారతో పనిలేదు. పొయ్యి చల్లారి పోయింది. గడ్డకట్టేట్లున్నది చలికి. కిటికీ పక్క చెట్ల ఆకులు మంచుకు గడ్డకట్టి గట్టిగా అయినాయి. దేవుడా అని తల పైకెత్తి ఆకాశం వేపు చూస్తే తెల్లగా వెండి గోడ అడ్డం వస్తున్నది. బొగ్గులు కావాలి. చలికి గడ్డకట్టి చావదలుచుకోలేదు. నా వెనక దయలేని బొగ్గులకుంపటి. ఎదురుగా దయరాని ఆకాశం. ఈ రెండింటి మధ్యగా పోయి బొగ్గుల వ్యాపారస్తుడి దగ్గర సాయమడగాలి. మామూలు వేడికోళ్లకు అతడు కరగడం మానేసాడు. విన్పించుకోడమూ మానేసాడు. నా దగ్గర ఒక్కొ బొగ్గుముక్కా లేదని ఋజువు చేసి, అతడు నాకు అంతరిక్షంలోని సూర్యుడి లాంటివాడని విన్నవించుకోవాలి. ఒక బిచ్చగాడిలా, గొంతులో మృత్యుగురక ధ్వనిస్తుండగా, అతగాడి గుమ్మం వద్దనే చనిపోబోతున్న దారుణస్థితిలో ఉన్నట్లుంటే – అతగాడు గొప్ప పాకశాస్త్ర నిపుణుడు, కాఫీ పాత్ర నుంచి కప్పులకొద్దీ కాఫీ ఇచ్చేవాడిలా ఆగ్రహంతో మండిపడుతున్నా 'ఎవరి ప్రాణాలు తీయకు' "Thou shalt not kill' అన్న ఆజ్ఞను పాటిస్తూ– నా బకెట్‌లోకి పారనిండా బొగ్గులు పారవేస్తాడు.

అతడి దగ్గరకెలా వెళ్లాలో తేల్చుకోవాలి ముందు; బక్కెటు మీద కూర్చుంటే సరి. బక్కెట్టు మీద కూర్చున్నాను, నా చేతులు ఆ బక్కెట్టు కాడను గట్టిగా పట్టుకున్నాయి కళ్లేన్ని పట్టుకున్నట్టు! మెట్ల మీద నుంచి దిగడం కష్టమయ్యింది కాని, ఒక్కసారిదిగాక నా బక్కెట్టు అద్భుతంగా, అద్భుతంగా పైకి లేచింది. నేలమీద పడుకున్న ఒంటెలు కూడా అంత హుందాగా లేవవు వాటి యజమానులు కట్టెతో అదిలిస్తున్నపుడు. మంచుకు గడ్డకట్టిన వీధుల గుండా వెళ్తూ, అక్కడక్కడ ఇళ్లపై అంతస్తు అంత పైకిలేచినా, దాదాపు ఇళ్ల తలుపులంత ఎత్తులో సాగుతున్నది మా ప్రయాణం. చివరకు నేను బాగా ఎత్తుకు ఎగిరి బొగ్గుల వ్యాపారస్తుడి కొట్టుపైన ఆగి క్రింద, వ్రాత బల్ల దగ్గర కూర్చుంటున్న వ్యాపారస్తుడిని చూసాను. అతడప్పుడే లోపలి వేడిగాలి బయటకు పోవడానికి తలుపులు తీసి అదృష్టవశాత్తూ నాకు కనిపించాడు.

"అయ్యా! బొగ్గుల వ్యాపారీ!'– నా ఊపిరి వల్ల ఏర్పడిన మబ్బులో, నా మాటలు, మంచుతో కాల్చబడిన శబ్దంతో బోలుగా సమసిపోయాయి. "సేఠూ! నామీద దయ ఉంచి, కొద్దిపాటి బొగ్గులను వేయగలవు. బక్కెట్టు ఎంత తేలికగా

ఉందంటే దాని మీద నేనెగరగలుగుతున్నాను. జాలిచూపు! నాకు చేతనైనప్పుడు నీ ఋణం తీర్చుకుంటాను"

వ్యాపారి తన చేతిని చెవి దగ్గరపెట్టుకున్నాడు. "నేను సరిగా విన్నానా?" అదే ప్రశ్న పక్కనే ఉన్న తన భార్యను అడిగాడు– "నేను సరిగా విన్నానా? ఎవరో బొగ్గులు కావాలి అని అడిగినట్లన్పించింది!"

"నాకేం వినబడలేదు" అన్నదతడి భార్య ప్రశాంతంగా గాలి పీల్చుకుంటూ ఏదో కుట్టుకుంటూ. తన వీపుకు తగుల్తున్న వెచ్చదనాన్ని అనుభవిస్తున్నది హాయిగా ఆమె.

"ఓ! నా మాటలాలకించండి" అన్నాను నేను అరుస్తూ "నేను మీకు తెలిసినవాడినే! ఇదివరకు ఎప్పుడూ మీ దగ్గరే కొంటుండేవాడిని. నమ్మకంగానూ సత్యప్రమాణకంగానూ. ప్రస్తుతం నా దగ్గర డబ్బుల్లేవు".

"ఏమోయ్!" వ్యాపారి తన భార్యతో అంటున్నాడు– "ఖచ్చితంగా ఎవరో పిలుస్తున్నారు. నా చెవులు నన్ను మోసం చేయవు. ఈ గొంతు పరిచయమున్నట్లే ఉన్నది. ఎవరో మన పాత కస్టమరు. నన్ను కదిలిస్తున్నదా గొంతు"

"నీకేమయ్యిందయ్యా ఇవ్వాళ?" అంటూ ఆమె తన పని ఒక్కక్షణం ఆపి, కుడుతున్న ఉన్నిగుడ్డను రొమ్ములకదుముకున్నది. "ఎవ్వరూ లేరు. వీధి నిర్మానుష్యంగా ఉన్నది. మనం అందరికి కావాల్సినంత బొగ్గు ఇచ్చేసాం! మన షాపు కొద్దిరోజులు మూసేసి విశ్రాంతి తీసుకోవచ్చు"

"నేనిక్కడ బక్కెట్టు మీద కూర్చుని ఉన్నాను" అరిచాన్నేను. గడ్డకట్టిన కన్నీళ్లు నా కళ్లను మసకగా చేసాయి. "దయచేసి పైకి చూడండి, ఒక్కసారి! నేనిక్కడ పైన కనబడతాను. మొక్కుతా మీ కాళ్లకు! ఒక్క దోసెడు, పారనిండా దోసెడు బొగ్గులు చాలు! ఎక్కువిస్తే ఇంకా సంతోషం. ఎంత సంతోషమంటే ఏం చేయాలో తెలియనంత. మిగతా మీ కష్టమర్లందరికీ కావల్సినంత అందింది. ఆహా! ఆ బొగ్గులు నా బక్కెట్టులో పడుతుంటే, ఆ శబ్దం ఎంత ఇంపుగా ఉంటుందో నా చెవులకు?"

"నేను వస్తున్నా!" అన్నాడు వ్యాపారి. చిన్నిచిన్ని అడుగులతో సెల్లార్ మెట్లెక్కబోయాడు. అప్పటికే అతడి భార్య అతడి పక్కనే నిలబడి అతడిని పట్టుకున్నది. "నీవిక్కడే ఉండు! మొండివాడివి. చెబితే వినవుగా! ఎవరూ లేరంటే వినిపించుకోవే! నేనే బయటకు వెళ్లి చూస్తాను. రాత్రెంత దగ్గావో గుర్తులేదా; చలి నీకు పడదాయె. ఈ కూసింత వ్యాపారానికి, ఒకవేళ ఎవరో నిన్ను నిజంగా పిలిచినా వెళ్లిపోవడమేనా?

నీ భార్యాపిల్లల్ని మరచిపోయి, ఊపిరితిత్తుల్ని చెడగొట్టుకోవాల్సిన అవసరమేముంది? నేను పోయి చూసి వస్తా. ఆగు!"

"అయితే, వెళ్లి చెప్పు, మనదగ్గర ఉన్న రకరకాల బొగ్గుల గురించి. వాటి ఖరీదులు నేను ఇక్కడ్నుంచి కేకపెడ్తాను"

"అలాగే" అన్నదామె. మెట్లెక్కి వీధివేపు చూసింది. అక్కడ నేనున్నాను. "సోదరీ!" నేనరిచాను. "నమస్కారం! కాసిని బొగ్గులు. ఒక్క దోసెడు! పారనిండా పోస్తే చాలు. ఇదిగో ఈ బక్కెట్టులో; నా ఇంటికి మోసుకునిపోతాను, నీ దగ్గరున్నవాటిలో పనికిరానివి, వాటి ఖరీదు చెల్లిస్తాను కాని ఇప్పుడు కాదు; ఇప్పుడు కాదు; ప్రస్తుతం నా దగ్గర పైసాలేదు" నాకే నా మాటలెట్లాగో అనిపించాయి. "ఇప్పుడు కాదు, ప్రస్తుతం నా దగ్గర పైసాలేదు" అవి సాయంకాలపు చర్చి గంటల శబ్దాల్లో ఎంత చక్కగా కలిసిపోతున్నాయి!

"ఇంతకీ, అతడికేం కావాలట?" వ్యాపారి అరుస్తున్నాడు. "ఏం లేదు" ఆమె సమాధానమిచ్చింది బిగ్గరగా– "ఇక్కడెవరూ లేరు. ఏమీలేదు. నాకెవరూ కనబడడం లేదు. నాకేమీ వినబడడం లేదు. చర్చిగంటలు ఆరు కొట్టాయి. మనం షాపు మూసేయాలి. బయట చలి తీవ్రంగా ఉంది. రేపు చెయ్యాల్సిన పని చాలా ఉండేట్లుంది"

ఆమె ఏమీ చూడటం లేదు. ఆమెకేమీ వినిపించడం లేదు. తన ఏప్రాను విప్పి నన్ను పారదోలడానికన్నట్లు గాలిలో ఊపింది. నా దురదృష్టం ఆమె గెలిచింది. నా బక్కెట్టుకు మంచి గుర్రానికుండే లక్షణాలన్నీ ఉన్నాయి. ఒక్క ఎదురుతిరగడం తప్ప. చాలా తేలికగా బరువులేకుండా ఉందేమో అది ఆమె ఏప్రాను విసురుకు గాలిలోకి ఎగిరి బయటపడింది.

"నీవు చెడ్డదానివి!" అరిచాన్నేను. ఆమె షాపులోకి వెళ్తున్నది చిరాకుతో, తన పిడికిలిని గాలిలో ఊపుతూ!

"నీవు బహు చెడ్డదానివి! నేను నిన్నడిగింది ఓ పారడో, దోసెడో పనికిరాని బొగ్గుల్ని. ఆమాత్రం కూడా నీవివ్వలేదు" అని తిట్టి నేను మంచు పర్వతాల్లోకి ఎగిరిపోయాను. అంతే ఇక ఎవరికీ కనపడను. వినపడను!

✧✧✧✧✧

---

**ఫ్రాంజ్ కాఫ్కా (Franz Kafka 1883-1924)**

ఫ్రాంజ్ కాఫ్కా – జర్మన్ రచయిత. Existentialism వాదాన్ని బలపరచినవాడు. అతడి రచనలలో ముఖ్యమైనవి– Metamorphosis, The trial, The castle.

# 32. ఉసిరికాయలు
## (Goose berries)

**- ఏంటన్ ఛెకోవ్**

ఉదయం నుంచి వానమబ్బులతో నిండిన ఆకాశం పగటిని శీతలంగా మబ్బుగా మార్చింది. ఈ ముసురుపట్టిన రోజుల్లో మబ్బులు తలలెప్పుడు దించుతాయో, ఎప్పుడు వాన వస్తుందో అర్థం కాదు. వాన పడ్తుందని మనం అనుకునేలోపునే ఆగిపోతుంది. ఆగిపోయిందనుకోగానే కుంభవృష్టి కురుస్తుంది.

పశువుల డాక్టరు- ఇవాన్ ఇవానిచ్, హైస్కూలు టీచరు- బర్కిన్, పొలాల గట్ల వెంబడే నడుస్తూనే వున్నారు అలసట వచ్చేవరకు. ఎంత నడిచినా తరగనట్లున్నదారి. దూరంగా మిరొనొసిట్స్‌కొయి గ్రామపు గాలిమర కనిపిస్తున్నది. కుడిపక్క ఉన్న చిన్నపాటి కొండలు గ్రామాన్ని దాటి విస్తరించి ఉన్నాయి. కొండలకు దిగువగా ఉన్నది నది. దాని పక్కన మైదానాలు, ఆకుపచ్చని విల్లో వృక్షాలు, పంటపొలాలు ఎస్టేట్లు. కొండలపైకెక్కితే వాళ్లకు తెలుసు ఎటు చూసినా పొలాలు, టెలిగ్రాఫు స్తంభాలు, అదుగో రైలుబండి- గొంగళి పురుగులా పాకుతూ కనిపిస్తున్నది. వాతావరణం బాగుంటే దూరాన ఉన్న గ్రామం కూడా స్పష్టంగా కనిపించేది ఇక్కడ నుంచి. ఇవాన్ ఇవానిచ్, బర్కిన్‌లకు ఈ నేలపై అవ్యాజమైన ప్రేమ. వాళ్లనుకున్నారు మన నేల ఎంత విశాలమైనదీ, అందమైనదీ అని.

"క్రితంసారి మనం ప్రొకొఫి వృద్ధుడి గుడిసెలో తలదాచుకున్నపుడు నీవేదో కథ చెబుతానన్నావు" అడిగాడు బర్కిన్.

"అవునవును. అది నా సోదరుడి కథ"

ఇవాన్ ఇవానిచ్ ఓ దీర్ఘశ్వాస తీసుకున్నాడు. పైపు వెలిగించి తాను చెప్పబోయే కథకు ఉపోద్ఘాతం అన్నట్లు సిద్ధమయ్యేసరికి జోరుగా వాన మొదలయ్యింది. అయిదు నిముషాల్లో అది కుండపోతగా మారింది. ఎప్పుడు ఆగుతుందో అంచనా వేయలేని పరిస్థితి. ఉన్నచోటనే నిలబడిపోయిన మిత్రులిద్దరూ ఆలోచనల్లో మునిగిపోయారు వానలో తడుస్తూనే. ఓవర్ కోట్లు వాళ్లకింత రక్షణ నిస్తున్నాయి. వాళ్ల పెంపుడు కుక్కలు కూడా పూర్తిగా తడిచి, తోకలు ముడుచుకుని, వాళ్లవేపే చూస్తున్నాయి. ఏదన్నా తలదాచుకునే చోటుకు దారి తీస్తారన్న ఆశతో కాబోలు.

"మనకెక్కడన్నా ఆశ్రయం కావాలిప్పుడు. అలెఖిన్ ఇంటికి పోదాం. అదిక్కడకు దగ్గరే" అన్నాడు బర్కిన్.

"అయితే పద"

వాళ్లు పక్కకు తిరిగి పంటపొలం మధ్యగా సరాసరి నడుస్తూ కుడివేపున ఉన్న రహదారికి చేరుకున్నారు. అక్కడ నుంచి కొంతదూరం పోయేసరికి, పోప్లర్ వృక్షాలు, పళ్లతోట, ఉధృతంగా ప్రవహిస్తున్న నది కనిపించింది. ఎక్కడ చూసినా నీరు, గాలిమర ఒకటి, సున్నంకొట్టి ఉన్న స్నానాల గది ఉన్న 'సోఫైయినొ' వ్యవసాయక్షేత్రం– అలెఖిన్ ఉండే ప్రదేశాన్ని చేరుకున్నారు.

గాలి మర తిరుగుతూ ఉన్నది. దాని రెక్కల చప్పుడు రైలింజన్ శబ్దాల్ని మింగివేయగా, మొత్తం ఆనకట్ట కంపిస్తున్నది. వానలో తడిచి, గుర్రాలు కొన్ని గుర్రపు బండ్ల పక్కన తలవాల్చి నిలబడి ఉన్నాయి. నెత్తిమీద, భుజాల మీద మూటలతో జనం అటు ఇటూ పోతున్నారు. ఎక్కడ చూసినా తడి, బురద నేల. నీళ్లు చల్లగా గడ్డకట్టినట్లున్నాయి. ఇవాన్ ఇవానిచ్, బర్కిన్‌లు కాళ్లకున్న బూట్లకు అతుక్కున్న బురదతో, అక్కడక్కడా తడిసిన బట్టల చల్లదనంతో, చిరాకుగా నడుస్తూ గాలిమరను దాటి ఎగువకు నడుస్తూ మౌనంగా, ఒకరి మీద ఒకరు విసిగిపోయినట్లు ఏ సంభాషణా లేకుండా ముందుకు వెళ్లినారు.

పక్కనే ఉన్న పాకల్లోంచి ఎవరో ధాన్యాన్ని తూర్పారబడ్తున్న శబ్దం. తలుపు తెరచి ఉండడం మూలంగా దుమ్ము మబ్బుతెరల్లా బయటకు వస్తున్నది. ద్వారం దగ్గర స్వయానా ఉన్నది అలెఖిన్. నలభై ఏళ్లు పైబడిన వయస్సు, లావుగా దృఢంగా ఉండి, పొడుగాటి జుట్టుతో ప్రొఫెసర్ లేదా ఆర్టిస్టులా ఉన్నాడే కాని జమీందారులా లేడతగాడు. తెల్లచొక్కా బురద మరకలతో నిండి ఉతకాల్సిన అవసరం చెబుతున్నది. పొడుగాటి డ్రాయర్ తొడుకున్నాడు దానికి ఏదో తాడును బెల్టుగా కట్టుకున్నాడు. అతడి బూట్లకు కూడా బురద మట్టి, గడ్డిపరకలు గట్టిగా అంటుకుని పెచ్చులూడ్తున్నవి. కళ్లమీద, ముక్కుమీద ధాన్యపు దుమ్ము వలయాలుగా పేరుకుని ఉన్నది. అతడు ఇవాన్ ఇవానిచ్, బర్కిన్‌లను చూడగానే గుర్తుపట్టినాడు. అతడి ముఖంలో ఆనందం కనపడింది.

"పైన, ఇంటిలోకి వెళ్లండి, మిత్రులారా! నేనింకో క్షణంలో వచ్చేస్తాను" అన్నాడు అలెఖిన్.

అది రెండంతస్తుల ఇల్లు. క్రింద రెండు గదులున్నాయి. వాటికి చిన్న కిటికీలుండి తక్కువ సామానుతో ఉన్నాయి. వాటిలో ఇదివరకు స్టివార్డు

లుండేవాళ్లు. రెడ్రెడ్, చవకరకం వోడ్కా, గుర్రపు కళ్లాల వాసనతో అవి కాస్త తక్కువ క్వాలిటీతో ఉన్నాయి. పైన ఉన్న గదుల్లోకి అతిధులు వచ్చినప్పుడు మాత్రమే అలెఖిన్ వెళ్తాడు. కాబట్టి అవి దాదాపు వాడనట్లే లెక్క. దారిలో వాళ్లకు ఓ అందమైన పనిమనిషి కనిపించగా వాళ్లు అలానే ఓ క్షణం నిలబడిపోయి ఆమె వేపు చూసి మరల చూపులు మరలించుకున్నారు.

"మిమ్మల్నిక్కడ చూడడం నాకెంత సంతోషంగా ఉందో మాటల్లో చెప్పలేను. మిత్రులారా! స్వాగతం!" అన్నాడు అలెఖిన్ వాళ్లను హాల్లో వేగంగా నడిచి దాటుతూ– "నాకు ఇది అనుకోని ఆశ్చర్యమే! పెలాజియా! మన అతిధులకు దుస్తులు మార్చుకునే ఏర్పాట్లు చేయి. నేనూ స్నానం చేసి చానాళ్లయ్యింది. వసంతకాలంలో చేసాననుకుంటాను– ఆఖరుసారి. మిత్రులారా! మీరు కూడా స్నానం చేసిరాకూడదూ వీళ్లు ఆతిథ్యపు ఏర్పాట్లు చేసే లోపుగా!"

అందమైన పెలాజియా వాళ్ల చేతికి సబ్బు, తువ్వాళ్లు ఇచ్చింది. అలెఖిన్, అతడి అతిధులు స్నానగృహం వేపు వెళ్లారు.

"అవును. నేను స్నానం చేసి చానాళ్లయ్యింది" అన్నాడు అలెఖిన్. "ఇది చాలా చక్కని స్నానగృహం. మా తండ్రిగారు కట్టించాడు. కాని నాకే టైం దొరకదు స్నానం చేయడానికి"

మెట్లమీద కూర్చుని అతడు తన మెడకు, పొడుగాటి శిరోజాలకు సబ్బు పట్టించాడు. నీళ్లతో కడుగుతుంటే స్వచ్ఛమైన నీళ్లు బురదరంగులోకి మారాయి అతడి చుట్టూరా!

"అవునవును... నీకు స్నానం...." అన్నాడు ఇవాన్ ఇవానిచ్ అలెఖిన్ తలవేపు చూస్తూ...

"చానాళ్లయ్యింది స్నానం చేసి..." అన్నాడు మరలా అలెఖిన్ మళ్లీ సబ్బు రాసి నీళ్లతో కడిగాడు. ఈసారి నీళ్లు ముదురు నీలంగా ఇంకులా మారాయి.

ఇవాన్ ఇవానిచ్ ఆ పాక నుంచి బయటపడి నది నీళ్లలోకి దూకి ఈత కొట్టడం ప్రారంభించాడు. అతడు చేతులు, కాళ్లు బార్లా చాచి ఈతకొడ్తుంటే ఆ అలల తీవ్రతకు తెల్ల కలువలు అటూ యిటూ ఊగుతున్నాయి. నది మధ్యకు ఈదుతూ వెళ్లి, మునిగీతకొడ్తూ ఇంకోచోట తేలి, అక్కడ మునిగి మరోచోట తేలుతూ, మళ్లీ మునుగుతూ నది అడుగును అంటుకోడానికి ప్రయత్నిస్తూ ఈత కొట్టడంలో ఆనందాన్ని అనుభవించసాగాడు. "ఓ దేవుడా!..." అంటూ దేవుడ్ని

స్తుతిస్తూ హాయిగా ఈతకొడ్తూ గాలిమర ఉన్నవేపు వేగంగా వెళ్లి ఒడ్డుకు చేరుకుని అక్కడున్న రైతుకూలీలతో ముచ్చట్లాడి వెనక్కు మళ్లి నది మధ్యకు రాగానే ఈసారి వెల్లకిలా పడుకుని ఈతకొడ్తూ మొహంపై పడ్తున్న వానజల్లు స్పర్శను ఆస్వాదిస్తూ మరింతగా ఆనందించసాగినాడు. బర్కిన్, అలెఖిన్లు వాళ్ల స్నానాలను ముగించి, దుస్తులు ధరించి వెళ్లడానికి సిద్ధమైనారు. ఇవాన్ ఇవానిచ్‌కు ఇంకా తనివితీర నట్లుంది., ఈదుతూనే ఉన్నాడు.

మునిగి పైకి వచ్చినప్పుడల్లా– "దేవుడా! దేవుడా!" అని ఆనంద పారవశ్యంతో మొక్కుతూనే ఉన్నాడు.

"రా! పోదాం!" అన్నాడు బర్కిన్ దాదాపు అరుస్తున్నట్లుగా.

వాళ్లు ఇంట్లోకి వెళ్లారు. బర్కిన్, ఇవాన్ ఇవానిచ్‌లు సిల్కు డ్రస్సింగ్ గౌన్లు తొడుక్కుని, స్లిప్పర్లు వేసుకుని పెద్ద గదిలో వాలుకుర్చీలలో కూర్చున్నారు. అలెఖిన్ మంచిగా తలదువ్వకుని కొత్తకోటు, దుస్తులు ధరించి, స్నానానంతర సౌఖ్యాన్ని, శుభ్రతను స్పర్శిస్తూ, స్లిప్పర్లు తొడుక్కుని హాయిగా నడుస్తూండగా, అందాల పెలాజియా ముగ్ధమనోహరంగా చిరునవ్వులు చిందిస్తూ కార్పెట్ మీద నిశ్శబ్దంగా నడుస్తూ బిస్కట్లు, టీకప్పులున్న ట్రే బల్లపై ఉంచింది. ఇవాన్ ఇవానిచ్ కథ చెప్పడం మొదలెట్టేసరికే అక్కడ గోడలకు తగిలించిన మెరిసే ఫ్రేములున్న ఫోటోల్లోని ప్రాచీన స్త్రీలు, యువతులు, మిలిటరీ వ్యక్తులు, గౌరవనీయులైన అతిథులు వాళ్లవేపు చూస్తూ వాళ్ల సంభాషణ వింటున్నట్లున్నారు.

"మేం ఇద్దరం అన్నదమ్ములం. నేను (ఇవాన్ ఇవానిచ్ నా సోదరుడు (నికొలాయి ఇవానిచ్). నా కంటే రెండేళ్లు చిన్నవాడు. నేను పై చదువులు చదివి వెటర్నరీ డాక్టరునయ్యాను. తమ్ముడు నికొలాయి పంథొమ్మిదేళ్ల వయసులోనే గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తాగా చేరాడు. మా తండ్రి పేరు చింషా– హిమాలైయస్కీ సైనిక పాఠశాలలో చదువుకున్నా, తర్వాతకాలంలో ఆఫీసర్ కావడంతో అతడికి ఓ చిన్న ఎస్టేట్, వంశపారంపర్య గౌరవ స్థానం లభించి నోబుల్‌మాన్‌గా మారినాడు. కాని అతడు చనిపోయాక ఋణబాధల నుంచి విముక్తి కావడానికి ఆ చిన్న ఎస్టేట్‌ను అమ్మివేయవలసి వచ్చింది. మా చిన్నతనం అంతా పల్లెటూళ్లలో గడవడం చేత మాకు అక్కడి స్వేచ్ఛా వాతావరణంలో పల్లె ప్రజల పిల్లల్లా పొలాల్లో అడవుల్లో హాయిగా తిరుగుతూ కాలం గడిపాము. గుర్రాల్ని మేతకు తీసుకువెళ్లడం, నిమ్మచెట్ల బెరడును ఊడబీకడం, చేపలు పట్టడం లాంటి వ్యాపకాలతో మా చిన్నతనం హాయిగా గడిచింది. ఎవరైనా సరే గాలం

పట్టుకుని పెర్చ్ చేపలను పట్టుకోవడం, పిచ్చుకలు, పక్షులు దక్షిణానికి వలస పోతున్నప్పుడు చూసి ఆనందించినవాళ్లెవరూ పట్టణ జీవితంలో అటువంటి సుందర దృశ్యాలు కానరాక ఎప్పుడెపుడు పల్లెకు పోదామా అని మనసులో తీవ్రమైన కోరికతో ఊగిపోతుంటారు.

నా తమ్ముడు ప్రభుత్వ కార్యాలయంలో ఉండి ఇటువంటి ఎడబాటునే పొందినట్లున్నాడు. సంవత్సరాలు గడిచినా అదే కుర్చీ, అదే ఉద్యోగం. ప్రతిరోజూ అదే రాత, అవే పత్రాలపై రాసిందే రాయడం, ప్రతిరోజూ అదే ఆలోచించడం. కాని అతడి మనస్సు ఎల్లప్పుడూ పల్లె జీవనం గురించే ఆలోచిస్తూ ఉండేది. ఆ ఎడబాటు క్రమేపీ తీవ్రమైన కోరికగా మార్చి అది స్వప్నంగా స్థిరపడిపోయింది. ఎప్పటికైనా ఓ ఎస్టేట్ యజమానిగా నదీ తీరానో, సరస్సు ఒడ్డునో జీవించాలనేది ఆ స్వప్నం.

అతడు కాస్త పిరికివాడు. కాని, మంచి వ్యక్తిత్వం కలవాడు. అతడంటే నాకిష్టమే కాని, తన స్వంత ఎస్టేట్‌లో ఎటూ కదలకుండా కాలక్షేపం చెయ్యాలనే కోరికకు నేను బద్ధ వ్యతిరేకిని. మనిషికెంత భూమి కావాలి– ఆరడుగులే కదా అని పెద్దలంటారు. ఆ ఆరడుగులు శవానికి సరిపోవచ్చును కాని మనిషి బతకడానికి సరిపోవు కదా! ఇప్పుడు ప్రజలంటున్నారు మేధావులు కూడా పల్లెజీవనానికిష్టపడడం మంచి సూచన అని. కాని ఎస్టేట్లలో మాత్రం ఏమున్నది ఆరడుగుల నేల తప్ప? ఇదంతా దేనికి? పట్టణపు రొదనుంచి, నిరంతర ఘర్షణ నుంచి, జీవితపు రణగొణ ధ్వనుల్నుంచి, తప్పించుకుని ఓ మారుమూల పల్లెటూరులోని ఎస్టేటులో తలదాచుకోవడం – జీవితం కాదు– ఇది కేవలం అహంకారం. ఎగోయిజం – బద్ధకం; ఓ విధమైన సన్యాసం. సన్యాస జీవితమే కాని నమ్మకంలేని సన్యాస జీవనం. ఆరు అడుగుల నేల కాదు, వ్యవసాయ క్షేత్రాలేవీ మానవుడికి సరిపోవు. అతడికి కావాల్సింది ఈ భూగోళం, ఈ ప్రకృతి యావత్తూ, మానవుడు తన నేర్పును ప్రదర్శించే అవకాశం, అతడి ఆత్మయొక్క ప్రత్యేక వ్యక్తిత్వం. ఇవి అతడు కోరుకునేది.

నా తమ్ముడు 'నికొలాయి' తన ఆఫీసు కుర్చీలో కూర్చుని తన చిన్ని ఎస్టేట్‌లో స్వహస్తాలతో పండించిన కాబేజితో చేసిన సూప్ తాగాలని కలలు కనేవాడు. వాటి చక్కని పరిమళంతో తన ఎస్టేటంతా సుగంధం వ్యాపించాలని ఆశించేవాడు. నీలాకాశం కింద ఆహారాన్ని భుజిస్తూ, పచ్చని పచ్చిక మీద, నీరెండలో నిద్రపోవాలని కలలు కనేవాడు. తన గేటుకు ఆవల ఉన్న బెంచీపై

కూర్చుని, పొలాల వేపు, అడవుల వేపు చూస్తూ గంటలకొద్దీ కాలం గడపాలనేది అతడి ఆశ, ఆశయం. వ్యవసాయానికి సంబంధించిన పుస్తకాలు, చిట్కాలు ప్రతిఫలించే క్యాలండర్లంటే ప్రాణం అతగాడికి. అవే అతడి ఆత్మకు ఆహారం. పేపర్లు, వార్తా పత్రికలు తెప్పించి వాటిలో ఆతడు చదివేదల్లా అమ్మకానికి పొలం లాంటి ప్రకటనలే! ఇన్ని ఎకరాల పొలం, ఇంత మెట్ట, ఇంత మాగాణి, ఇంత బీడు భూమి, వ్యవసాయక్షేత్రంలోనే ఇల్లు, పక్కనే నది, పండ్లతోట, తోటలో దారులు, పూలూ, పళ్లూ, పెంపుడు పక్షుల గూళ్లు, కార్ప్ చేపల చెరువూ, గాలిమర, ఏర్లు పారగా నిండే సరస్సు ఇటువంటి ఆలోచనలే అతడి మనసు నిండా! ప్రకటనను బట్టి అతడి ఆలోచనలలోని విషయం మారుతూ ఉండేది కాని ప్రతి ఊహలోనూ ఉసిరిచెట్టు తప్పక ఉండేది. ఉసిరిక చెట్లు లేని ఎస్టేట్‌ను అతడు ఊహించలేకపోయేవాడు.

పల్లెటూరి జీవనంలో కొన్ని లాభాలున్నాయి. వరండాలో కూర్చుని, టీ తాగుతూ, చెరువులో ఈతకొడ్తున్న బాతుపిల్లల్ని చూడవచ్చు. చక్కటి మట్టి పరిమళం అన్నివేపులా! పండిన ఉసిరికల గూస్‌బెర్రీల వాసన...”

ఎస్టేట్ గురించి చక్కని ప్లాన్‌లు, ప్రణాళికలూ ఎప్పుడూ అతడి వద్ద సిద్ధంగా ఉండేవి. కాని ప్రతిదీ ఒకేవిధంగా ఉండేది. (1) నివాసగృహం, (2) సేవకుల గదులు, (3) వంటగది–చిన్నతోట, (4) ఉసిరిచెట్లు (గూస్‌బెర్రీ పొదలు).

అతడు చాలా పొదుపుగా ఉండేవాడు. ఎప్పుడూ కడుపునిండా తిన్న, తాగిన పాపానపోలేదు. అడుక్కునేవాడిలా దుస్తులు ధరించేవాడు. సంపాదించిందంతా బ్యాంకులో దాచుకున్నాడు. క్రమేపీ పెద్ద పిసినిగొట్టుగా మారినాడు. అతడి వంక చూడాలంటేనే నాకిష్టమయ్యేది కాదు. నేనెప్పుడన్నా కొద్ది డబ్బులిచ్చినా, బహుమతి పంపినా అవన్నీ జాగ్రత్త పెట్టుకునేవాడు. ఎవరి మనసులోనన్నా ఒక ఆలోచన తీవ్రంగా తిష్ఠవేస్తే అది వదలదేమో ఎన్నటికీ!

ఏళ్లు గడిచాయి. అతడికి మరో చోటుకు ట్రాన్స్‌ఫరయ్యింది. అప్పటికే అతడికి నలభై ఏళ్లు వచ్చాయి. ఇంకా వార్తాపత్రికల్లో ప్రకటనలు చదువుతూనే వున్నాడు. డబ్బు దాస్తూనే ఉన్నాడు. అతడికి పెళ్లైందని తెలిసింది. పెళ్లి కూడా డబ్బుకోసమే! అందుకనే అతడు ఓ అనాకారి, వయసు మీరిన, కాస్త డబ్బున్న వితంతువును వివాహం చేసుకున్నాడు. ఆమెపై కించిత్ ప్రేమ, ఆప్యాయతలు లేవు. పెళ్లైనాక కూడా జీవన విధానంలో మార్పు లేదు. అదే పొదుపు, అదే పిసినారితనం. అర్ధాకలితో తానుంటూ, ఆమెనూ ఇబ్బందిపెట్టేవాడు. ఆమె

డబ్బును తన ఎకౌంట్‌లోకి మార్చుకున్నాడు. ఆమె మొదటి భర్త పోస్ట్‌మాస్టర్. బాగానే బతికింది. మంచి తిండీ, మంచి జీవనం. ఇతగగాడు కనీసం బ్లాక్‌బ్రెడ్ కూడా దొరకనిచ్చేవాడు కాదు తినడానికి. దానితో ఆమె ఆ నియంతృత్వ పరిపాలనలో కృంగి కృశించి మూడేళ్లలో దేవుని సన్నిధికి చేరుకున్నది. అయినా, ఆమె గురించి ఇతడేమాత్రం బాధ పడలేదు. అపరాధ భావన అసలే లేదు. డబ్బు, వోడ్కాలా మనిషిని ఓ విపరీత ధోరణి వున్న ఎక్సెంట్రిక్ వ్యక్తిగా మారుస్తుందేమో.

మా ఊళ్లో ఒక వ్యాపారి మరణశయ్య మీద ఉండి ఇంత తేనె తెప్పించుకుని తన దగ్గర ఉన్న బ్యాంకు నోట్లు, లాటరీ టిక్కెట్లు అన్నీ తేనెలో ముంచి తిన్నాడట. తన డబ్బు ఎవరికీ చెందకూడదనే ఉద్దేశంతో. అట్లాగే ఓ రోజున రైలు స్టేషన్‌లోకి పశువుల మందను తీసుకువచ్చిన వ్యక్తి కాలుజారి ఇంజను కింద పడితే కాలు తెగిపోయింది. మేం నానా అవస్థ పడి రక్తమోడుతున్న అతడిని స్టేషన్ రూంలోకి తీసుకువచ్చి పడుకోబెట్టి ప్రాథమిక వైద్యం చేస్తుంటే, అతగాడి గొడవల్లా, 'నా కాలు తీసుకురండి! నా కాలు తీసుకురండి' అని. ఎందుకయ్యా ఎందుకు పోయిన కాలు గురించి ఇంత బెంగ అని గదమాయిస్తే అప్పుడు చెప్పాడు– 'ఆ కాలి బూటులో ఇరవై రూబుల్సున్నాయి' అని. అవి 'ఎవడన్నా కొట్టేస్తాడేమో' అని ఒకటే ఏడుపు!"

"కథ దారి మళ్లుతున్నది మిత్రమా" అన్నాడు బర్కిన్.

ఒక్కక్షణం ఆగి ఇవాన్ ఇవానిచ్ మరల ప్రారంభించాడు– "భార్య చనిపోయాక అతడు ఎస్టేట్ గురించి విస్తృతంగా శోధించాడు. అయిదేళ్లు వెదికినా చివర్లో ఏదో తప్పు జరిగి నీవనుకున్నదానికి బదులు ఏదో కొని సమాధానపడాల్సి వస్తుంది. నా తమ్ముడు నికొలాయి మొత్తానికి ఓ మూడు వందల ఎకరాలు కొన్నాడు. దాంట్లో నివాసగృహముంది. సేవకులకు గదులున్నాయి. చిన్న పార్కు ఉన్నది. ఏజంటు ద్వారా తీర్చాల్సిన ఋణముంది. కాని పండ్లతోట లేదు. ఉసిరి చెట్లు– గూస్‌బెర్రీ పొదలు లేవు. చెరువు దాంట్లో ఈదే బాతులూ లేవు. పక్కనే నది ఉన్నది కాని నీళ్లు కాఫీరంగులో ఉంటాయి. ఎందుకంటే ఎస్టేటు కిరుపక్కలా ఒకవేపు ఇటుకబట్టీ, రెండోవేపు ఎముకలపొడి కర్మాగారం ఉన్నాయి. అయినా తల్గొగ్గని 'నికొలాయి' రెండు డజన్ల గూస్‌బెర్రి ఉసిరిక మొక్కల్ని తెప్పించి వాటిని పొలంలో నాటి ఎస్టేట్‌లో స్థిరపడినాడు. ఇప్పుడతడో భూస్వామి.

క్రితం సంవత్సరం అతడిని చూడటానికి వెళ్లాను. ఎలా ఉన్నాడో పరామర్శిద్దామని. అతడిచ్చిన అడ్రస్‌లో చుంబరొక్లోవా పుస్తోష్ / హిమాలైకొయిస్కీ

అని వ్రాసివుంది. నేను మధ్యాహ్నానికల్లా అక్కడకు చేరుకున్నాను. ఎండ వేడి తీవ్రంగా ఉన్నది. ఎక్కడ చూసినా గోతులూ, కంచెలు, ఎత్తుపల్లాలు, ఫర్ వృక్షాల వరుసలు. ప్రయాణమే కష్టం అనుకుంటే, గుర్రపు బండినెక్కడ ఆపాలో అర్థం కాలేదు. కొంతదూరం వెళ్లేసరికి ఓ బలిసిన కుక్క, అల్లం రంగులో, దాదాపు పందిలా ఉన్నది నా ఎదుటకు వచ్చింది. మరీ బద్ధకంగా ఉండి కాబోలు కనీసం మొరగను కూడా మొరగలేదు. వంటగదిలోంచి ఓ లావాటి పందిలాంటి ఆడమనిషి చెప్పుల్లేని కాళ్లతో వచ్చి- యజమాని భోజనానంతర నిద్రలో ఉన్నాడని చెప్పింది. నేను సరాసరి నా తమ్ముడి గదిలోకి వెళ్లాను. అతడు మంచం మీద కూర్చుని ఉన్నాడు. మోకాళ్ల పైవరకు దుప్పటి కప్పి ఉన్నది. వయసు మీరినట్లుగా, కాస్త లావుగా ఊబకాయంతో ఉన్నాడు. బుగ్గలు, ముక్కు, పెదాలు ఉబ్బినట్లున్నాయి. ఇతడు కూడా పందిలా ఘుర్ఘురిస్తాడేమో అనుకున్నాను.

మేం కౌగిలించుకున్నాం, కన్నీరు కార్చుకున్నాం. సంతోష విషాదాలు కలిసిన సన్నివేశం అది. చిన్నవాళ్లుగా కలిసి తిరిగి ఎంతోకాలం కాలేదు. అప్పుడే నెరిసిన జుట్టుతో ముసలివాళ్లలా, స్మశానం వేపు నడుస్తున్నవాళ్లలా.

"ఎలా వుందిక్కడ నీకు?" అన్నాన్నేను.

"బ్రహ్మాండంగా! ఆనందంగా ఉన్నాను. థాంక్స్" అన్నాడతడు.

అతడిప్పుడు వెనకటి పిరికి గుమాస్తా కాడు. జమీందారు, స్థితిమంతుడు, పెద్దమనిషి. పల్లెజీవనంలో ప్రవేశించి స్థిరపడినవాడు. మంచిగా తింటున్నాడు. స్నానగృహంలో స్నానాలు చేసి శుభ్రంగా ఉంటున్నాడు. కండపట్టినాడు. ఇప్పటికే గ్రామ పంచాయితీతో, ఇటుక బట్టీ యజమానితో, ఎముకల పొడి కర్మాగారపు యజమానితో తగాదాలు పడ్తున్నాడు. పల్లెజనం ఎవరైనా తనను 'అయ్యా' అనో యువర్ హానర్ అనో సంబోధించకపోతే దానిని అవమానంగా భావిస్తాడు. మత వ్యవస్థలోకి పెద్దమనిషిలా ప్రవేశించాడు. మంచిపనులు చేస్తున్న భావన కలిగిస్తాడు. ఏం మంచిపనులంటావా అవి? పేద ప్రజల రోగాలకు బైకార్బనేట్ ఆఫ్ సోడా, ఆముదం నూనే మందుగా ఇస్తాడు. తన పుట్టినరోజుకు కృతజ్ఞతాదినంగా ప్రకటించి ఆ రోజున బాల్చీలో సగం వోడ్కా నింపి అందరికీ తాగడానికి ఇస్తాడు. ఇవ్వాళ జమీందారుగా తన పొలంలో, బీళ్లలో గొర్రెలను మేపిన పేదరైతుల్ని జెమ్‌స్టొవ్ అధికారి వద్దకు తీసుకువెళ్లి న్యాయం అడుగుతాడు. ఆ సంతోషపు రోజున వాళ్లకు బాల్చీడు సగం వోడ్కా తాగిస్తే వాళ్లే అతగాడికి

జేజేలు కొడ్తూ అతడి కాళ్ల దగ్గర కూలబడతారు. బహుశా రష్యన్లకిది మామూలేనేమో. ఆర్థిక పరిస్థితుల్లో ఏదైనా కాస్త మంచిమార్పు వస్తే, సంతృప్తి, బద్ధకం చోటు చేసుకుంటే వీళ్లకుండేంత ఉదాసీనత ఇంకెవరికీ ఉండదేమో! ఒకప్పుడు తనకంటూ ఎటువంటి అభిప్రాయాన్ని కలిగి ఉండని నికొలాయి ఇవానిచ్ ఇప్పుడు మత బోధకుడిలా ప్రతి విషయం మీద కొత్తకొత్త సూక్తులు ప్రవచిస్తున్నాడు. "విద్య తప్పనిసరిగా కావాలి, కాని, ప్రజలు దానికి సిద్ధంగా లేరు; ఉరిశిక్ష తప్పు, కాని, కొన్ని నేరాల్లో అదే ముఖ్యమైనది, సరైనది కూడా!" ఇలా.

"నాకు ప్రజల నాడి తెలుసు. వారినెలా మచ్చిక చేసుకోవాలో తెలుసు" అన్నాడతగాడు. "ప్రజలు నన్ను ప్రేమిస్తున్నారు, ఆరాధిస్తున్నారు. నేను నా చిటికెన వేలు లేపితే చాలు నాకేం కావాలో వాళ్లు అది చేసేస్తారు"–

ఇవన్నీ కూడా 'నికొలాయి' చెక్కుచెదరని చిరునవ్వుతో చెబుతాడు. మరల మరలా ఇవే నొక్కి వక్కాణిస్తాడు,– "మేం జమీందార్లం; పెద్దమనిషిలా చెబుతున్నాను"– ఇట్లాంటివి. నా తమ్ముడు మరిచిపోయాడు మా తాతగారు ఓ సాధారణ రైతుకూలీ అన్నమాట. మా తండ్రి మామూలు సైనికుడు అన్న సంగతి. మా ఇంటి పేరు 'చింషహిమాలైస్కీ' అన్నది అతడికిప్పుడు విశిష్టంగా, హుందాగా, గౌరవప్రదమైన నామధేయంగా ధ్వనిస్తున్నది.

"ఇది నేను నా గురించి, అతడి గురించి కాదు చెబుతున్నది. ఆ కొద్ది గంటలు అతడితో గడిపిన కాలం నాలో తెచ్చిన మార్పుల గురించి నేను చెబుతున్నాను. ఆ సాయంకాలం మేం 'టీ' తాగుతుండగా, వంటమనిషి ప్లేటు నిండా గూస్‌బెర్రీస్‌ను తెచ్చి ఇచ్చింది. అవి డబ్బుతో కొన్నవి కాదు. తన తోటలో తొలిసారిగా కాసినవి. 'నికొలాయి' నవ్వుతూ ఆ ఉసిరికాయల వేపు చూసాడు. కళ్లవెంబడే నీళ్లు కారుతుండగా నిశ్శబ్దంగా వాటివేపు దాదాపు అయిదు నిముషాలు చూసాడు. ఉద్వేగంతో నోటి మాట రాక, ఒక గూస్‌బెర్రీ కాయ నోట్లో వేసుకుని, పోగొట్టుకున్న ఆట వస్తువు దొరికిన పిల్లవాడిలా నావేపు ఓ చూపు విసిరి ఇలా అన్నాడు–

"డెలిషియస్! మధురం! మధురాతి మధురం!"

ఒకదాని తర్వాత ఒకటి తింటూనే ఉన్నాడు.

"బాగున్నాయి. నీవు కూడా రుచి చూడు!"

అవి చాలా గట్టిగా, పుల్లగా ఉన్నాయి. పుష్కిన్ చెప్పినట్లు 'మనకు సంతోషాన్నిచ్చే అబద్ధం, వేయి కఠోర నిజాలకన్నా ఉత్తమం' – నేను నా కళ్ల ముందు అత్యంత సంతోషంగా ఉన్న నా తమ్ముడిని చూసాను. తన స్వప్నాన్ని నిజం చేసుకున్నవాడిని, జీవితపు లక్ష్యాన్ని చేరుకున్నవాడిని, తనకున్న దానితో సంతృప్తి చెందినవాడిని, తనను తాను అభినందించుకుంటున్నవాడిని నేను చూసాను.

మానవుడి ఆనందంపై నాకున్న దృక్పథంలో ఏదో కొంత విషాదపు ఛాయ ఉండేది. కాని నా ముందున్న ఇతడి ఆనందాన్ని చూస్తున్నపుడు నాలో ఏదో తెలీని దుఃఖం తెగింపుతో, నిరాశతో కూడినది పెరిగి నన్ను ముంచెత్తసాగింది. రాత్రంతా అది అలా పెరుగుతూనే ఉన్నది. నా సోదరుడి పడకగది పక్కన ఉన్న గదిలోనే నాకు బస ఏర్పాటు చేసారు. అతడు రాత్రంతా అప్పుడప్పుడూ లేస్తూ పళ్లెంలోని గూస్‌బెర్రీలను ఒక్కొక్కటి రుచిచూస్తూ పచార్లు చేస్తూ ఉన్నాడు. ఇలా సంతృప్తితో ఆనందంగా ఉండేవాళ్లెంతమంది ఉంటారు? నాలో నేనే తర్కించు కున్నాను. ఎటువంటి బలీయమైన శక్తి ఇది? ఈ జీవనాన్ని చూడు– తిరస్కారం, బద్ధకంతో నిండిన బలవంతులు; అజ్ఞానం, పశుత్వపు ఛాయలున్న బలహీనులు; ఎక్కడ చూసినా దరిద్రం, ఇరుకు ఇళ్లు, పతనం, తాగుబోతుతనం, ఆత్మవంచన, అబద్ధాలు – అయినా శాంతి, క్రమశిక్షణ ఒక పద్ధతిలో ఆ ఇళ్లల్లో, వీధుల్లో వర్ధిల్లుతున్నాయి.

యాభై వేల మంది ఉండే పట్టణాలలో ఎవడూ బయటకు ఏడ్వడు. తన అవమానాన్ని, నగుబాటును బయటకు చెప్పుకోడు. మనం ప్రతిరోజూ సంతకు వెళ్లి ఆహార వస్తువులు కొనుక్కువచ్చేవారిని చూస్తున్నాం. పగలు తిని రాత్రి నిద్రపోయేవాళ్లని, ఏ దిగులూ లేకుండా పెరిగి పెద్దవాళ్లై పెళ్లి చేసుకుని, ముసలివాళ్లై, స్మశానాలకు తమ వాళ్లని తమని తీసుకుపోతున్నవాళ్లనీ చూస్తున్నాం. కాని ఎవరైతే బాధలో జీవనం గడుపుతున్నారో వాళ్లను చూడడం లేదు, వినడం లేదు. జీవితపు భయంకర క్షణాల్ని అనుభవించే వాళ్లను, తెరవెనక జరిగే సంఘటనలను గమనించడం లేదు. బయటకు అంతా ప్రశాంతంగా ఉంటుంది. మూగవైన గణాంకాలు మౌనంగా తమ అభ్యంతరాలను తెలుపుతుంటాయి. ఎందరో పిచ్చివాళ్లయ్యారు. ఇంకెందరో తాగుడుకు బానిసలయ్యారు. ఎందరో పిల్లలు సరైన తిండిలేక మరణిస్తున్నారు. ఇదేగదా నిజానికి పైకి కనిపించవలసింది! ఆనందంగా కనిపిస్తున్నవాళ్లు సంతోషిస్తున్నవాళ్లు తమ వరకే ఆ ఆనందాన్ని

పొందుతున్నారు. ఎందుకంటే వాళ్ల భారాన్ని దుఃఖితులు మోస్తున్నారు గనుక. మౌనంగా భరిస్తున్నారు గనక. వీళ్లకు ఆనందం అలభ్యవస్తువే! ఇదొకరకమైన విశ్వ సమ్మోహనావస్థ.

సంతోషించే ప్రతి వ్యక్తి వెనుక ఒక శ్రామికుడుంటాడు. అతడు తన సుత్తి దెబ్బల ధ్వనులతో 'ఎందరో దుఃఖితుల శ్రమఫలమే నీ ఆనందం' -అని గుర్తు చేస్తుంటాడు. నీవు ప్రస్తుతానికి సంతోషంగా ఉండవచ్చును గాక, కాని ఇప్పుడో, అతి త్వరలోనో జీవితం తన పదునైన గోళ్లను చూపిస్తుంది. ఏదో ఒక అవాంఛనీయ సంఘటన జరిగి అంతా తల్లకిందులవుతుంది. రోగాలు, దారిద్ర్యం, నష్టం– ఇవన్నీ చుట్టుముట్టుతాయి. ఇప్పుడు ఇతడు ఇతరుల దుఃఖాన్ని చూడక, విననట్లే రేపు అతడి కష్టాన్ని ఎవరూ పట్టించుకోరు. సంతోషపడ్తున్న వ్యక్తి వెనక, సుత్తిదెబ్బలు వినిపించే వ్యక్తి లేనంత వరకు– అతడు తన స్వల్పకాలపు ఆనందాలను హాయిగా అనుభవిస్తూ వాస్తవాలకు దూరంగా బతుకుతుంటాడు. ఇతరుల కష్టాలు అతడిని కదిలించవు. ఏస్పెన్ వృక్షానికి తగిలిన గాలిలా అంతా సక్రమంగానే ఉన్నట్లుంటుంది.

"ఆ రాత్రి నాకింకో విషయం అర్థమైంది. నేనూ సంతృప్తిగా, సంతోషంగా ఉన్నానన్న విషయం"– అన్నాడు ఇవాన్ ఇవానిచ్ లేస్తూ... "వేటకు వెళ్లినప్పుడు భోజనం చేసేప్పుడు, సక్రమ మార్గంలో జీవనం గడుపుతున్నపుడు, భగవంతుడిని ప్రార్థిస్తున్నపుడు, ప్రజల్ని నడిపిస్తున్నపుడు– నాకూ సంతోషం కలుగుతున్నది. నేను చెబుతున్నాను– జ్ఞానం లేనిదే వెలుగు ఉండదు. విద్య తప్పనిసరిగా ప్రతి ఒక్కరకూ కావాల్సిందే. మామూలు విద్య సరిపోవచ్చు పల్లె ప్రజలకు. స్వేచ్ఛ అనేది వరం. గాలి, నీరు ఎలాంటివో అదీ అటువంటిదే. అయితే ఆ స్వేచ్ఛ కొరకు కొన్నాళ్లు వేచి ఉండాల్సి రావచ్చు.

ఇప్పుడు నేను అడుగుతున్నాను– "దేనిపేరు మీద మనం వేచి ఉండాలి?"– బర్కిన్ వేపు కోపంగా చూస్తున్నట్లు చూస్తూ ఇవాన్ ఇవానిచ్ ప్రశ్నించాడు. "ఎందుకు మనం వేచి ఉండాలి? దేనిని మనం అంగీకరించాలి? తొందరపడకు –అని వాళ్లంటున్నారు. ప్రతి ఆలోచనా క్రమంగా పెరిగి పెద్దదై మొగ్గతొడిగి పుష్పఫలవంతమౌతుంది. దేని కాలం దానికి ఉన్నది. ఈ మాట చెప్పేందుకు వీళ్లెవరు? ఇదే న్యాయమని ఎలా ఋజువు? నీవు ప్రకృతి సహజమైన పద్ధతిని చెబ్తున్నావు, సంఘటనలోని వాస్తవికతను గుర్తిస్తున్నావు, కార్యకారణ సంబంధాన్ని తెలుపుతున్నావు, సరే, కాని ఏ పద్ధతితో, ఏ తర్కంతో నేను ఆలోచించే

తత్త్వమున్న వ్యక్తిని, అగాధపు అంచుపై నిలబడ్డ వాడిని, ఈ అగాధం నెమ్మదిగా, సహజంగా పూడిపోతుందని, మడ్డితో నిండిపోతుందని, నేను దాని మీదుగా దూకి ఆవలి ఒడ్డుకు చేరతానని, లేదా దానిపై వంతెన నిర్మిస్తానని ఎలా చెప్పగలుగుతున్నావు? దేని పేరు మీద మనం ఇంకా వేచి చూడాలి? ఎందుకు? ఎవరి కోసం? జీవించే శక్తి లేనప్పుడు ఎలా జీవించాలి? ఏ కోరికతో జీవించాలి?

నేను మరుసటి రోజు ఉదయమే నా తమ్ముడిని వదిలి పట్టణానికి వచ్చాను. అప్పటి నుంచి నాకీ పట్టణ జీవితంపై వైముఖ్యం కలిగింది. ఇక్కడి శాంతి, క్రమపద్ధతి నా నరాలను పిండివేస్తున్నట్లనించసాగింది. కిటికీలోంచి బయటకు చూడాలంటే భయం. ఎందుకంటే నాకు పొరబాటున ఎవరైనా తమ ఇంట్లో అందరూ కూర్చుని సంతోషంగా 'టీ' తాగుతున్నా భయమే! నేను పెద్దవాడినై పోయాను. ఘర్షణకు యుద్ధానికి పనికిరానివాడినిప్పుడు. కనీసం ద్వేషభావనను కూడ భరించలేని శక్తి కలవాడినయ్యాను. లోలోపల బాధపడుతూ చిరాకు, అలజడులు నా మనస్సును ఆక్రమించగా రాత్రిళ్లు నా తల ఈ ఆలోచనల వాడికి, వేడికి పగిలిపోయేట్లుండగా నిద్రపట్టదు... ఓహ్! ఇప్పుడు నేను యువకుడిగా ఉంటే ఎంత బాగుండేది!"

ఇవాన్ ఇవానిచ్ అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు–

"నేను యువకుడిగా ఉంటే ఎంత బాగుండేది!"

మరల మరలా అలా అంటూనే ఉన్నాడు.

అకస్మాత్తుగా అతడు అలెఖిన్ వద్దకు వెళ్లి ముందు ఒక చేతిని తరువాత మరో చేతిని ఒత్తుతూ అన్నాడు– "పావెల్ కాన్‌స్టాంటినిచ్! నీవెప్పుడూ ఏ స్పందనా లేని నిరాశలో పడవద్దు. నీ అంతరాత్మను నిద్రపుచ్చవద్దు. నీవింకా యువకుడిగా ఉన్నప్పుడే, బలంగా, ఉత్తేజంగా ఉన్నపుడే ప్రయత్నించు. ఈ సంతోషమనే వస్తువు ఎక్కడా దొరకదు. అటువంటి వ్యక్తిగతమైన సంతోషానికి విలువ లేదు. అది నీ జీవిత గమ్యం కాకూడదు. సంతోషాన్ని పొందడమే నీ జీవిత లక్ష్యం కాకూడదు. అంతకంటే విశాలమైన, విస్తృతమైన దృక్పథం అలవరుచుకోవాలి! మంచిని చేయాలి! అందరికీ పంచాలి!"

ఇవాన్ ఇవానిచ్ ఈ మాటలు చెబుతున్నపుడు ఏదో గమ్మత్తైన నవ్వు అతడి ముఖాన కదలాడుతున్నది. అతడు తన కోసం ఏదో అడుగుతున్న భావన స్ఫురించింది.

ముగ్గురూ తమ వాలుకుర్చీలలో ఏ మాటా పలుకూ లేకుండా చాలాసేపు అలానే కూర్చుండిపోయారు. ఇవాన్ ఇవానిచ్ కథ వాళ్లిద్దరినీ బర్కిన్, అలెఖిన్‌లకు ఏ మాత్రం సంతృప్తి కలిగించలేదు. గూస్‌బెర్రీ ఉసిరికాయలు తినే గవర్నమెంటు క్లర్క్ జీవిత చరిత్ర వినాలనే కుతూహలం ఎవరికుంటుంది, ఆ గది గోడలపైన విలువైన ఫ్రేములోంచి సైనికాధికారులు, జనరల్స్, అందమైన నాజూకైన యువతులు వాళ్లవేపు కుతూహలంగా చూస్తున్నపుడు! అటువంటి సమయాల్లో సొగసుకత్తెల గురించి, రాజకుమారుల గురించి మాట్లాడాలి గాని. అంతేకాక వాళ్లు కూర్చున్న గది అద్భుతమైన షాండెలియర్లతో, వాలుకుర్చీలతో, నేలపై ప్రశస్తమైన తివాచీతో, ఆ ఫోటోఫ్రేముల్లోంచి తొంగి చూస్తున్న చిత్రాలు, సజీవ శిల్పాలుగా ఒకప్పుడు అక్కడ తిరిగిన విషయాల్ని గుర్తు చేస్తున్నపుడు! ఆ ఖరీదైన కుర్చీలలో కూర్చుని, ఆనందంగా 'టీ' తాగుతూ కులాసా కబుర్లు చెప్పుకుంటూ పెలాజియా లాంటి అందమైన పరిచారికలు నిశ్శబ్దంగా అటూ ఇటూ తిరుగుతున్న కథలాంటిది చెబితే ఎంతో బాగుండేది కదా!

అలెఖిన్‌కు గాఢ నిద్ర వస్తున్నది. ఆపుకోలేక పోతున్నాడు. అతడు ఆరోజు ఉదయాన్నే మూడు గంటలకల్లా నిద్రలేచి, ఎస్టేట్‌లో పని మొదలెట్టాడు. ఇప్పుడు నిద్ర అతడి కళ్లను కమ్ముకున్నది. కాని అతడికి వెళ్లి పడుకోవాలనే ఉద్దేశం లేదు. ఏమో ఈ అతిథులు తను వెళ్లాక ఏదైనా ఆసక్తికరమైన విషయం చర్చిస్తే మంచి అవకాశం పోతుంది కదా! అతడికి ఇవాన్ ఇవానిచ్ చెప్పిన దాంట్లో సత్యముందా, న్యాయముందా అర్థం కాలేదు. వాళ్లు మాట్లాడిందల్లా తనకు తెలిసిన గడ్డి, ధాన్యం, తారు ఇటువంటి దైనిక సంబంధ విషయాలు కాక వేరేవి మాట్లాడుతున్నారు. అది అతడికి నచ్చింది. అందుకే సంభాషణకు అడ్డు తగలకుండా వింటున్నాడతడు...

"చాలా పొద్దుపోయింది. నిద్రపోదాం ఇక!" అన్నాడు బర్కిన్ లేస్తూ– "గుడ్‌నైట్ చెబుతాను మీకు!"–

అలెఖిన్ కూడా లేచి నిలబడి వాళ్లకు గుడ్‌నైట్ చెప్పి క్రింది అంతస్తులోని తన గదికి వెళ్లిపోయాడు. అతిథులకు పై అంతస్తులోని పెద్ద గది ఇవ్వబడింది. దానిలో చక్కగా చెక్కబడిన ప్రాచీన దారు తల్పాలున్నాయి. గదికి ఒక మూల దంతపు శిలువ ఉన్నది. ఆ మంచాలపై అందమైన పెలాజియా అప్పుడే పరచిన దుప్పట్ల పరిమళం తాజాగా ఉన్నది.

ఇవాన్ ఇవానిచ్ తన దుస్తులు మార్చుకుని పడుకున్నాడు.

"ప్రభువు పాపులమైన మనలను కరుణించును గాక" అని అంటూ దుప్పటిని లాక్కుని తలపై ముసుగు కప్పుకున్నాడు. బల్లపై ఉంచిన అతడి పైపు నుంచి పాత పుగాకు వాసన గది అంతా వ్యాపించింది. దాని వలన బర్కిన్‌కు చాలాసేపు నిద్ర పట్టలేదు. ఎక్కడి నుంచి ఆ వాసన వస్తున్నదా అని అతడు ఆలోచిస్తూనే ఉన్నాడు చాలాసేపు.

రాత్రంతా వానజల్లు కిటికీ అద్దాలను తడుతూనే ఉన్నది.

✧✧✧✧✧

---

**ఏంటన్ పావ్లొవిచ్ ఛెకొవ్ (Anton Pavlovich Chekhov 1860-1904)**

ఏంటన్ పావ్లొవిచ్ ఛెకొవ్ గొప్ప కథకుడు, వైద్యుడు అయిన ఏంటన్ ఛెకోవ్ జనవరి 29, 1860 నాడు రష్యాలోని తగన్‌రాగ్ పట్టణంలో పావెల్, ఎవ్‌జెనియా దంపతుల మూడవ సంతానంగా జన్మించాడు.

దుర్భరమైన ఆర్థిక పరిస్థితుల మధ్య, ట్యూషన్లు చెబుతూ, రాత్రిళ్లు పనిచేస్తూ 1879లో మాస్కో యూనివర్సిటీలో మెడిసిన్ అభ్యసించడానికి చేరాడు. 1880 నుంచి రచనలు చేయడం ప్రారంభించిన ఛెకొవ్ 1881లో వ్రాసిన కథలు డ్రాగన్‌ఫ్లై అనే రష్యన్ పేపర్‌లో వచ్చాయి. 1884లో మెల్పొమిని అనే తొలి కథల సంపుటిని ప్రచురించాడు. 1885లో సెయింట్ పీటర్స్‌బర్గ్ గెజిట్‌కు కంట్రిబ్యూటర్‌గా గ్రిగరోవిచ్ లాంటి విమర్శకుల దృష్టిలో పడ్డాడు. 1887లో మొదటి నాటకం 'ఇవానోవ్' వ్రాసాడు.

1888లో పుష్కిన్ ప్రైజు లభించింది.

1903లో అతడు వ్రాసిన ప్రసిద్ధ నాటకం The Cherry Orchard అతడికి ఎనలేని ఖ్యాతిని తెచ్చింది.

1904లో అతడి క్షయరోగం ముదిరి, ఆరోగ్యం క్షీణించింది. ఆరోగ్యం కుదుటపడేందుకు భార్య ఓల్గాతో కలిసి జర్మనీ వెళ్లిన ఛెకోవ్ జులై 2, 1904న హోటల్‌రూంలో ఉండగా డాక్టరు సమక్షంలో తనకు ఛాంపేన్ కావాలని కోరుకున్నాడు.

ఛాంపేన్ తాగుతూ 'ఇచ్‌స్టెర్బ్' – I die - 'నేను మరణిస్తున్నాను' అని చెప్పి కన్నుమూసాడు.

# 33. ఒమెలాస్ నుంచి వెళ్లిపోయే వాళ్లు
## (The ones who walk away from Omelas)

**– ఉర్సులా కె. లెగ్విన్**

గంటలు గణగణ మోగేసరికి పిచ్చుకలు ఒక్కుమ్మడిగా గాలిలోకి ఎగిరాయి. ఒమెలాస్ పట్టణంలోకి వేసవి పండుగ వచ్చింది. పక్కనే సముద్రం ప్రకాశవంతంగా మెరుస్తున్నది. రేవు దగ్గర పడవలు; వాటిపై పతాకలు రెపరెప లాడ్తున్నాయి. ఎర్రటి పైకప్పులు, గోడలకు పెయింటింగ్స్ ఉన్న ఇళ్ల మధ్యలో ఉన్నవీధులలో నాచు పెరిగిన తోటలు, చెట్ల వరుసలు, వెనకటి ప్రసిద్ధ పార్కులు, ప్రభుత్వ భవనాలను దాటుతూ ఊరేగింపు పోతున్నది. ఆడంబరంగా గచ్చకాయ, బూడిదరంగున్న పొడుగాటి దుస్తులు ధరించిన వృద్ధులు, గంభీర వదనాలతో నిపుణులైన పనివారు నిశ్శబ్దంగా, హుషారుగా ఉన్న స్త్రీలు తమ చంటిపిల్లల్ని భుజాన వేసుకుని ముచ్చట్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. మిగతా వీధుల్లో వినవస్తున్న సంగీతంలో లయ వేగంగా ఉన్నది. తంబూర, డప్పుల చప్పుళ్లు వేగాన్ని పుంజుకుంటున్నకొద్దీ నృత్యంలో వేగం అధికమై ఆ ఊరేగింపు నృత్యరూపకంగా మారింది. చిన్నపిల్లలు అటుయిటూ గంతులేస్తూ తిరుగుతూ ఒకరినొకరు పిలుచుకుంటూ అరుస్తుంటే ఆ పిలుపులు ఊరేగింపుపై ఎగుర్తున్న పిచ్చుకల, స్వాలో పక్షుల అరుపుల్లా ఉన్నాయి. అన్ని ఊరేగింపులూ ఆ పట్టణపు ఉత్తర దిశవేపే సాగుతున్నాయి, గ్రీన్‌ఫీల్డ్స్ అని పిలువబడే నీటి మైదానం వేపు. బాలురు బాలికలు, నగ్నంగా, బురద కాళ్లతో, పొడుగాటి చేతుల్తో ఉండి చక్కటి గాలిలో గుర్రాలను అదిలిస్తూ పందేలకు సిద్ధంగా ఉన్నారు. గుర్రాలపై హాల్టర్ తప్పితే ఇంకేమీలేదు. వాటి జూలుకు వెండి, బంగారు, ఆకుపచ్చ తళుకులీనే అలంకరణలున్నాయి. అవి తమ ముక్కుపుటాలను అదిలిస్తూ, వేడిగాలుల్ని వదుల్తూ, ఒకదాన్ని మించి ఒకటి బుసలు కొడ్తున్నాయి. అవి ఎంత ఉత్సాహంగా ఉన్నాయంటే మన ఉత్సవాల్ని తమ పండుగలుగా భావించి ఉరుకుతున్నాయి. వాయువ్య మూలలో దూరంగా తీరాన ఒమెలాస్ పట్టణాన్ని సగం చుట్టిన అంచులా కొండలు. ఉదయం ఎంత స్వచ్ఛంగా, నిర్మలంగా ఉందంటే ఆ పద్దెనిమిది కొండ శిఖరాలకు కిరీటంలా భాసిల్లుతున్న మంచుపొరలు, సూర్యకాంతితో కలిసి తెలుపు బంగారం కలిపిన వర్ణాల్ని విరజిమ్ముతున్నాయి. పైన ఆకాశం ముదురు నీలిరంగులో ప్రకాశిస్తున్నది. తెరలు తెరలుగా, మంద్రంగా వీస్తున్న గాలి రేస్‌కోర్స్‌లోని జెండాలను రెపరెపలాడిస్తున్నది. అప్పుడప్పుడూ

విశాలమైన ఆకుపచ్చని మైదానపు నిశ్శబ్దాన్ని, పట్టణపు వీధుల్లోంచి వస్తున్న సంగీతపు సవ్వడి భంగపరుస్తూండగా, తియ్యటి గాలి వణుకుతూ, ఒకచోటకు చేరి ఆనందంతో మోగిన గంటల చప్పుడులా ముక్కలవుతున్నది.

ఆనందం! ఆనందాన్ని ఎలా చెప్పగలవు? ఒమెలాస్ పట్టణ ప్రజల్ని ఎలా వర్ణించగలవు?

సంతోషంగా ఉన్న వాళ్లు మామూలు ప్రజలు కారు. ఆనందపు పదాల్ని అంతకన్నా మనం ఎక్కువగా వర్ణించలేం. చిరునవ్వులన్నీ పురాతనమైనాయి. ఈ ఉదాహరణలు ఆనందాన్ని కొంతవరకు ఊహించగలిగేట్లు చేస్తాయి. ఇటువంటి వర్ణనలు ఒక చక్రవర్తిని, అద్భుత శ్వేతాశ్వంపై కూర్చుని, సామంత సేవక జన పరివేష్ఠితమై లేదా బంగరు పల్లకిలో కూర్చుని బలిష్ఠులైన బానిసలు మోసుకుని వస్తున్న దృశ్యాన్ని మనం ఊహించుకుని ఎదురుచూస్తుంటాం. కాని అక్కడ రాజు లేడు. వాళ్లదగ్గర కత్తులు లేవు. అక్కడ బానిసలు లేరు. వాళ్లు అనాగరికులు కారు. వాళ్ల సమాజంలో ఉన్న నిబంధనలు, న్యాయ సూత్రాల గురించి నాకు తెలీదు, కాని వాళ్లని ఓ ప్రత్యేకమైన గుంపుగా నేను పేర్కొంటాను. రాజరికం, బానిసత్వం, స్టాక్ ఎక్స్చేంజిలు, అడ్వర్టయిజ్‌మెంట్లు, సీక్రెట్ పోలీస్, బాంబ్‌లు ఇవేమీ అక్కడ లేవు. మరలా చెబుతున్నాను వాళ్లు మామూలు ప్రజలు కారు, గొర్రెలను మేపుకుంటూ ప్రశాంతంగా బతికేవాళ్లూ కారు, ఉన్నతులైన అనాగరిక జాతి వాళ్లూ కారు, మర్యాదస్థులైన ఉత్కృష్ట జీవనులు కారు. మనకంటే క్లిష్టమైన మనస్సు లేనివాళ్లూ కారు. సమస్య ఏమిటంటే మనకో చెడు అలవాటు, ఆలోచన ఉన్నది– అదేమిటంటే ఆనందం అనేది ఓ మూర్ఖపు విషయం అని– దానిని బలపరుస్తూ మనకు వేదాంతులు, ఛాందసులు, శుష్కవాదులు, కుతర్కవాదులూ అనేకులున్నారు. వీళ్లకు Happiness is a stupid thing. బాధ ఒక్కటే మేధోపరమైనది. చెడు ఆసక్తికరమైనది. ఇది కళాకారుడి ద్రోహం. చెడులోని సాధారణ రసహీనతను, బాధలోని భయంకరమైన విసుగును ముసుగులో కప్పి ఉంచే ప్రయత్నం. వాళ్లను జయించలేకపోతే వాళ్లలో జాయిన్‌కా, కలిసిపో, అది నిన్ను బాధిస్తే అలవాటుపడు, అయితే నిరాశను పొగడడం, ఆనందాన్ని కాలదన్నడమే కదా! హింసను కావలించుకోవడం మిగతా అన్నిటినీ వదిలేయడం కాదా? మనకు పట్టుతప్పింది. సంతోషంగా, సంతృప్తిగా ఉన్న మనిషిని వర్ణించలేని స్థితి, సంతోషాన్ని సంబరంగా జరుపుకోలేని పరిస్థితి. మీకు ఒమెలాస్‌లోని ప్రజల గురించి ఎలా వర్ణించగలను? వాళ్లు పిల్లలుగా ఉన్నపుడు సహజంగా, సంతృప్తిగా లేరు, వాళ్ల పిల్లలిప్పుడు సంతోషంగా ఉన్నట్లు– వాళ్లు పరిణితి చెందినవాళ్లు, తెలివైన వాళ్లు,

ఉద్వేగంతో నిండినవాళ్లు, వాళ్ల జీవితాలు శోకగ్రస్తమైనవి కావు. ఎంత అద్భుతం! O miracle! దీనిని ఇంతకంటే బాగా వర్ణించాలని కోరుకున్నాను. మిమ్మల్ని ఒప్పించగలననుకున్నాను. ఒమెలాస్ నా మాటలలో ఓ అతిలోక సంఘటనలతో కూడిన దేవతాకథలోని పట్టణంలా, అనగనగా ఒకప్పుడు, సుదూర తీరంలో ఉన్నట్లు అనిపిస్తుంది. బహుశా నీవు దానిని నీ ఊహాలోకంలో దర్శించి వర్ణిస్తే నీకు నచ్చుతుందేమో! నీకు కావాల్సినట్లు నేను వర్ణించలేను కదా!

ఉదాహరణకు ఇప్పటి సాంకేతిక జ్ఞానం గురించి ఏమంటావు? అక్కడ వీధుల్లో కార్లూ, పైన హెలికాప్టర్లూ లేవు కనుక, ఒమెలాస్‌లో ప్రజలు సంతోషంగా ఉన్నారని అనుకుంటామా! సంతోషమనేది ఏది కావాలో తెలుసుకోవడం, ఏది అనవసరమైనది– ఏది విధ్వంసకరం కానిదో తెలుసుకోవడం, ఏది విధ్వంసకరమైనదో తెలుసుకోవడం, వీటిమధ్య ఉన్న తేడాల్ని తెలుసుకోవడం. ఏది అనవసరమైనది– ఏది విధ్వంసకరం కానిది అన్న దాంట్లో– సౌఖ్యం, విలాసం, ఆడంబరం ఇవన్నీ వస్తాయి. సెంట్రల్ హీటింగ్, సబ్ వే ట్రెయిన్లు, వాషింగ్ మెషిన్లు, ఇంకా కనుగొనబడని అద్భుత వస్తువులు, గాలిలో తేలే కాంతి జనకాలు, ఇంధన రహిత శక్తి, జలుబుకు మందు ఇవన్నీ ఉంటాయి. లేదా ఇవేమీ ఉండవు. నీ ఇష్టం అది. సముద్రతీరంలోని పట్టణాల నుంచి ప్రజలు ఒమెలాస్‌కు రైళ్లలో, రెండంతస్థుల ట్రామ్ కార్లలో పండగకు కొన్ని రోజులు ముందుగా వస్తున్నారని తలపోస్తాను. ఒమెలాస్‌లోని ట్రెయిన్ స్టేషను అందమైన భవంతి. కాని రైతుబజారు కన్నా మామూలుగా ఉంటుంది. రైళ్లున్నాయను కున్నా, ఒమెలాస్ ఇప్పటి వరకూ బాగానే ఉందనిపిస్తున్నది కదా! చిరునవ్వులు, చిరు గంటలు, కవాతులు, గుర్రాలు– ఇంకా నీకు కావాలనుకుంటే విందులూ, వినోదాల్ని తగిలించు. అయితే ఈ విషయంలోకి దేవాలయాల్ని వాటిల్లోంచి వచ్చే నగ్న పూజారులూ, పూజారిణుల్ని –అప్పటికే సగం ఆనంద పారవశ్యంలో ఉండి స్త్రీ పురుషులు ఎవరు కనిపిస్తే వాళ్లెంతో కామతృష్ణ తీర్చుకుందామనుకునేవాళ్లను– ప్రియుడా, అపరిచితుడా భేదం లేకుండా– పరమాత్మతో కలయికను పరిశోధించే వాళ్లను– వదిలేద్దాం– నా మొదటి ఆలోచన అదే నిజానికి. దేవాలయాలు లేకపోవడమే మంచిది ఒమెలాస్ పట్టణంలో– ఉన్నా మానవులు లేనివైతే మరీ మంచిది. మతం ఉండవచ్చు. మత బోధకులు వద్దు. అందమైన నగ్న మానవులు, మానవిలు అటూ యిటూ తిరుగుతుంటే అభ్యంతరం లేదు, వాళ్లు తమని తాము ఆకలిగొన్నవాళ్లకు దివ్య ప్రసాదంలా అర్పించుకుంటూ శరీరకాంక్షను, కామాన్ని తృప్తిపరచడం వరకూ సబబే. వాళ్లూ ఊరేగింపులో పాల్గొనవచ్చు. తంబూరాలు శృంగారంపై ధ్వనిచేస్తూ, కామపు ఖ్యాతిని డప్పులు నినదిస్తుంటే, (ముఖ్యమైన

విషయమే) వాళ్ల కలయిక వలన జనించిన శిశువుల్ని సమాజం సరిగా అక్కున చేర్చుకుంటే మంచిదే! నాకు తెలిసీ ఒమెలాస్ పట్టణంలో లేనిదల్లా అపరాధభావన (గిల్ట్–Guilt). అయితే, అక్కడేమున్నది? అక్కడ డ్రగ్స్ లేవనుకున్నాను. అది మరీ పాత ఆలోచన. కావాలనుకున్నవాళ్లు కాస్త డ్రూజ్–drooz-గంజాయి సేవించి ఆ సుగంధం వీధుల్ని పరిమళభరితం చేస్తుండగా మనసు తేలికై, ప్రకాశవంతమై, ఆకాశపు ఎల్లలు చేరి కాళ్లూ చేతులూ పారవశ్యంతో కదులుతుంటే, అలా కొన్ని గంటలసేపు బడలికతో సొమ్మసిల్లి, విశ్వరహస్యాన్ని మనోఫలకంపై దర్శిస్తూ, శృంగారంలోని అంతుబట్టని రహస్యాలను అద్భుతంగా ఆస్వాదిస్తూ, అత్యున్నత ఆనందాన్ని పొందవచ్చు, అంతేకాదు, అదేమీ అలవాటు కాబోదు కూడా! మామూలు ఆనందం కావాలనుకునే మొహమాటస్థులకు బీరు ఉండనే ఉన్నది. సంతోషనగరంలో అంతకన్నా నీకేం కావాలి? నీకేం కావాలి? ఒక విజయ భావన, ధైర్య ప్రదర్శన, అంతేగా!

మత బోధకులు (Clergy) వద్దనుకున్నట్లే సైనికులూ వద్దు. మారణహోమం తర్వాత లభించే ఆనందం వద్దు. విజయవంతంగా మానవ హత్యాకాండ చేసి ఆనక లభించిన సంపదలిచ్చే సంతోషం వద్దు. అది భయంకరమైనది, సాధారణమైనది. ఎల్లలు లేని, విస్తృతమైన సంతృప్తి– బాహ్య వ్యక్తులపై శత్రువులపై గెలిచిన అపారమైన విజయం కాదు– మానవ ఆత్మలతో సన్నిహిత సంబంధాల్ని ఏర్పరుచుకోవడం –అది ప్రపంచపు వేసవికాల ప్రకాశం కావాలి. అదే ఒమెలాస్‌లోని ప్రజల హృదయాల్ని ఉద్విగ్నం చేస్తుంది. వాళ్లు జరుపుకునే విజయోత్సవం జీవితానికి సంబంధించినది. నిజానికి వాళ్లకెవరికీ డ్రూజ్ అక్కర్లేదు.

ఊరేగింపులన్నీ గ్రీన్‌ఫీల్డ్స్‌కు చేరుకున్నాయి. రకరకాల వంటల సువాసనలు నీలి, ఎరుపు గుడారాల నుండి వెలువడ్తున్నాయి. చిన్నపిల్లల నోళ్లు తినుబండారాల జిగురుతో, వృద్ధుల గడ్డాల్లో రుచికరమైన భక్ష్యాల ఆనవాళ్లతో కనిపిస్తున్నాయి. యువతీయువకులు తమతమ గుర్రాలనెక్కి పందెపు ప్రారంభరేఖ వద్ద తమతమ స్థానాల వద్ద సిద్ధంగా ఉన్నారు. ఓ వయసుమళ్లిన మహిళ తన బుట్టలోంచి పూలను తీసి యువకులకు ఇస్తుంటే వారు ఆ పూలను తమ మెరిసే జుట్టులో అమర్చు కుంటున్నారు. తొమ్మిది–పదేళ్ల పిల్లవాడొకడు జనం అంచు ముందు నిలబడి వేణువుపై రాగం ఆలపిస్తున్నాడు. జనం ఆగి అతడి పాట విని చిరునవ్వు నవ్వుతున్నా, అతడు తన వేణుగాన పారవశ్యంలో వారిని గమనించడం లేదు. అతడి లోతైన కళ్లు ఆ తీయని, సన్నని రాగమాధురిలో మంత్రముగ్ధలై అరమోడ్పులైనాయి.

అతడు పాట ముగించి వేణువును పట్టుకున్న చేతులను క్రిందికి దించాడు.

ఆ కొద్ది నిశ్శబ్దం సంజ్ఞగా భావించో ఏమో, ఒక్కసారిగా పెవిలియన్ నుండి బాకా ధ్వని బిగ్గరగా వినిపించింది. అశ్వాలు ఒక్కసారి తమ కాళ్లను నేలకు నొక్కిపెట్టాయి. కొన్ని బిగ్గరగా సకిలించాయి, సమాధానమిస్తున్నట్లు. గంభీరమైన వదనాలతో యువ అశ్వికులు తమతమ అశ్వాల మెడలను సవరిస్తూ వాటిని ప్రశాంత పరుస్తూ, వాటితో గుసగుసలాడుతున్నారు– “శాంతం! శాంతం! అందమైన అశ్వమా! నా ఆశాకిరణమా!....” – ప్రారంభపు రేఖ దగ్గర వాళ్లు సిద్ధంగా ఉండగా, రేస్‌కోర్సులోని ప్రేక్షకజనం పచ్చగడ్డి మైదానంలా, గాలికి ఊగుతున్న పూలలా ఉన్నారు. వేసవి పండుగ మొదలయ్యింది.

నీవు నమ్మగలవా? నీవు ఈ పండుగను నమ్ముతున్నావా? ఈ పట్టణాన్ని, ఈ ఆనందాన్ని ఊహించగలుగుతున్నావా? అయితే నీకింకో విషయాన్ని చెప్పాలి నేను.

ఒమెలాస్‌లోని ఓ అందమైన భవనం క్రింది భూగర్భ గృహంలో లేదా విశాలమైన వ్యక్తిగత భవనాల నేలమాళిగలోనో ఒక గది ఉన్నది. దానికి తాళం వేయబడ్డ తలుపు ఉన్నది. కాని, ఆ గదికి కిటికీ లేదు. కొద్దిపాటి వెలుతురు తలుపు చెక్కల సందుల గుండా ఆ గదిలోకి మసక మసకగా పో ప్రయత్నిస్తున్నది, అదీ ఇంకెక్కడో ఉన్న కిటికీ, సాలెగూళ్లతో బూజుతో నిండిఉన్న దాంట్లోంచి వచ్చిన వెలుగు. ఆ గదికి ఒక మూల రెండు నేలను తుడిచే గుడ్డలు, కంపుకొడ్తున్నవి. ఓ తుప్పుపట్టిన బకెట్ పక్కన పడేసి ఉన్నాయి. నేలంతా దుమ్ముకొట్టుకుని, ముట్టుకుంటే తడి తగుల్తున్నది. సెల్లార్ గదులు సాధారణంగా అలాగే ఉంటాయి కదా! ఆ గది మూడు గజాల పొడుగు, రెండు గజాల వెడల్పు ఉన్నది. బహుశా చీపురుకట్టలు పడేసే గది, లేక పాత సామాన్లుంచే గది కావచ్చును. ఆ చీకటిగదిలో ఓ చిన్నమనిషి కూర్చుని ఉన్నది. బాలుడో, బాలికో చెప్పడం కష్టం. ఆరేళ్ల వయసున్నట్లు కనిపించినా వాస్తవానికి పదేళ్లుంటాయి. మతిమాంద్యమున్నట్లున్నది. పుట్టుక లోపమో, భయం వలన కలిగిన చపలత్వమో, పౌష్ఠికాహార లోపమో, నిర్లక్ష్యమో కావచ్చు. కాసేపు ముక్కు గోక్కుంటున్నది. కాసేపు కాలివేళ్లు, కొద్దిసేపు జననాంగాల్ని స్పృశిస్తూ దూరంగా ఓ మూల నక్కి కూర్చుని ఉన్నది; ఆ చీపుళ్లకు, తుడిచే గుడ్డలకు దూరంగా, ఆ తుడిచే గుడ్డలంటే భయం కాబోలు, వాటివంక భయ విహ్వలితయై బెదరు కళ్లతో పరికిస్తున్నదా ఆకారం. అప్పుడప్పుడు కళ్లు మూసుకుంటున్నది కాని దానికి తెలుసు ఆ తుడిచే గుడ్డలు కర్రతో సహా అక్కడే ఉన్నాయని. కాని తలుపు తాళం

వేసే ఉన్నది. ఎవరూ రావడం లేదు. ఎప్పుడూ అంతే. ఎప్పుడో ఒకసారి తలుపు ధడేలున తెరచుకుంటుంది, ఒకరో, ఎక్కువ మందో వస్తారు. వాళ్లలో ఒకడు వచ్చి ఆ పసిపాపను కాలితో తన్ని నిలబెడ్తాడు. మిగతావాళ్లు దగ్గరకు కూడా రారు. వాళ్లు ఆ ఆకారం వేపు అసహ్యంగా విభ్రాంతికరమైన చూపులతో చూస్తారు. ఆహారపు గిన్నె, నీళ్ల కూజా త్వరత్వరగా నింపుతారు, మరల తలుపు వేయబడ్తుంది. కళ్లు అదృశ్యమవుతాయి. తలుపు దగ్గర ఉన్నవాళ్లు ఒక్కమాట మాట్లాడరు, కాని, ఆ పసిబిడ్డ, ఎప్పుడూ ఆ చెత్తగదిలోనే ఉండింది కాదు కనక, అప్పుడప్పుడూ తానెరిగిన సూర్యకాంతిని, తల్లి గొంతును గుర్తు తెచ్చుకుని, ఒక్కోసారి మాట్లాడ్తుంది– "నేను మంచిగా ఉంటాను 'I will be good' – నన్ను బయటకు పోనీయండి, మంచిగా ఉంటాను!" ఎవ్వరూ సమాధానం చెప్పరు. రాత్రిపూట తోడు కోసం ఎలుగెత్తి అరిచేది ఏడ్చేది ఒకప్పుడు. ఇప్పుడు ఆ గొంతు నుండి ఏంహాహాం, ఏహాహా – అన్న అరుపు తప్ప ఇంకేమీ రావడం లేదు. మాటలూ తగ్గిపోయాయి. ఎంత సన్నగా అయిపోయిందంటే పిక్కల్లో వీసమెత్తు కండ లేదు. పొట్ట బానలా ముందుకు వచ్చింది. రోజూ సగం గిన్నె మొక్కజొన్న జావ, ఇంత గ్రీజూ మాత్రమే తింటే అట్లాగే ఉంటుంది కదా. నగ్నంగా ఉన్నదా ఆకారం. తొడల మీదా, పిరుదుల మీదా రసి కారుతున్న పుండ్లు– తను విసర్జించిన వాటిపైనే తాను కూర్చోవడం, పడుకోవడం వలన.

అందరికీ తెలుసు అది అక్కడ ఉందని, అందరికీ, ఒమెలాస్ నివాసులందరికీ. కొందరు చూసారు, కొందరు విన్నారు. వాళ్లందరూ దాన్ని అక్కడే ఉంచాలన్నారు. కొందరికి తెలుసు ఎందుకక్కడే ఉంచాలో, కొందరికి తెలీదు. కాని అందరికీ తెలుసు వాళ్ల సంతోషం, ఆ నగర సౌందర్యం, వాళ్ల స్నేహమాధురి, వాళ్ల పిల్లల ఆరోగ్యం, మేధావుల జ్ఞానం, నిపుణుల శక్తి సామర్థ్యాలు, వాళ్ల పంటల దిగుబడులు, వాతావరణ మార్పులూ ఇవన్నీ ఆ పసిపాప పడే దారుణ కష్టాలపై ఆధారపడి ఉంటాయని వాళ్లు నమ్ముతున్నారు.

పిల్లలు ఎనిమిది నుంచి పన్నెండేళ్ల వయసున్నప్పుడు వాళ్లకీ సంగతి వివరంచబడ్తుంది. అర్థం చేసుకోగలిగిన వయసే గదా అది. ఆ ఆకారాన్ని చూడవచ్చే వాళ్లు ఎక్కువ మంది పిల్లలే. చూసినవారే మళ్లీ చూడడానికి వస్తారు. ఎంత తార్కికంగా వివరించినా, పిల్లలు ఆ ఆకారాన్ని చూడగానే విచలితులై, ముఖం తిప్పుకుంటారు. తాము గొప్పవాళ్లమనుకున్న దానిపై వారికి అసహ్యం వేస్తుంది. కోపం, ఆగ్రహం, బలహీనత ఇవన్నీ వారిని తరుముకు వస్తాయి. ఆ చిన్ని ఆకారానికి ఏదైనా సాయం చేయాలనుకుంటారు కాని చేయలేరు. దానిని వెలుతురులోకి తెచ్చి, శుభ్రంగా స్నానం చేయించి, మంచి ఆహారమూ, దుస్తులు ఇచ్చి సంరక్షించితే అది మంచిపనే కదా!

కాని అలా చేసిన మరుక్షణం– ఆరోజునే, ఆ గంటలో, ఆ నిముషాన –అన్నీ ఆవిరైపోతాయి. అవీ వాళ్ల ఒప్పందాలు. ఆ పట్టణంలోని అందరి సంతోషం కోసం, ఆ పసిపాపను అంతటి నికృష్ట స్థితిలో ఉంచారు. ఒమెలాస్ ప్రజల మంచితనం, ప్రతి ఒక్కరి జీవన మాధురి ఒక ఎత్తు ఆ చిన్ని రూపం ఒక ఎత్తు. వేలాదిమంది ఆనందం ఒకవేపు... ఆ పసిపాప దుఃఖం మరోవేపు. అందుకని ఆ అపరాధ భావనను నాలుగు గోడల మధ్య బందీని చేసారు.

ఒప్పందంలోని అంశాలు తీవ్రమైనవి, వెనక్కి తీసుకోలేనివి. ఆ పసిపాపతో ఒక్క దయాపూరితమైన మాటా మాట్లాడకూడదు.

చాలాసార్లు చిన్న పిల్లలు ఆ పనిదాన్ని చూసి దుఃఖంతో కన్నీళ్లు కారుస్తూ ఇంటికి పోతారు; లేదా ఆగ్రహంతో ఊగిపోతారు. వాళ్లకు ఆ పసిపాపను చూసినప్పుడు జీవన వైరుధ్యాల్ని అర్థం చేసుకున్నప్పుడు ఆ ఉద్వేగం కలుగుతుంది. దాన్ని ఆలోచిస్తూ వాళ్లు వారాలు, నెలలు, సంవత్సరాలు గడుపుతారు. కాలం గడిచిన కొద్దీ వాళ్లకు అర్థమవుతుంది, ఆ పసిపాపను బయటకు తీసుకువచ్చినా అది తన స్వేచ్ఛను సరిగా వినియోగించలేదని. కాస్త వెచ్చదనం, ఆహారం లభించినా అంతకు మించి అదేం చేయలేదనీనూ. అది ఎంత మందకొడిగా మారిందంటే ఆనందానికి అర్థం తెలీదు. సంతోషమంటే సంబరం లేనిదా చిన్ని ఆకారానికి. భయం నుంచి విడుదల కాలేనంతగా భయపడిందది. మానవ సంస్కరణకు అలవి కాని అలవాట్లకు లోనై ఇప్పుడది ఆ నాలుగు గోడలు దాటి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి, వాటి వెనకే తనకు రక్షణ ఉన్నదని, తన కళ్లను వెలుతురు నుంచి ఆ నాలుగు గోడల గది రక్షిస్తుందని విశ్వసిస్తున్నది. తన విసర్జనలపై కూర్చోడానికి ఇష్టపడ్తున్నది. ఈ ఘోర అన్యాయానికి చలించిన కళ్లు క్రమేపీ కన్నీళ్లు ఆవిరి కాగా, వాస్తవ ప్రపంచపు భయంకర న్యాయాన్ని అంగీకరిస్తాయి. అయినా, వాళ్ల కన్నీళ్లూ, కోపం, ఔదార్యం, తమ అసహాయతను అంగీకరించడం – ఇవన్నీ బహుశా వాళ్ల జీవితాల్లోని వెలుగుకు కారణమై ఉండవచ్చును. వాళ్లదేమీ నిస్సారమయిన, బాధ్యతా రహితమైన సంతోషం కాదు. వాళ్లకు తెలుసు, ఆ చిన్న రూపంలా వాళ్లూ స్వేచ్ఛాజీవులు కాదని. వాళ్లకు జాలి, కనికరం తెలుసును. ఆ పసిపాప ఉనికి, ఆ ఉనికి గురించి వారికున్న జ్ఞానం, వాళ్ల సంఘ నిర్మాణంలోని ఔన్నత్యానికి; వాళ్ల సంగీతంలోని హృదయ విదారకమైన తీవ్ర గతి గల సంగీతానికి; వాళ్ల అపార శాస్త్రజ్ఞానానికి కారణం. ఆ పసిపాప గురించి తెలుసుకోవడం వల్లనే వాళ్లు తమ పిల్లలతో మృదువుగా, ప్రేమగా, ఆప్యాయంగా ప్రవర్తిస్తున్నారు. వాళ్లకు తెలుసు ఆ హేయమైన చీకటి ఆకారం లేకుండా ఉండి ఉంటే, ఆ వేణువు వాయించే పిల్లవాడు అంత అద్భుత గీతాన్ని పాడగలిగేవాడు కాదు. ఆ యువ అశ్వికులు

పందెపు ప్రారంభ రేఖ వద్ద అంత సొగసుగా బారులు తీరేవారు కాదు, ఆ వేసవి ప్రారంభ దినపు సూర్యకాంతిలో.

ఇప్పుడు నీవు వారిని నమ్మగలవా? వాళ్లు నీకు గొప్పగా అనిపిస్తున్నారా? ఇంకొక విషయం చెబుతాను, ఇది నీకు మరింత నమ్మశక్యం కాకుండా ఉంటుంది.

ఒక్కోసారి ఈ బాలురు, బాలికలలో కొందరు– ఆ పసిపాపను చూడడానికి వచ్చినవాళ్లు– కన్నీళ్లతో కలవరపడరు, ఆగ్రహంతో ఊగిపోరు. వాళ్లు ఇంటికే వెళ్లరు. ఒక్కోసారి పెద్దవాళ్లు స్త్రీయో, పురుషుడో ఆ పసిపాపను చూసి ఒకటో రెండో రోజులు మౌనంగా ఉండిపోయి వాళ్లూ ఇల్లు వదిలి వెళ్లిపోతారు. వాళ్లు వీధుల్లోకి వచ్చి ఒంటరిగా నడుస్తూ పోతుంటారు. వాళ్లు అలా నడుస్తూ నడుస్తూ ఆ ఒమెలాస్ పట్టణాన్ని దాటి, ఆ పట్టణపు సుందర ద్వారాలను దాటి, పచ్చని మైదానాలను దాటి ఒంటరిగా వెళ్లిపోతుంటారు. బాలుడో, బాలికో, యువకుడో, వయసు మళ్లిన వాడో, వృద్ధుడో, స్త్రీయో, పురుషుడో ఎవరైనా కావచ్చు. రాత్రి చీకటి పడుతుంది. బాటసారి గ్రామపు వీధుల్ని– ఇరుపక్కలా పచ్చగా వెలుగు ప్రసరిస్తున్న కిటికీలున్న ఇళ్లనీ దాటి చీకటి మైదానాల్లోకి పోతుంటారు. ప్రతి ఒక్కరూ ఒంటరిగా పడమటకో, ఉత్తరానికో ఆ పర్వతాల వేపు పోతుంటారు. వాళ్లలా వెళ్తూనే ఉంటారు. ఒమెలాస్‌ను వదిలి అలా చీకటిలోకి పోయినవాళ్లు మరలా తిరిగి రారు. వాళ్లలా వెళ్లి వెళ్లి మనబోటి వాళ్లం సంతోష నగరాన్ని ఊహించినట్లు ఊహించలేని చోటుకు పోతారు. దాన్ని నేను వివరించడానికి అశక్తుడిని. అది ఉండకపోవచ్చు కూడా! కాని వాళ్లకు తెలిసినట్లుంది వాళ్లెక్కడకు వెళ్తున్నారో, వాళ్లే ఒమెలాస్‌ను విడిచి పోతున్న వాళ్లు; The ones who walk away from Omelas.

✧✧✧✧✧

---

**ఉర్సులా కె. లెగ్విన్ (Ursula K. Le Guin 1929- )**

ఉర్సులా కె. లెగ్విన్ అమెరికన్ నవలా రచయిత్రి. పిల్లల పుస్తకాలు, ఎన్నో కథలు వ్రాసి పేరు గడించినది. రచయిత్రిగా ఆమెకు ఎన్నో పురస్కారాలు లభించాయి.

Omelas అనే పదం రచయిత్రి చెప్పిన దాన్ని బట్టి Salem (a road sign: Salem (oregon) ను రివర్స్ చేసి చదవడం వలన వచ్చిన పదం. Salem = Schelomo = Salam = Peace (శాంతి). Melas. Omelas. Hommehelas = Man Alas (అయ్యో, మానవుడా!) అని అర్థం.

# 34. ఇక మనం నౌకా విహారానికి వెళ్లలేం!

## (So We'll go no more A-roving)

**– జార్జ్ గార్డన్, లార్డ్ బైరన్**

ఇక మనం నౌకా విహారానికి వెళ్లలేం,
రాత్రి పొద్దుపోయేంత వరకూ విహరించలేం!
ప్రేమలా హృదయం స్థిరంగా ఉన్నా,
చంద్రుడు ఇంకా ప్రకాశవంతంగా వెలుగుతున్నా!

ఒర కన్నా కత్తి మన్నుతుంది ఎక్కువ కాలం,
దేహం కన్నా ఆత్మ జీవిస్తుంది కలకాలం;
ఊపిరి తీసుకునేందుకు ఆగుతుంది హృదయం
ప్రేమ కూడా కోరుకుంటుంది విశ్రాంతి సమయం.

రాత్రి సృష్టించబడిందే ప్రేమించుకోడానికి
పగలు వస్తుంది మరీ శీఘ్రంగా ముందుకి,
అయినా మనం ఇక నౌకా విహారానికి వెళ్లలేం!
వెన్నెల రాత్రుల్లో సంతోషంగా విహరించలేం!!

✧✧✧✧✧

---

**లార్డ్ బైరన్ (George Gordon, Lord Byron 1788-1824)**

లార్డ్ బైరన్ ఇంగ్లీషు కవి. Romantic movement లో ప్రముఖ పాత్ర వహించినవాడు. Don Juan, Child Herald's Pilgrimage, She walks in beauty లాంటి అద్భుత కవితలను రచించినాడు. గ్రీకుల స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని National Hero గా కీర్తించబడినాడు.

# 35. బైజాంటియమ్‌కు నౌకా ప్రయాణం

## (Sailing to Byzantium)

**- విలియం బట్లర్ ఈట్స్**

### I

**That is no Country for old men-**
**అది వృద్ధులు ఉండతగిన రాజ్యం రాదు-**
యువతీ యువకులు ఒకరి బాహువుల్లో ఒకరు;
కిలకిలారావాలు చేస్తూ తరూశాఖలపై పక్షులు-
అంతర్ధానమవుతున్న తరాలు- గానం చేస్తూ;-
సాల్మన్ చేపలు ఎగిసిపడే నదీ ప్రవాహాలు
రకరకాల జలచరాలతో ఉప్పొంగే సముద్రాలు
జంతువులూ, చేపలూ, పక్షులూ - వేసవిని ఉత్తేజపరుస్తూ-
పుట్టిన ప్రతిదీ నశిస్తుంది.
ఆ అద్భుత సంగీతంలో
చిక్కుకుని ప్రతి ఒక్కరూ మరచిపోతారు,
చెక్కుచెదరని మేధోజనిత మహానిర్మాణాలను.

### II

వయసు పైబడినవాడు- నికృష్టమైనవాడు,
వెదురు బొంగుపై వేలాడే కోటు లాంటి వాడు;
ఆత్మ చప్పట్లు కొడుతూ గొంతెత్తి బిగ్గరగా పాడితేనే
మర్త్యవస్త్రపు ప్రతి పీలికా కదిల్తేనే, అతడి ఉనికి.
అక్కడే సంగీత పాఠశాల లేదు, కాని దివ్యమైన
ఆ స్మృతి చిహ్నాలను సందర్శించడానికే
నేను ఉప్పొంగే సముద్రాలను దాటి
పవిత్ర బైజాంటియమ్ నగరానికి వచ్చాను.

### III

భగవానుని పవిత్రాగ్ని చెంత,
గోడకున్న బంగరు నగిషీలా నిలబడిన జ్ఞానులు
వర్తులాకారపు మెట్ల నుంచి వచ్చి ఉన్నారు.
నా ఆత్మకు వారు గానం చేసే ప్రభువులు!
కోరికతో కమిలిపోతున్న నా హృదయాన్ని తీసుకుపోయి

మరణిస్తున్న జంతువుకు తగిలించగలరు.
దానికి తెలియపోవచ్చు అదేమిటో. కాని
అది నన్ను శాశ్వతత్వపు పరిక్రమలోకి నెడుతుంది.

## IV

ఒకసారి ప్రకృతి నుంచి నిష్క్రమించినాక
ఏ సహజ వస్తువు నుంచీ పొందలేను నా రూపాన్ని.
కాని, గ్రీకు స్వర్ణకారులు, బంగారాన్ని మోది,
బంగారపు రేకులతో చేసిన వృక్షరూపాల్లా*
కునికిపాట్లు పడే చక్రవర్తిని మెలకువలో ఉంచిన సాధనాల్లా,
లేదా, పెరికితే మరలా పెరిగే స్వర్ణశాఖల్లా**
బైజాంటియమ్ రాజులకు, రాణులకు
భూత భవిష్యత్ వర్తమానాల్ని గానం చేసిన
పక్షిగా మారాలని తలపోసాను.

✧✧✧✧✧

---

**విలియం బట్లర్ ఈట్స్ (William Butler Yeats 1865-1939)**

విలియం బట్లర్ ఈట్స్– ఇరవై శతాబ్దపు ముఖ్య రచయితలలో ఒకరు... ఐరిష్ కవి. టాగోర్ విశ్వవిఖ్యాత రచన 'గీతాంజలి'కి ముందుమాట వ్రాసినాడు.

**బైజాంటియమ్–** నేటి ఇస్తాంబుల్ నగరం. ఒకప్పటి తూర్పు రోమన్ సామ్రాజ్యపు రాజధాని. మేధోసంపత్తికి, కళాభితృష్ణకు కేంద్రం. ఈట్స్ ఈ నగరాన్ని కృత్రిమత్వానికి (ఆ రకంగా మృత్యువు సోకనిదిగా) కళకు, అందానికి ప్రతీకగా; దానికి వైరుధ్యంగా సహజ ప్రకృతిలోని అందాన్ని, దాని అశాశ్వతత్వాన్ని, మృత్యువును పోల్చి చెబుతున్నాడు.

That is no Country for old men - ఐర్లండ్ గురించి– ఇది కాలానికి బంధించబడిన నగరం. సహజత్వానికి, ప్రకృతికి చిహ్నం.

* **వృక్షరూపాలు–** బైజాంటియం చక్రవర్తి భవనంలో ఉన్న బంగారం వెండితో చేయబడిన ఓ వృక్షంపై ఉన్న కృత్రిమమైన పక్షులు పాటలు కూడ పాడేవని 'ఈట్స్' చిన్నప్పుడు విన్నానని వ్రాసుకున్నాడు.

** **'స్వర్ణశాఖ'** (Golden bough) ఈనీడ్‌లో ఎయినీస్ ఒక చెట్టు నుంచి బంగరు రంగులో ఉన్న శాఖను పెకిలించగానే దాని స్థానంలో మరో శాఖ పుట్టుకు వచ్చింది. ఆ స్వర్ణ శాఖ సాయంతోనే అతడు హేడ్స్ (పాతాళలోకం)లోకి వెళ్లగలుగుతాడు.

# 36. నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకెలా తెలుపను?

## (How do I love thee?)

**– ఎలిజబెత్ బారెట్ బ్రౌనింగ్**

నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకెలా తెలుపను?
ఆ పలు విధాల్ని నేనెలా ప్రకటించను?
నిన్ను ప్రేమిస్తున్నాను అన్ని కొలమానాల్లో, అభిమానాలలో
నీవు కనిపించని చోటుకూ చేరుతుంది నా ఆత్మ నీలో
సొగసైన నీ స్ఫూర్తి, నీ వ్యక్తిత్వపు మూర్తి ఉన్నది నాలో
సూర్య కాంతిలా, దీపపు వెలుగులా, నిత్యావసర వస్తువైన
నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకెలా తెలుపను?

హక్కులకై ఆరాటమున్న మనిషిలా స్వేచ్ఛగా,
పొగడ్తను సహించని వ్యక్తిలా స్వచ్ఛంగా,
నా పాత దుఃఖాలలో, చిన్నప్పటి విశ్వాసాలలో, ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో,
వినియోగించిన ఉద్వేగంలా, ఉప్పొంగిన గానంలా
నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకెలా తెలుపను?

బాల్యపు స్మృతులంత గాఢమైన ప్రేమతో
కన్నీళ్లు, చిరునవ్వులు, నా జీవితపు ఊపిరితో
నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకెలా తెలుపను?

ఒకవేళ దేవుడు ఎన్నిక చేస్తే నన్ను గూఢంగా
చనిపోయాక కూడా నిన్ను ప్రేమిస్తాను మరింత గాఢంగా,
నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకెలా తెలుపను?
ఆ పలు విధాల్ని నేనెలా ప్రకటించను?

✧✧✧✧✧

---

**ఎలిజబెత్ బారెట్ బ్రౌనింగ్ (Elizabeth Barett Browning 1806-1861)**

ఎలిజబెత్ బారెట్ బ్రౌనింగ్ – విక్టోరియా కాలంలో ప్రముఖ కవయిత్రిగా పేరు తెచ్చుకున్నది. ప్రముఖ కవి రాబర్ట్ బ్రౌనింగ్ ఆమె భర్త. ఎమిలిడికిన్సన్, ఎడ్గార్ అలెన్ పొ వంటి కవులు, రచయితలపై తన ప్రభావాన్ని చూపిన విదుషీమణి.

# 37. మరేమైనాయి నిరుటి జలపాతాలు?

- డాంటీ గాబ్రియేల్ రొసెట్టి
డాక్టర్ లంకా శివరామప్రసాద్

అందాల రాశి ఆమ్రపాలి,
ఏ అడవి దాగుందో చెప్పగలవా నీవు?
ఎక్కడుంది వసంతసేన, ఏమైంది చింతామణి
ఎక్కడ అదృశ్యమయ్యారీ ఎల నాగలు!
ఎక్కడుందీ రాణీ పద్మిని?
చితిలోకి దూకింది శత్రువుకు దొరకనని!
ఏమయ్యింది అనార్కలి?
సజీవ సమాధిగా స్థాపితమయ్యింది.
వాళ్ల అందాలు జగద్విదితాలు,
మరేమైనాయి నిరుటి జలపాతాలు?

ఏమైంది మీరాబాయి?
కృష్ణుడే పురుషుడన్న భక్త శిరోమణి.
ఏమైంది ఆండాళ్లు?
తాను ముడిచిన పూలను దేవుడికిచ్చిన దేవేరి
ఎక్కడుంది రాణీ రుద్రమ?
కాకతీయ సామ్రాజ్యపు కరవాలం చేబూని,
ఎక్కడుంది వీరనారి ఝాన్సీ?
తెల్లవాళ్లనెదిరించిన తెగువగల ధీశాలిని!
వాళ్ల భక్తీ, శక్తీ విశ్వవిఖ్యాతాలు,
మరేమైనాయి నిరుటి జలపాతాలు?

ఏమైనది రచయిత్రి మొల్ల?
రామాయణాన్ని రమణీయంగా వ్రాసిన దామె.
ఏమైనది అవ్వయ్యార్?
సంగం కవులలో సాటిలేని కవయిత్రి.
ఏదీ భాగ్యమతి? ఎక్కడ రజియాబేగం?

ఏమైనారీ వీరమాతలు ఏవీ విజయగీతాలు
మరేమైనాయి నిరుటి జలపాతాలు?

ఎప్పుడు, ఎప్పుడూ అడగవద్దు
వారేమైనారని, ఎటు పోయారనీ?
వారి జ్ఞాపకాలు ఘనీభవించిన హిమపాతాలు
మరేమైనాయి నిరుటి జలపాతాలు?

**(The Ballad of Dead Ladies - Dante Gabriel Rosette 1828-1882)**

✧✧✧✧✧

---

**డాంటీ గాబ్రియెల్ రొజెట్టి (Dante Gabriel Rosette 1828-1882)**

డాంటీ గాబ్రియెల్ రొజెట్టి ఆంగ్ల కవి, చిత్రకారుడు, అనువాదకుడు. Pre Raphelite Brotherhood స్థాపకులలో ఒకడు. తన చిత్రాలకు వ్యాఖ్యానంగా ఉండే కవితలను వ్రాసినాడు. The Blessed Damozel, Found, Lady Lilith లాంటి చిత్రాలు ఎంతో ప్రసిద్ధికెక్కినవి.

# 38. అమన్‌టిల్లాడో కొయ్య పీపా
## (The Cask of Amantillado)

**– ఎడ్గర్ అల్లన్ పో**

ఫార్చునాటొ చేసిన వేయి గాయాలైనా భరించగలను కాని అతడు చేసిన ఈ అవమానం సహించరానిది. ప్రతీకారం తీర్చుకోక తప్పదు. నా మనస్తత్వం తెలుసు నీకు, అయినా, ప్రతీకారపు మాటల వేడిని, వాడిని గమనించలేదు. దీర్ఘకాలమైనా నేను నా పగ తీర్చుకుంటాను. ఈ నిర్ణయం జరిగిపోయింది. దానిని ఎలా ఆచరణలో పెట్టాలో, ఎటువంటి కష్టాలు వస్తాయన్నదీ ఆ నిర్ణయం ముందు చిన్నబోయాయి. అతడిని శిక్షించడమే కాదు, ఆ శిక్షకు తిరుగుండకూడదు. అంతేకాక వాడికి తెలియాలి ఎందుకు, ఎవరు ఆ శిక్షను అమలుపరుస్తున్నారో.

మాటల వల్ల గాని, చేతల వల్ల గాని నన్ను ఫార్చునాటో సందేహ పడకుండా జాగ్రత్త పడ్డాను. నేను అవమానాన్ని నాలో దిగమింగుకుని అతడు కనిపించినప్పుడల్లా చిరునవ్వు ముఖాన పులుముకుని, ఆ చిరునవ్వే అతడి నాశనానికి గుర్తుగా అతడు భావించకుండా ప్రవర్తించాను.

ఈ ఫార్చునాటోకు ఒక బలహీనత ఉన్నది. అది మినహా మిగతా విషయాల్లో అతడు గౌరవింపదగినవాడే కాక, కొన్ని విషయాల్లో మనం భయపడాల్సిన వాడు కూడా. వైన్ రుచి చూసి దాని శ్రేష్ఠత్వాన్ని పసికట్టగల దిట్టగా అతడికి గర్వం కూడా. చాలా కొద్దిమంది ఇటాలియన్లకు ఆ నైపుణ్యం ఉన్నది. ఎక్కువ మంది బ్రిటిష్, ఆస్ట్రియన్ మిలియనీర్ల పంచన చేరి వాళ్లని వంచన చేయడంలో తమ కాలాన్ని, అవకాశాల్ని వినియోగిస్తారు. చిత్రకళలో, రత్నశాస్త్రంలో అతడు తన దేశస్థుల్లానే నకిలీ వైద్యుడు లాంటివాడు. కాని, వైన్ రుచి పసిగట్టడంలో మాత్రం ఫార్చునాటో దిట్ట. ఈ విషయంలో నేను అతడికేమీ తీసిపోను. నేను కూడా ఇటాలియన్ వింటేజి వైన్స్ గొప్పతనాన్ని అంచనా వేయడంలో ప్రసిద్ధికెక్కినవాడిని, అంతేకాక చాలా ఎక్కువ సంఖ్యలో వాటిని కొని నిలవజేసాను కూడా! కార్నివాల్ సంబరాలు మిన్నంటిన ఆ రోజు సాయంకాలం, అప్పుడప్పుడే చీకటి పడుతోంది. నా స్నేహితుడిని కలిశాను. ఎంతో ఆప్యాయంగా నన్నతడు ఆహ్వానించాడు, అప్పటికే బాగా తాగి ఉన్నాడు కాబోలు. రంగురంగుల దుస్తులు, బాగా బిగువుగా ఉన్నవి, చారలు చారలుతో

కూడినవి, నెత్తిపై శంఖు ఆకారపు టోపీ దానికి వేలాడుతున్న చిరుగంటలు ధరించి ఉన్న అతడిని చూసి నాకానందం వేసింది. అతడికి చేయి కలపకుండా ఉండి ఉంటే బాగుండేదని అనిపించింది.

అతడితో అన్నాను– "మైడియర్ ఫార్చునాటో! భలేగా కలిసాం మనమిక్కడ, నా అదృష్టం కొద్దీ! ఎంత చక్కగా ఉన్నావీ రంగురంగుల దుస్తుల్లో. అమన్‌టిల్లాడో రకం వైన్‌గా చెప్పబడుతున్న వైన్ పీపా ఈరోజు నా దగ్గరకు వచ్చింది. నాకేమో దానిపై సందేహం ఉంది"–

"ఏమిటీ, ఎలా? అమన్ టిల్లాడోనా! అదీ ఒక పీపా! అసంభవం! అది ఈ కార్నివాల్ రోజుల్లో!" అన్నాడతడు.

"నా సందేహం నాకున్నది. కాని నేను నిన్ను సంప్రదించకుండా మొత్తం పైకం ఇచ్చేసాను. ఆ సమయానికి నీవు అందుబాటులో లేవు. నేనేమో మంచి అవకాశం పోగొట్టుకోకూడదని ధైర్యం చేసి కొనేశాను"

"అమన్‌టిల్లాడో!"

"నాకు సందేహమే!"

"అమన్ టిల్లాడో"

"నేను సంతృప్తి పడాలి కదా!"

"అమన్ టిల్లాడో!"

"నీవిక్కడ బిజీగా ఉన్నావు కదా, నేనిప్పుడు ల్యుకేసి దగ్గరకు వెళ్తాను. అతడికి దాంట్లో నేర్పుంది కదా! అతడు నాకు..."

"ల్యుకెసి దగ్గరకా? అతడికి షెర్రీకి, అమన్‌టిల్లాడోకీ తేడా తెలీదు"

"అయినా కొందరంటారు వైన్ శ్రేష్ఠతను నిర్ణయించడంలో అతడు నీకు సమ ఉజ్జీ అని"–

"పద, వెళ్దాం"–

"ఎక్కడకు?"–

"నీ వైన్ పీపా ఉన్న వాల్ట్ దగ్గరకు"–

"స్నేహితుడా! వద్దు! నీ మంచితనాన్ని నేను దుర్వినియోగం చేయబోను. నీవు తీరిక లేకుండా ఉన్నావని నాకు తెలుసును. ల్యుకెసి"–

"నాకేం ఎంగేజ్‌మెంటూ లేదు, పాడూ లేదు. పద!"

"మిత్రమా! వద్దు! ఏదో ఎంగేజ్‌మెంట్ ఉందని కాదు నేను వద్దనేది. జలుబుతో బాధ పడ్తున్నావని నేను వద్దంటున్నాను. నేలమాళిగ ఇప్పుడు తడిగా ఉంటుంది. నైటర్ పొరలుగా గడ్డకట్టి ఉంటుంది"

"ఏం ఫరవాలేదు! ఈ జలుబుకేం కాదు! అమన్‌టిల్లాడో! అది నీ నెత్తిన రుద్దబడింది. అవునా కాదా చెప్పాలి! ఇక ల్యుకేసి సంగతంటావా అతడికి షెర్రీకి, అమన్‌టిల్లాడోకు తేడా తెలీదు"–

అలా అంటూ ఫార్చునాటో నా చేయి దొరకబుచ్చుకున్నాడు. నా తలపై నల్లని సిల్కు ముసుగు కప్పి, మీద మోకాళ్లు దాటే పొడుగాటి అంగీ తొడిగినాడు. నేనెవరో నాకే తెలీనట్లున్నాను నేను ఆ దుస్తులలో. అతడిని నా భవనం వేపు తీసుకువెళ్లాను. కార్నివాల్ సందడిలో ఎవరి గొడవల్లో వాళ్లున్నారు.

నా ఇంటి దగ్గర పనివాళ్లు లేరు, సమయం చిక్కగానే వాళ్లూ కార్నివాల్ సంబరాల్లో పాల్గొనడానికి చడీచప్పుడు లేకుండా జారుకున్నారు. నేను రేపు ఉదయం వరకూ రాను ఎవరూ ఎటూ పోకండి అని ఆజ్ఞ జారీచేసాను. నాకు తెలుసు, నేను వీధి మలుపు తిరగక మునుపే వాళ్లు అదృశ్యమైపోతారని.

నేను రెండు వెలుగుతున్న కొవ్వొత్తులున్న స్టాండులను తీసుకుని ఒకటి ఫార్చునాటోకి ఇచ్చి, నేను రెండోది పట్టుకున్నాను. అతడికి అభివాదం చేసి, అనేక గదుల గుండా నడిపిస్తూ నేలమాళిగ వేపు నడిపించాను. అతడికి జాగ్రత్తలు చెబుతూ భూగర్భ గృహంలోకి దారితీసే పొడుగాటి, మెలికలు తిరిగిన మెట్లమీదుగా దిగుతూ నెమ్మదిగా కిందకు దిగి తడినేలపై అడుగుపెట్టాం. అదే మాంట్రెసార్ నేలమాళిగ.

నా మిత్రుడి నడక అంత స్థిరంగా ఉండక అతడు అటు ఇటు ఊగినప్పుడల్లా అతడి టోపీపైన చిరుగంటలు మ్రోగుతున్నాయి.

"పీపా?" అడిగాడతడు.

"వచ్చేసాం! కాస్త దూరంపోతే చాలు! అయినా ఆ సాలెగూళ్లున్నాయి చూడు ఆ మూలలలో ఎలా మెరుస్తున్నాయో!"–

అతడు నావేపు పరీక్షగా చూసాడు. అతడు నా కళ్లలోకి తన రెండు కళ్లతో చూస్తున్నపుడు వాటి నుంచి కన్నీళ్లు చుక్కలుగా రాలిపడ్డాయి వైన్ ప్రభావం వల్ల. దగ్గాడతడు.

"నైటర్" అన్నాడతడు చివరకు–

"నైటర్" అన్నాన్నేను. "ఎప్పటి నుంచీ ఉన్నదీ దగ్గు?"

'అఘ్! అఘ్, అఘ్' – అఘ్, అఘ్, అఘ్ – అఘ్, అఘ్!

అఘ్, అఘ్, అఘ్ – అఘ్, అఘ్, అఘ్!

పాపం అతడు ఎడతెరపి లేకుండా వచ్చిన దగ్గు వలన కొద్ది నిముషాల సేపు మాట్లాడలేకపోయాడు.

"ఏం లేదు! మామూలు దగ్గే" అన్నాడు ఆయాసంగా.

"వెళ్దాం!" అన్నాను ఓ నిర్ణయం తీసుకుని– "మనం వెనక్కు వెళ్లిపోదాం! నీ ఆరోగ్యం ముఖ్యం నాకు. నీవు ధనవంతుడివి, గౌరవనీయుడివి, అందరి ప్రేమను చూరగొన్నవాడివి, మెచ్చుకోబడినవాడివి; నేను ఒకప్పుడున్నంత ఆనందంగా ఉంటున్నవాడివి. నిన్ను పోగొట్టుకోవడం కుదరనివాడివి. నాకు ఇదేం పెద్ద లెక్క కాదు. మనం వెళ్లిపోదాం! లేకుంటే నీ అనారోగ్యానికి నేను కారణమౌతాను. అది నాకిష్టం లేదు. అంతే కాకుండా ఈ పని చెయ్యడానికి ల్యుకేసి"–

"చాలు ఇక ఆపు!" అన్నాడతడు– "ఈ దగ్గు నన్నేం చేయదు. ఇది మామూలు దగ్గే! ఇది నన్ను చంపదు. మామూలు దగ్గుతో చచ్చిపోయే రకం కాదు నేను"–

"నిజం–నిజం" అన్నాన్నేను – "నాకు నిన్ను అనవసరంగా కంగారు పెట్టించే ఉద్దేశం లేదు. కాని మనం అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి కదా! ఒక గ్లాసు రెడ్‌వైన్–మెడాక్ మనల్ని ఈ తడి వాతావరణం నుంచి కాపాడ్తుంది; వెచ్చగా!"

అక్కడికక్కడ నేను, వరుసలుగా పెట్టి ఉన్న 'మెడాక్' వైన్ సీసా ఒకదాని మూతి పగలగొట్టి అతడికిచ్చాను.

"నేను ఇక్కడ పాతిపెట్టబడిన వాళ్ల గౌరవార్థం ఈ రెడ్‌వైన్ మధువు సేవిస్తున్నాను" అన్నాడతడు.

"నేను నీ చిరకాల జీవితం కోసం" అన్నాన్నేను. అతడు మరలా నా చేయి పట్టుకున్నాడు. మేం ముందుకు వెళ్లాము.

"ఈ నేలమాళిగలు" అన్నాడతడు– "చాలా పెద్దవి"

"మాంట్రెసార్ కుటుంబం. చాలా పెద్దది. ఆ వంశవృక్షం చాలా విస్తృతమైంది" అన్నాను నేను.

"నేను మీ చిహ్నాన్ని మరిచిపోయాను" అన్నాడతడు.

"అజూర్ నీలి బాక్‌గ్రౌండ్ మీద స్వర్ణపాదం, ఆ పాదం కింద తొక్కబడిన సర్పం, పైకి లేచి చీలమండను కాటువేస్తున్న దృశ్యం"–

"మరి ముఖవాక్యం– మోటో (Motto) ఏమిటి?"

"Nemo me impune lacessit"-

(నన్ను గాయపరచినవారు శిక్షింపబడకుండా తప్పించుకోలేరు)

"బాగుంది" అన్నాడతడు.

అతని కన్నులలో వైన్ ప్రభావం తళుక్కున మెరిసింది. చిరుగంటలు ఘల్లుఘల్లుమన్నాయి. మెడాక్ రెడ్‌వైన్ తాగడం వల్ల నాలోనూ ఉత్తేజం పెరిగింది. మేము గుట్టలుగా, గోడవారగా ఉన్న ఎముకలు, కపాలాల మధ్యగా అక్కడక్కడా వైన్ పీపాలు, సీసాల వరుసల్ని దాటుతూ నేలమాళిగలోని మారుమూల వేపు నడుస్తూపోయాము. అక్కడ ఓ క్షణం ఆగి, ధైర్యంగా నేను ఫార్చునాటో మోచేయిపైన పట్టుకున్నాను.

"నైటర్" అన్నాను. "చూడు, నైటర్ ఇక్కడ ఇంకా ఎక్కువగా ఉన్నది. అది నాచులా పైకప్పు నుంచి వేలాడుతున్నది. మనమిప్పుడు నది అడుగు భాగం కింద ఉన్నాము.

తడి నీళ్లచుక్కలు ఎముకలపై పడుతూ ఉన్నాయి. ఇంకా ఆలస్యం కాకమునుపే మనమిక్కడ నుంచి వెళ్లిపోదాం. పైగా నీ దగ్గు"–

"అదేం లేదు"– అన్నాడతడు. "ముందుకు పోదాం పద. నీ మెడాక్ రెడ్‌వైన్ ఓ గుక్క తాగాలి ముందుగా" నేను ఫ్లాగాన్ ఆఫ్ డిగ్రేవ్ బాటిల్ మూతి పగలగొట్టి అతడికా సీసా ఇచ్చాను. ఒక్క ఉదుటున దాన్ని ఖాళీ చేసాడతడు. అతడి కళ్లు ప్రకాశవంతంగా మెరిసాయి. అతడు ఓ నవ్వు నవ్వి తన చేతిలోని సీసాను గాలిలోకి

ఎగరవేసి ఓ వింత సంజ్ఞ చేసాడు. నాకర్థం కాలేదు. వికృతంగా, హాస్యాస్పదంగా ఉన్న సంజ్ఞ.

నేను అతడివంక ఆశ్చర్యంగా చూసాను.

అతడు మళ్లీ దానిని అనుకరించి చూపించాడు.

"నీకర్థం కాలేదా" అడిగాడతడు.

"కాలేదు" అన్నాను నేను.

"అంటే నీవు ఆ సమాజానికి చెందవా?" అన్నాడు.

"ఏమిటి?" అన్నాను నేను.

"నీవు మాసన్ బ్రదర్‌హుడ్‌కు చెందినవాడివి కాదా?"

"అవును, అవును" అన్నాన్నేను. "అవును, అవును."

"అసంభవం! నీవు.... కాదు... మాసన్‌వు కాదు!"

"నేను మాసన్ (Mason)నే" అని జవాబిచ్చాను.

"అయితే సంజ్ఞ చూపించు" అన్నాడతడు.

"ఇదిగో!" అన్నాను నా దుస్తులలోంచి ఒక తాపీ (Trowel)ను చూపిస్తూ.

"హాస్యం కాదు కదా!" అని కొన్ని అడుగులు వెనక్కు వేసి అన్నాడు– "ముందు మనం అమన్‌టిల్లాడో సంగతి చూద్దాం పద!"

"అలాగే" అన్నాను 'తాపీ'ని మరల దుస్తులోనికి పోనిచ్చి, అతడి చేయిపట్టుకుని ముందుకు నడిచాను. అతడు నాపై ఆధారాన్ని ఉంచి ఆ అమన్‌టిల్లాడోను వెదుకుతూ చిన్న ఆర్చ్‌ల కిందుగా దిగుతూ, నడుస్తూ, దిగుతూ, నడుస్తూ చివరకు ఒక లోతైన గోతి దగ్గరకు వచ్చాము. అక్కడి దుర్వాసన మా చేతిలోని కాగడాలను ఎర్రగా మండేట్లు చేసింది. ఆ గోతికి చివర మరింత చిన్నదైన ఇంకో ఇరుకు నేలమాళిగ గది కనిపించింది. కాని గోడలకు మానవ దేహాల జీర్ణభాగాలు వేలాడుతున్నాయి. ఎముకలు, కపాలాలు గుట్టలుగా పైకప్పు వరకు పేర్చబడి పారిస్ భూగర్భగృహంలో మానవ కంకాళాల్ని భద్రపరచిన రీతిలో కనిపిస్తున్నాయి. ఆ ఇరుకుగది మూడుపక్కలా ఎముకలు అలంకరించినట్లు అమరి ఉండి, నాల్గవ వేపు ఉన్న ఎముకలు పక్కకు, కిందకు నెట్టబడి కాస్త ఖాళీ చేయబడినట్లు

కనిపిస్తున్నాయి. దాంట్లోంచి మేము ఇంకాస్త లోపలికి వెళ్లాము. ఆ ఇరుకు సందులో ఇంకో ఇరుకు గది. నాలుగు అడుగుల లోతు, మూడు అడుగుల వెడల్పు, ఆరు, ఏడడుగుల ఎత్తు ఉండవచ్చు. ఏదో ప్రత్యేకమైన పనికోసం తయారు చేసినట్లుండక పోయినా నేలమాళిగకు ఆధారమైన పెద్ద స్తంభాల మధ్య, వెనక గ్రానైట్‌రాయి గోడలా ఉండగా మూడువేపులా మూయబడిన చిన్నగదిలా ఉన్నదది.

ఫార్చునాటో తన చేతిలో ఉన్న కొవ్వొత్తి వెలుగు సాయంతో అక్కడేమున్నదో చూడడానికి ప్రయత్నించాడు. కాని ఏమీ కనిపించలేదు.

"పద!" అన్నాన్నేను. "అమన్‌టిల్లాడో ఉన్నది అక్కడే. ల్యుకెసి అభిప్రాయం అడగాలని"

"వాడికేం తెలియదు" అన్నాడు మిత్రుడు మధ్యలో కలగజేసుకుని, కొంచెం తూలుతూ ముందుకు నడుస్తూ– అతడి వెనకే నేనూ నడిచాను, అతడు ఆ ఇరుకు గది చివరకు చేరుకుని ఎదురుగా గ్రానైట్ గోడను తాకి ఓ క్షణం నివ్వెరపోయాడు. ఇంకో క్షణం అలానే ఉండి ఉంటే నేనాతడిని ఆ గ్రానైట్‌గోడకు కట్టి పడేసేవాడిని. రెండు ఇనుప కొక్కేలు రెండడుగుల దూరంలో గోడకు బిగించబడి ఉన్నాయి. ఒకదాని నుంచి చిన్న గొలుసు, రెండవ దానికి కప్పుతాళం వేలాడుతున్నాయి. అయిదు సెకండ్లు చాలు అతడిని గోడకు బంధించడానికి. ప్రతిఘటించడానికి తగిన శక్తిలేదతడిలో ఇప్పుడు, తాళం వేసి నేను ఒక అడుగు వెనక్కి వేసాను. అతడిప్పుడు గోడకు బందీ!

"నీ చేతుల్తో గోడను తడుము" అన్నాను నేను. "గోడమీద అంతా నైటర్ అలుముకుని ఉన్నది. ఇక్కడంతా తడే! నా మాటవిని వచ్చేయ్, వెళ్లిపోదాం మనం. రావా! అయితే, నిన్ను విడిచి వెళ్లక తప్పదు. నా అధీనంలో ఉన్న కొన్ని విషయాలు నీకు చెప్పాలి"

"అమన్ టిల్లాడో" అరిచాడు నా మిత్రుడు, ఆశ్చర్యంలోంచి తేరుకోకుండానే.

"అమన్‌టిల్లాడో" నేనూ అదే సమాధానమిచ్చాను. "అదీ" అంటూనే నేను అక్కడ పోగుపడిన ఎముకల్ని సర్దడంలో నిమగ్నమైపోయాను. వాటి కింద అంతకు ముందే సిద్ధం చేసి ఉంచిన సున్నము, ఇసుక, నీరు కలిపిన మోర్టార్, రాళ్లూ ఉన్నాయి. వాటితోనూ, నా దగ్గర ఉన్న తాపీ పనిముట్టుతో నేను ఆ ఇరుకు గదిని మూసివేసే పని ప్రారంభించాను.

మొదటి వరస వేసానో లేదో ఫార్చునాటో మైకం కాస్త వదిలినట్లుంది అతడు సన్నగా కేకపెట్టాడు. అది తాగినవాడి అరుపులా లేదు. ఆ తరువాత కొంత

దీర్ఘ నిశ్శబ్దం. రెండో వరస అయిపోయింది. మూడోది, నాలుగోది. అప్పుడు నాకు గొలుసును బలంగా గుంజుతున్న కంపనాలు, చప్పుళ్లు వినిపించాయి. అలా చాలా నిముషాలు లాగుతున్న శబ్దాలను వింటూ నేను ఇన్నాళ్లూ దాచిపెట్టుకున్న అవమానానికి ఉపశాంతి లభిస్తున్నట్లు భావించాను. కాసేపు నేను చేస్తున్న పని ఆపి, ఎముకల గుట్టపై కూర్చున్నాను. గొలుసు గణగణ చప్పుడు ఆగినాక మరల పని మొదలెట్టి అయిదో వరస, ఆరోది, ఏడోది ఎటువంటి ఆటంకం లేకుండా ముగించాను. గోడ ఇప్పుడు నా భుజాల ఎత్తు వరకు వచ్చింది. కొద్ది క్షణాలు ఆగి నా చేతిలో కొవ్వొత్తుల స్టాండును నేను కడుతున్న గోడపై పెట్టి లోనికి పరిశీలనగా చూసాను. లోపలికి మసక మసకగా వెలుగు ప్రసరించింది.

గోడకు బంధించబడిన వ్యక్తి గొంతు నుండి ఒక్కుమ్మడిగా కీచుమనే అరుపులు పెద్దగా, భయంకరంగా వచ్చి నన్ను బెదరగొట్టాయి. నేను హడావుడిగా వెనక్కు తగ్గాను. ఒక్కక్షణం నేను వణికిపోయాను. నా దుస్తులలో ఉన్న రెండంచుల కత్తిని బయటకు తీసి ఇంకేదైనా సందు ఉన్నదేమోనని గాలించాను. ఎక్కడా సూది మొనంత సందులేదు. కాస్త ధైర్యం వచ్చింది. మరల గోడ వద్దకు వచ్చి వాడి అరుపులకు ప్రతిగా నేనూ అరచాను. వాడు బిగ్గరగా అరిస్తే నేను మరింత బిగ్గరగా, ఇంకా బిగ్గరగా, ఆ నేలమాళిగలో అన్ని ఇరుకు గదులూ అదిరేలా, ఎముకలు కదిలి నేలపై పడేలా, గోడలు కంపించేలా... నేనట్లా అరిచేసరికి అతడు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

ఇప్పుడు అర్ధరాత్రి. నా పని దాదాపు ముగింపుకు వచ్చింది. ఎనిమిది, తొమ్మిది, పదో వరస కూడా పూర్తయ్యింది. ఆఖరుది పదకొండో వరసలో ఒక్క రాయిపెట్టి ప్లాస్టర్ చేస్తే చాలు పనైపోతుంది. అలిసిపోయానేమో చాలా బరువున్న ఆఖరి రాయి ఎత్తుతుంటే నాకు ఆయాసం వచ్చింది. బాగా కష్టపడి దానిని పైకెత్తి సగం వరకు పెట్టి కాస్త ఊపిరి తీసుకుంటే లోపల నుంచి నా తలపై రోమాలు నిక్కపొడుచుకునేలా ఓ భయంకరమైన నవ్వు వినిపించింది. దాని తరువాత విషాదకరమైన గొంతు విచారాన్ని ధ్వనిస్తూ, నేను గుర్తుపట్టలేనట్లు మారింది. నా మిత్రుడు గౌరవనీయుడు ఫార్చునాటోదేనా అనిపించేది ఆ గొంతు అంటున్నది.

–హా! హా! హా! – హే! హే! హే! – మంచి జోకు! బ్రహ్మాండమైన హాస్యం. మనం దీని గురించి ఎన్నిసార్లైనా నవ్వుకోవచ్చు. ఈ సంఘటన చెప్పుకుంటూ పైన భవనంలో హే! హే! హే! – వైన్ తాగుతూ– హే! హే! హే!

“అమన్ టిల్లాడో” – అన్నాన్నేను.

"హే! హే! హే! – హే! హే! హే! – అవును. అదే అమన్‌టిల్లాడో! పొద్దుపోతున్నది కదా! మన గురించి బయట భవనంలో ఎదురుచూస్తూ ఉంటారు కదా! లేడీ ఫార్చునాటో, మిగతా సిబ్బందీ! పద వెళ్దాం!"

"అవును" అన్నాన్నేను. "మనం వెళ్లిపోదాం"

"దేవుడి మీద ఒట్టేసి, మాంట్రెసర్!" అన్నాడతడు.

"అవును. దేవుని మీద ఒట్టేసి" అన్నాను నేను. 'Nemo me impune lacessit'

అటునుంచి మాట రాలేదు. సహనం నశించి నేను రెట్టించాను.

"ఫార్చునాటో!"

సమాధానం లేదు. మరలా అరచాను.

"ఫార్చునాటో!"

జబాబు లేదు. నా చేతిలోని వెలుగుతున్న దీపాన్ని మిగిలిన రంధ్రంలోంచి లోపలికి విసిరాను. చిరుగంటలు కదిలిన సవ్వడి మాత్రం వినిపించింది. నా హృదయం ముడుచుకుపోయింది– ఆ నేలమాళిగలోని చెమ్మకు, పని పూర్తిచేయ దలుచుకున్నాను. గబగబా ఆఖరి రాయిని గోడపై సరిగాపెట్టి, రంధ్రాన్ని మూసివేసి ప్లాస్టర్ చేసాను. ఆ కొత్తగోడకు రక్షణగా అక్కడ ఉన్న ఎముకలను దట్టంగా అమర్చాను.

* * * * *

అర్థశతాబ్దం వరకూ ఏ బతికున్నవాడూ ఆ గోడను అంటుకోలేదు. అతడి ఆత్మ శాంతినొందునుగాక!

**In peace requieseat!**
**(May he rest in peace)**

✧✧✧✧✧

---

## ఎడ్గార్ అలన్‌పో (Edgar Allan Poe 1809-1849)

ఎడ్గార్ అలన్‌పో – సంచార నటుల కుటుంబానికి చెందినవాడు. అతడి మూడేళ్ల వయసులోనే తండ్రి వాళ్లను వదిలి వెళ్లిపోయాడు. తల్లి మరణించింది. రిచ్‌మండ్‌లోని ఓ ధనిక కుటుంబం ఇతడిని దత్తత తీసుకున్నది.

మొదట్లో ఇతడి తెలివితేటలకు, క్రీడాభినివేశానికి సంతోషించిన పెంపుడు తల్లీదండ్రులు ఇతడు డబ్బులు విచ్చలవిడిగా ఖర్చుచేస్తుండడం

భరించలేకపోయారు. వర్జినియా యూనివర్సిటీలో చదువుకుంటూ జూదమాడి అప్పులపాలై చదువు అర్ధాంతరంగా ఆపేసాడు. ఇంటి దగ్గర్నుంచి పైకం రావడం ఆగిపోయింది. తల్లిదండ్రులతో సంబంధాలు తెగిపోయాయి. ఇప్పుడు 'పొ' నిరుపేద. అనేక ప్రేమకలాపాలు విఫలం కాగా చివరకు పదమూడేళ్ల వర్జినియా క్లెమ్‌ను వివాహం చేసుకున్నాడు.

మద్యపాన వ్యసనం వల్ల అతడికి ఎంత డబ్బూ సరిపోయేది కాదు, విలక్షణమైన అతడి రచనలను విమర్శించిన విమర్శకుల నోళ్లు మూయడానికా అన్నట్లు– అతడి ఈ రచన The Cask of Amantillado - చాలా ప్రసిద్ధికెక్కింది. ఈ కథలోని ముఖవాక్యం, మాసన్ కథ తన పెంపుడు తండ్రినుద్దేశించినవే. క్షయ వ్యాధితో అతని భార్య వర్జీనియా చనిపోయిన రెండేళ్లకు ఎడ్గార్‌అలన్ పొ బాల్టిమోర్‌లో మరణించాడు.

# 39. అతగాడి పేరు గుర్రం!
## (A Man called Horse!)

**- డొరొతి యమ్. జాన్సన్**

అతడు మంచి కుటుంబానికి చెందినవాడు, ఈ మాట వందేళ్లక్రితం న్యూ ఇంగ్లండ్‌లో నలుగురి నోట నానుతూ ఉండేది. అయితే అతనిలో పెచ్చుమీరిన తీవ్ర అసంతృప్తికి కారణం ఎవరికీ తెలీదు చివరకు అతనికి కూడా! అమ్మమ్మ సంరక్షణలో ఏ లోటూ లేకుండా పెరిగాడు పాత బోస్టన్ నగరంలో, అతడి తల్లి కాన్పు సమయంలో చనిపోయింది. అతడి జీవితమంతా భాగ్యవంతుడైన తండ్రి సమకూర్చిన భోగభాగ్యాలతో హాయిగా గడచింది.

కాని అతడిలో ఏదో అసంతృప్తి. దానిని నిర్వచించలేని అశక్తత. అతడు తనకు సమానులైన వారితో- తనకంటే ఎక్కువా, తక్కువా కాని వారితో కలిసి జీవించాలనేది కోరిక. తనలోని దిగులుకు దాదాపు దగ్గర కారణంగా అతడు దానిని వివరిస్తూ బోస్టన్ నగరాన్ని వదిలి ఇంకెక్కడకన్నా వెళ్లాలనుకున్నాడు.

1845లో ఇల్లు వదిలి పశ్చిమంగా పోయిపోయి దేశపు సరిహద్దుల వద్దకు చేరుకున్నాడు, తనకు సమానులైన వారిని అన్వేషిస్తూ. రెడ్ ఇండియన్‌లుండే దేశంలో ప్రమాదం ఉంటుందని తెలుసు కాని అక్కడ తెల్లవాళ్లు రాజుల్లా బతుకుతున్నారని విన్నాడు, తను కూడా వాళ్లలో ఒకడు కావాలనుకున్నాడు. కాని పశ్చిమాన కూడా బోస్టన్‌లో లానే తను గౌరవించేవాళ్లు ఎప్పుడూ అతడికన్నా ఉన్నతస్థితిలో ఉండేవారు. వాళ్లకు చదువు వచ్చినా, రాకపోయినా, తను గౌరవమివ్వనివాళ్లు మాట్లాడతగ్గ అర్హత కూడా లేనివాళ్లలా కనబడ్డారు.

అతడి దగ్గర డబ్బుంది కాబట్టి తను గౌరవించేవాళ్లు నలుగుర్ని పనిలో పెట్టుకున్నాడు. వేటకు, వంటకు, గైడుగా పనిచేయడానికి, తోడుగా ఉండటానికి- కాని వాళ్లు స్నేహంగా మెలగకలేకపోవడం గమనించాడు.

వాళ్లు దూరాన్ని పాటించడం వల్ల అతడు ఒంటరిగానే ఉండిపోవాల్సి వచ్చింది. ఇంకా అతడు తన హోదా గురించి ఆలోచిస్తూ తనకు సమానులైన వాళ్ల కోసం వెదకుతూ ఉన్నాడు.

జూన్ నెలలో ఒకరోజున అతడికి తొలిసారిగా హోదా అనేది లేకపోవడ మంటే ఏమిటో తెలిసింది. అతగాడు 'క్రో' ఇండియన్లకు బందీగా దొరికిపోయాడు.

అతడికి తుపాకి కాల్పులు, తన అనుయాయుల కేకలు, మూల మలుపులో సముద్రపు పాయ వద్ద వినిపించాయి. వాళ్లు చచ్చిపోయారు కాని అతడికి వాళ్ల శవాలేవీ కనిపించలేదు. అతడికి పోట్లాడే అవకాశమే రాలేదు. ఎందుకంటే అప్పుడు అతడు నగ్నంగా, ఆయుధాలు లేకుండా, స్నానం చేస్తున్నాడు. ఓ 'క్రో' వీరుడు అతడిని చులాగ్గా పట్టుకుని బందీగా చేసాడు.

కొద్దిసేపటి తర్వాత క్రో ఇండియన్ ఇతడిని వదిలేసి పరిగెత్తనిచ్చాడు. అతడి వెనక వాళ్లు పరిగెడ్తూ, కేకలు పెడుతూ తమ దగ్గర ఉన్న కర్రలతో పొడుస్తూ ఆట ఆడసాగారు. వాళ్ల చేతుల్లో రక్తమోడుస్తూన్న శిరస్సులపైన ఉండే చర్మం, తన అనుయాయులది. ఇంకొకడి చేతిలో బాప్టిస్తె నల్లని గడ్డం ఉన్నది, బహుశా జ్ఞాపక చిహ్నంగానో, విజయ సూచకంగానో కాబోలు.

దొరికిన గుర్రాలను లాక్కుపోయినట్లు, వాళ్లు అతగాడిని తమ కూడా గుంజుకుపోయారు. గుర్రంలానే అతడికీ కళ్లెం లేదు, దుస్తులూ లేవు. పూర్తి నగ్నంగా ఉన్నాడతడు. గుర్రాలకు వేసినట్లే అతడి మెడకు ఓ పచ్చి తోలుపట్టీ తగిలించారు. కింద పడనంత వరకూ అతడిని వాళ్లు పట్టించుకోలేదు.

రెండోరోజున అతడికి వాళ్లు అతడి పొడుగాటి లాగూను తొడుక్కోనిచ్చారు. పాదాలు ఉబ్బి బూట్లు పట్టకపోయేసరికి ఆ ఇండియన్లలో ఒకడు ఏటి పాయ దగ్గర చచ్చిన తమవాళ్లలో ఒకడైన సగం క్రోజాతి–హెన్రీ– మొకాసిన్లను అతడిపైకి విసిరాడు. బందీ వాళ్లిచ్చిన మోకాసిన్లను కృతజ్ఞతాభావంతో తొడుక్కున్నాడు. మూడోరోజు వాళ్లు అతడిని ఖాళీగా ఉన్న గుర్రాన్ని స్వారీ చేయనిచ్చారు. దానివల్ల వాళ్లు వేగంగా పోవడానికి వీలు చిక్కింది. త్వరగానే వాళ్లు 'క్రో' ఇండియన్ల శిబిరం వద్దకు వచ్చారు.

అతడు పారిపోదామనుకున్నాడు, శిబిరంలో చిత్రహింసలపాలై చావడం కన్నా, పారిపోయే ప్రయత్నంలో ఒక్కసారిగా మరణిస్తే బాధలుండవు కదా! కాని, అటువంటి అవకాశమే దొరకలేదు. తప్పించుకోవడం అతగాడికన్నా వాళ్లకే ఎక్కువ తెలుసు కదా! వాళ్లు అతడి ప్రయత్నాల్ని ముందే పసిగట్టారు. ఇంతకు ముందొక్కసారే అతడు తప్పించుకోడానికి ప్రయత్నించి సఫలమయ్యాడు– అదెప్పుడంటే బోస్టన్‌లో ఇల్లు వదిలి పోదామనుకున్నపుడు– తండ్రికి కోపం వచ్చింది. అమ్మమ్మ ధారాపాతంగా ఏడ్చింది. కాని వాళ్లు మాటలతో అతడి మనసు మార్చలేకపోయారు.

క్రో ఇండియన్లకు మాటలతో పనిలేదు.

వాళ్లు తమ శిబిరంలోకి వెళ్లేముందు తాము చంపిన శత్రువుల దుస్తులను ధరించి, ముఖానికి నల్లరంగు పులుముకుని లోపలికి అడుగుపెట్టారు. తెల్లమనిషిని

మెడలో ఉన్న తోలుపట్టీ పట్టుకుని గుర్రాన్ని లాగినట్లు లాగుతూ టిపీ (Tepee)ల వలయం వేపు, అరుస్తూ, పాటలు పాడుతూ, ఆయుధాలను ఝళిపిస్తూ వెళ్తుంటే స్పృహతప్పి పడిపోయిన అతడిని ఈడ్చుకుంటూ వాళ్లు తమ శిబిరంలోకి తీసుకుపోయారు.

ఓ టిపీ దగ్గర అతడు వళ్లంతా దెబ్బలతో కమిలి, పుండులా ఉన్న దేహంతో, నిస్త్రాణగా, మగతగా పడి ఉండగా, అతడిని చూడ్డానికి ఆ శిబిరంలోని ఆడామగా, పిల్లాజెల్లా అందరూ గుమికూడి గోలగోలగా అరుస్తున్నారు. దాహం తీవ్రతరం కాగా గుంటలో ఉన్న వాననీళ్లను కుక్కలా నోటితో లబలబా తాగాడు. ఓ తెల్లజుట్టున్న ముసల్ది అరుస్తూ, కేకలు పెడుతూ, అతడు పడుకున్న చోటున ఉన్న గడ్డిమీదకు మాంసం ముక్క విసరగా ఆకలితో నకనకలాడ్తున్న అతడు ఆ మాంసం ముక్క కోసం కుక్కలతో పోట్లాడి మరీ గెలుచుకున్నాడు.

ఆకలీ, దాహం తీరి కాస్త ప్రశాంతత చిక్కాక అతడికి కోపం వచ్చింది. అతడికి తెలుసు తన కోపమె తన శత్రువని.

నేను గుర్రంగా ఉన్నపుడే మెరుగు, ఈ కుక్కబతుకు కన్నా అనుకున్నాడతడు. మెడకున్న తోలుపట్టీ లాగుతుంటే గుర్రంలా నడిచినప్పుడే కాస్త మర్యాదగా ఉండింది, ఈ కుక్కలా నేలమీద పడుకుని నీళ్లకు, మాంసం ముక్కకు వెంపర్లాడడం కంటే! నేను కుక్కను కాబోను.

ఆ ముసల్ది అతడివేపు ఏదో గ్రీజులాంటిది విసిరి ఏం చేస్తాడా అని చూడసాగింది. అతడు దానిని తన ఒంటిపై ఉన్న పుండ్లకు రాసుకున్నాడు.

ఇప్పుడు నేను వాళ్లలాగా వాసన గొడ్తున్నాను. అనుకున్నాడతడు.

అతడు కోలుకుంటున్నపుడు, తను గుర్రంగా ఉంటే కలిగే లాభాలను ఆలోచించాడు. మనిషిగా ఉంటే ఏదో ఒక క్షణాన ఎదురు తిరగవచ్చు, తిరుగుబాటు చేయవచ్చు. అలా చేస్తే అదే తనకు ఆఖరి క్షణమౌతుంది. గుర్రంగా ఉంటే మెత్తగా, సాధువుగా ఉండవచ్చు. అలా గర్వాన్ని జయించాడతడు.

అతడికి అర్ధమయ్యింది తను ఆ కేకలుపెడ్తున్న ముసలిదాని ఆస్థిగా మారిపోయాడని. తాను ఆమెకు ఆమె కొడుకిచ్చిన కానుక అన్నమాట. అందుకని ఆమె తనను అందరిముందూ కేకలు పెడ్తూ ప్రదర్శిస్తున్నది. అందరికంటె ఎక్కువ అరుస్తున్నది. పొరుగువాళ్లకు తన కుమారుడెంత ఔదార్యం గలవాడో వివరిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నది. ఒంటిలో ఎముకలు, చర్మం తప్ప ఏమీలేని ఆ ముసల్ది

అధికారం చెలాయిస్తూ గర్వంగా తిరుగుతున్నది. అయినా ఆమె చాలా కష్టించి పనిచేసే తత్వమున్నది స్త్రీ.

ఈ తెల్లవాడు, తనని తాను గుర్రంగా భావించుకున్నాడు. తనున్న అపాయకరమైన స్థితిని దాదాపు మరచిపోయినాడు. ఒకవేళ ప్రాణాలతో బయటపడితే బోస్టన్‌లో ఉన్న తనవాళ్లకు ఎటువంటి విషయాలు చెప్పాలో మననం చేసుకుంటున్నాడు. హీరోలా ఇంటికి వెళ్లి అమ్మమ్మతో అంటాడు– "అమ్మమ్మా! నీ దుప్పటి తెచ్చి కప్పనా! నీ వయసున్న ఒకావిడకు నేనిలాగే చేసేవాడిని"–

ఆ ముసల్ది ఉన్న 'టిపీ'లో ఇద్దరు ఆడపిల్లలు, వీరుడైన ఆమె పుత్రుడితో పాటు ఉన్నారు. వాళ్లలో ఒకామె అతడి భార్య రెండవది చెల్లెలు కావచ్చు అనుకున్నాడతడు. కోడలు పిల్ల అందరికిష్టం కాబట్టి పనేం చేసేది కాదు. చెల్లెలు ప్రకాశవంతమైన కళ్లతో చూడముచ్చటగా ఉండేది. వాళ్లిద్దరూ అప్పుడప్పుడూ తాను గుర్రాన్ని అనుకుంటున్న తెల్లవాడిని దగ్గరగా చూడడానికి అటుగా వచ్చేవారు.

ముసల్ది పురమాయించిన పనుల్ని చేస్తూనే, వాళ్లు వాళ్లకేది ఇష్టమో అది చేయడానికి ఉరుకులు పరుగులెత్తేవారు. ఎప్పుడూ ఏదో ఆటలు, పోటీలు. బోలెడంత నవ్వులు. కాని తెల్లవాడికి ఆటాపాటా లేదు. ఒంటరితనమంటే ఏమిటో అతడికి బాగా తెలిసివచ్చింది.

మైదానాల్లో ఆ సంవత్సరం ఫలవంతమైన వేసవికాలం. కావాల్సినంత పచ్చిక, బోలెడంత ఎనుము (బఫెలో) మాంసం, బఫెలో చర్మంతో చేసిన దుస్తులు, 'టిపీ'లు. 'క్రో' ఇండియన్లకు సరిపడా గుర్రాలున్నాయి. తృప్తికల జీవనం. వీళ్లకే కనక కీర్తికాంక్ష లేకుండినట్లయితే ఇంకా ఎక్కువమంది ఉండేవారు. కాని వీళ్లు సాహసికులు, మొండివాళ్లు, మృత్యువును కావలించుకోడానికైనా జంకనివాళ్లు. కాని ఎవరైనా వాళ్లలో ఒక్కరు చనిపోతే మొత్తం శిబిరంలో అందరూ ప్రతీకారం తీర్చుకోడానికి దేవుణ్ణి ప్రార్థించేవారు.

ఆ వేసవికాలమంతా 'బందీ' గుర్రంలానే కాలం గడిపాడు. పెంపుడు సాధుజంతువులా ఓపికగా, జాగ్రత్తగా బరువులు మోసేవాడు. మిగతా గుర్రాలకన్నా మంచిగా ప్రవర్తిస్తే మేలనుకునేవాడు. గిట్టలతో, పళ్లతో ఎవరినీ గాయపరచలేదు కదా! ముసలిదానికి ప్రయాణంలో తోడు పడడం, గుర్రాన్ని బండికి కట్టడం చేస్తూ అనేవాడు– "సోదరా! గొడవ పడకుండా నడిస్తే చాలా హాయి"–

ఆ గుర్రం అతడివేపు పెద్ద కళ్లతో చూసి అర్థమైనట్లు తలూపేది. అది అతడికి చాలా స్వాంతననిచ్చేది ఎందుకంటే ఇంకెవరూ అతడితో మాట్లాడేవారు కాదుకదా! అయితే, గుర్రాలతో కూడా అతడు అసమానంగా భావించేవాడు. అవి తప్పించుకుంటే తమ బాగు తాము చూసుకోగలవు. తన పరిస్థితేమిటి? ఆకలిదప్పులతో మాడి చావవలసిందే గదా! గుర్రాల మధ్య కూడ అతడు గుర్రంలా ఉంటూ అసూయకు లోనయ్యేవాడు.

వినయ విధేయతలతో ఎవరు ఏది చెప్పినా చేసేవాడు. ఆడవాళ్లకు సాయం చేయబోయినా వాళ్ల పనుల్లో తనకంత నైపుణ్యం లేదుకదా! మగవాళ్లతో వేటకు పోవాలన్నా వాళ్లు ఇతన్ని నమ్మరు.

శిబిరం మరోచోటికి తరలినప్పుడు ఇతడు బరువు మోసుకుంటూ ఆడవాళ్లతో కలిసి నడిచాడు. వాళ్ల కుక్కలు కూడా కర్రల బండిపై చిన్నచిన్న బరువులు, మూటలు మోస్తూ నడిచాయి.

అతడిని బందీగా పట్టుకున్న ఇండియన్ ఓ ప్రభువులా నడిచేవాడు, అతడికా హక్కు ఉన్నది. తన సమస్కంధులతో కలిసి వేటాడేవాడు, ఉత్సవాల్లో పాల్గొనేవాడు. సమావేశాల్లో చర్చలకు కూర్చుని ఆటా, పాటా, మాటలతో కాలక్షేపం చేసేవాడు. చెట్లనీడలో భార్యతో హాయిగా ముద్దూముచ్చట్లు తీర్చుకునేవాడు. అతడికున్న బాధ్యతలు రెండే. బఫెలో (ఎనుబోతు)ను చంపడం, కీర్తి సంపాదించడం. ఈ తెల్లవాడు అతనికంటె హోదాలో తక్కువవాడు గనక అతడిపై ఈర్ష్యాసూయలు లేనేలేవు.

అనుకోకుండా ఒకరోజున అనేక సంఘటనలు జరిగాయి బందీ మరల మనిషయ్యే అవకాశాలు కనిపించాయి. ఆరోజుకు అతడు వాళ్ల భాష కొద్దికొద్దిగా అర్థం చేసుకునే స్థితికి చేరుకున్నాడు. నాలుగు నెలలపాటు వాళ్ల మాటలను పగలూ రేయీ విని, వాళ్ల దుఃఖాన్ని, ఆనందాన్ని, ఆచార వ్యవహారాల్ని, మంత్రోచ్చారణల్నీ, ప్రార్థనల్నీ, గొడవల్నీ, ఉపన్యాసాల్ని గమనించాక వాళ్ల మాటలు కొద్దికొద్దిగా అర్థమవుతున్నట్లు అనిపించాయి. కాని, వాటిల్లో తనకు సంబంధించిందేమీ లేదు.

ఆకురాలే కాలం తొలిదినాల్లో ఓ ముఖ్యమైన రోజున ఆ ఇద్దరు యువతులు నదివేపు వెళ్తున్నారు. వారిలో ఒకామె తను స్నానానికి పోతున్నా అని ముసలామెకు వినబడేలా అరిచింది. తెల్లవాడు ఎందుకో తెలీదు గజగజ

పణికాడు. శిబిరంలో జనం మాటలు ఇదివరకటిలా గందరగోళంగా గాక అర్థాన్ని స్ఫురిస్తున్నాయి.

అదేరోజున, ఆ ముసలి స్త్రీ రెండు కొత్త 'మొకాసిన్లు' (కాలి జోళ్లు) తెచ్చి అతడి మీదకు విసిరింది. దయతో, జాలితో ఏమన్నా చేస్తున్నదేమో అనుకున్నాడు కాని, మొకాసిన్లు ఇవ్వడమంటే 'టిపీ' – ఇంటిని కాపలా కాయమనే కదా!

ఆమెకు కృతజ్ఞతలు తెలుపుదామని, అతడు ధైర్యం చేసి, రాలిపడ్డ పూలను దోసిలినిండా పట్టుకుని ఆమె ఉన్నవేపు వెళ్లాడు. ఆమె తన 'టిపీ' ముందు కూర్చుని ఎనుము చర్మాన్ని ఒక సాధనం– ఎముకకు ఇనుపరేకు లాంటిది కట్టినది–తో శుభ్రం చేస్తున్నది. ఆమె చేతులు చూడ్డానికి అసహ్యంగా ఉన్నాయి. చాలా వేళ్లకు మొదటి కణుపులు లేవు. ఆమెకు వినయంగా నమస్కరించి, పుష్పాలను సమర్పించబోయాడు.

ముఖంపై వేలాడుతున్న మట్టికొట్టుకున్న శిరోజాల సందు నుంచి అతడివేపు చూసిందామె. ఆ పూలవేపు చూసి, తన చేతిలోని పనిముట్టుతో అతడి దోసిలిమీద కొట్టి వాటిని పడగొట్టి, వేగంగా పక్కనే ఉన్న టిపీల దగ్గరకు పోయి ఆ వృత్తాంతాన్ని కథలు కథలుగా చెబుతున్నది. వాళ్లూ, ఆమె పకపకలుగా నవ్వుతూ, తుళ్లింతలు పడ్తున్నారు.

తెల్లవాడు ఈసారి ధైర్యంగా పక్కనే బాణాలు వెయ్యడం ప్రాక్టీసు చేస్తున్న పిల్లల దగ్గరకు వెళ్లి ఇంగ్లీషులో అడిగాడు– "ఎలా వెయ్యాలో నాకు చూపించరా... ...Show me how to do that, will you?"–

వాళ్లు మొహం చిట్లించారు. అయినా అతడు తన చేతిని జాపి తనేం అడుగుతున్నాడో అర్థమయ్యేలా చూపించాడు. వాళ్లలో ఒకడు అతడికి విల్లు, ఒక బాణం ఇచ్చాడు. అతడు టార్గెట్ మిస్సవ్వగానే అందరూ ముసిముసి నవ్వులు నవ్వారు.

అక్కడి జనం అందరూ, కోపంగా ఉన్నపుడు తప్ప, మిగతా సమయాల్లో అతడిని చూసి ఆనందించేవారు. చిన్నపిల్లలతో కలిసి అతడు ఆడుకోవడానికి వాళ్లేమీ అభ్యంతరపెట్టలేదు. కొద్దిరోజుల తర్వాత అతడు ఆ ముసలిదాన్ని ఆమె కొడుకు పారేసిన విల్లు కావాలని సంజ్ఞలు చేస్తూ అడిగాడు. తరువాత కొన్ని పాత బాణాలను ఏరి వాటితో ప్రాక్టీసు చేస్తుంటే అతగాడి అమ్ములు లక్ష్యాన్ని తప్పడం చూసి వాళ్లంతా పకపకా నవ్వుకునేవారు.

ఒక్కసారి మాటలు అర్థం కావడం మొదలైనాక అతడికి మనుషుల్ని పేర్లు అర్థం చేసుకున్నాడు. ముసలావిడ పేరు గ్రీజీహాండ్ (జిడ్డు చేతులు); ఆమె కూతురు ప్రెటికాఫ్ (అందాల లేగదూడ); ఇంకో యువతి పేరు అతడికి అర్థం కాలేదు. ఆ మాటలింకా అతడి పరిజ్ఞానానికి అందలేదు. అతడిని బందీ చేసిన వీరుడిపేరు ఎల్లో రోబ్ (పీతాంబరుడు).

మాటలు అర్థమయ్యాక కొద్దికొద్దిగా మాట్లాడసాగినాడు. అతడిలో ఒంటరి తనపు భావన తగ్గసాగింది. కాని అతడితో మాట్లాడాల్సిన అవసరం వాళ్లకెవరకూ లేదు కనక ఎవరూ మాట్లాడేవాళ్లు కాదు, మాట్లాడినా అతడికి అర్థం కాదులే అనుకుని. ఒకరోజున అతడు ముసలావిడను అడిగాడు– 'నా పేరేమిటి?' – అంతేకదా, పేరు లేకపోతే అసంపూర్ణమే కదా మనిషి. ఆమె భుజాలు పైకి కదిలించింది. అతడికే పేరూ లేనట్టు.

అతడు 'క్రో' భాషలో అన్నాడు– "నాపేరు గుర్రం", మళ్లామళ్లా అదేమాట అన్నాడు. ఆమె తలూపింది. ఆ తరువాత అందరూ అతడిని 'గుర్రం' అనే పిలిచేవారు. అదే అతడికి కావాల్సింది తనకి ఒక పేరు.

అతడు వాళ్ల శిబిరం దాటి బయట తచ్చాట్లాడ్తున్నా ఇప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పడం లేదు. పారిపోవడానికి ప్రయత్నించినా ఎంతో అదృష్టం కలిసి వస్తేనే అతగాడు ఏదైనా కోటకో, వ్యాపార కేంద్రానికో చేరుకుని తెల్లవాళ్లలో కలిసే అవకాశముంటుంది. కాని శీతాకాలం దగ్గర పడింది. గుర్రం లేకుండా వెళ్లాలను కోవడం మూర్ఖత్వం అనుకున్నాడతడు. సరైన దుస్తులు, వేటాడటానికి ఆయుధాలు, నైపుణ్యం ఇవన్నీ కావాలి. దొంగతనం చేసి వాటిని సంపాదించే ఉద్దేశం లేదు. ఆ పని చేస్తే వాళ్లు వెంబడించడం, తాను దొరికిపోవడం రెండూ నిశ్చయమే. బోస్టన్‌లోని తన ఇంటి వెచ్చదనాన్ని గుర్తు చేసుకుంటూ అతడు ఆ శీతాకాలం వాళ్లతోనే ఉండడానికి నిశ్చయించుకున్నాడు.

ఒకరోజు శీతలరాత్రి అందరూ నిద్రపోతుండగా అతడు 'టిపీ'లోకి దూరబోయాడు. గుర్రానికైనా సరే చల్లగాలి నుంచి రక్షణ కావాలి కదా! ముసలావిడ గొణిగింది అస్పష్టంగా, అంతేకాని అతడిని బయటకు గెంటలేదు.

వాళ్ల దారికడ్డం రానంతవరకు, అతడు నీడలో, వెనక ఉండడాన్ని సహించారు.

అతడికి అర్థమయ్యింది. తన యజమానులు మిగతావాళ్లకన్నా ఎటువంటి దుర్భర పరిస్థితులో ఉన్నారో! విధి వాళ్లతో క్రూరంగా ప్రవర్తించింది. వాళ్లూ వాళ్లూ

పోట్లాడుకుంటున్నప్పుడు ఒకావిడ గ్రీజ్‌హేండ్‌ను ఎగతాళిగా అన్నది– "ఓసి, చుట్టాలు లేనిదానా?" – ఆ మాటకు ముసలావిడ చాలాసేపు బాధపడుతూ తన తండ్రి సోదరులు, చుట్టాల ధైర్యసాహసాలను గురించి ఏకరువు పెట్టింది– "నాకు నలుగురు కొడుకులుండేవారు తెలుసా?"

"ఎవరు వాళ్లు? ఎక్కడున్నారు" అన్నది పొరుగింటావిడ హేళనగా!

తరువాత తెల్లవాడి కళ్లకు మూలుగుతూ, ముక్కుతూ తనలో తానే గొణుక్కుంటూ, కటి ప్రదేశంపై చేతులుంచుకుని ముందుకూ వెనక్కు ఊగుతూ, తన మొండి చేతుల వైపు చూసుకుంటూ రోదించడం కనిపించింది. అప్పుడర్థ మయ్యిందతడికి తను చుట్టాల మృతికి విలపించేవాళ్లు తమ చేతివేళ్లను కణుపుల వద్ద నరుక్కుంటారని. వృద్ధురాలు గ్రీజీహేండ్ చాలామంది దగ్గర చుట్టాల్ని కోల్పోయినట్లుంది. తొలిసారిగా ఆతడికి ఆ ముసల్దానిపై జాలి కలిగింది. కాని అతడు ఆ భావనను 'కోపం'లానే, తాను మోయలేని మరో ఉద్వేగంగా భావించాడు. అతడనుకున్నాడు– ఇంటికెళ్లినాక చెప్పుకోడానికి ఎన్ని కథలున్నాయి నా దగ్గర!

ఏవగింపుతో, రోతతో అతడు ముక్కుపుటాలెగరేసాడు. ఆ శిబిరం జంతువులతో, మాంసంతో, నిలవ వుంచిన కొవ్వుతో వాసన కొడ్తున్నది. అతడు నగ్నంగా ఉన్న తన కాళ్లవేపు చూసుకున్నాడు. ఇంకా తాను గుర్రమే కదా?

అతడు ముసలిదాన్ని నమ్మే స్థితిలో లేడు. ఆకలితో నకనకలాడే బానిస పనిచేయదని ఆమెకు తెలుసు గనక తనకి ఆమాత్రం తిండి పడేస్తున్నదని ఆతడి నమ్మకం. తనకు ఇంత కూడు పడేసి దానిని గొప్ప ఔదార్యంగా పొరుగువాళ్లతో గప్పాలు కొట్టుకుంటున్నదని అతడనుకున్నాడు. ఆమె కోపం ఎటువంటిదో కూడా అతడొకసారి చూసాడు. ఆ శిబిరంలో తిరిగే వందలాది కుక్కల్లో ఒకటి, పెద్దది ఎప్పుడూ ఆమె 'టిపీ' దగ్గరే పడుకుని ఉండేది ఎప్పుడూ ఆమె కాళ్లకు అడ్డం పడుతూ ఉండేది. అది శిబిరం వేరే చోటుకి తరలినప్పుడల్లా తను మోయగలిగినంత బరువును కర్రలబండి మీద లాక్కువస్తూండేది.

అనేకసార్లు దానిని, 'టిపీ' ముందు పడుకుని ఉన్న ఆ కుక్కను ఈ ముసలావిడ కాళ్లతో గట్టిగా తన్నడం అతడు తన కళ్లతో స్వయానా చూసాడు. కుయ్యోమని అరుస్తూ అది లేచి దారి ఇచ్చేది కాని మరలా అక్కడే పడుకునేది. ఒకరోజున ముసల్ది తన కాలికి తగిలిన కుక్కకు యధావిధి తన్నింది కాని ఆ కుక్క దారి తొలగకుండా నిద్రపోతున్నట్లు కళ్లు తిప్పి పడుకుంది. వెవంటనే ఆ ముసల్ది తన చేతిలోని గొడ్డలితో మెడమీద ఒక్క వేటు వేసి తల తెగగొట్టి, తన బానిస అయిన తెల్లవాడిని ఆ చచ్చిన కుక్కను తొలగించమని ఆదేశించింది.

"నేనైనా అంతే" అనుకున్నాడతడు. "అయితే నేను కుక్కను కాదు, గుర్రాన్ని"–

అతడి ఆశాకిరణమల్లా ఆమె కుమార్తె "అందాల లేగదూడ" ప్రెటీ కాఫ్. ఆమెను వివాహమాడాలంటే తనకున్న అనర్హతలు బోలెడన్ని– రంగు, ఆస్తి, గౌరవం, హోదా– ఇవన్నీ తనకి అననుకూలమే. తనకు గుర్రం లేదు, ఆయుధాలు లేవు (ఉన్నదల్లా ఓ పాత విల్లు, పనికిరాని బాణాలు). ఆమెకు బహుమతి ఇవ్వడానికి తన దగ్గరేమిలేవు.

అక్కడి ఆచారమేమిటంటే, ఆడపిల్లను అడగదల్చుకున్న వరుడు ఆమె సోదరుడికి గుర్రాల్ని కానుకగా ఇచ్చి, ఆమె తల్లికి బోలెడంత బఫెలో–ఏనుబోతు మాసం ఇవ్వాలి. అవి ఇవ్వడానికి తెల్లవాడికి ఎంతోకాలం వేచి వుండాల్సిన అవసరం రాలేదు. అంతేకాక ఆ యువతితో మాట్లాడాలంటే ఎంతో రహస్యంగా జరగాలా పని. ఆమెను జాగ్రత్తగా గమనిస్తున్న ఆడపిల్లల కళ్లుకప్పి, గద్దరెక్క ఎముక నుంచి తయారు చేసిన వేణువు ఊదుతూ, ఆమెకోసం రహస్యంగా ఎదురుచూసే ఇతర యువకుల్లా ఉండలేదు తాను.

అందాల లేగదూడ– 'టిపీ' మీదుగా వేగంగా పోయే గుర్రం మీద రంగురంగుల దుస్తులు ధరించి వీరుడిలా వెళ్లే అవకాశం లేదు. ఎందుకంటే తన దగ్గర గుర్రమూ లేదు. దుస్తులూ లేవు.

అదే తన ఇంటి దగ్గరయితే తాను కోరుకున్న అమ్మాయితో వివాహం జరిగి ఉండేది. ఆ ఆలోచన పొడిగిస్తూ అతడు తన సమయాన్ని వృథా చేయదలుచుకో లేదు. భవిష్యత్తును మనం సంపాదించుకోవాలి.

అతడు చేసిన సాహస కార్యక్రమంలో గొప్పది 'అందాల లేగదూడ'కు అప్పుడప్పుడూ కన్నుగొట్టడం, ఆమెను మెచ్చుకోలుగా చూసినప్పుడు ఆమె ముసిముసి నవ్వులు నవ్వుతూ ముఖాన్ని తన చేతుల్లో దాచుకోవడం. అతడు కలలో కూడా ఊహించనిది ఆ పిల్లతో లేచిపోవడం. కాని తను కనీసం ఒక గుర్రాన్ని ఆమె సోదరుడికి బహుమతిగా ఇవ్వగలిగితే, వాళ్ల జాతి అంగీకారాన్ని పొందగలిగితే– –ఎవర్నైనా చంపగలిగితేనే గదా విరోధి గుర్రం తనకు దక్కేది...

వసంతకాలంలో అతడికా అవకాశం లభించింది. అతడు క్రో ఇండియన్లకు చెందినవాడు కాదు. కేవలం వాళ్లను వినోదపరిచేవాడు మాత్రమే అప్పటి వరకు. ఒక వింత పెంపుడు జంతువులా, పక్షిలా, లేకపోతే వాళ్లు అతడికి శీతాకాలంలో తిండిపెట్టేవాళ్లు కాదు.

ఆ అవకాశం ఓ రోజు అతడు ముగ్గురు చిన్నపిల్లలతో కుందేళ్లలాంటి వాటిని వేటాడడానికి పోయినప్పుడు లభించింది. ఆ పిల్లలే అతడి రక్షకభటులు, అలక్ష్యంగా చూసే సహచరులూనూ. కుందేళ్లూ, పక్షులూ ఆహారంగా పెద్ద విలువైనవి కావు ఎందుకంటే ఆ శిబిరంలో ఎనుబోతు మాంసానికి కొదవలేదు కదా! కాని అవి టార్గెట్ ప్రాక్టీస్‌కు పనికి వస్తాయి.

ఆ రోజున వాళ్లు నలుగురూ చాలా దూరం పోయారు వేటాడుతూ. అకస్మాత్తుగా వాళ్లకు నదీపాయ దగ్గర రెండు గుర్రాలు కనిపించాయి. వెంటనే వాళ్లు పొట్ట మీద పడుకుని పాకుతూ ముందుకు వెళ్లి నేలమీద పడి మూలుగుతున్న ఒక ఇండియన్– విరోధి తెగకు చెందినవాడిని చూసారు. వాడేదో ఒంటరి ప్రయాణం చేస్తూ చిక్కుల్లో పడ్డట్లున్నాడు. ఆ పిల్లలకంటే ముందుగా స్పందించాడు తెల్లవాడు.

అలా అతడు– బందీగా వున్న ఆ తెల్లవాడు– గుర్రం అని పేరుగలవాడు గౌరవాన్ని, గుర్రాల్ని సంపాదించుకున్నాడు. తన జీవితాన్ని కాపాడుకోడానికి, పెళ్లి చేసుకోడానికి అర్హతను సంపాదించుకున్నాడు. తనతో పాటు ఉన్న పిల్లలకన్నా ఒక్కక్షణం ముందుగా ఆ విరోధి ఇండియన్‌పై బాణం వేసి, మూలుగుతున్న వాడిని తన విల్లుతో తొలిదెబ్బ కొట్టి చంపేసి, ఆ గుర్రాలను వశం చేసుకున్నాడు.

ఎప్పుడైతే గుర్రాలను వశపరచుకున్నాడో అతడికి తనకు స్వేచ్ఛ లభిస్తుందన్న ఆశ వచ్చింది. ఆ పిల్లలు తాము చిన్నప్పటి నుంచి నేర్చుకున్న విద్యలను ఆచరణలో పెడ్తూ, కేకలు, పెడబొబ్బలు పెడ్తూ సంజ్ఞలు చేస్తూ గంతులేస్తున్నారు, వాళ్లలో ఒకడు చచ్చినవాడి తలపై చర్మాన్ని ఒలిచి విజయసూచకంగా పట్టుకున్నాడు కాని, ఆ రక్తమోడుతున్న చర్మాన్ని చూసి వికారంతో లుంగలు చుట్టుకుని వాంతి చేసుకున్నాడు... వాణ్ణి చూసినప్పుడు తెల్లవాడి ముఖాన వింతైన చిరునవ్వు విరిసింది.

వాళ్లు సాయంకాలానికల్లా శిబిరాన్ని చేరేసరికి అక్కడ అంతా గోలగోల, కోలాహలం. ఒక్కో గుర్రంపై ఇద్దరు వీరుల్లా శిబిరంలోకి వస్తుంటే, తననిన్నాళ్లూ బందీగా చూసిన ఇండియన్లు అతడివేపు మెచ్చుకోలుగా చూస్తున్నారు.

రాత్రంతా హడావుడి. సందడే సందడి. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల ఘనతను పొగుడుతున్నారు. తనతో వచ్చిన ఇద్దరు పిల్లలు శత్రువును రెండోదెబ్బ ఎవరు కొట్టారన్న దానిపై భీకరంగా పోట్లాడుకుంటుంటే దాన్ని తీర్చడానికి తెల్లవాడిని అక్కడకు పిలిచారు– "మొదటిదెబ్బ నీవు కొట్టావు సరే! రెండోది ఎవరు? మూడోది ఎవరు?"– చాలాసేపటికి అతడి బుర్రకు వాదన అర్థమయ్యింది. అతడు తనకు దగ్గర్లో ఉన్న బాలుడివేపు వేలు చూపించాడు. తగాదా పరిష్కారమైపోయింది.

వీరుల విజయకవాతు ఎలా ఉంటుందో తెలిసినవాడు. (అక్కడ వినయానికి చోటు లేదు.) ఎవడు గొప్పపని చేస్తే వాడు దాన్ని గురించి ఘనంగా చెప్పుకోవాల్సిందే!

అతడు తన తెల్లమొహంపై గ్రీజూ, బొగ్గూ పులుముకున్నాడు. పాడుతూ, నృత్యం చేస్తూ 'టెపీ' వలయం మధ్యకు వెళ్లాడు. తన స్వంత భాషలో పాట పాడాడు.

–"అవిశ్వాసుల్లారా! అనాగరికుల్లారా!

నేనిక్కడ్నుంచి త్వరలో తప్పించుకుపోతాను.

నేను వెళ్లిపోతాను! నేను పారిపోతాను"–

క్రో ఇండియన్లు అతడి పాటను జాగ్రత్తగా విన్నారు.

అతడు 'క్రో' భాషలో అరిచాడు–

"నేను గుర్రాన్ని! నేనే గుర్రాన్ని!"–

అందరూ తలలూపారు.

అతడికి గొప్పలు చెప్పుకునే అర్హత లభించింది.

ఎందుకంటే అతడికిప్పుడు రెండు గుర్రాలున్నాయి.

పొద్దుగుంకేప్పటికే అతగాడు తను కోరుకున్న యువతితో ఓ దూరపు కొండగుట్ట దగ్గర విశ్రమ స్థలంలో పడుకుని "నేను ప్రేమిస్తున్నాను నిన్ను ఓ చినదానా! ఐలవ్‌యూ" అంటున్నాడు.

ఆమె అతడి వేపు తన చక్కటి వెడల్పాటి కళ్లతో తమకంగా చూస్తున్నపుడు అతడనుకున్నాడు ఆమెకు తన ఇంగ్లీషు మాటలు అర్ధమై ఉంటాయని. లేక తనకు కావలసినంత ఆమె అర్థం చేసుకుందని.

"నీవు నా స్వర్ణనిధివి. యు ఆర్ మై ట్రెజర్! రత్నాలకన్నా, మణులకన్నా, స్వర్ణాభరణాలకన్నా విలువైనదానివి. నిన్ను నేను 'స్వేచ్ఛ' అని పిలుస్తాను" అన్నాడతడు.

రెండు రోజుల తర్వాత శిబిరానికి వచ్చేసరికి అతడు ధైర్యంగానే ఉన్నాడు కాని మనసులో ఏదో దిగులు. ఆ నియమ నిబంధనలు సరిగా తెలీకుండా అతడు విసిరిన 'ఏస్' పనిచేస్తుందో లేదో!

ముసల్ది గ్రీజీహాండ్ కోపంగా సణుగుతూనే ఉన్నది. తన కూతురు అంత చౌకగా పోయినందుకు. కాని ఆ వివాహం 'క్రో' వివాహరీతిలోనే జరిగింది కదా! అతడు గుర్రాన్ని ఇచ్చాడాయె!

ఆ తరువాత అతడికి వాళ్ల భాష ధారాళంగా పట్టుబడింది. 'అందాల లేగదూడ' ప్రెటీకాఫ్ నుంచి. ఒక్కోసారి ఆతడామెను 'స్వేచ్ఛ' ఫ్రీడమ్ అని సంబోధించేవాడు. అతడికి అర్థమయ్యింది. తననంతగా ఇష్టపడ్తున్న ఆ నవవధువు వయస్సు పధ్నాలుగేళ్లని.

'లేగదూడ' భర్తగా ఆమె తల్లితో, సోదరుడితో ఎటువంటి సమస్యలు వస్తాయో అని భయపడ్డాడతడు. తన స్థితి మెరుగుపడాలని కోరుకున్నాడతడు, అంతేకాని, గౌరవం లభించాలని అనుకోలేదు. వివాహం తరువాత ముసల్ది అతడితో ఒక్క మాటా మాట్లాడలేదు. ఆ ప్రస్తావన తీసుకువస్తే అతడి వధువు విస్మయంగా చూసింది. ఎప్పుడూ మాట్లాడే ప్రయత్నం చేయవద్దు అని వివరణ ఇచ్చింది. మగాడు తన అత్తగారితో మాట్లాడకూడదు. సంభాషణలో కూడా ఆమెపేరు రాకూడదు. కనీసం పేరులో భాగమైనా సరే!

తన హోదా పెరిగింది గనక అతడు అక్కడ్నుంచి పారిపోవాలన్న కోరికకు కాస్త కళ్లెం వేసాడు. ఇప్పుడు తనకో స్త్రీ ఉన్నది, ఇక మిగతా వాళ్లలా ధనవంతుడు కావాలి. తన 'అందాల లేగదూడ' ఇతర ఆడపిల్లలతో ఆటలకు పోకుండా తనకోసం ఎదురుచూస్తున్నది. ఇప్పుడు తన తల్లి నుంచి పెళ్లైన యువతికి కావాల్సిన రకరకాల పనుల్ని నేర్చుకుంటూ ఆనందిస్తున్నది. చర్మాలను ఎండబెట్టడం, శుభ్రం చేయడం, దుస్తుల్ని తయారుచేయడం, వంట వండడం ఇలాంటివి.

ఇప్పుడు తను గుర్రం కాదు. ఒక మనిషి. సగం ఇండియన్. పేదవాడు, పెద్ద నేర్పు లేనివాడు అయినా గౌరవం ఉన్నవాడు. క్రో సమాజంలో చిక్కుకు పోయినవాడు.

తప్పించుకు పారిపోవాలని ఉన్నా దానిని కాస్త గౌరవప్రదంగా చేయాలను కున్నాడు. ముందుగా మంచి దుస్తులు, సరైన గుర్రం, వేటకు అవసరమైన ఆయుధాలు సంపాదించుకోవాలి. పారిపోవడం అనేది– ఈ శిబిరం ఏదైనా వ్యాపార కూడలి దగ్గర్లో మకాం చేసినప్పుడు ఆలోచించుకోవచ్చు అనుకున్నాడతడు. ఎలా ఇంటికి వెళ్లాలో అతడికి తెలీదు. కాని ఇంటికి వెళ్లి అక్కడ హాయిగా ఉన్నట్లు, ఇక్కడి సంఘటనలను, ఎవరూ నమ్మలేనివి, అక్కడి వాళ్లకు కథలు కథలుగా చెబుతున్నట్లు– కలలు కన్నాడు. కాబట్టి తొందరేం లేదు.

అతడికి అక్కడి విషయాలు నేర్పడం 'అందాల లేగదూడ'కు చాలా యిష్టంగా ఉండింది. ఆ తెగ ఆచారవ్యవహారాలు, పద్ధతులు, ఇవన్నీ వివరించేది. వాళ్లెందుకు అలా జీవిస్తున్నారంటే, వాళ్లెప్పటి నుంచో అలాగే ఉన్నారనేది. ఆమెకు తెలిసిన

విషయాల్ని, అతడికి తెలవని వాటిని వివరిస్తూ ముసిముసి నవ్వులు నవ్వేది. కాని, తన సోదరుడి భార్యను మరో వీరుడు ఎత్తుకుపోయాడని తెలిసినప్పుడు గంభీరంగా ఉండింది. ఆ విషయాన్ని ఎంతో పొదుపైన మాటలతో, సంజ్ఞలతో వివరించింది.

'ఎల్లో రోబ్' క్రో ఇండియన్లలోని 'బిగ్ డాగ్స్' సొసైటీకి చెందినవాడు. అతడి భార్యను ఎత్తుకుపోయినవాడి పేరు 'కట్ నెక్' - ఫాక్స్ సొసైటీవాడు. వాళ్లు ఒకే తెగకు చెందినవాళ్లే, వేటకు కలిసి వెళ్లేవాళ్లే, యుద్ధాల్లో కలిసి పోరాటం చేసినవాళ్లే. అయినా ఒక సొసైటీలోని వాళ్లు ఇంకొక సొసైటీ వాళ్ల భార్యలను కొన్ని నియమాలకు లోబడి ఎత్తుకుపోవచ్చు.

ఎప్పుడైతే 'కట్‌నెక్' నవ్వుతూ, పాడుతూ ఎల్లోరోబ్ భార్య ఉన్న 'టెపీ' దగ్గరకు వచ్చి "బయటకు రా! బయటకు రా!" అన్నాడో ఆమె సిగ్గుపడుతూ, పిరికిగా, ఇష్టపూర్వకంగానే బయటకు వచ్చింది. తరువాత ఉత్సవాల్లో అతడిపక్కనే స్వారీచేస్తూ అతడి చేతికర్రను పట్టుకున్నది. అయినా అతడి మరో భార్య పట్టనట్లే చూస్తుండింది.

"ఎందుకు?" అడిగాడు తెల్లవాడు తన భార్య 'స్వేచ్ఛ'ను. "ఎందుకు పొగ తాగుతున్నాడు, మాటా పలుకూ లేకుండా మీ అన్న?"-

ప్రెటీకాఫ్- లేగదూడకు ఈ ప్రశ్న ఆశ్చర్యం వేసింది. తన సోదరుడు ఆమెను తెచ్చుకోలేడు. ఒకవేళ ఆమె మరల రావాలనుకున్నా అది వీలుపడదు. బహుశా 'కట్‌నెక్'కు ఆమెపై మోజు తీరినాక ఆమెకు ఇటు రావాలనిపించవచ్చు. కాని అది సాధ్యం కాదు. అంతేకాదు, ఎల్లోరోబ్‌కు తన హృదయం బాధపడుతున్నా, పైకి బయటపడకూడదు. ఇక్కడ విధానాలు అంతే! ఎవరైనా బయటకు పోయారంటే అది అవమానమే!

'కట్‌నెక్'కు కనబడకుండా ఆమె దాక్కుని ఉండవచ్చు. నిజంగా శీలవతి అయినట్లయితే అతడితో పోవడాన్ని తిరస్కరించి ఉండవచ్చు. కాని ఆమె అలా చేయలేదు. ఎందుకంటే బెర్రీలు కోసుకువచ్చిన కాలంలో ఆమె 'కట్‌నెక్'తో కలిసి ఉండింది. అందుకే అతడికి ఇప్పుడా హక్కు వచ్చింది.

"దాంట్లో ఏం సెన్స్ లేదు. అర్థంపర్థంలేని వ్యవహారం ఇది" అన్నాడతడు. "నీవు వెళ్లిపోయావా, నేను మళ్లీ తీసుకువస్తాను"

అతడు ఆమె తల నిమురుతూ "బారూకీ - శీలవతీ" అన్నాడు.

ఆమె ధైర్యంగా అన్నది- హేహా-

అతడు సమాధానమివ్వకపోయేసరికి, దెబ్బతిన్నట్లు పక్కకు తొలిగింది. అతడికి 'హేహా'కు అర్థం తెలీదు.

"ఆడది తన మగాడు తనను వదలి వెళ్లడని నమ్మితే 'హేహా' అంటుంది– అన్నదామె. "నాది తప్పా?"–

ఆ తెల్లవాడు ఆమెను తన గుండెలకు హత్తుకున్నాడు. "ప్రెటికాఫ్ తప్పుగా మాట్లాడలేదు. గుర్రం ఆమెను విడిచి వెళ్లదు. గుర్రం ఇంకో ఆడదాన్ని కోరుకోదు" అన్నాడు. లేదు. తాను వెళ్లలేదు. ఆమెను విడిచివెళ్లడం ఆమెను పొందిన దానికన్నా కష్టం. 'హేహా'– అని గుసగుసలాడినాడు– 'హేహా' – స్వేచ్ఛ.

అంతరాత్మ అతడిని ఇరుకునపెట్టింది. మరీ అంత ఎక్కువసేపు కాదు. తాను వెళ్లిపోయినా ఈ 'అందాల లేగదూడ'కు మరో వీరుడు, భాగ్యవంతుడు, ఆమెను సుఖంగా ఉంచగలిగినవాడు దొరుకుతాడు. తన వేట నిపుణత పెరుగుతున్నది కాని ఇంకా అపరిపక్వమే!

వెళ్లిపోవాలన్న తొందరేం లేదు. అతడికి 'క్రో' జాతి ఆచార వ్యవహారాలన్నీ వంటబడ్తున్నాయి. కొద్దికొద్దిగా ధనవంతుడౌతున్నాడు. ఇప్పుడతడి దగ్గర అయిదు గుర్రాలున్నాయి. ఆ గుంపులో తన హోదా దాదాపు సురక్షితమైంది. ముగ్గురు, నలుగురు యువతులు, అదీ ఎల్లోరోబ్‌కు చెందినవాళ్లు కూడ అతనిపై మక్కువ చూబుతున్నారు. 'అందాల లేగదూడ'కు తన మగాడు అంత ఆకర్షణీయుడైనందుకు గర్వంగానే ఉన్నది.

ఈలోగా తెల్లవాడు తన రహస్య ప్రయాణానికి సరిపడా సరంజామా సిద్ధం చేసుకున్నాడు. మైదానాల్లోని పచ్చిక పసుపురంగుకు మారింది. చలికాలం దగ్గర పడుతున్నది. కాని అతడు 'స్వేచ్ఛ' అని పేరుబెట్టిన చిన్నదానికి, తన భార్యకు ఇప్పుడు సేవకుడైనాడు ఎందుకంటే ఆమె గర్భవతి గనుక. తన బిడ్డను మోస్తున్నది అని తెలిసాక!... చలికాలం ముగింపుకు వచ్చింది.

బిగ్‌డాగ్ సొసైటీ వసంతకాలంలో పెద్ద ఉత్సవాన్ని జరుపుకున్నది. తెల్లవాడు తన భార్యతో సముద్రపు పాయ ఒడ్డున విహరించాడు. ఇంటికి వెళ్లినాక నేను వాళ్లకు ఇక్కడివాళ్ల మంత్ర తంత్రాలను, పాటలను డప్పు శబ్దాలను అనుకరించి చూపిస్తాను... కొన్నాళ్లకు... కొన్నాళ్లకు...

'టిపీ'కు వెళ్లినాక 'అందాల లేగదూడ' అతడితో కలిసి శయనించలేదు.

"ఆగు! ముందు నా సోదరుడి గురించి వెదుకు!" అన్నదామె– "నాకేదో భయంగా ఉన్నది. ఏమైనా జరగవచ్చు".

అతడికి తెలిసినంతవరకు 'బిగ్‌డాగ్స్' ఒకరకమైన ఎన్నిక తంతును నిర్వహిస్తున్నారు. అతడు తన భార్యతో కలిసి నెగడు వద్ద కూర్చున్నాడు. ఎప్పుడూ పెందలకాడ నిద్రపోయే ముసల్ది, ఏదో అశాంతిగా పచార్లు చేస్తున్నది.

బయట హడావుడి ముగిసి నిశ్శబ్దం ఆవరించేసరికి, తెల్లవాడికి ఆవలింతలు వస్తున్నాయి. రంగురంగుల దుస్తుల్లో, ముఖాన పెయింటుతో 'ఎల్లోరోబ్' ఉన్నిదుస్తులు, ఈకల అలంకరణతో వచ్చేసరికి ఆ స్త్రీలు వలవలా విలపించారు. ఆ ముగ్గురి మధ్య ఏదో సంభాషణ. చాలా వేగంగా మాట్లాడుకోవడం వలన అతడికి సరిగా అర్థం కాలేదు. ముసలావిడ ఏడుస్తూ అరవబోయింది. ఆమె కుమారుడు ఒక్క మాటతో ఆమె మౌనం వహించేలా చేసాడు.

తెల్లవాడు నిద్రలోకి జారుకుంటూ పక్కనే తన భార్య ఏడుస్తూ ఉండడం గమనించాడు, కాని నిద్ర అతడిని ఆవహించింది.

తెల్లవారే ఆమె వివరించింది.

–"అతడు ఎలుగుబంటి చర్మపు బెల్టు ధరించాడు. అంటే యుద్ధంలో అతడు వెనుదిరిగే ప్రసక్తి లేదు. అతడు ఎప్పటికీ ప్రమాదంలోనే ఉంటాడు. అంటే చచ్చిపోతాడు"–

"చనిపోడులే అంతా నీ ఊహ" అన్నాడు తెల్లవాడు తన భార్యతో. 'ప్రెటికాఫ్' ఇంతకు ముందు బేర్‌స్కిన్ బెల్ట్ ధరించిన వాళ్లను గుర్తుకు తెచ్చుకున్నది. అది అతి సాహసవంతుడికిచ్చే గౌరవం. అతడు ఈ వేసవికాలం దాటగలిగితే దాన్నుంచి విముక్తం కావచ్చు.

''నా సోదరుడు చనిపోవాలనుకుంటున్నాడు. అతడి హృదయం క్షోభపడ్తోంది" విలపించిందామె.

'ఎల్లో రోబ్' ఆ వేసవికాలంలో ఆరు చిన్నిచిన్ని పోట్లాటలలో నెగ్గుకు రాగలిగాడు. అవి విరోధి తెగలవాళ్లు చేసిన చిన్నచిన్న దాడులు. ఎన్నో గౌరవాలు పొందాడు. శత్రు శిబిరంలోంచి గుర్రాలను కొల్లగొట్టుకువచ్చాడు. రెండు విజయవంతమైన దాడులు చేసాడు. విరోధి తెగవాడిని మొదటి దెబ్బకొట్టి తుపాకీ లాక్కు వచ్చాడు. తన మొకాసిన్లపై తోడేలు తోకలను, అంగీపై ఎర్మైన్ –అడవిపిల్లి చర్మాన్ని అతికించుకున్నాడు. కాళ్ల తొడుగులకు తాను కోసుకువచ్చిన శత్రువుల శిరస్సుపైని చర్మాన్ని కుట్టించుకున్నాడు.

అతడి తల్లి అస్తమానూ అంటూనే ఉండేది– "నా కుమారుడు ఇంకో భార్యను తెచ్చుకోవాలి. ఇంటిపని చేయలేక చస్తున్నాను నేను" అని అంటున్నా అతడు లక్ష్యపెట్టలేదు. ఎక్కువ సమయం కొండగుట్టలపై కూర్చుని ప్రార్థనలోనో, లేక మెడిసిన్ మాన్– మందులవాడితో మాటల్లోనో కాలం గడిపేవాడు. ప్రతిజ్ఞలు, బాసలు చేసేవాడు, వాటిని నిలబెట్టుకునేవాడు. బేర్‌స్కిన్ బెల్ట్ గౌరవం నుంచి స్వేచ్ఛ పొందేముందు ఆఖరిదాడికి వెళ్లాడు.

ఉత్తరం వైపు నుంచి వీరులు వస్తున్న సమయంలోనే, దక్షిణ దిక్కు నుంచి తెల్లవాడు ఇంకో ఇద్దరు వేటగాళ్లతో కలిసి– ఎనుబోతు (బఫెలో), కణుజు (ఎల్క్) మాంసాన్ని ఇంకా నెత్తురోడుతున్న చర్మాలతో పాటు గుర్రాలపై వేసుకుని శిబిరం వేపు వస్తున్నారు. వీళ్లలో ఒక వేటగాడు దగ్గినట్లు శబ్దం చేయగానే ముగ్గురూ ఆగారు. వాళ్లకు 'టెపీ'లున్న ప్రదేశానికి ఉత్తరాన ఉన్న కొండపై ఎవరో అశ్వికుడు కనిపించాడు.

అతడు గుర్రం దిగి, బ్లాంకెట్ ఒకటి పట్టుకుని నేలపై జారవిడిచాడు. మరలా రిపీట్ చేసాడు.

వేటగాళ్లు గుసగుసలాడుకున్నారు. 'ఇద్దరు చనిపోయారు'. వాళ్లు వేగంగా శిబిరంలోకి దూసుకుపోయారు. ఏడ్పులు, పెడబొబ్బలతో శిబిరం గొడవ గొడవగా ఉన్నది.

దాడికి వెళ్లిన దళం నుండి ముందుగా ఒక వార్తాహరుడు వచ్చాడు. మిగతావాళ్లు ముఖాలను పెయింటు వేసుకుంటున్నారుట సంతాపానికి, విజయానికి గుర్తుగా! చనిపోయినవాళ్లలో ఒకడు ఎల్లోరోబ్. వాళ్లు అతడి శరీరాన్ని ఒక గుహలో ఉంచి చుట్టూ రాళ్లతో మూసివేసారు. రెండో అతడు తరవాత చనిపోయాడు. అతడి మృతదేహాన్ని చెట్టుపై ఉంచారు.

'టిపీ' ముందు రక్తం ధారగా పడి ఉన్నది, దాంట్లోకి ఇక 'ఎల్లోరోబ్' రాలేడు. అతడి తల్లి తన తలవెంట్రుకలను కురచగా కత్తిరించుకుని గుమ్మంలో కూర్చుని ముందుకూ వెనక్కూ ఊగుతూ గుండెలవిసేలా ఏడుస్తున్నది. ఆమె తన అరచేతిని మరో అరచేతితో పట్టుకున్నది. ఈరోజు ఇంకో వేలు కణుపు దగ్గర ఖండించబడింది.

'అందాల లేగదూడ' కూడా తన పొడుగాటి జుట్టును అక్కడక్కడా కత్తిరించుకుని, చేతులపై కత్తిగాట్లు పెట్టుకుంటుండగా తెల్లవాడు ఆమె చేతిలోని

కత్తిని లాక్కోబోగా ఆమె అభ్యర్థించిన తీరు చూసి చకితుడై ఆమె ఇష్టం వచ్చినట్లు చేసుకోనిచ్చాడు. వాళ్లందరిపై అతడికి ఏవగింపు కలిగింది.

"అనాగరికులు!" అనుకున్నాడతడు. "నేను వెళ్లిపోతాను. నేను ఒంటరిగా వేటకు వెళ్తాను. అలా వెళ్తూనే ఉంటాను. వెళ్లిపోతాను!"

కాని అతడు వెళ్లలేదు. ఆ శిబిరంలో అతనొక్కడే ఇద్దరు స్త్రీలకు ఆహారం సంపాదించి ఇవ్వగలిగినవాడు. వాళ్లలో ఒకామె వృద్ధురాలు, మరొకామె తన శిశువును మోస్తున్న గర్భిణీస్త్రీ.

వాళ్ల సంతాపంతో వాళ్లు అతడిని మరల నిరుపేదను చేసారు. వాళ్లకున్న సుఖసౌఖ్యాలను, సంపదలను 'ఎల్లోరోబ్' ఆత్మశాంతికై ఆత్మలకు బలియిచ్చారు. పదిహేడు ఎనుబోతుల చర్మంతో చేసిన 'టెపీ', ఫర్స్, తెల్లటి లేడిచర్మంతో చేసిన కణుజు దంతాలతో అలంకరించబడిన డ్రెస్– ప్రెటికాఫ్‌కు ఎంతో ఇష్టమైనది, వాళ్ల పనిముట్లు, 'ఎల్లోరోబ్' ఆయుధాలు– (కొన్ని పవిత్ర వస్తువులు మినహా)– అన్నిటినీ ప్రయరీ పచ్చగడ్డి మైదానాలపై వదిలి మరోచోటుకు తరలివెళ్లారు. తనకున్న గుర్రాల్లో రెండింటిని బలి ఇచ్చారు. మిగతావి స్త్రీలు త్యాగం చేసారు.

ఇప్పుడు తలదాచుకోడానికి నీడలేదు. సంతాప దినాలు రెండు నెలలు ముగిసే వరకూ 'టెపీ' స్వంతమైనది ఉండకూడదు. ఆ తరువాత స్త్రీలు ఎనుబోతు చర్మాన్ని శుద్ధిచేసి ఇవ్వగా దానితో 'టెపీ' తయారు చేసుకోవాలి. అంతవరకు విల్లో చెట్ల కొమ్మలతో చేసిన గుడిసెలపై తోళ్లు కప్పి వాటిలో తల దాచుకోవాలి. అవీ వాళ్ల స్నేహితులు దయతలచి ఇస్తే. వాళ్ల బంధువులతో కలిసి ఉండవచ్చు కాని 'ఎల్లోరోబ్' స్త్రీలకు బంధువులంటూ లేరు.

తెల్లవాడికి అర్థమయ్యింది. 'క్రో' జాతి ప్రజలకు బంధువులు లేకపోవడమంటే ఎంత దౌర్భాగ్యమో! గ్రీజీహాండ్ చేతులు వేళ్లులేని మొండిచేతులుగా ఉండడానికదే కదా కారణం. ప్రతి ఏడాది ఎవరో ఒక బంధువుని, తన చేతివేలి కణుపునూ పోగొట్టుకుంటూ వస్తూనే ఉన్నది ఆ ముసలిది. ఇప్పుడు ఆమెకు మిగిలిందల్లా ఆమె కూతురు ఒక్కటే– ప్రెటికాఫ్ – అందాల లేగదూడ.

తెల్లవాడికి, అదే, గుర్రానికి వాళ్ల మూర్ఖత్వంపై కోపం వచ్చింది. తను బందీగా ఉండడం, నగ్నంగా గుర్రంలా ఉండడం, బానిసలా నిరుపేదగా ఉండడం– ఇవన్నీ సరే. ఎందుకంటే తనను బంధించినవాళ్లు తననలా చేసారు. కాని ఈ స్త్రీలు స్వచ్ఛందంగా వాళ్లకు అవసరమైన వాటినన్నిటినీ వదులుకున్నారు.

ఆ గుడిసెలో వాళ్లతో ఉండడానికి అతడికి మనసొప్పలేదు. ఓ చెట్టునీడలో పడుకున్నాడు. సంతాపదినాల మూడోరోజు రాత్రి అక్కడినుంచి వెళ్లిపోవడానికి సన్నాహాలు చేసుకున్నాడు. తన దగ్గర కత్తి, విల్లమ్ములు ఉన్నాయి. రెండు గుర్రాలను తీసుకుని మాంసం తెచ్చేందుకు పోయినట్లు పోవాలి. ఇక తిరిగి వచ్చే ప్రసక్తి లేదు. అతడనుకున్నాడు– "ఇంటిదగ్గర ఇక్కడి చాలా విషయాలు వాళ్లకు చెప్పను". గుడిసెలోంచి అతడి భార్య ఏడుస్తున్నది. అక్కడ ఏదో కమిలిన చప్పుడు. ముసల్దాని గొంతు గొణుగుతున్నట్లు–

ఇరవై నాలుగు గంటల తరువాత అతడికి కొడుకు రెండు నెలల ముందుగా పుట్టాడు. మెడిసిన్ వుమన్– 'టెపీ' లోపల. పుట్టిన బిడ్డ ఊపిరి తీయలేదు. సూర్యాస్తమయం కాకమునుపే తల్లి ఊపిరి కూడా ఆగిపోయింది.

తెల్లవాడికి ఎలా దుఃఖించాలో కూడా తెలీలేదు. ఏమని ఏడ్వాలి? ఎలా దుఃఖించాలి? ముసల్ది గొంతు పొరపోయే వరకు ఏడ్చింది. ఏడుస్తూనే ఉంది. విషాదంతో దుఃఖిస్తూ ఆమె అతడి వద్దకు వచ్చింది, వంగిపోయి వణుకుతూ; ఆమె తన చేతిలోని కత్తిని అతడికి ఇచ్చింది. అతడు తీసుకున్నాడు.

ఆమె తన హస్తాల్ని చూపి, తల అడ్డంగా ఊపింది. ఇంకో వేలి కణుపు కూడా ఖండిస్తే ఆమె ఇక పని చేసుకోలేదు. ఇంక ఆమె విచారించడానికీ, దుఃఖించడానికీ సమయం లేదు.

తెల్లవాడన్నాడు– "సరే సరే!" అతడు కత్తితో తన చేతులపై గాట్లు పెట్టుకున్నాడు. రక్తం వెల్లువలా, ధారలుగా నేలపైకి కారింది. ఆ మాత్రం తన అందాల లేగదూడ కోసం త్యాగం చేయవలసిందే! ఆమాత్రం రక్తం ప్రియతమమైన స్వేచ్ఛకు చేరవలసిందే!

"ఇప్పుడు నాకిక్కడ ఏ బంధనాలూ లేవు" అనుకున్నాడతడు. ఆ విషయాన్ని గ్రహించాడతడు. "ఇంటికి వెళ్లాక ఎవ్వరినీ ఈ గాయాల మచ్చలను చూడనివ్వను!"

అతడు గ్రీజీహాండ్ వేపు చూసాడు. దుఃఖంతో కూడిన వృద్ధాప్యం ఆమెను మరింత కృంగదీసింది.

అతడనుకున్నాడు– ఇప్పుడు నాకు పూర్తి స్వేచ్ఛ లభించింది.

భార్య చనిపోయాక, ఆ కుటుంబానికి అతడు చేయాల్సిన బాధ్యతలేమీ లేవు. 'ప్రెటికాఫ్' ఆ సంగతి చెప్పింది. మగాళ్లు ఒక 'టెపి' నుంచి మరో దాంట్లోకి ఎందుకు మారుతుంటారో!

మరి ముసలిదాని పరిస్థితేమిటి? ఏమవుతుంది. ఎవరైనా విసిరేసినవి తిని బతుకుతుంది. స్కావెంజర్‌లా! ఈమెలాంటిదే మరొక ముసలిది ఇంకొకతె ఆ శిబిరంలో ఉన్నది. ఆమెకూ బంధువులు లేరు. ఎవరికీ ఆమెపై బాధ్యతలు లేవు. కాస్త ఉన్నవాళ్లు పడేసిన తిండిపై బతుకుతున్నదామె. తన మొండి చేతుల్తో కట్టుకున్న గుడిసెలో ఆమె విశ్రమిస్తుంది. శిబిరాన్ని తరలించినప్పుడు ఆమె అందరికంటె వెనుకగా తడబడుతూ వస్తుంటుంది. ఎవరూ ఆమెను పట్టించుకోరు. ఆమె చనిపోయినా ఎవరూ దుఃఖించరు. లెక్కలో లేని మనిషి ఆమె.

"రేపు ఉదయం" లెక్కవేసాడు తెల్లవాడు– నేను వెళ్లిపోతాను అనుకున్నాడు. అతడి అత్త పెదాలు వణికాయి. ఆమె పెదాలు వణుకుతూ ఒక్కమాట పలికాయి. "ఈరూ–ఊషే" అన్నదామె– 'కొడుకా?"

అతడి కళ్లు రెపరెపలాడాయి. అతడికి గుర్తుకు వచ్చింది. భార్య చనిపోతే భర్త స్వేచ్ఛను పొందుతాడు. కాని ఆమె తల్లి అభిమానంతో ఇంతవరకూ పట్టించుకోనిది, అతడిని ఉండమని అడగవచ్చు. అతడిని ఆమె 'కొడుకా' అని పిలిచింది. అతడు అంగీకరించాడు.

గ్రీజీహాండ్ అతడి ముందు నిలబడింది. వృద్ధాప్యపు బరువుతో వంగిన నడుము, క్షణం తీరికలేని పనితో ముడతలు పడ్డ చర్మం, ప్రేమ, పిల్లలు లేని జీవితం, దుఃఖంతో మచ్చలు పడిన శరీరం– అయినా ఆమె జీవితాన్ని ప్రేమిస్తున్నది. దానికోసం అతడిని అర్థిస్తున్నది. అతడి ఒక్కడినే అలా అడగగలదు. దానికోసం ఆమె తాను కప్పుకున్న గర్వమనే వస్త్రాన్ని ఊడబెరికి మరీ అర్థిస్తున్నది. జీవితంపై ప్రేమ అంటే అదే!

అతడు పచ్చికమైదానాల వేపు, తూర్పుదిక్కుగా చూసాడు. రెండు వేల మైళ్ల దూరంలో తన ఇల్లు, ఊరు ఉన్నాయి. ఈ వృద్ధురాలు ఎల్లకాలం బతికి ఉండదు కదా! తనింకా యువకుడే! వేచి ఉండగలడు. ఔదార్యంగా ఉండగలిగిన శక్తి, మనసూ ఉన్నాయి తనకు. ఎందుకంటే తను మనిషి కనుక. అతడు తన సమాధానం ఇచ్చాడు– 'ఈగ్యా' 'అమ్మా!'

మూడేళ్ల తరువాత అతడు తన ఇంటికి చేరుకున్నాడు. అతడు చాలా క్లుప్తంగా చెప్పేవాడు– "నేను 'క్రో' ఇండియన్లతో కొన్నాళ్లున్నాను. నేను వాళ్లని వదిలి రావడానికి కొద్దికాలం పట్టింది. వాళ్లు నన్ను 'గుర్రం' అని పిలిచేవాళ్లు. "They called me a Horse"–

అతడికి క్షమాపణ గాని, పొగడుకోవడం గాని చేసుకోవలసిన అవసరం రాలేదు. ఎందుకంటే అతడు ఇప్పుడు ఈ భూమిపై ఉన్న ఏ మనిషికైనా సమానుడు కాబట్టి.

✧✧✧✧✧

---

**డొరొతి యం. జాన్‌సన్ (Dorothy M. Johnson 1908-1984)**

డొరొతి యం. జాన్‌సన్ – మోంటానాలో పుట్టి పెరిగి, తూర్పుదేశాన ఉండాలని అనుకుని మరల మోంటానా వచ్చిన డొరొతి జాన్సన్ గురించి 'ఈ కథలు ఆమె మాత్రమే వ్రాయగలదు' అంటాడు జాక్ ష్కాఫర్.

జాన్‌సన్‌ను బ్లాక్‌ఫుట్ ఇండియన్లు తమ తెగలో గౌరవ సభ్యురాలిగా చేసుకున్నారు. ఆమెకు వాళ్లు పెట్టిన పేరు– Kills-both-places. ఆమె శ్వేతజాతీయతను, బ్లాక్‌ఫుట్ అభిమానాన్ని అందంగా చెబుతుంది.

ఆమె కథలు– The Hanging Tree, The Man who shot Liberty Valance, A Man Called Horse సినిమాలుగా తీయబడినాయి.

జీవితాన్ని ప్రేమించే ఒక వృద్ధురాలి బతుకు అంతర్లీనంగా ఉన్న ఈ కథ 'క్రో' ఇండియన్లకు బందీ అయిన శ్వేతజాతి యువకుడు వారి జీవితాలకు బందీ అయి స్వేచ్ఛకోసం పడిన పాట్లను అత్యంత హృద్యమంగా వర్ణిస్తుంది. 1845కు ముందు యునైటెడ్ స్టేట్స్‌లో భాగం కాలేని రెడ్ ఇండియన్ల ప్రాంతం క్రమేపీ తెల్లవాళ్ల ఆక్రమణకు గురై అంతర్ధానం కావడం ఆ విషాద గాథ తొలి పదాలను అడుగులను ఈ కథలో మనం చూస్తాం.

# 40. కిలిమంజారో హిమశిఖరం

## (The Snows of Kilimanjaro)

**– ఎర్నెస్ట్ హెమింగ్ వే**
**Ernest Hemingway**

*(కిలిమంజారో 19710 అడుగుల ఎత్తు ఉండి మంచుతో కప్పబడిన శిఖరంతో ఆఫ్రికాలో ఎత్తైన పర్వతంగా ప్రసిద్ధికెక్కింది. దాని పశ్చిమ శిఖరాన్ని మసాయి తెగ ప్రజలు– House of God అని పిలుస్తారు. పశ్చిమ శిఖరం దగ్గర్లో ఓ చిరుతపులి దేహం ఎండి మంచులో గడ్డకట్టింది కనిపిస్తుంది. చిరుతపులి అంత ఎత్తుకు ఎందుకు వెళ్లిందో ఎవరికీ తెలీదు.)*

"దాంట్లో గొప్పతనం ఏమిటంటే అసలు నెప్పి తెలియదు" అన్నాడతడు – "అలా తెలుస్తుంది నీకు ఎప్పుడు మొదలయ్యిందీ"

"నిజంగా?"

"ఖచ్చితంగా! అయితే వాసన భరించలేం! అదే నీకు కాస్త చిరాగ్గా ఉండవచ్చు" అన్నాడతడు.

"లేదు, లేదు"

"వాటివేపు చూడు" అన్నాడతడు– "చూసి వస్తున్నాయా లేక వాసన పసిగట్టి వస్తున్నాయంటావా అవన్నీ"

తుమ్మచెట్టు నీడలో మంచంపై పడుకుని అతడు ఆ విశాల మైదానంలోకి, పైకి తేరిపార చూసాడు. దూరంగా మూడు రాబందులు అసహ్యంగా, కూర్చుని కనబడుతున్నాయి. ఆకాశంలో మరో డజను చక్కర్లు కొడుతుంటే వాటి నీడలు మైదానంపై పడి చెదరిపోతున్నాయి.

"ట్రక్కు దెబ్బ తిన్నప్పటి నుంచీ అవి అక్కడే తిరుగుతున్నాయి. కాని ఇవ్వాళే నేలమీదకు దిగాయి. వాటిని చాలా జాగ్రత్తగా పరిశీలించాను నాకేమన్నా కథావస్తువుగా పనికి వస్తాయేమోనని. అంతా గమ్మత్తుగా ఉంది" అన్నాడతడు.

"వద్దు. వద్దు" అన్నదామె గాభరాగా.

"నేను మాట్లాడగలుగుతున్నాను" అతడన్నాడు– "మాట్లాడుతుంటే కాస్త ఉపశమనంగా ఉంది. కాని నిన్ను ఇబ్బంది పెట్టదలుచుకోలేదు."

"నీకు తెలుసు. నాకేమీ ఇబ్బంది లేదు. నీకేమీ చేయలేకపోతున్నందుకు నాకు కష్టంగా ఉంది. విమానం వచ్చేంత వరకు మనం సాధ్యమైనంత మామూలుగా గడుపుదాం" అన్నదామె.

"లేదా, విమానం రానంతవరకూ"

"దయయుంచి నాకేదన్నా ఆలోచన చెప్పు, ఏదో ఒకటి, నేను చేయగలిగింది"

"నా కాలు నరికేయ్! అలా దాన్ని పైకి పాకకుండా ఆపగలుగుతాం! అదీ నాకు సందేహమే. లేదా, నన్ను కాల్చేయ్! ఇప్పుడు నీవు గురితప్పకుండా కాల్చగలుగుతున్నావు కదా, నేనేకదా నీకు నేర్పింది, అవునా?" అన్నాడతడు.

"దయచేసి అలా మాట్లాడకు. ఏమన్నా చదవనా?" అన్నదామె.

"ఏం చదువుతావు?"

"మనం చదవనిదేదైనా"

"నేను వినలేను. మాట్లాడటమే ఉపశాంతిగా ఉన్నది నాకు. మనం పోట్లాడుకుందామా, అలా అయినా కాలం గడుస్తుందేమో!"

"నాకు పోట్లాడడం రాదు. నేనెప్పుడూ పోట్లాడలేదు. ఎంత దిగులుపడ్డా అది నావల్ల కాదు. రేపు ఇంకో ట్రక్కుతో వస్తారేమో వాళ్లు. విమానం వస్తుందేమో!"

"నేను కదలలేను" అన్నాడతడు– "అంతేకాక కదలడంలో అర్థం లేదు. కదలడమంటే నీకు కష్టం తగ్గించడమే"

"అది పిరికితనం"

"మనిషిని సుఖంగా చావనివ్వవా ఏమిటి ఏ పేరూ పెట్టకుండా? నన్ను పట్టుకుని వేలాడడంలో అర్థమేమిటి?"

"నీవు చనిపోవు! నేను నమ్ముతున్నాను"

"అమాయకంగా మాట్లాడకు. నేను చావబోతున్నాను. కావాలంటే ఆ దయ్యపు పక్షుల్నడుగు" అతడు రాబందులవేపు చూసి అన్నాడు. అవి పెద్దగా, అసహ్యంగా తమ మొండి తలల్ని ఈకల్లోకి జొప్పించి నింపాదిగా కూర్చుని ఉన్నాయి. నాల్గవది ఆకాశం నుంచి విమానంలా దూసుకువచ్చి నేలపై కాస్త దూరం పరిగెత్తి, ఒళ్లు ఊపుకుంటూ మిగతావాటి దగ్గరకు చేరింది.

"అవి ప్రతి కాంపు చుట్టూ మూగుతూనే ఉంటాయి. ఎప్పుడూ పట్టించుకోం! ఆశ వదులుకోవద్దు. నీవు చనిపోవు. నాకు తెలుసు" అన్నదామె.

"ఎక్కడ చదివావీ విషయం! నీవో అమాయకురాలివి"

"ఇంకెవరి గురించైనా ఆలోచించు. ఇంకేదైనా..."

"దేవుడి సాక్షిగా" - అతడన్నాడు- "నా ఉద్యోగమే అది కదా!"

అతడు కాసేపు మౌనంగా పడుకుని తామున్నచోటు నుంచి పొదల అంచు వరకు మలమల మసలుతున్న ఎండను పరికించాడు. దూరంగా చిన్నగా కనిపిస్తున్న కుందేళ్లు ఆకుపచ్చని పొదల దగ్గర జీబ్రాల మంద. నిజానికి ఇది కాంపుకు అనువైన ప్రదేశం. వెనక కొండ, దిగువన పెద్ద చెట్లు మంచినీళ్ల కుంట, పక్కనే ఎండిన నీటికుంట దగ్గర గాలికి పైకి లేస్తున్న దుమ్ము.

"నన్ను చదవమంటావా?" అడిగిందామె. మంచం పక్కనే ఉన్న కాన్వాస్ కుర్చీలో కూర్చున్నది. "కాస్త చల్లగాలి వస్తున్నట్లున్నది"

"నో థాంక్స్"

"ట్రక్కు వస్తున్నదేమో!"

"వచ్చినా, రాకపోయినా నేను లెక్కచెయ్యను"

"నేను చేస్తాను"

"నేను పట్టించుకోని చాలా విషయాలను నీవు పట్టుకు వేలాడ్తావు కదా!"

"అన్నిటినీ కాదు, హారీ!"

"ఏదైనా డ్రింకు"

"అది మంచిది కాదు. ఆల్కహాలు తీసుకోకూడదని వ్రాసి ఉందిగా, నీవు తాగకూడదు"

"మోలో!" అరిచాడతడు.

"ఎస్! బ్వానా!" అతడి వ్యక్తిగత పరిచారకుడు వచ్చాడు.

"విస్కీ-సోడా తీసుకురా!"

"ఎస్, బ్వానా!"

"నీవు తీసుకోకూడదు. అదే నేను అన్నది ఆశ వదులుకోకూడదని.... విస్కీ నీ ఆరోగ్యానికి మంచిది కాదు"

*(అంతా అయిపోయింది అనుకున్నాడతడు. కాలు కుళ్లిపోయి 'గాంగ్రీన్' అయ్యింది కనక ఇప్పుడు నెప్పి లేదు. నెప్పే లేదు కాబట్టి బాధ లేదు. ఉందల్లా నీరసం, అశక్తత, అసహాయత, ఆగ్రహం- అందుకే కాస్త విస్కీకోసం ఆరాటం. ఎలాగూ పోబోతున్నపుడు ఈ అడ్డంకులు అవసరమా? అంతం నిశ్చయమయ్యాక బతుకు మీద ఆసక్తి చచ్చిపోయింది.*

*ఎన్నో ఏళ్ల నుంచి అతడు దాన్ని నమ్మి అన్వేషిస్తున్నాడు. ఇప్పుడు దానికి అర్థం లేకుండా పోయింది. శరీరం, మనసూ అలిసినప్పుడు అన్వేషణ ఎంత తేలికగా ముగుస్తుందో అతడికి అర్థమయ్యింది.*

*వేటి గురించయితే సవివరంగా రాయాలని తన సమస్త శక్తులూ కూడగట్టుకుని శోధించి మరీ సేకరించిన విషయాలను అనుభవాలను తానిక పుస్తక రూపంలోకి తేలేడు. రాయడానికి ప్రయత్నించడంలో తప్పులేదు కదా! బహుశా చివరకు రాద్దాములే అని ఇన్నాళ్లూ వాయిదా వేసింది, బహుశా వ్రాయకుండా పోడానికేనేమో! ఇప్పుడు తనకిక తెలిసే అవకాశమూ లేదు.)*

"మనం రాకుండా ఉంటే బాగుండేది" అన్నదామె. చేతిలో గ్లాసు పట్టుకుని తన పెదాల్ని కొరుకుతూ అతడివేపు చూస్తున్నది. "పారిస్‌లో ఏనాడూ నీవిలా అయ్యేవాడివి కాదు. పారిస్ అంటే ఎంతో ఇష్టమని అనేవాడివి. మనం పారిస్‌కో లేకుంటే ఇంకెక్కడికో వెళ్లినా బాగుండేది. నీవెక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చేదాన్ని. హంగరీకి పోయి వేటాడి హాయిగా కాలం గడిపి ఉండేవాళ్లం"

"నీ వెధవడబ్బు" అన్నాడతడు.

"అది సరైన మాట కాదు!" అన్నదామె. "ఆ డబ్బు నాదెంతో నీదీ అంతే! నాకున్నవన్నీ విడిచిపెట్టి నీవెక్కడికి రమ్మంటే అక్కడకు వచ్చాను. నీకేం కావాలంటే అది చేసాను. కాని మనమిక్కడకు రాకుండా ఉంటే బాగుండేది"

"నీవన్నావు, నీకీ దేశమూ ఇష్టమేనని"

"మనం సుఖంగా ఉన్నపుడు ఆ మాట అన్నాను. ఇప్పుడు ద్వేషిస్తున్నాను. ఎందుకు నీకు కాలికి ఆ గాయం కావాలో నాకర్థం కాదు. మనమేం పాపం చేసాము నీకీ స్థితి రావడానికి?"

"బహుశా, నేను గాయం మీద అయొడిన్ వేయడం మరచిపోయుంటాను. ఎందుకంటే నా వంటికి చీము పట్టదన్న నమ్మకంతో! ఒకసారి పుండు అయిన తర్వాత సరైన మందులు, ఏంటిసెప్టిక్‌లు వాడకపోవడం కావచ్చును. అందుకని గోకడం పుండయ్యింది, పుండు గాంగ్రీన్‌నై కాలు కుళ్లిపోయింది. అంతేగా" అన్నాడతడు ఆమెవేపు చూస్తూ.

"నేనన్నది అది కాదు"–

"నీవు నీ వాళ్లని వదిలి వచ్చి ఉండాల్సింది కాదు. ఆ పాత వెస్ట్‌బరీ సరటోగా లోనే ఉండి ఉండాల్సింది. పామ్‌బీచ్‌లో"–

"నేను నిన్ను ప్రేమించాను. నీవనేది సరైనది కాదు. ఇప్పుడు ప్రేమిస్తున్నాను. ఎప్పుడూ ప్రేమిస్తాను. నీవు నన్ను ప్రేమించడం లేదా?"

"నో" అన్నాడతడు– "నిన్నెప్పుడూ ప్రేమించలేదు"

"ఏమంటున్నావు, హారీ! ఏమంటున్నావో తెలిసే మాట్లాడ్తున్నావా?"

"లేదు. తెలిసేందుకు నాకు బుర్రుంటేగా!"

"తాగవద్దు. డార్లింగ్ తాగవద్దు. మనం శాయశక్తులా ప్రయత్నిద్దాం"

"నీవాపని చేయి" అతడు నెమ్మదిగా అన్నాడు– "నేను అలసిపోయాను"

(అతడికిప్పుడు అంతరంగాన కరగాచ్ స్టేషన్ కనిపించింది. అక్కడతడు తన యధావిధి బాక్‌పాక్‌తో, తలపై సింప్లాన్– ఆఫెంట్ హెడ్‌లైటు కాంతి కత్తిలా చీకటిని కోస్తుండగా థ్రేస్‌ను వదలి వెళ్తున్నాడు. తాను వ్రాయాల్సింది అదే. ఉదయం బ్రెక్‌ఫాస్ట్ అయ్యాక బల్గాఫా పర్వతాలపై కప్పిన మంచును కిటికీలోంచి చూస్తున్నాడు. నాన్సేన్ సెక్రటరీ తనవృద్ధ యజమానిని అది 'మంచు' కదా అంటే అతడు కాదంటున్నాడు. మంచు రావడానికి ఇంకొన్ని రోజులు పడ్తుంది. సెక్రటరీ తన మిత్రులనూ అదే మాట అడిగింది. వాళ్లూ అది మంచు కాదన్నారు. అది మంచు అని నిర్ధారణ అయ్యేందుకు అతడు వాళ్లనక్కడకు పంపాడు. వాళ్లు ఆ మంచును తొక్కుకుంటూ వెళ్లి వెళ్లి, ఆ శీతాకాలంలో చనిపోయారు. యుద్ధం మంచులానే ఉంటుంది.

*ఆ క్రిస్టమస్ కాలమంతా గాలెర్టావ్‌లో మంచు కురుస్తూనే ఉన్నది. వాళ్లు ఆ ఏడాది ఓ వుడ్ కట్టర్ ఇంట్లో నెగడు పక్కన ముచ్చట్లాడుకుంటున్నపుడు సైన్యాన్ని విడిచి వచ్చిన ఒకతడి కాళ్ల నుంచి రక్తం కారి మంచు ఎర్రబడింది. అతడిని పోలీసులు వెంబడిస్తున్నారని అతడన్నాడు.*

*క్రిస్టమస్ రోజున 'ఘ్రంజ్'లో కళ్లు చెదరగొట్టిన మంచు, మాడ్ లెనెర్‌హాస్‌లో పౌడర్‌లా కురిసిన మెత్తటి మంచు ఇంకా గుర్తే.*

*వారం రోజులు మంచు దట్టంగా పట్టినప్పుడూ, అసలు మంచు ఒక్క తునకా లేనప్పుడూ వాళ్లు పేకాడేవారు. తను జీవితంలో పేకాడిన కాలమంతా కళ్లముందు కదలాడింది. ఇవన్నీ రాస్తాడు తన పుస్తకాలలో.*

*ఇది మాత్రం రాయడు– ఆ క్రిస్టమస్ రాత్రి బార్కర్ తన యుద్ధవిమానంలో వెళ్లి ఆస్ట్రియన్ ఆఫీసర్లు శలవులో వెళ్తున్న ట్రెయిన్‌పై బాంబులు కురిపించి, చెల్లాచెదరై పరిగెడ్తున్న వ్యక్తుల్ని మెషిన్‌గన్‌తో పిట్టల్ని కాల్చినట్లు కాల్చి చంపిన సంగతి. అతడు తిరిగి వచ్చి గొప్పలు చెప్పుకున్న విషయాన్ని.*

*ఆ సంవత్సరమంతా చంపడాలూ, చావడాలే! తాను చావలేదు.*

*ఆ తరువాత నాలుగేళ్లు– నాలుగు శీతాకాలాలు! మంచుకొండల మీద స్కైయింగ్; ఆటపాటలూ, (ద్రాక్షసారాయీ–)*

"మనం పారిస్‌లో ఎక్కడున్నాం?" అన్నాడతడు తన పక్కనే కాన్వాస్ కుర్చీలో కూర్చుని ఉన్న ఆమెతో– ఆఫ్రికాలో ఇప్పుడు–

"క్రిల్లాన్‌లో– నీకు తెలుసు"–

"ఎందుకు తెలవాలి నాకు?"

"ఎప్పుడూ మనం అక్కడే ఉంటాం కదా, అందుకని"–

"ప్రతీసారీ కాదు"

"అక్కడ, సెయింట్ జర్మెన్‌లో పెవిలియన్ 'హెన్రి–క్వాట్రి'లో – నీకా చోటు నచ్చుతుందనే వాడివి"

"ప్రేమ అనేది ఓ పేడకుప్ప. నేను కోడిపుంజులా దానిపైకెక్కి కూసాను"

"నీవు వెళ్లిపోవాలనుకుంటే, నీకు సంబంధించిన వాటినన్నిటినీ ధ్వంసం చేసి కాని వెళ్లదలుచుకోలేదా? ప్రతిదీ నీతో తీసుకుని వెళ్లదలుచుకున్నావా? నీ గుర్రాన్ని, నీ భార్యనూ! నీ గుర్రపు జీనును, ఆయుధాల్ని తగలెట్టాలంటావా?"

"అవును" అన్నాడతడు– "నీ వెధవ డబ్బే నా ఆయుధాలు, నా కత్తి, కవచం"

"కాదు"

"సరే! ఇక్కడితో ఆపేస్తా! నిన్ను బాధ పెట్టబోను!"

"ఇప్పటికే కాస్త ఆలస్యమయ్యింది"

"అయితే, ఇంకాస్త బాధించనీ. అదే కాస్త సరదాగా ఉంది. నీతో ఏది ఇష్టపూర్వకంగా చెయ్యాలనుకునేవాడినో అదిప్పుడు చేయలేను"

"అది నిజం కాదు. నీకెన్నో చెయ్యాలని ఉండేది. నీకిష్టమైనవి నేను చేసేదాన్ని"–

"ఓహ్! ఆపుతావా నీ కోతల్ని"–

అతడు ఆమె వేపు చూసాడు. ఆమె ఏడుస్తున్నది.

"విను" అతడన్నాడు– "ఇదేమీ సరదా కాదు ఇలా చేయడం. ఎందుకు చేస్తున్నానో నాకు తెలీదు. నిన్ను నీవు బతికుంచుకోడానికి నిన్ను నీవు చంపుకోవడం లాంటిది. సంభాషణ మొదలెట్టినప్పుడు నేను మామూలుగానే ఉన్నాను. ముందుగా మాట్లాడడమే నాకిష్టంలేదు, ఒకసారి మొదలెట్టాక నాలో ఏదో ఉన్మత్తత ప్రవేశించి, నీతో ఎంత క్రూరంగా ప్రవర్తించాలో అంత క్రూరంగా ప్రవర్తిస్తున్నాను. డార్లింగ్! దానిని పట్టించుకోకు. నిన్ను ప్రేమిస్తున్నాను. నీవంటే నాకిష్టం! నీకు తెలుసు నిన్ను నేను ప్రేమిస్తున్నానని. నిన్ను ప్రేమించినట్లు నా జీవితంలో ఇంకెవరినీ ప్రేమించలేదు"

అతడు తన అతి సుందరమైన అబద్ధాన్ని చాలా సొగసుగా చెప్పాడు.

"నాతో మంచిగా ఉన్నావు"

"డర్టీబిచ్!" అరిచాడతడు. "డర్టీబిచ్! డర్టీ రిచ్ బిచ్! ఇది కవిత్వం. ఇప్పుడు నాలో కవిత్వం ప్రవహిస్తున్నది. కుళ్లు కవిత్వం; కశ్మల కవిత్వం"

"హరీ! దయచేసి ఆపు! ఎందుకు ఇప్పుడు దయ్యంలా ప్రవర్తిస్తున్నావు"

"నేనేమీ వదిలి వెళ్లదలచుకోలేదు" అన్నాడతడు "నేను దేనినీ నా వెనక విడిచి వెళ్లను"

* * * *

సాయంకాలం అయ్యింది. అతడు నిద్రలోకి జారుకున్నాడు. సూర్యుడు కొండల వెనక్కు వెళ్లిపోగా మైదానం అంతా నీడలు కమ్ముకున్నాయి. చిన్నచిన్న జంతువులు వాళ్ల కాంపు దగ్గర తచ్చాట్లాడుతున్నాయి. అవి తలల్ని వంచుతూ తోకల్ని ఊపుతూ, మేతమేస్తూ అటుయిటు పోతుంటే అతడు వాటిని తదేకంగా చూస్తున్నాడు.

పక్షులు నేలమీద నుంచి ఎగిరి పెద్ద చెట్టుపై ఉన్న తమతమ గూళ్లకు ఎగిరిపోయాయి. చెట్టునిండా పక్షులే. అతడి వ్యక్తిగత సేవకుడు మంచం పక్క కూర్చున్నాడు.

"మేడమ్ వేటకు వెళ్లింది" చెప్పాడతడు. "బ్వానాకేమన్నా కావాలా?"

"ఏమీ వద్దు"

*ఆమె అతడి కోసం కాస్త మంచి మాంసం తెద్దామని అడవిలోనికి వెళ్లింది. ఆమెకు తెలుసు అతడికి వేట అంటే ఎంత ఇష్టమో. అతడి నిద్రను భంగపరచకుండా ఉండేందుకు ఆమె దూరంగా వేటకు వెళ్లిందని అతడికి అర్థమయ్యింది. తనకు తెలిసిందేదైనా సరే, చదివిందైనా, విన్నదైనా, నేర్చుకున్నదైనా బాగా ఆలోచించి చేస్తుంది.*

*ఆమె తప్పు ఏమీలేదు. అతడామె దగ్గరకు వెళ్లేసరికే అతడి పని అయిపోయింది. అయినా తనంటున్న మాటలు మనఃస్ఫూర్తిగా అన్నవి కాదని, అవి అలవాటు ప్రకారం వచ్చినవే, కేవలం కొద్దిపాటి ఊరట కోసం అంటున్నవేనని ఆడవాళ్లెలా గ్రహించగలుగుతారు? అతడు అనే మాటలను పట్టించుకోనక్కరలేదని వాళ్లనుకున్నాక అతడు చెప్పిన నిజాలకన్నా అబద్ధాలు ఎక్కువగా విజయవంత మయ్యాయి.*

*(అతడు పూర్తిగా అబద్ధాల కోరు అని అనలేం. ఒక జీవితకాలాన్ని గడిపి అంతా అయిపోయిందనుకున్నాక అతడు వేరే వ్యక్తులతో, ఇంకా ఎక్కువ ధనం మధ్య, మంచి సౌఖ్యాలలో మరల మరల జీవించాడు.*

*అవన్నీ అద్భుతాలని అతడి భావన. "నీ శరీర అంతర్భాగం బలంగా ఉంటే, నీవు ముక్కలు కాకుండా రక్షింపబడతావు". నీవు ఇదివరకు చాలాగొప్ప పనులు చేసావు ఇప్పుడు వాటిపై పెద్ద ఆసక్తి లేదు అందుకని ఇప్పుడు వాటిని చేయలేదు, నీవనుకోలేదా నీలోనే, ఈ అద్భుత ధనవంతుల గురించి వ్రాద్దామని, వాళ్లలో ఒకడివి కావు కాబట్టి, ఓ గూఢచారిలా వాళ్ల రాజ్యంలో చేరి వివరాలు రాబట్టి, ఆ రాజ్యాన్ని వదిలిపోయి వాళ్ల గురించి వ్రాయవచ్చు. ఇంతలో తను వ్రాయబోతున్నదేమిటో పసిగట్టి ఎవరన్నా అటువంటిదే రాస్తే తాను రాయకుండా బయటపడవచ్చు. కాని అతడలా చేయలేదు, ఎందుకంటే సౌఖ్యాల గురించి (తనకిష్టంలేనివే అవి) ఏరోజు కారోజు రాయకపోతే తన ప్రావీణ్యత నేర్పు, పనిచేసే ఆసక్తి తగ్గి, అసలు రాయడమే మానేస్తాడు. అతడు పని చేయనప్పుడే అతడి చుట్టూరా ఉన్నవాళ్లు సుఖంగా ఉండేవారు. ఆ సంగతి అతడికి తెలుసు. అతడు తన జీవితంలో ఎక్కువభాగం చాలా హాయిగా గడిపింది ఆఫ్రికాలోనే. అందుకే జీవితాన్ని పునః*

ప్రారంభించడం కోసం అతడిక్కడికి వచ్చాడు. ఈ సఫారీలో సౌఖ్యాలు తక్కువ, అలా అని పెద్దగా శ్రమ పడాల్సిందీ లేదు. కొంచెం శ్రమ అదీ ఉంటే తాను రాసే దాంట్లో వాస్తవికత, నిజాయితీ ఉంటాయి. అంచేత మరల ట్రైనింగ్ మొదలు పెట్టవచ్చు. పర్వతాలలో శిక్షణ పొందే యుద్ధవీరుడిలా ఈ అభ్యాసం ఆత్మకు అంటిన కొవ్వును కరిగించి వేస్తుంది.

ఆమెకు అది నచ్చింది. తనకిష్టం అని అన్నదామె. ఏదైనా ఉత్తేజం కలిగించే పని చేయడం ఆమెకిష్టం. కొత్తకొత్త ప్రదేశాలు, కొత్త కొత్త మనుషులు, కొత్తకొత్త అనుభవాలు మనసుకు ఆనందపరిచేవి ఆమెకిష్టం. ఆమె కలిసింతర్వాత తనలో మరలా పనిచేసేందుకు నూతన శక్తి వచ్చినట్లు అనుకున్నాడు. కాని అది భ్రమ. దాని ముగింపు ఇదిగో ఇలా ఉండబోతున్నది. నడుం విరిగిన పాము తన తోకను తాను కాటేసినట్లు, తాను ప్రవర్తించకూడదు. దీంట్లో ఆమె తప్పేమీ లేదు. ఆమె కాకపోతే తన జీవితంలో మరొకరు ఉండేవారు. ఇది తన ఆట. తన వేట. అబద్ధంతో బతికేప్పుడు దానితోనే చావడానికి సిద్ధంగా ఉండాలి. కొండకు అటువేపు అతడికి తుపాకి శబ్దం వినిపించింది.

ఈ డబ్బున్న కుక్క, రిచ్ బిచ్, దయగల సంరక్షకురాలు, తన నేర్పును ధ్వంసం చేయగల సమర్థురాలు, మంచి వేటగాళ్లకేమీ తీసిపోదు. నాన్‌సెన్స్! ఆమెకాదు, తానే కదా టాలెంట్‌ను నాశనం చేసుకున్నది. తనను ఇంత ఆదరంగా చూసిందనా తను ఆమెను నిందిస్తున్నది? తన నైపుణ్యాన్ని తాను వినియోగించుకోలేదు, తను నమ్మిన వాటిని, సిద్ధాంతాలను పాతిపెట్టి, తెగ తాగి తన పరిశీలనాత్మకతా శక్తిని మందకొడిగా చేసుకుని, బద్ధకంగా, తినడం, నిద్రపోవడం కార్యక్రమాలుగా, ఎదుటివాళ్లను లోకువగా చూస్తూ, గర్వంగా పూర్వ నిర్ణయాలు, విజయాలు కళ్లకు పొరలుగా కమ్మగా, తనకు కావల్సిన వాటిని మాయోపాయాలతో బలంతో పొంది చివరకు సాధించిందేమిటి? ఒక పుస్తకాల దొంతర. ఎ క్యాటలాగ్ ఆఫ్ బుక్స్. ఇంతకీ తన టాలెంట్, నేర్పు ఏమిటిట? అది గొప్పదే కాదనేది లేదు, కాని దానితో వ్యాపారం చేసాడతను. ఇదివరకు తానేం చేసాడు అన్నది కాదు, తను ఇంకా ఏం చేయగలడు అన్నదానితో. తన జీవితాన్ని తనకు ప్రావీణ్యమున్న కలంతోనో, పెన్సిల్ తోనో కాక వేరే విషయంతో జీవించడానికి ప్రయత్నించాడు. అది విడ్డూరమే కాదా. తాను ఇంకో స్త్రీతో ప్రేమలో పడడం, ఆ స్త్రీకి ఇదివరకటి ఆమెకన్నా బాగా డబ్బుండేట్లు చూసుకోవడం ఇదీ ఒరకమైన టాలెంటే కదా! ప్రేమ లేనప్పుడు ప్రేమే జీవితమన్నట్లు అబద్ధమాడినాడు. అందరికన్నా భాగ్యవంతురాలు, ఎంతో డబ్బున్న ఈమెను ప్రేమిస్తున్నట్లు నటించినాడు. భర్త పిల్లలుండి, ప్రేమికులుండి, వాళ్లతో

*సంతృప్తిలేక, రచయితగా, మనిషిగా, మగాడిగా, సహచరుడిగా, గర్వించదగిన సంపదగా తనను ప్రేమించిన ఆమెను ప్రేమించక, ప్రేమిస్తున్నట్లు ప్రతిక్షణం అబద్ధమాడడం, ఆమె ఇచ్చిన ధనసంపదలకన్నా ఎక్కువేదో ముట్టచెబుతున్నట్లు ప్రవర్తించడం– అంతా నటన... నిజంగా ప్రేమించినవాడికన్నా ఎక్కువగా...*

*మనం ఏం చేస్తామో దానికి తగ్గట్టు మనముండాలి– అనుకున్నాడతడు. కాని మన నేర్పును బట్టి మన జీవితం సాగుతుంది. జీవశక్తిని ఏదో ఒకరూపంలో అమ్ముతూ ఇప్పటివరకూ కాలం గడిపాడు తను. ప్రేమ, ఆప్యాయతలు లేకపోతే డబ్బుకు తగిన విలువ ఇవ్వగలుగుతాడు మనిషి– అనుకున్నాడతడు. తననుకున్నది ఇక వ్రాయలేడు. అది వ్రాయగలిగిన అంశమైనా ఇక రాయడు. అంతే!)*

ఆమె వస్తూండడం చూసాడతడు. జోధ్‌పూర్ దుస్తులు ధరించి తుపాకి పట్టుకుని నడుస్తున్నదామె. ఇద్దరు కుర్రాళ్లు ఆమె వెనక అడవి గొర్రెను మోసుకుని వస్తున్నారు. ఇంకా ఆమె సొగసుగానే ఉన్నది, చక్కటి శరీరం, మొత్తంమీద లావణ్యవతే. మరీ గొప్ప అందగత్తె కాకపోయినా శృంగారంలో దిట్ట. ఆమె ముఖంలో కొట్టవచ్చినట్లుండే ఏదో కళ– అతడికిష్టమైనది. బాగా చదువుకున్నది, స్వారీ అన్నా వేట అన్నా యిష్టం. విపరీతంగా తాగుతుంది. ఆమె ఇంకా వయసులో ఉండగానే భర్త చనిపోయాడు. కొన్నాళ్లపాటు తన పిల్లల్ని పెంచడమే లోకంగా కాలం గడిపింది. ఆమె అవసరం వాళ్లకవసరం లేని వయస్సు వాళ్లకొచ్చాక, ఆమె ఉంటే వాళ్లకు ఇబ్బందిగా ఉందని ఆమె గ్రహించాక ఆమె తన సమయాన్ని గుర్రపుశాలలో, పుస్తకాలలో, బాటిల్స్ మధ్య గడపడం మొదలెట్టింది. డిన్నర్‌కు ముందు పుస్తకాలు చదువుతూ, స్కాచ్ విస్కీ, సోడా చప్పరిస్తూ చప్పరిస్తూ, డిన్నర్‌లో ఇంకో బాటిల్ వైన్ ఖాళీ చేసేసరికి, నిద్రాదేవత ఆమె కళ్లపైనే ఉండేది.

*ఇదంతా ఆమె ప్రేమికుల్ని ఎన్నిక చేసుకోకముందు. ఒకసారి ప్రేమలో పడినాక ప్రేమికులు ఉన్నాక నిద్రపోడానికి స్కాచ్, వైను మరీ అంత ఎక్కువ మోతాదులో అక్కర్లేదు కదా! కాని వాళ్లతో ఆమెకు విసుగెత్తింది. వివాహమాడిన వ్యక్తితో ఆమెకు ఎప్పుడూ బోరుకొట్టలేదు, కాని, ఈ ప్రేమికులు చిరాకు పుట్టించేవారు.*

*దురదృష్టవశాత్తు, ఆమె ఇద్దరిపిల్లల్లో ఒకామె విమాన ప్రమాదంలో మరణించింది. ఆ తరువాత ఆమె ప్రేమికులను దూరంగా పెట్టింది. మధువు ఇచ్చే మత్తు ఆమెకు సరిపోయేది కాదు. ఆమెకు మరో జీవితం ఉత్సాహంతో తొణికిసలాడేది కావాల్సి వచ్చింది. అకస్మాత్తుగా ఆమెకు ఒంటరితనం అంటే భయం పుట్టుకు వచ్చింది. ఆమె కోరుకున్నదల్లా తనను గౌరవించే సహచరుడు కావాలని.*

అది మామూలుగా జరిగింది. అతడు వ్రాసేది ఆమె ఇష్టపడి చదివేది. అతడి జీవనశైలిని చూసి ఈర్ష్యపడేది. తనకు నచ్చినది చేసే వ్యక్తిలా కనిపించాడతడు. ఒక పద్ధతి ప్రకారం ఆమె అతడిని తనకు సహచరుడిగా చేసుకున్నది, ఆ క్రమంలోనే ఆమె అతడిని ప్రేమించి తన జీవిత పుస్తకంలో నూతన అధ్యాయాన్ని తెరచింది. అతడు తనకు మిగిలిన జీవితకాలాన్ని ఆమెకు పెట్టుబడిగా పెట్టాడు.

*తన జీవిత చరమఘట్టాన్ని తన రక్షణ కోసం, సుఖసౌఖ్యాల కోసం తాకట్టు పెట్టాడు. అంతేనా? ఇంకా దేనికి పెట్టాడో అతడికి తెలియదు. అతడేది అడిగితే అది ఆమె అతడికి కొని యిచ్చింది. ఆమె ఎంత మంచి హృదయంగలదో అతడికి తెలుసు. అంతేకాక ఆమె దగ్గర చాలా డబ్బున్నది. సౌమ్యంగా ఉంటుంది. తనను మెచ్చుకుంటుంది. ఎటువంటి గొడవా చెయ్యదు. అందువల్ల ఆమె ఎప్పుడు పిలిచినా పక్కకు చేరడానికి అతడు సిద్ధంగానే ఉండేవాడు. ఆమె నిర్మించిన ఈ జీవితం కూడా ముగింపుకు వచ్చేట్లున్నదెందుకంటే రెండు వారాల క్రితం మోకాలి మీద ముల్లు గీచుకున్నప్పుడు గాయాన్ని తాను అయొడిన్‌తో శుభ్రం చేయకపోవడం. అదీ నీటిదున్నలు (Water bucks) గుంపు, వాటి మోరలు పైకెత్తి, ముక్కు రంధ్రాలతో గాలిని శోధిస్తున్నపుడు, వాటి చెవులు వెడల్పుగా చేసి తొలి శబ్దాల్ని వినడానికి, అలికిడైతే చాలు దగ్గరున్న పొదల్లోకి పారిపోవడానికి సిద్ధంగా ఉన్నపుడు వాటిని ఫోటో తీయాలని ప్రయత్నిస్తుంటే గీచుకుంది ఆ దరిద్రపు ముల్లు. ఫోటో తీయక మునుపే అవీ అదృశ్యమయ్యాయి. బాధ మిగిలింది.*

ఆమె దగ్గరకు వచ్చింది. తల ఆమెవేపు తిప్పి "హలో" అన్నాడు.

"అడవి గొర్రె దొరికింది" అందామె– "దాని మాంసం, బంగాళ దుంపలతో వేడివేడి పులుసు తయారు చేయిస్తాను, నీకోసం! ఎలా ఉన్నావు?"

"ఫరవాలేదు"

"సంతోషంగా ఉంది. నేననుకున్నా నీకు నెమ్మదిస్తుందని. నేను వెళ్లేప్పుడు నీవు నిద్రపోతున్నావు"–

"మంచి నిద్ర పట్టింది. చాలాదూరం పోయినట్లున్నావు"

"ఫెద్ద దూరమేమీ కాదు. ఆ గుట్ట వెనకకే. మంచి షాట్"–

"నాకు తెలుసు నీ నేర్పు!"

"నాకు ఇష్టం. ఆఫ్రికా అంటే మరీనూ. నీకు మంచిగా ఉండి ఉంటే బహుశా నేనింకా ఆనందించి ఉండేదాన్ని. నీతో కలిసి ఇలా కాలం గడపడం నా జీవితంలో ఓ మధురఘట్టం"

“నాకు కూడా!”

“డార్లింగ్! నీకు ఆరోగ్యం కుదుటపడడం నాకెంతో సంతోషంగా ఉంది. నీవు అదోరకంగా మాట్లాడడం నేను భరించలేకపోయాను. మరింకెప్పుడూ అలా మాట్లాడవుగా. ప్రామిస్ చేయి!”

“లేదు” అన్నాడతడు– “ఎందుకంటే నేనేం మాట్లాడానో నాకు గుర్తులేదు”.

“నన్ను కలత పెట్టకు. మధ్య వయస్సులో ఉన్న యువతిని, నిన్ను గాఢంగా ప్రేమిస్తున్న దానిని, నీవేం కోరితే అది చేస్తున్న దానిని నను బాధపెట్టవద్దు. ఇప్పటికే రెండు మూడుసార్లు దెబ్బతిని ఉన్నాను. నీవు కూడా నన్ను దెబ్బతీయవుగా?” అన్నదామె.

“నిన్ను మంచం మీద దెబ్బతీయాలని ఉన్నది నాకు” అన్నాడతడు.

“అవును. అదీ ఒక పద్ధతే. అలాగే మనం సృష్టించబడ్డాం. విమానం రేపు వస్తుంది”.

“నీకెలా తెలుసు?”

“నాకు తెలుసు. అది వస్తుంది. కుర్రాళ్లు విమానం దిగడానికి అనువైన ఏర్పాట్లు చేసారు. ఈరోజు నేను వెళ్లి చూసాను. విమానం వస్తుంది. పట్టణంలో వాళ్లు నీ కాలికి తగిన చికిత్స చేస్తారు. ఆ తరువాత నీవన్న విధ్వంసకాండ చేసుకుందాం. కాని నీవన్నమాటలు వద్దు”

“సూర్యాస్తమయమవుతోంది. డ్రింక్స్ తీసుకుందామా?”

“నీవు తీసుకోకతప్పదా?”–

“నేను తీసుకుంటాను”

“సరే! ఇద్దరం తీసుకుందాం! మోలో! విస్కీ–సోడా” అన్నదామె.

“మస్కిటో బూట్లు వేసుకో” చెప్పాడతడు.

“స్నానం చేసాక...”

వాళ్లు తాగుతుండగా చీకటి పడింది. ఆ మసక చీకటిలో ‘హైనా’ ఒకటి అటుగా పోతూ వాళ్ల కంటపడింది.

“ప్రతిరాత్రి ఆ క్రూరమృగం అటేపోతున్నది రెండు వారాలుగా” అన్నాడతడు.

"రాత్రిపూట అరిచేది ఆ దరిద్రపు మృగమే" అన్నదామె.

ఒక పక్కనే పడుకోవడం వలన వచ్చే అసౌఖ్యమే కాని నెప్పిలేదు. కుర్రాళ్లు నెగడు వెలిగించారు. ఆ మంటల నీడలు గుడారంపై గెంతులు వేస్తున్నాయి. జీవితపు లొంగుబాటుకు అంగీకార పత్రంపై సంతకం చేయడం అయిపోయింది.

ఆమె తనతో ఎంతో హుందాగా వ్యవహరించింది తానే మూర్ఖంగా అన్యాయంగా ప్రవర్తించాడా మధ్యాహ్నం. ఆమె మంచిది. ఎంతో మంచిది. అప్పుడే అతడికి గుర్తుకు వచ్చింది తాను మరణించబోతున్నాడని.

అది ఎంత దూకుడుగా వచ్చిందంటే, ఉధృతమైన గాలిలా, వరదనీటిలా కాదు. ఏదో దుర్గంధపూరిత శూన్యం, ఆ శూన్యం అంచు వద్ద పచార్లు చేస్తున్న హైనా!

"ఏమిటి హారీ!" అడిగిందామె.

"ఏమీలేదు! నీవక్కడ నుంచీ లేచి ఇటువేపు కూర్చో!"

"మోలో డ్రస్సింగ్ మార్చాడా?"

"మార్చాడు. బోరిక్ ఏసిడ్ పౌడర్ చల్లాను"

"ఎలా వుంది?"

"ఊగుతున్నట్లు"

"స్నానం చేసి ఇప్పుడే వస్తాను" అన్నదామె– "నీతో కలిసి భోంచేసినాక, మంచాన్ని లోపల వేయిస్తాను"

"మొత్తానికి ఘర్షణ నివారించుకోగలిగాము" అనుకున్నాడతడు. ఇంతకు ముందు అతడితో ఉన్న స్త్రీలతో ఎంత ఘర్షణ పడేవాడంటే, వాళ్ల మధ్య ఏ కొద్దిపాటి ప్రేమైనా ఉంటే అది కాస్త ఆవిరైపోయేది. అతడు ఎంత ప్రేమించేవాడో, అంత కోరుకునేవాడు, అంత ప్రేమనూ హరించేవాడు– పోట్లాడి!

(పారిస్‌లో తనతో పోట్లాడి వెళ్లిపోయిన మొదటి భార్య గుర్తుకు వచ్చింది. ఆమె పోయినాక ఒంటరితనం చంపుకోడానికి అతడు తిరగని గల్లీలేదు. ప్రతిరాత్రీ వ్యభిచరించడమే. ఆ కాస్త కాలక్షేపం అయినాక మరల ఒంటరితనమే. ఆ మాటే రాసాడతడు ఉత్తరంలో– "నీవు లేని ఒంటరితనం ఎంత భయంకరంగా ఉందంటే దాన్ని పోగొట్టుకోడానికి బయటకు వెళ్లినపుడు 'రీజెన్స్' బొవెలెవార్డ్ దగ్గర నిన్ను పోలిన అమ్మాయిని చూడగానే నాలో ఏదో నిస్సత్తువ, జబ్బుపడ్డ భావన. ఎవరితో

పడుకున్నా నీగురించే ఆలోచన, నిన్ను మరింతగా పోగొట్టుకున్నట్టు. నీవు నన్ను వదిలి వెళ్లినందుకు బాధలేదు కాని నిన్ను ప్రేమించడం అన్న రోగానికి మందులేదు కదా!" –అని వ్రాసి న్యూయార్క్‌లో ఉన్న ఆమెకు పోస్ట్ చేసినపుడు అతడు తాగిలేడు. కాన్‌స్టాంట్ నోపుల్‌లో ఓ క్లబ్‌లో కూర్చుని వ్రాసాడా లేఖ. జవాబు పారిస్ ఆఫీస్‌కు వ్రాయమని అడ్రస్ ఇచ్చాడు. ఉత్తరం పోస్ట్ చేసాక మరింత ఒంటరిగా అనిపించి 'మాక్జిమ్'కు వెళ్లి ఓ యువతిని వెంటబెట్టుకుని సప్పర్‌కు తీసుకుపోయాడు. ఆ తర్వాత డాన్స్‌బార్‌కు వెళ్లి డాన్స్ చేయడం రాని ఆమెను వదిలి మంచి హాట్‌గా ఉన్న ఆర్మేనియన్ వేశ్యతో డాన్స్ చేస్తుంటే ఆమె వేడిపొట్ట తగిలి ఇతడికి చర్మం కాలినట్లు అనిపించింది. ఆమెకోసం ఓ బ్రిటిష్ గన్నర్‌తో తగాదాపడి పబ్ బయట భీభత్స యుద్ధం చేసి పారిపోయి టాక్సీలో బొస్ఫొరస్ పక్కనున్న రిమ్మిలి హిస్సాలో గది తీసుకుని శృంగారంలో పండిపోయినా, మృదువైన, గులాబిరెక్కల పెదాలు, బుగ్గలున్న; చక్కని నడుము, చక్రస్తనాలు, తొడల కింద దిండు అక్కర్లేనట్లున్న ఆ లావణ్యవతితో ఆ చల్లనిరాత్రి వెచ్చగా గడిపి, ఆమె లేవక మునుపే అక్కడ్నుంచి బయటపడి తెల్లారేసరికి 'పెరా ప్యాలెస్' వద్ద ఒక స్లీవ్‌లేని కోటుతో, ఎడమకన్ను చుట్టూ నల్లటి వలయంతో నడుస్తూ ఉన్నాడు.

అదేరాత్రి అనటోలియా చేరుకున్నాడు, ఓపియం కోసం పెంచబడిన పాపీ పొలాల్లో స్వారీ చేస్తూ. ఎటు వెళ్లాలో తెలీదు, ఎంత దూరం వెళ్లారో తెలీదు. వాళ్ల మీద గుండ్లవర్షం కురుస్తుంటే బ్రిటిష్ అబ్జర్వర్ చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్చాడు.

ఆరోజున చూసాడతడు చచ్చిన మనుషులు డాన్స్ చేసేప్పుడు వేసుకునే దుస్తులు ధరించి బోర్లాపడి ఉండడం. టర్క్‌లు పెద్దపెద్ద ముద్దలుగా, సమూహాలుగా విరుచుకుపడ్తుంటే సైనికులు పారిపోవడం, ఆఫీసర్లు అటుయిటూ కాలుస్తూ అందరు అన్నిదిక్కులకు చెల్లాచెదురవడం, బ్రిటిష్ అబ్జర్వర్ 'ఊపిరితిత్తులు అలిసేంత వరకు పరిగెత్తి, పరిగెత్తి, నోట్లో పెన్నీల విషపు వాసన వస్తుంటే, బండరాళ్లమధ్య దాక్కుని వలవలా దుఃఖించడం – టర్క్‌లు ఇంకా వస్తూనే ఉన్నారు ఎడతెరపి లేకుండా. ఇంతకన్నా దారుణ దృశ్యాలుండవనుకున్నప్పుడే ఇంకా దారుణ దృశ్యాలు చూసాడతడు. చావుతప్పి కన్ను లొట్టబోయి పారిస్ చేరుకున్నాక ఎవరితోనూ ఈ విషయం మాట్లాడలేదు. కొన్నిరోజులు గడిచాయి. అమెరికన్ కవి అతడి రొమనియన్ స్నేహితుడితో దాదా విప్లవం గురించి ముచ్చట్లు– మళ్లీ కొత్త జీవితం, కొత్తప్రేమ, ఘర్షణలు లేవు, పిచ్చి ఆలోచనలు లేవు. ఇంటికి వచ్చి సంతోషంగా భార్యతో ఉన్నాననుకున్నరోజే ఆఫీస్ నుండి ఇంటికి ఓ ఉత్తరం వచ్చింది. అంతకుముందు భార్యకు తాను వ్రాసిన ఉత్తరానికి జవాబు ఈమె అడిగింది– "డియర్? ఎక్కడ

నుంచి ఆ ఉత్తరం" అని అడగనే అడిగింది తను ఆ ఉత్తరాన్ని ఆమె కంటపడకుండా దాచేస్తుంటే. అలా ఆ కథలో ప్రారంభంలోనే ముగింపు సన్నివేశం మొదలైంది.

అతడికి ఆ ఘర్షణలూ గుర్తున్నాయి. మంచి సంగతులూ గుర్తున్నాయి. అవన్నీ అతడు మంచి మూడ్‌లో ఉన్నప్పుడు ఎందుకు మొదలయ్యేవో అతడికి ఇప్పటికీ అర్థం కాదు. వాళ్ల గురించి అతడెప్పుడూ వ్రాసింది లేదు. వాళ్లను బాధపెట్టాలన్న ఉద్దేశం అతడికి లేదు. ఆ గొడవల్ని మినహాయించి కూడా అతడు వ్రాయగలడు. వాళ్లందరి గురించీ, డబ్బున్న విలాసినుల జీవితం గురించీ అధ్యయనం చేసి వ్రాద్దామనుకున్నాడు. బోలెడంత సమాచారం ఉంది వ్రాయడానికి. ప్రపంచం మారటం చూసాడతడు. సంఘటనల్నే కాదు, వ్యక్తుల్నీ దగ్గరగా చూసాడు. వాళ్లలో మార్పులు చూసాడు. కాలాన్ని బట్టి వ్యక్తుల ప్రవర్తనలో మార్పులూ గమనించాడు. తానూ ఆ మార్పులో భాగంగా ఉన్నాడు కనక దాని గురించి వ్రాద్దామనుకున్నాడు. కాని దురదృష్టం, ఇక వ్రాయలేడు.)

"ఎలా ఉంది" స్నానం చేసి ఫ్రెష్‌గా బయటకు వచ్చిందామె.

"ఆల్‌రైట్!"

"ఏమన్నా తినకూడదూ!" ఆమె వెనక 'మోలో', ఇంకో కుర్రాడు టేబుల్, డిషెస్‌తో సిద్ధంగా ఉన్నారు.

"నేను రాద్దామనుకుంటున్నాను!"

"కాస్త సూప్ తీసుకో. శక్తి వస్తుంది!"

"నేను ఈ రాత్రి చనిపోతున్నాను. నాకు శక్తి అవసరంలేదు"

"అలా మాట్లాడకు, హారీ!" అన్నదామె.

"ఎందుకు నీవు అర్థం చేసుకోవు. నా కాలు తొడవరకు కుళ్లి వాసన గొడ్తోంది. ఇంకా సూపు తాగనా? మోలో! విస్కీసోడా తీసుకురా!"

"ప్లీజ్! టేక్ ద బ్రాత్" అన్నదామె సున్నితంగా, మెల్లగా.

"ఆల్‌రైట్"–

బ్రాత్ చాలా వేడిగా ఉంది. కాస్త చల్లారిన తరువాత అతడు మొత్తం ఒక్క గుక్కలో తాగాడు.

"నీవు మంచిదానివి. నా గురించి చింతించకు"

ఆమె అతడివంక తన చిరపరిచితమైన వదనంతో, చూసింది అందరిలా కాదు. ఆ గుండ్రటి స్తనాలు, అరటి బోదెల్లాంటి మృదువైన తోడలు, వీపును సున్నితంగా స్పృశించే కోమల హస్తాలు– అతడు ఆ చిరునవ్వును అలా చూస్తూనే ఉండిపోయాడు. అతడికి తెలుసు మృత్యువు సమీపిస్తున్నదని.

ఈసారి ఆ ఉధృతి లేదు. ఒక సన్నని వాయువీచిక అంతే! కొవ్వొత్తిని కదిలించేది, మంట నిలువుగా పైకి సాగినట్లు.

"వాళ్లు వలను నా మంచంపైన ఉండేట్లు చెట్టుకు కడ్తే సరిపోతుంది. ఈరోజు నేను గుడారంలోకి రాను. లోపలికి రావడం సరైనది కాదు. రాత్రి ప్రశాంతంగా ఉంది. వర్షం వచ్చే సూచనలు లేవు"–

ఇలాగే అన్నమాట చావడం అంటే. వినీ వినబడని మాటలు. నీకే వినబడని గుసగుసలు. చెడులో మంచి అన్నట్లు ఇక పోట్లాటలూ, గొడవలు, ఘర్షణలకు స్వస్తి. ఇది తన వాగ్దానం. వెనకటి సంఘటనలు పునరావృతం చేయదలుచుకోలేదు. ఇక తను ఏ ప్రేమనూ ధ్వంసం చేయబోడు. ఇదివరకు చేసి ఉండవచ్చు, ఇప్పుడు కాదు.

"డిక్టేషన్ తీసుకోగలవా?"–

"నేను నేర్చుకోలేదు" అన్నదామె.

"దట్సాల్‌రైట్"–

వ్యవధి లేదు. తాను రాయాలనుకున్నది మొత్తం ఒక్క పేరాలో ఇమడ్చగలడు ప్రయత్నిస్తే.

(అదుగో చెరువు. దానిపక్క చెక్కలతో చేసిన ఇల్లు. ఇంటివెనక పొలాలు, పొలాలకావల పోప్లర్ వృక్షాలు, అరణ్యం. ఒకసారి అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి, గోడలకమర్చిన దుప్పికొమ్ముల్లో ఉంచిన తుపాకులు అన్నీ కాలిపోయి, తుపాకి గుళ్లు పేలి వాటిలోని సీసం గడ్డకట్టింది. తాతయ్య ఆ తరువాత తుపాకులు కొనలేదు. వేటకు వెళ్లలేదు. ఇల్లు కొత్తగా కట్టారు కాని తుపాకులు కాలగా మిగిలిన బారెల్స్‌ను ఎవరూ ముట్టుకోలేదు.

యుద్ధం అయిన తర్వాత బ్లాక్‌ఫారెస్ట్‌లోని ఒక ఏట్లో ట్రౌట్ చేపలు పట్టడం ఇంకా గుర్తే. తరువాత వచ్చిన ఆర్థిక మాంద్యం దరిద్రదేవత విశృంఖలనృత్యం, తాగుబోతులు, క్రీడాకారులుగా దారిద్ర్యాన్ని చంపడానికి ప్రయత్నం చేసే యువతతో పారిస్ పొలిమేర వీధులు కిటకిటలాడుతుండేవి.)

"ఇంకాస్త బ్రాత్ తీసుకోరాదూ" అందామె.

"నో, థాంక్‌యూ! చాలా రుచిగా ఉంది"

"ఇంకొంచెం!"

"విస్కీ-సోడా కావాలి నాకు!"

"ఎవరన్నా కవిత్వం వ్రాసారా ఈ మాటల్ని చరణాలుగా?"-

"నీకు తెలుసు నేను డ్రింక్ లైక్ చేస్తానని"-

"మరి నాకేనా ఈ నిషేధం!"

ఆమె వెళ్లాక నాక్కావల్సినవన్నీ తెప్పించుకుంటాను. ఏదుంటే అది. అలసటగా ఉంది. కాసేపు నిద్రపోతాను" అనుకున్నాడతడు. అతడలాగే పడుకున్నాడు. నిద్రా రాలేదు, మృత్యువూ రాలేదు. బహుశా మృత్యువు మరోదారిలో వెళ్లాడేమో! నిశ్శబ్దంగా, సైకిల్ మీద పోయినట్లు జంటగా,

(పారిస్ గురించి ఎప్పుడూ వ్రాయలేదు. ముఖ్యం తను ఎరిగిన పారిస్. తనకి దొరకని విశ్రాంతి గురించి రాయవద్దా?

రాంచ్ మాటేమిటి? దాంట్లో పనిచేసి అనవసరంగా జైలుపాలైన కుర్రాడి కథ, అటువంటిది కనీసం ఇరవై కథలన్నా ఉన్నాయి కదా. ఎందుకు వ్రాయలేదు వాటిని?)

"ఎందుకు చెప్పు?" అడిగాడతడు.

"ఎందుకు ఏమిటి, డియర్" అన్నదామె.

"ఏమీలేదు!" అన్నాడతడు.

(అతడు తన జీవితంలోకి వచ్చాక ఆమె తాగడం తగ్గించింది. తను బతికితే ఆమె గురించి వ్రాయడు. అది అతడికి తెలుసు. అంతేకాదు ధనవంతుల గురించీ రాయదల్చుకోలేదు. డబ్బున్నవాళ్లు మందకొడిగా ఉంటారు. ఎప్పుడూ తాగడం లేదా జూదం ఆడడం అంతే. చేసిన పనే చేస్తుంటారు ప్రతిరోజూ. ధనవంతులు మామూలువాళ్లకన్నా ప్రత్యేకం అనుకుని, తరువాత అది తప్పని తెలిసాక అతడు హతాశుడయ్యాడు, తాను అనుకున్నది తప్పని తేలిన ఇతర విషయాల్లానే.

అది నీకర్థమయ్యింది కాబట్టి దానిని ఇష్టపడాల్సిన పనిలేదు. నన్నేదీ బాధించదు కనుక నేను దేన్నైనా జయిస్తాను. దేనినీ లెక్కచేయను- అనుకున్నాడతడు.

మృత్యువును కూడా లెక్కచేయను అనుకున్నాడు. కాని అతడికి నెప్పి అంటే చచ్చేంత భయం. కొంతసేపు తట్టుకోగలడేమో అందరిలానే కాని ఎక్కువకాలం ఉండి తనను ధ్వంసం చేస్తుందేమోనని భయపడ్డాడు. అంతలోనే నెప్పి మాయమయ్యింది.

అతడికి విలియంసన్ గుర్తుకొచ్చాడు. జర్మన్ పెట్రోల్‌దళం విసిరిన బాంబు తగిలి ముళ్లకంచె పొట్టలో గుచ్చుకుని పేగులు బయటకు వచ్చాయతడికి. ఎంతో ధైర్యస్తుడైన అతడే అందరినీ తనను చంపేయమని బతిమాలాడ్తూ, షూట్‌మి హారీ! ఫర్ క్రీస్ట్ సేక్ షూట్ మి! అంటుంటే తన దగ్గర ఉన్న మార్ఫిన్ టాబ్లెట్లు అన్నీ ఇచ్చాడతడికి. అతడే ఒకసారి తనతో "దేవుడు మనం భరించలేనిదేవీ పంపడు" అని వాదం చేసింది.)

ఇప్పటి వరకు బాగానే గడిచింది. తను వెళ్లబోయే చోటున ఇంతకంటే దారుణంగా ఏమీ ఉండదు. ఇంతకంటే మంచి కంపెనీ దొరకవచ్చు.

తనకు ఎవరు దొరుకుతారా అని కాసేపు ఆలోచించాడు. నీవే పనిచేసినా అది చాలా సమయం తీసుకుంటుంది. ఆలస్యమూ అవుతుంది. నీవెళ్లేప్పటికి అక్కడ ఉండాల్సిన వాళ్లూ ఉండరు. పార్టీ అయిపోతుంది. నీవు నిన్ను ఆహ్వానించిన ఆమె ఇద్దరే మిగుల్తారు.

"మిగతావాటిలానే చావుకూడా బోరుగొడ్తోంది నాకు –అనుకున్నాడతడు.

"ఇటీజ్ ఎ బోర్ – విసుగుపుడ్తోంది" అన్నాడు బయటకు.

"వాటీజ్ మై డియర్?"

"నేనేది చేసినా బాగా ఆలస్యం కావడం!"

తనకు నెగడుకు మధ్య ఉన్న ఆమె మొహం వేపు తేరిపార జూసాడతడు. కుర్చీలో కూర్చుని ఆమె కునికిపాట్లు పడడం అతడు గమనించాడు. తుపాకీ వేటుకు దూరంగా అటుయిటూ తిరుగుతున్న 'హైనా' సకిలింపు అతడికి వినబడింది.

"నేను వ్రాస్తున్నాను" అన్నాడతడు– "అయితే అలిసిపోయాను"

"నిద్రపోగలననుకుంటున్నావా?"

"హాయిగా! నీవుకూడా విశ్రాంతి తీసుకోరాదూ?"

"నీతో కాసేపు కూర్చోవాలనుకుంటున్నాను"–

"ఏదైనా కొత్తగా అనిపిస్తున్నదా నీకు?" అడిగాడతడు.

"లేదు. కాస్త నిద్ర వస్తున్నట్లున్నది"

"నాక్కూడా!" అన్నాడతడు.

అదుగో వస్తున్నది మృత్యువు అనుకున్నాడతడు.

"నేను కోల్పోనిదల్లా ఆసక్తి మాత్రమే" అన్నాడతడు.

"నీవేమీ కోల్పోలేదు. నీవు నాకు తెలిసిన సంపూర్ణ మానవుడివి" అన్నదామె.

'క్రీస్ట్!" అన్నాడతడు– "ఆడవాళ్లకెంత తక్కువ తెలుసు. అది నీ ఊహ!"

సరిగా అప్పుడే మృత్యువు అటుగా వచ్చి తన శిరస్సును మంచం మీద ఉంచింది. మృత్యువాసన అతడు పసిగట్టాడు.

"చేతిలో కొడవలి, పుర్రెలా ఉంటుంది మృత్యురూపమనే మాట నీవు నమ్మవద్దు" అన్నాడతడు– "ఇద్దరు పోలీసువాళ్లు సైకిళ్ల మీద పోతుండవచ్చు. లేదా పక్షి కావచ్చు. లేదా హైనాకున్నట్లు పొడుగాటి ముట్టె ఉండవచ్చు.

అది అతడిమీదకు కదిలింది. దానికి ఒక రూపమంటూ లేదు. కేవలం అతడిపై ప్రదేశాన్ని ఆక్రమించింది.

"దాన్ని పొమ్మను".

అది పోకుండా ఇంకాస్త దగ్గరకు జరిగింది.

"నరకలోకపు వాసన నీ దగ్గర! పో నా మీదనుంచి" చెప్పాడతడు.

అది ఇంకా దగ్గరకు వచ్చింది. అతడేం మాట్లాడలేకపోతున్నాడు. అతడు మాట్లాడకపోయేసరికి అది మరింత దగ్గరకు వచ్చింది. మాట్లాడకుండానే దానిని అక్కడ నుంచి పంపివేయడానికి ప్రయత్నించాడతడు. అది అతడి రొమ్ముపై కూర్చుని తన బరువుతో అతడిని అదిమిపెట్టింది. అతడు ఆ భారంతో కదలలేక, మాట్లాడలేక అలానే ఉండిపోయాడు.

"బ్వానా' నిద్రపోయాడు. మంచాన్ని నెమ్మదిగా లోపలికి తీసుకురండి" ఆమె మాటలు అతడికి వినీ వినిపించనట్లున్నాయి.

మృత్యుభారంతో మాట్లాడలేకపోతున్న అతనిపై నుండి కాసేపు బరువు తగ్గినట్లు అనిపించింది. వాళ్లు అతడు పడుకున్న మంచాన్ని నెమ్మదిగా గుడారంలోకి తీసుకువెళ్తున్నారు.

(తెల్లవారింది. తెల్లవారి చాలాసేపయినట్లుంది. విమానం వస్తున్న చప్పుడు. ముందు చిన్ని చుక్కలా కనిపించిన విమానం క్రమేపీ పెద్దదై తమ క్యాంపు వద్ద ఒక రౌండు తిరుగుతుండేప్పటికే కుర్రాళ్లు కిరోసిన్ పోసి సిద్ధంగా ఉంచిన నెగళ్లు వెలిగించారు. పక్కనే పోగుచేసిన గడ్డి అంచులు కాలి దారిలా ఏర్పడ్డాయి. విమానం క్రమేపీ దగ్గరగా రెండు రౌండ్లు వేసి నేలమీదికి దిగింది.

కాంప్టన్ అడుగో వస్తున్నాడు విమానం దిగి.

"ఏమయ్యింది మిత్రమా?" అన్నాడు కాంప్టన్.

"కాలు దెబ్బతిన్నది" అన్నాడతడు. "బ్రేక్‌ఫాస్ట్ చేయరాదూ"

"థాంక్స్! టీ చాలు లే! ఇది చిన్న విమానం. నిన్ను తీసుకువెళ్తాను. మీ లారీ దారిలో ఉన్నది. మేడమ్‌కు చోటు లేదు దీంట్లో!"

కాంప్టన్‌ను పక్కకు తీసుకువెళ్లి హెలెన్ ఏదో గుసగుసలాడింది. కాంప్టన్ హుషారుగా తిరిగి వచ్చాడు.

"నిన్ను వెంటనే తీసుకువెళ్తాను. మేడమ్ కోసం రెండోట్రిప్పు వేస్తాను. బహుశా అరుషాలో ఆగి ఇంధనం నింపుకోవాల్సి ఉంటుంది. వెంటనే వెళ్తే సమయం ఆదా అవుతుంది"

"టీ తాగవూ!"

"పెద్ద పట్టింపు లేదు. నీకు తెలుసు కదా!"

కుర్రాళిద్దరూ మంచాన్ని మోసుకుంటూ, గుడారాల్ని దాటి, విమానం ఆగి ఉన్న చోటుకు వచ్చారు. అతడిని విమానంలో ఉంచడం చాలా కష్టమయ్యింది. అతడు వెనకసీట్లో కూర్చోగా అతడి కాలు కాంప్టన్ పక్కగా తిన్నని స్కేలులా ఉంచాల్సి వచ్చింది.

కాంప్టన్ మోటార్ స్టార్ట్‌చేసి తన సీట్లో కూర్చున్నాడు. అతడు హెలెన్‌కు, కుర్రాళ్లకు చేయి ఊపుతూ విమానాన్ని పోనిచ్చాడు. విమానం నెమ్మదిగా కదిలి కుర్రాళ్లు సిద్ధం చేసిన దారి మీదుగా పరిగెత్తి ఆకాశంలోకి ఎగిరింది. క్రిందవాళ్లు ఇంకా చేతులూపుతూనే ఉన్నారు. క్యాంపు, దాని పక్కనే ఉన్న గుట్ట, మైదానాలు, చెట్ల వరుసలు, పొదలు అన్నీ క్రమేపీ చిన్నవిగా మారిపోతున్నవి. ఎండిన నీటి గుంటలపై అడుగుజాడలు, కొత్త నీటి గుంటలు తనకు తెలీనివి కన్పడగా అతడు

ఆశ్చర్యపోయాడు. అవిగో అవి జీబ్రాలు, ఇంకా రకరకాల మృగాలు. వరుసలుగా చేతివేళ్లలా విమానపు నీడ పడగానే ఆ నీడకు, శబ్దానికి చెల్లాచెదురవుతున్నాయి. విమానం ఎత్తుకు ఎగిరినాక అతడికి స్పష్టంగా కనబడిందల్లా కాంప్టన్ తొడుక్కున్న జాకెట్, అతడి టోపీ మాత్రమే. ఇప్పుడు విమానం కొండలను దాటుతున్నది. జంతువులు, వెదురుచెట్లు, అరణ్య వృక్షాలు, కొండలు, గుట్టలు- అదిగో మళ్లీ మైదానాలు- కొండలూ... కాంప్టన్ వెనక్కి తిరిగి చూసాడు.

అయితే అరూషా వెళ్లి ఇంధనం నింపుకోడానికి బదులు ఎడంవేపు తిరిగారు. వాళ్లకు అటువేపే వస్తున్న చిన్ని మబ్బు కనిపించింది. తీరా చూస్తే అది మబ్బుకాదు. మిడతల దండు. స్వార్మ్. దట్టంగా మేఘంలా ఉన్నది. ఇంకాస్త ఎత్తుకు ఎగిరి తూర్పుగా వెళ్తున్నారు. వెళ్లివెళ్లి చిన్నపాటి తుఫానులో చిక్కుకున్నారు. జలపాతం మధ్యలోంచి పోతున్నట్లు అనిపించింది వాళ్లకు. దాన్ని దాటగానే కాంప్టన్ వెనక్కు తిరిగి చిరునవ్వు నవ్వి తన చూపుడు వేలితో అటు చూపించాడు. ఎదురుగా, ప్రపంచమంత విశాలమైనది, గొప్పది, ఎత్తైనది, తెల్లగా వెండి కొండలా సూర్యకాంతిలో మెరుస్తున్నది. చదరంగా ఉండే కిలిమంజారో శిఖరభాగం. అప్పుడు అతడికర్థ మయ్యింది. తామెక్కడికి వెళ్తున్నదీ-)

అదే సమయంలో హైనా మూలగడం ఆపి ఎవరో మనిషి ఏడుస్తున్నట్లు వింత శబ్దాలు చేస్తూ ఆరవడం మొదలెట్టింది. ఆమె నిద్రలో ఆ అరుపులు విని పక్కకు కదిలింది. మెలకువ రాలేదు. ఆమె కలగంటున్నది. ఆ కలలో ఆమె లాంగ్ ఐలాండ్‌లో ఉన్నట్లూ, ఆ రోజే ఆమె కుమార్తె అరంగేట్రం ఎందుకో ఆమె తండ్రి కూడా అక్కడే ఉన్నాడు. అతడు కాస్త మొరటుగా మాట్లాడ్తున్నాడు. అప్పుడే బయట హైనా మరింత బిగ్గరగా అరచింది. ఆమె ఉలిక్కిపడి లేచేసరికి తానెక్కడున్నదో తనకే అర్థం కాలేదు. ఆమెకు భయం వేసింది.

తన దగ్గర్లో ఉన్న ఫ్లాష్ లైట్ ఆన్ చేసి ఆ వెలుగులో తన పక్క మంచంవేపు చూసింది. దోమతెరలో అతడి శరీరం కనిపిస్తున్నది, అయితే, అతడి కాలు మంచం పక్కన వేలాడుతున్నది. డ్రస్సింగ్ ఊడిపోయినట్లున్నది, ఆమె దానివేపు చూడలేదు.

"మోలో" పిలిచిందామె- "మోలో! మోలో!"

ఆ తరువాత పిలిచింది "హారీ! హారీ!" మరల బిగ్గరగా పిలిచింది "హారీ! ప్లీజ్! ఓ హారీ!"

అతడి వద్ద నుంచి సమాధానం రాలేదు. అతడి ఊపిరి చప్పుడూ లేదు.

గుడారం బయట హైనా మరల అటువంటి వింత శబ్దాన్నే చేసింది. ఈసారి ఆమెకాశబ్దం వినబడలేదు, తన గుండె వేగంగా బిగ్గరగా కొట్టుకుంటున్న చప్పుడులో.

✧✧✧✧✧

---

## ఎర్నెస్ట్ మిల్లర్ హెమింగ్‌వే
## (Ernest Miller Hemingway 21-7-1899 - 2-7-1961)

ఇరవై శతాబ్దపు సాహిత్యంపై తన ప్రత్యేక ముద్ర వేసిన హెమింగ్‌వే అమెరికన్ రచయిత. జర్నలిస్టు. లిటరేచర్‌లో నోబుల్‌ప్రైజు 1954లో వచ్చింది. ఏడు నవలలు, 6 కథాసంకలనాలు, రెండు నాన్‌ఫిక్షన్ వర్క్స్ చేసినవాడు హెమింగ్‌వే. The Snows of Kilimanjaro 1938లో వ్రాసాడు.

ఓక్‌పార్క్, ఇల్లినాయిస్‌లో పెరిగిన హెమింగ్‌వే జర్నలిస్టుగా, మొదటి ప్రపంచ యుద్ధం కాలంలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసాడు. ఆ యుద్ధపు అనుభవాలను- A farewell to arms అనే నవలగా వ్రాసాడు. 1921లో హాడ్లీ రిఛర్డ్‌సన్‌ను 1927లో పైలీన్ పీఫ్ఫర్‌ను, 1940లో మార్థాగెల్‌హారన్ తరువాత మేరీ వెల్ష్‌ను పెళ్లి చేసుకున్నాడు. నాలుగు పెళ్లిళ్లు, మూడు విడాకుల కథ హెమింగ్‌వేది. స్పానిష్ అంతర్యుద్ధం నేపథ్యంలో For whom the bell tolls నవల వ్రాసాడు.

1952లో The Old Man and the Sea వ్రాసాక ఆఫ్రికాకు సఫారీకి వెళ్లినప్పుడు రెండుసార్లు వరుసగా విమానప్రమాదంలో చిక్కుకుని బతికి బయటపడినా నెప్పి, అనారోగ్యం అతడిని పీడించసాగాయి. 1953లో పులిట్జర్ ప్రైజు, 1954లో నోబెల్ ప్రైజును గెలుచుకున్నాడు. 1961 ఇదాహోలోని తన స్వంత యింట్లో ఆత్మహత్య చేసుకున్నాడు.

# 42. వష్టి
## (Vashti)

**- ఫ్రాన్సిస్ ఇ.డబ్ల్యు. హార్పర్**

తన మృదువైన చేతిపై తలనాన్చి
ఆమె మహరాజు ఆజ్ఞను మౌనంగా విన్నది–
"నా సామంతరాజులు, ప్రభువులు ఆరగిస్తున్నారు విందు
వెళ్లి రాణి వష్టిని వెంట తీసుకుని రండు ముందు".

–"సమస్తలోక రాజన్మణులకు సాదరంగా చూపించాను
నా స్వర్ణనిధులను, అరుదైన మణిమాణిక్యాలను.
కాని ప్రకాశవంతమైన ఆమె కనుల తేజస్సుకు
ఏ కెంపుల కాంతి సాటిరాదు.

స్వర్ణాభరణ భూషితమై, కిరీటధారిణిగా
మహరాణిగా, ఠీవిగా ఆమె ఇటు రాగలదు
ఈ ప్రభువులు మహావీరుల మధ్యన
తన మేలిముసుగు తొలగించి దర్శనమివ్వగలదు.

నా కిరీటంపై మెరిసే ప్రతి రత్నమూ
నా సింహాసనంపై శోభిల్లే ప్రతి వజ్రమూ
ఆమె సొబగుల ముందు వెలవెలా బోతాయి
ఆ అందాల రాణి, నా స్వంతమైన ప్రశస్తమణి"–

వేచి ఉన్న ప్రతీహారులు
రాణి సమాధానాన్ని ఆపేక్షిస్తున్నారు.
ఆమె కపోలాలు తెల్లగా పాలిపోయాయి.
కాని, ఆమె కళ్లలో కాంతి ప్రజ్వరిల్లింది.

"వెళ్లండి! మహరాజుతో మనవిచేయండి
"నేను పర్షియా దేశపు మహరాణిని,
విందులు గుడుస్తున్న విలాసపురుషుల మధ్యకు
నేను రాలేనని విన్నవించండి" అన్నదామె అభిమానంతో–

వాళ్ల అలక్ష్యపు అసభ్యకరమైన దృక్కులు
నా మూతలు పడుతున్న నయనాలపై పడేముందే
నా తలపైని కిరీటాన్ని నేలపై పడవేసి
నా పాదాలతో తొక్కుతూ నడచిపోతాను.

మహరాణి మంది ముందు ముసుగు తొలగిస్తుందా?
అందరి పెదాలపై ఆమెపేరు పలకనిస్తుందా?
పర్షియా దేశపు స్త్రీలందరూ సిగ్గుతో చచ్చిపోరా,
వష్టి పేరు పలుకుతూ వలవలా విలపించరా!

"వెళ్లిపొండి!" తన చేత్తో సంజ్ఞ చేసిందామె
ఆమె కనులలో విచారం గూడుకట్టుకుంది.
"వెళ్లి, మహరాజుతో చెప్పండి" – బాధగా చెప్పిందామె.
"అంతకన్నా మరణం నాకు అంగీకారమని విన్నవించండి!"

వాళ్లు మహరాజుకు ఆమె సందేశాన్ని వివరించారు.
అతడి కళ్లపై ఆగ్రహం నల్లటిపొరగా కమ్ముకున్నది
తుఫాను ముందు మెరిసిన విద్యుల్లతల్లా
కోపపు రేఖలు అతడి ముఖంలో విరజిమ్మాయి.

మహరాజు పలికాడు మరింత క్రోధంతో,
కోపంతో నల్లబడి వణుకుతున్న పెదవులతో–
"చక్రవర్తి ఆజ్ఞను ధిక్కరించే మందమతికి
ఎటువంటి శిక్ష వేయడం సమంజసం?"

వంచకులైన అతడి సలహాదారులన్నారు–
"ఈ అద్భుత రాజ్యానికి ఏలిక తమరు!
హిందూదేశం నుండి ఇథియోపియా వరకు
అందరూ తమ ఆజ్ఞను శిరసావహిస్తారు.

తమ సేవకుల కళ్లెదుటే ఈ ధిక్కారం,
అందరూ చూస్తుండగా జరిగిన వికారం,
వష్టి తమ ఆజ్ఞను పాటించలేదు,
వచ్చి తమ ముందు నిలబడలేదు.

ఆ స్త్రీ, తమ అధికారాన్ని కాదన్నది
తమ పేరుకే కళంకాన్ని తెచ్చినది.
ఆమె చేసిన ఈ తుచ్ఛ కార్యం
తెచ్చింది తమకు తలవంపులు, అవమానం.

అందుకని, న్యాయనిర్ణేతలైన ప్రభూ!
తమరు కఠిన నిర్ణయాన్ని తీసుకోగలరు–
వష్టి తన కిరీటాన్ని త్యజించక తప్పదు!
ఇంకొక్క క్షణం ఆమె ఈ రాజ్యానికి రాణిగా ఉండ తగదు.

ఆమె మహరాజు ఆజ్ఞను విన్నది మౌనంగా
తన రాణి హోదాను తృణప్రాయంగా భావించి
తన స్త్రీత్వంపై తరగని అభిమానంతో
విధి నిర్ణయించిన బాటపై వినమ్రంగా నిష్క్రమించింది.

వష్టి నామానికి వన్నెతెచ్చే విధంగా
ఆమె రాజభవనాన్ని వీడి వెళ్లిపోయింది.
కష్టాల్ని, దుఃఖాన్ని భరించడానికి సిద్ధమై
అవమానానికి తలవంచని ఆత్మగౌరవం గల ఆ స్త్రీ.

✧✧✧✧✧

---

**ఫ్రాన్సిస్ హోర్పర్ (Francis E.W. Horper 1825-1911)**

ఫ్రాన్సిస్ హోర్పర్– కవయిత్రి, రచయిత్రి American Abolitionist. అనేక స్త్రీ ఉద్యమాలలో ప్రముఖ పాత్ర వహించింది. ఆమె కవిత్వం– Bury me in a free land - అన్నది ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. National Association of Colored Women (1896) అనే సంస్థ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించింది.

# 43. రాజుగారి కథకుడు

## సెల్టిక్ జానపద గాథ

అనగనగా ఒక రాజు. ఆ రాజుగారికి కథలంటే చాలా ఇష్టం. అందుకని ప్రత్యేకంగా ఒక కథకుడిని నియమించుకున్నాడు. ఇతడు చెయ్యాల్సిందల్లా ప్రతిరోజూ ఒక కొత్త కథ చెప్పాలి రాజుగారు రాత్రి నిద్రపోయే ముందు. ఆరోజు ఉదయాన ఎంత ఆలోచించినా కథకుడికి కొత్తకథ తట్టలేదు. రాజుగారికి కోపమొస్తే తన పరిస్థితి ఏమిటి! గుండె దడదడ కొట్టుకుంది. కథకుడు కథలు చెప్పడంలోనే కాదు జూదమాడడంలోనూ ప్రవీణుడే... ఆలోచిస్తూ కిటికీలోంచి బయటకు చూసాడు. బయట చింపిరిగుడ్డల్లో ఒక వృద్ధుడు దారి పక్కన కూర్చుని తనవేపే చూస్తున్నాడు. అతడి దగ్గర ఒక పెట్టె, పాచికలు ఉన్నాయి.

"జూదమాడగలవా నాతో! నా దగ్గర వంద దీనారాలున్నాయి" అన్నాడతడు.

"నేను నమ్మను" అన్నాడు కథకుడు.

ఆ తరువాత ఇద్దరూ జూదమాడారు. ఆశ్చర్యం! కథకుడు ఓడిపోయాడు. డబ్బు పోయింది. గుర్రాలు, రథం, వేటకుక్కలు, సమస్త సంపదలు అన్నీ కోల్పోయాడు.

"ఇప్పుడు పందెం కాయడానికి నా దగ్గరేం లేదు" అన్నాడు కథకుడు.

"ఆలోచించుకో! ఇప్పుడు దాకా నీవు పోగొట్టుకున్నవన్నీ ఒక ఎత్తు, నీకెంతో ఇష్టమైన నీ భార్య ఒక ఎత్తు! గెలిస్తే అన్నీ నీ స్వంతం" అన్నాడు వృద్ధుడు.

కథకుడు ఎత్తు వేసాడు. ఈసారి సంపదలతో పాటు భార్యా పోయింది.

"ఈసారి నిన్ను నీవు పందెం కాచుకో" అన్నాడు వృద్ధుడు.

కథకుడు పందెం కాసాడు. తనను కూడా ఓడిపోయాడు. వృద్ధుడు తన దగ్గర ఉన్న మంత్రదండంతో కథకుడ్ని కుందేలుగా మార్చి తనతోపాటు తీసుకెళ్లాడు. సరాసరి చక్రవర్తి దర్బారులోకి.

"మహా చక్రవర్తీ! నేను ఇంద్రజాలికుడిని" అన్నాడు వృద్ధుడు– "అయిదు వెండి నాణేలివ్వండి. మీకు నేనో ట్రిక్కు చూపిస్తాను!"

చక్రవర్తి చేతిలో మూడు గడ్డిపరకలుంచాడు ఇంద్రజాలికుడు. "మధ్యలో ఉన్న దానిని ఊదేస్తాను పక్కవి రెండు కదలకుండా– మీరూ ప్రయత్నించండి" అన్నాడు. అందరి చేతుల్లో ఆశ్చర్యంగా మూడు గడ్డిపరకలున్నాయి. చక్రవర్తి, మంత్రులు, సదస్యులు ఊదితే అన్నీ ఎగిరిపోతున్నాయి. అందరూ తమవల్ల కాదన్నారు.

వృద్ధుడు తన రెండు వేళ్లను గడ్డిపరకకు అటూయిటూ ఉంచి ఊదగానే మధ్యనున్న గడ్డిపరక ఎగిరిపోయింది. యువరాజు అట్లా చేయబోతే అతడి చిటికెన వేలు గడ్డిపరకతో సహా ఎగిరిపోయింది. అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగానే వృద్ధుడు తన చేతిలోని సిల్కుదారపు ఉండను గాలిలోకి విసిరాడు. అది నిచ్చెనగా మారి పైభాగం ఆకాశంలోకి అదృశ్యమైంది. పెట్టెలోంచి కుందేలును తీసి మెట్లమీదగా పొమ్మన్నాడు. ముందు కుందేలు, దాని వెనక వేటకుక్క ఆకాశంలోకి పరిగెత్తాయి.

"మీలో ఎవరన్నా నా కుందేలును తీసుకురాగలరా!" అన్నాడు వృద్ధుడు.

యువరాజు ధైర్యంగా ముందుకు వచ్చాడు. తన వేలేది? ఎక్కడకు పోయింది?

"యువరాజా! నా కుందేలు చచ్చిపోయిందా, కిందకు వచ్చాక నీ తల నరికేస్తాను, నీకిష్టమేనా?" అన్నాడు వృద్ధుడు.

సాహసికుడు కాబట్టి యువరాజు ఒప్పుకున్నాడు. ముందు కుందేలు, తర్వాత వేటకుక్క, వాటి వెనక యువరాజు ఆకాశంలో అదృశ్యమయ్యారు. చాలా సమయం గడిచింది.

"అయ్యో! వేటకుక్క కుందేలును తినేసింది. యువరాజు నిద్రపోతున్నాడు" అన్నాడు వృద్ధుడు. తాడు కత్తిరించగానే యువరాజు నిద్రపోతూనే కిందపడ్డాడు. తర్వాత వేటకుక్క పడింది పెదాలు చప్పరిస్తూ. వృద్ధుడు తన కత్తితో ఇద్దరి తలలూ నరికాడు. "నాకు పది వెండి నాణేలివ్వండి! ఇద్దర్నీ బతికిస్తాను" అని పది నాణేలు తీసుకుని ఇద్దర్నీ బతికించి వృద్ధుడు అదృశ్యమయ్యాడు.

అక్కడ రాజుగారు తన కథకుడి కోసం ఎదురుచూస్తున్నాడు. కథకుడి బదులు వృద్ధుడు ప్రత్యక్షమై వీణ వాయిస్తానన్నాడు. తీరా వీణ వాయిస్తే పిల్లి అరిచినట్లు

శబ్దం. రాజుకు కోపం వచ్చి వీడిని ఉరిదీయండి, ఇక్కడే! అని ఆజ్ఞాపించాడు. తీరా వృద్ధుడిని ఉరిదీయబోతే వృద్ధుడు లేడక్కడ ఉరితీయబడి రాజుగారి తమ్ముడున్నాడు. మళ్లీ అలాగే చేయబోతే ఈసారి రాజుగారి ప్రధానమంత్రి ఉన్నాడు. మూడోసారి సైన్యాధిపతి అన్నాడు “నిన్ను ఉరిదీయలేం! వెళ్లిపో”

వృద్ధుడు అదృశ్యం కాగానే ఉరిదీయబడిన ఇద్దరూ బతికి వచ్చారు. కుందేలు రూపంలో ఉన్న కథకుడు ఇవన్నీ చూసాడు. వృద్ధుడు అతడిని మామూలు మనిషిగా మార్చేప్పటికి ఆశ్చర్యం తనింకా తనింట్లోనే ఉండి కిటికీలోంచీ చూస్తున్నాడు కాని అక్కడ వృద్ధుడు లేడు. ఎవ్వరూ లేరు.

ఇదే కథ కధకుడు రాజుకు చెప్పాడు. రాజు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ ఆ రోజు నుంచి ప్రతిరాత్రి అదే కథ చెప్పమనేవాడు. కధకుడు ఆ కథనే కాస్త మార్చి చెప్పేవాడు. ఆ కథ రాజుకు అంత నచ్చింది మరి.

✧✧✧✧✧

# Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

## డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

1. **సత్యాన్వేషణలో (లజ్జ–2012) (నవల) :** ప్రేమ నుంచి పేదరికం వరకూ, చరిత్ర వక్రీకరణల నుంచి ఇప్పటి యుద్ధాలవరకూ అనేక అంశాలను రచయిత కథారూపాలతో పాఠకుల ముందు పెట్టిన తీరు విలక్షణంగా ఉంది. (ఇండియాటుడే).

2. **ఆల్కెమీ (కవిత్వం) :** 'కవిత్వం ఒక ఆల్కెమీ'.

3. **How to be Happy :** a highly popular book of Prasad's naration and Jayadev's Cartoons.

4. **వానమబ్బుల కాంతిఖడ్గం (కవిత్వం) :** స్త్రీ పుట్టిన నాటినుంచి గిట్టేవరకూ పడే కడగళ్లను కవిత్వీకరించిన కవితామాలిక.

5. **సంఖ్యాశాస్త్రం :** సంఖ్యలలోని అద్భుతాలను వివరించే మార్మికశాస్త్రం.

6. **డా. జయదేవ్ కార్టూన్లు :** ప్రసాదు ట్యూన్లు+డా. జయదేవ్ కార్టూన్లు – ఓ కొత్త ప్రయోగం (ఆంధ్రజ్యోతి)

7. **జీనోమ్ (సప్తమ అంతర్ధానం) :** తెలుగులో తొలి బయోటెక్నాలజీ నవల. అనేక దేశాల తత్త్వ, మత, సమాజ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో మానవజాతి సాగించిన అద్భుత జిజ్ఞాసాయాత్రకు ఆధునికాక్షరభాష్యం (నడుస్తున్న చరిత్ర – ఇండియాటుడే).

8. **టీకప్పులో తుఫాను (కవిత్వం) :** పంచభూతాల ఉత్పత్తిపై ప్రాచీనుల ఊహలు, నవీన మానవుని కాలుష్యదురాక్రమణలను వివరించే దీర్ఘకావ్యం.

9. **Shades (Poetry - English) :** A rare piece of work; Shades is not a collection but a revelation. ( Dr. Jayadev)

10. **The Twilight Zone (Poetry - English)** is about the final scene of a life's drama.

11. **స్వప్నశాస్త్రం (తెలుగు) :** స్వప్నాలపై, స్వప్న విశ్లేషణలో తెలుగులో వచ్చిన ఏకైక సాధికారక గ్రంథం. (వార్త)

12. **In Search of Truth (English Novel) :** What is the ultimate Truth? a book about Death with subliminal Message.

13. **తంగేటి జున్ను (కవిత్వం) :** తీయగా, స్వచ్ఛంగా ప్రవహించిన కవితాజలధార.

14. **Soundarya Lahari (Poetry-English) :** Highly acclaimed book reached many places. (Sankaracharya's mystic poems explained and translated in Modern perspective)

15. **Bhagavatam (Poetry-English) :** An abridged Version of Potana's Bhagavatam into simple, lucid English. The second revised edition with commentery is released.

16. **మూడు స్వప్నాలు ఒక మెలకువ (కవిత్వం) :** ముగ్గురు కవులు (పొట్లపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, లంకా శివరామప్రసాద్‌ల కవిత్వఝరి).

17. **సుప్రసన్నాచార్య 'సాంపరాయం'** – ఇంగ్లీషు అనువాదం.

18. **రామా చంద్రమౌళి 'Fire & Ice' –** ఇంగ్లీషు అనువాదం

**బహుళ ప్రజాదరణ పొందిన సప్త అనువాద కావ్యాలు:**

19. **ఇలియాడ్ (తెలుగు) :** హోమర్ ప్రఖ్యాత రచన తొలిసారిగా తెలుగులో అందరి మన్ననలను పొందిన మహాకావ్యం. (ఆంధ్రజ్యోతి)

20. **ఒడెస్సీ (తెలుగు):** హోమర్ రచించిన ఒడెస్సీ – మహాభారత కావ్యంలా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే కథల్తో సాగే మహాకావ్యం. (ఇండియాటుడే)

21. **ఎపిక్ సైకిల్ (ఇతిహాసచక్రం–తెలుగు) :** గ్రీకువాఙ్మయంలో మూడవ భాగంగా వెలువడి ఎన్నో విశేషాలను తెలియజెప్పే కావ్యం. (ది హిందూ)

22. **ఈనీడ్ (Aeneid) :** వర్జిల్ మహాద్భుత రచన – తెలుగు అనువాదం

23. **తీర్థయాత్రికుని ప్రగతి (The Pilgrim's Progress) :** జాన్ బున్యన్ ప్రసిద్ధ రచనకు తెలుగు అనువాదం.

24. **డాంటే రచన డివైన్ కామెడీ - Dante's Divine Comedy** – తెలుగు అనువాదం.

25. **జాన్ మిల్టన్ ప్రసిద్ధ రచన – Paradise Lost - Paradise Regained (పారడైజ్ లాస్ట్ – పారడైజ్ రిగైన్డ్)** – తెలుగు అనువాదం.

26. **కత్తి అంచుపై...** – తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన తొలి Noir (Black-చీకటి) నిశీధి కథల సంపుటి.

27. **దీప నిర్వాణగంధం** – మృత్యువు గురించి వివరించే అనేక అసాధారణ సంఘటనలు, కవిత్వాలు, నవీన శాస్త్ర విశ్లేషణలతో కూడిన పరిశోధనా గ్రంథం.

28. **అక్షరార్చన** – ఆంధ్రజ్యోతి నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వేదాంత విషయాల కదంబం.

29. **క్రీస్తు అద్భుతగీతాలు** – కరుణ, అద్భుత రసాలతో నిండిన కమనీయ కవిత్వ సంపుటి. ప్రపంచ ప్రసిద్ధ కవుల రచనలు క్రీస్తు జీవిత చరిత్ర.

30. **తమిళ సరస్వతి అందెల రవళి** – సంగం కాలం నాటి అద్భుత కవితా సంపద – వీర, శృంగార రసవాహిని.

31. **నామదేవొ ధసాల్ కవిత్వం** – ఈనాటి నుంచి ఎవరూ కవిత్వాన్ని అస్పష్టంగా రాయవద్దు' అని శాసించిన మరాఠీ కవి ధసాల్ కవిత్వం.

32. **శాంతి యుద్ధం** – మొదటి ప్రపంచ యుద్ధపు ఘట్టాల్ని, ప్రజలపై దాని ప్రభావాన్ని కవుల మాటల్లో వివరించే కవితల సంకలనం.

33. **డబ్బు–మని–షి** – హాస్యరస ప్రధానంగా ప్రపంచ కవుల కవితలకు తెలుగు అనువాద సంపుటి.

34. **విలియం బ్లేక్ కవిత్వం** – తన మార్మిక కవిత్వం, చిత్ర రచనలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన బ్లేక్ కవిత్వ నిధి.

35. **ఫాస్ట్–గేథే రచన** – జర్మన్ సాహిత్యంలో తలమానికమై అత్యధిక ప్రాచుర్యాన్ని పొందిన విషాదాంత నాటకం. 'ఆత్మను సైతానుకు అమ్మిన మానవుడిగా' తెలుగులో వెలువడ్తున్నది.

## త్వరలో...

36. **మూడు ప్రాచీన గ్రీకు నాటకాలు** – ఇడిపస్ రెక్స్, ఏంటిగొని, ట్రోజన్ వుమెన్ – ప్రపంచ ప్రసిద్ధికెక్కిన విషాదాంత నాటకాలు – తెలుగులో.

37. **ప్రపంచ ప్రసిద్ధ కథలు** – విశ్వవిఖ్యాత కథకుల ప్రసిద్ధ కథలు.

38. **కలలు–విశ్లేషణ – స్వప్నశాస్త్రం రెండవభాగం**

39. **శిలప్పదికారం** – కాలి అందియ కథ. తమిళ మహాకావ్యానికి దీటైన తెలుగు అనువాద కావ్యం.

40. **క్రీస్తు నడచిన దారి** – కరుణామయుడి పదముద్రలపై కవుల కవితాభినివేశం.

✤✤✤✤✤

ప్రపంచ సాహిత్యం-9

# ప్రపంచ ప్రసిద్ధ కథలు-1

Flannery O' Connor
Richard Connell
Vladimir Nabokov
Roald Dahl
Ray Bradbury
O' Henry
Sandra Cicneros
W.W. Jacobs
Donald Barthelme
Saki
Shirley Jackson
Kate Chopin
Franz Kafka
Anton Chekhov
Ursula K. Le Guin
Edgar Allan Poe
Dorothy M. Johnson
Ernest Hemingway

## డాక్టర్ లంకా శివరామప్రసాద్